18LA134M132

భారతి

సచిత్ర మాసపత్త్రిక

అధిపతి

కా. నాగేశ్వరరావు

సంపాదకుడు

గన్నవరపు సుబ్బరామయ్య

సంపుటము ౧౦. సంచిక ౮.

ఆంధ్రపత్త్రికా ముద్రాలయము, మద్రాసు.

౧౯33

Printed at the
ANDHRAPATRIKA PRESS
G. T., Madras.

విషయసూచిక

పంప - కుందుర్తి నరసింహారావుగారు ... ... ౧౮౧—౧౮౩

కావ్యపఠనము - శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు ... ... ౧౮౫—౧౯౦

కన్యాశుల్క నాటక విమర్శనము-శ్రీపాద కామేశ్వరరావుగారు ... ౧౯౧—౧౯౮

బిల్హణకథ—డి. ఎ. నరసింహంగారు ... ... ౧౯౯—౨౦౬

ఖాన్‌ఖానా అబ్దుల్ రహీమ్‌ఖాన్—రామమోహన్‌రాయ్ ... ౨౦౭—౨౧౦

ప్రేమపాశం—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ... ... ౨౧౧—౨౧౩

మేఘుడు—జి. జాషువగారు ౨౧౪

మాసంసారాలు—టేకుమళ్ల కామేశ్వరరావుగారు ... ... ౨౧౫—౨౧౯

'మిస్ లైలా'—గొల్లపూడి జోగారావుగారు ... ... ౨౩౦—౨౩౫

సూరన—అయినంపూడి గురునాథరావుగారు ౨౩౭

ఉరిశిక్ష—తంగిరాల రాధాకృష్ణయ్యగారు ... ... ౨౩౯—౨౪౪

వినోదశిల్పము: కుట్టుపని—కొ. నరసింహాచారిగారు ... ... ౨౪౫—౨౪౬

తాజ్ మహాలు—క్రమధాటి జానకీగిరిగారు ... ... ౨౪౭—౨౫౨

గ్రంథప్రకటనము—'భాషాభిమాని' ... ... ౨౫౩—౨౫౪

ఆధునిక చిత్రకళయందలి లోపమేమి? ... ... ౨౫౫—౨౫౯

భారతీయ విద్యాచరిత్రము—మారేమండ రామారావుగారు ... ౨౬౦—౨౬౧

నేటి రష్యా—నార్ల వెంకటేశ్వరరావుగారు ... ... ౨౬౧—౨౬౬

చేతిపనులు—దశిక సూర్యప్రకాశరావుగారు ... ... ౨౬౬—౨౮౦

హిందూమతాచారములు: ప్రభుత్వపు అధికారభాధ్యతలు—కొమాండూరి
శఠకోపాచార్యులుగారు ... ... ౨౮౧—౨౮౫

రాజకీయవిధేయత—శ్రీపాద గణపతిరావుగారు ... ... ౨౮౬—౨౮౯

ఆంధ్రగ్రంథముల పట్టిక— ... ... ౨౯౦—౨౯౩

నక్షత్రమండలము (శ్రావణమాసము)—గొబ్బూరు వెంకటానంద రాఘవ
రావుగారు ... ... ౨౯౫—౨౯౯

బాలక్రీడలు—గుంగిపూడి వేంకటశర్మగారు ౩౦౦–౩౦౪

భారతీయ మహిళామండలి—శ్రీమతి కె. రామసుబ్బమ్మగారు ... ౩౦౪

ఆంధ్రాభ్యుదయము—శ్రీ వేముల కూర్మయ్యగారు; డాక్టరు యం. వి. రాధాకృష్ణరావుగారు ౩౦౫

నాట్యకళ: కీ. శే. పిల్లలమర్రి సుందరరామయ్యగారు—ఏ. వి. సీతారామయ్యగారు ౩౦౬–౩౦౭

మీగడతఱకలు: లాంఛనములు—మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ... ౩౦౮–౩౧౦

కలగూరగంప: జర్మనువిద్యాలయములలో వార్తాపత్రికలు; ఆంగ్లప్రధానోపాధ్యాయుని నేటికాలపు విద్యార్థుల వర్ణనము; సనాతన ధర్మమనగా నేమి?; స్వాతంత్ర్య పరిచయము; విద్యాలయములలో ఆటలు; సహకారమహాసభ–౧౯౩౩; మొహెంజో దారో ... ౩౧౧–౩౧౬

విమర్శనము— ౩౧౭–౩౨౧

మనవిమాటలు: ఆంధ్రవిశ్వకళాపరిషత్తు - ప్రాచ్యవిద్యాపరీక్షలు; ఆంధ్ర నాటక కళాపరిషత్తు (౧౯౩౩); ప్రాచ్యవిద్యాపరిశోధనాలయము, చెన్నపురి - సహాయాంధ్రపరిశోధక నియామకము; స్వర్గీయ జతీంద్రమోహనుడు; అశ్రుతర్పణము: కీ. శే. ఆ. వేం. సాంఖ్యాయనశర్మగారు; అరవమునకు ప్రోత్సాహము; దాంపత్యసౌఖ్యము; అశ్లీలప్రకటనములు. ౩౨౨–౩౩౩

సాభిప్రాయ విశేషములు— ౩౩౪–౩౩౬

చిత్రములు

త్రివర్ణ చిత్రములు—కన్నప్ప; చాకలి.

సాధారణ చిత్రములు—ఆధునిక శిరోజసంస్కారచిత్రములు ౮; మొహెంజోదారో; చిత్రములు ౧౨; తిరునీర్ మలై; శ్రీ గోవిందరాజస్వామి దేవాలయ గోపురము, తిరుపతి; కోటగిరిలోని బజారు, నీలగిరి; హూంటు ప్లెజంటు, కోటగిరి; డచ్చికోట శిథిలములు, అంజెంగోవద్ద; తుంగభద్రానది (హంపి శిథిలములు); జైనదేవాలయములు (హంపిశిథిలములు); ఏనుగుల శాల (హంపిశిథిలములు); కోటలోని రక్షకశాఖామందిరము (హంపిశిథిలములు); ఊరబావి; ఇతర చిత్రములును.

1931



కన్నప్ప

—టి. జి. గుప్త, ఆంధ్రజాతీయకళాశాల, బందరు



సంపు. ౧౦ శ్రీముఖ సంవత్సరము, శ్రావణమాసము (ఆగష్టు ౧౯33) సంఖ్య ౮

పంప

కుందుర్తి నరసింహరావు

౧

తెలుఁగుపొలాల పంట గుఱుతింపఁగరాని తెవుళ్లపాలుగా,
మలఁచిన పైఁడిగద్దియల మంటిపొరల్ నునుసిగ్గు దాఁపఁగా,
కలఁగిన కాఱుమబ్బులు పికారులు కొట్టెడి గబ్బిలాలుగా—
నిలిచితటే, సరోవరమ, నీ వొకదానవు నాఁటిసొత్తుగా ?

అలల మెఱుంగుటద్దపు హొయల్ గులికించిననాఁడు తీవెక
న్నెలు నిను గారవించిరి, కనీనికలన్ దొలుకారుమబ్బువ
న్నెల నునుసోగగాఁ దిలకనీలిమ పూవుమొదళ్ల దిద్దుకోఁ
దలఁచి, భవత్తటాంచలపదభ్రమణక్రమలాస్యలోలలై !

౨

తురకరౌడీల కత్తుల కఠారుల వేడి తుంగభద్రాదేవి నింగి కెగయ,
పగరతేజీల పావాల హేషాఘోష కోటకొమ్మల గుడ్లగూబ లెగయ,

అరుల 'పారా'ల విహారాల 'సారా'ల ముసలికొండలు ముక్కు మూసికొనఁగ,
పాదుషామీసాలపై చేతిగడగడ పైఁడి 'దర్వాజా'లు పకపక నగ
తొల్లి తెలుఁగుకోటలు పడ్డ దుర్దినమున - తోడికమలాకరములు నిన్వీడి చెదరి
కొండరాళ్లేవో పైఁగప్పుకొన్నవోటు ! - బావురుమటందు వమ్మ, పంపామతల్లి !

రమ్మనినావటే తెలుఁగురాయని పేటికి వైరిరాజదు
ర్గమ్ముల కీర్తికాంతను పరాజయకాంతను తోడుతోడుగా :
బొమ్మలపెండ్లిగా పగటిపూట జయోత్సుకుఁడైన రాజులె
న్నెమ్ముల నంటి రేయి సహితేశ్వరు స్వాగత మిచ్చినావటే ?

3

వచ్చిన తొంటియేఁడుల విశాంపతు లెల్లరు తుంగభద్రలో
ముచ్చటకై నిజాశ్వముల ముందుగ తా మెదురీఁదువారు ; మా
కచ్చెరువయ్యె, నట్టికులమందు జనించియు, 'పుట్టి' గట్టి, యే
పిచ్చిపథాలనో కడచు వీరుల మైతిమటమ్మ, చూచితే ?

ఇందుల కీవె సాక్షివి సఖీ, సరసీ, నిజవామలోచన
స్పందనమాత్ర సూచితవిపత్కుల ప్రమదావికస్వరా
క్రందనకోటివా తెలుఁగురాణివి : ప్రాక్తనకీర్తినామక
స్యందన మెక్క నర్హత రవంతయు నున్నదటమ్మ మా కిఁకన్ ?

మా పౌరాణిక పారిశుద్ధ్యమును పంపా, నీ తరంగద్యుతుల్
స్థాపించెన్ దొలినాళ్ల రామచరణస్పర్శప్రభావంబునన్,
త్రేపో మాపో నశించిపోఁగలుగు మా ప్రేమాభిమానాల స
ల్లాపా లియ్యవి లెక్కలోనివటె లీలామూర్తివా నీ కిటన్ ?

నీ కొకమాట చెప్పవలెనే, జలజాకరమా, తపస్వినీ
లోకము పుణ్యహస్తములలో నిను లాలనచేసినట్టి ప్ర
త్యేకత మంటఁగల్పి మతిహీనుల నెత్తుటికండ లాజిలో
ఆఁకలిగొన్నయట్టు లకటా ! దిగమ్రింగుట పాపకార్యమే !

ర

ఆరుబయ లిది ; మాది కొండంతకోట ఏదో, రవ్వంత యిది బలహీనపార్శ్వ
మాయెపో ! వైరివీరుల ఆయువులకు - అమృతదాన మొసంగినావటవె నీవు !

౫

నీవు పిశాచివా, ప్రణయినీమణివా ముదుసళ్ల గుంపులో
కావరమెక్కి-యున్న మొనగానికి వానికి రామరాయమా
క్ష్మావనిభృచ్ఛిఖామణికి? అంతయు నీదిశ నాశమైన, ఏ
దేష్ఃడు నిన్ను 'మూలమిదియే' యని వ్రేలిడి చూపఁజాలఁడే!

అమ్మా, పంప, నిలింపసేవితతరంగా, నీకు జోహారు! దుః
ఖమ్మో, దోషబలమ్మొ నాకుఁ దెలియంగానీదు, నీపార్శ్వభా
గమ్మునాఁ డెటుచూచినన్ విడియపాకైపండెనా? నేఁటి కా
'కమ్మెరాకుల' తమ్మలో మెఱుపు రక్తస్రావమా, భోగమా?

౬

విఱుచుకుపడ్డ దేవతల విగ్రహపంక్తులలో దవానలుం
డఱచి 'లబోదిబో' యనిన అడ్డపడంగల కోఱమీస మె
వ్వరిది? సరోవరేందిర, నివాళులుపట్టిన పళ్లెరమ్ములన్
తురకలు రత్నహారములతో తెగనింపి అదృశ్యులైరకో?

ఈ సన్న్యాసిమఠాలు నీగుహలు నిక్లే యుండనీ—వీథులన్
రాసుల్ వోసిన పుష్యరాగముల బేరా లిష్ష దున్నట్టులే
యీశైలోపలఖండఖండములు నిక్లే యుండనీ... పేదస
న్న్యాసుల్ చేసగగాసులేక యిఁక నానందాశ్రువుల్ రాల్తురే!

ఇంకొకమాటతోడ ముగియించెద నాహృదయస్థదుర్విషా
దాంకురజీవగాథ: సగమైన శరీరమువోలె జీర్ణప
ర్యంకము నంటఁగట్టుకొని ఱాతిపొరల్ పయిఁగప్పుకొన్న యే
ణాంకధరప్రతిష్ఠితమహాలయసీమకు దోయిలొగ్గుచున్.

౭

జీర్ణవిజయనగర శిథిలాలయప్రాంత - శైలరాశి కటకటాలమధ్య
బందియై వడంకు పంపాసరోవరా - రామ మాతృదేవతామతల్లి!



తిరునీర్ మలై

వి. యస్. గోపాలదేశికాచారి.

కావ్యపఠనము

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

గ్రంథపఠనములో ఆసక్తి ఉన్నవాళ్లైవరేనా వాఙ్మయసముద్రాన్ని అమృతప్రాయమైన కావ్యాన్ని మరిచిపోలేరు. లలితకళలలో సంగీత మెట్లో, వ్రాతలలో కావ్య మట్లు. నవల చదవడానికి ఓరిమి అవసరము. అది త్వరగా పూర్తి కాదు. తొందరపడి పరిశిష్టము చదివేస్తే ఆసక్తి నశించిపోతుంది. వ్యాసము భావమునకుకన్న ఆలోచనకే ప్రాధాన్యమిస్తుంది. చిన్నకథలు, నాటకాలు చదివి ఆనందించడానికి కళారీతులను చాలామట్టుకు తెలుసుకుని ఉండాలి. ఠాకూరుమహాకవి వ్రాసిన పవిత్రనిశీథము (Supreme night) అనే కథను చదివినవారిని ఆరాత్రి పవిత్రమెందుకయిం దని ప్రశ్నిస్తే సరియైనజవాబు సామాన్యంగా రాదు. శాకుంతలాని కామాధుర్యమెలా వచ్చిందో చెప్పగలిగినవారు లెక్కకు తక్కువ. కాని కావ్య రసాస్వాదనం సర్వ మానవులకు కదళీఫలభోజనమువంటిది. 'భాష అర్థమైతే భావ మరటిపండే.' అన్నాడుగదా ఉమర్ ఖయ్యామ్.

'ఆనందలేశమైనా నోచుకో'ని 'ప్రవాస పాషాణజీవనా'లు కూడ కావ్యరసాస్వాదనమువల్ల 'దుఃఖపుంగసటు' నశించి భాగ్య సుమవాసనలను పరిమళిస్తాయి. కంకణవిభూషితమైన అదృశ్యకరసరోజము కావ్యపఠనాసక్తుడైన చదువరిని పాలుబారిన భాగ్యసీమలకు తీసుకుపోతుంది. ఆ సీమలలో ఉషాకన్య తన బంగారుచీర చెరగుల్లో తారకారత్నాలని మూటకట్టుకోడానికి హంసనడకలతో బయలుదేరుతుంది. చివురుమేతలచే జేవురించిన కంఠాల్లో పుట్టి తెమ్మెరత్రోవల్లో కోయిల పాటలు పరుగులెత్తుతాయి. బాలసూర్యుడు సయ్యాటలకని చేతులు చాపుతే వరిపంట చిన్నారి సిగ్గున శిరము వంచుతుంది. మనోహరగానసత్కళావిలసితుడైన అళిరాజును వరించిన మల్లెపూవుపరిణయానికి పువ్వులన్నీ గుమికూడుతాయి. తమ యేలికకోసము తుమ్మెదలు విరిదేనె పానకము కూడబెట్టుతాయి. పవనుడు పుప్పొళ్లు కూరుస్తాడు. ఈ వివాహమహోత్సవానికి ఉపశ్రుతిగా సెలయేటిచెలులు నదీకాంతతో కూడితే నదీకాంతలు సముద్రునితో చేరుతాయి. భాస్కరుడు బంగారుతివాచీమీద నడిచి పశ్చిమము చేరగానే మనుజహృదయాల కగమ్యాలయిన మధురగీతాలతో గాలిదారుల్లో గుంపులై పక్షులు తేలిపోతాయి. నభోమణి పోయిందని సంధ్యాదేవి జేవురిస్తుంది. నిశాకాంత తన నీలిచీర చెరగుల్తో సంధ్యాదేవి ఉంచిన రంగు ముగ్గుల్ని తుడిచేసి ముత్యాలు చల్లుతుంది. ఉదయగ్రావమనే పానవట్టముమీద అభిషేకాంభోధిలోంచి శీతగభస్తిబింబశివలింగ ముదయించి కౌముదీ దీపప్రభారాశిలో దర్శన

మిస్తుంది. మానవుల ఆశల్లో విధికి నిరంతరానీకము సాగే ఈ కటికి నేలే మనోజ్ఞమైనందనములాగ కనబడుతుంది. నీలాభ్రసరసిలో నిండుజాబిల్లి రాయంచవలె విహారము సల్పుతుంది. కమ్మతెమ్మెరలు శాఖాపత్రాలలోనో, కల్లోలినీతరంగాలలోనో దాక్కుంటాయి. నాట్యమూ, గానమూ మానేశి శైవలిని సుఖనిద్ర పోతుంది. సర్వేశ్వరుని చేతుల్లో విశ్వమే హాయిగా విశ్రాంతి చెందుతుంది.

ఈ వింత ప్రపంచములో దేశకాల ప్రతిబంధకాలేమీ లేవు. చలికి నరాలన్నీ జిల్లార్చే శీతకాలములో మంచుగడ్డతప్ప మరేదీ చూడలేని ఉత్తరసముద్రతీరవాసి "ఆకుబచ్చని చీనిచీనాంబరమ్ము, చారుసుకుమార పుష్పభూషలను దాల్చి, లలిత శాద్వలశయ్యాతలమున గూరుచున్న" కుంజసుందరిని చూడగలడు. పోలీసువారి చేతులలోతప్ప వేరెచ్చటను కత్తిచూడని నేటి ఆంధ్రుడు కండకండదీయు పరాసు ఫిరంగిగుండ్లమధ్య పసుపుకొంగుల ముసుగు లెడలగ కొసలుదీరిన కోరకత్తులు కసరిపోరిన గండుయోధుల శౌర్యాన్ని దర్శించగలడు. నీరవమైన అడవిలో తడియారిన తేటకన్నుల్తో, విడిపోయి జీరాడే జుట్టుకట్టుతో ఒంటరిగా శిలాతలమున నుపవిష్టయైన జానకీదేవి మానసవీధిలో పరుగులెత్తే భావతరంగాలు కవితాప్రభావంచేత మన మనస్సులకి స్పష్టమౌతాయి. గుండెలవియించే శివరాత్రిప్రభల చప్పుడు దారుల్లో విహరించే కాలకంఠుని ప్రళయనృత్యాన్ని కవియొక్క లేఖిని మనకన్నులగట్టుతుంది. మోదుచిగిర్చే పచ్చదనముతో గగుర్పుచెందిన తూర్పుకనుమల పాటను కావ్యము మనకి వినిపిస్తుంది. ఇన్నెందుకు? కావ్యము కామినీ స్వయంగ్రాహములాగ గగుర్పుచెందిస్తుంది. మెరుపులాగ ఈ ప్రకృతికి పాటపూస్తుంది. శ్రీకృష్ణుని వేణువులాగ సంగీతడోలల్లో ఊగులాడిస్తుంది. సరస్వతీదత్త పాత్రములాగ పంచభక్ష్యపరమాన్నాలు వడ్డిస్తుంది. ఉద్యానవనములాగ పరిమళ మెగబోస్తుంది.

కావ్యపఠనమువల్ల చదువరుల దృష్టి వైశాల్యము హెచ్చవుతుంది. ఈ దృష్టి కేవలము భౌతికమైన బాహ్యదృష్టిమాత్రమే కాదు. ఈ బాహ్యదృష్టిని మనకివ్వడానికి ఫొటోగ్రాఫులు చాలు. దూరదేశాలలోని నదులు, కొండలు, వ్యక్తులు మొదలైనవారి స్వరూపము చూపడములో కవిత చిత్రకళకి తీసిపోతుంది. కాబట్టి వర్ణితవిషయాల రూపచిత్రాన్ని కన్నులకి కట్టించడములో కాదు, కవిత్వానికి గౌరవము. చిత్రకళ కందని విచిత్రవీథులకి కవిత మనలను తీసుకుపోతేనే దాని ఆధిక్యము. పుట్టింటినుండి అత్తింటికి వెళ్లే మాలెత లెందరినో మనము చూస్తూంటాము. ఫొటోగ్రాఫులలోని చిత్రములలాగే వారు ఒకక్షణము మనకి కనబడి నిష్క్రమిస్తారు. వారి నిష్కపటహృదయాలు పరిమళించే అమాయికపు వాసనలు చిత్రకళగానీ, మన చూపులుగానీ చెప్పలేవు. కీ. శే. జనమంచి వేంకటరామయ్యగారి "దారితోడు" చదవండి.

మెత్తగా నున్న గౌతమీసైకతముమీద గమ్యభూమిఁచేరే కాంక్షతో కవి నడుస్తున్నాడు. ఆతని వెనుకనే ఎవరో ఒకయింతి నెత్తిని మూటపెట్టుకొని నడుస్తోంది. కవి "ఏమిమూట అమ్మి? ఎందుండి ఎందుల కేగుచున్న దాన విపుడు చెపుమ" అని ప్రశ్నించాడు. "పుట్టినింటినుండి పోదు నల్ల దిగో మాయూరి కయ్యగారు" అని జవాబిచ్చింది. కవి ఆమెకు మూట యంకిలైనదని జాలిపడగా ఆమె "మూట పైనమునకు నాటంకమగు గాని పూట గడవదండి మూటలేక" అని జవాబిచ్చెను కొత్త కోక పెట్టి కుంకంబువెట్టి వెర్రివాడైన ఆమె పెద్దయన్న తనివితీరక పచ్చజొన్నలు మూట గట్టి నెత్తిని పెట్టినాడట. చిన్నబిడ్డపలుకుకన్న ప్రేమార్ద్రమూ, కోమలమూ అయిన ఆ నిష్కపటురాలి పలుకు కవిహృదయానికి ప్రియము చేసింది. ఇద్దరూ పాటిరేవుపడవని ఏటిపాయను చేరారు. దోనెవాడు "బాపనయ్యవారు పాయదాటకమున్ను దాటరాదు మాలదాని" కన్నాడు. కరుణార్ద్రితగు కవి దోనెవానితో, వెలివాడని పుట్టగానే ఈశ్వరుడు వెలిబెట్టడనీ, పావనమైన గౌతమికి అంటు లేదనీ చెప్పి ఆమెతో దోనె నెక్కినాడు. గౌతమీపావనతరంగములపై తేలిపోయి మన కవి ధర్మరాజు కుక్కతోవలె స్వర్గానికి తొలిమెట్టు నెక్కినాడు. ఈ ఖండకావ్యము మనము దినదినమూ చూచే మాలెతల హృదయమును విప్పిచూపుతున్నది. మన మనస్సులలో మాలెత లాక్రమించగలిగే స్థూలరూప చిత్రాని కీకావ్యము భావవర్ణ మిస్తోంది. ఇప్పటినుంచీ ఈమాలెతయమాయకత్వము కవిహృదయములోనే కాక మనహృదయము మీద కూడా అచ్చుపడుతోంది. ఈకావ్యము మన లౌకికదృష్టికి భావమనేరంగు పూసి అందము తెస్తోంది. చిత్రకళ కీ భాగ్యము లేదు. ఇట్టి ఖండమే కవికొండల వేంకటరావుగారి "పడవ" కూడా. రాళ్ళపడవలకి చుక్కానిపట్టే కుర్రకుంకలని మనముఎన్నిమార్లైనా చూచి ఉంటాము. వారు మన హృదయాలదాకా ఎందుకు, కంటికికూడా ప్రత్యేకముగా కనపడరు. కవి మనకి బాహ్యదృశ్యాన్ని అతిక్రమించి వారి ఆంతర్యా నిదర్శించగల తపనీయ సులోచనా లిస్తున్నాడు. అప్పుడు, మన హృదయాలమీద నుండే వట్టిబొమ్మ చిత్రములైన వర్ణాలు పొంది అక్కడే అతుకు కుంటుంది. లక్షలకి మించిన వర్ణచిత్రాలు చూచినా ఈ అమాయికత బోధపడదు. ఇది సజీవ ప్రకృతి సంగితి.

కవితా స్పర్శముచేత జడప్రకృతికూడ సజీవమై భావలహరులు వెలువరించడము కూడా కలదు. తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలో పయనమై కోయిలపాట పరువు లెత్తిందట. పచ్చగోరంట పరిమళ మొగబోస్తే పడుచుగేదంగి పైరుగాలికి నవ్వింటదట. విభుని విడిచిన విరహిణి సెలయేరు శుష్కించినదట. లజ్జవదిలేసిన గోపకాంతలను చూచి తరుణ కరుణావృక్షము పూనవ్వు నవ్వింటదట. అతిముక్తలతా పరిరంభణమువల్ల తియ్యమామిడి ముకుళితపులకిత

మైనదట. వెన్నెలరేని చల్లని కరముల గిలిగింతకు కలువకన్నె నవ్విందట. నిర్మలమైన గౌతమీ నీరమందు తన సొగసు వన్నెలను చూచుకొనుచు నభశ్రీలతాంగి సందెచెరగులను సర్దుకున్నదట. నిత్యమూ తమదగ్గరనే వసించే భుజంగములు కబలించిన క్లేశముచేత మలయ వాయువులు మంచునీటిలో స్నానము చెయ్యడానికి హిమవత్పర్వతమువైపు సాగినవట. ఇలాంటి ఉదాహరణాలు లక్షలు. అందరికన్నలకీ ప్రకృతి అంతా సజీవముగా కనిపించదు. తపనీయ సులోచనాలు ధరించిన సత్కవికి ప్రకృతి అంతా సజీవమే. ప్రాచీనులలో కాళిదాసు, ఆధునికులలో గురజాడకవి ఇట్టివారు. తక్కినవారికి వారి వ్యుత్పత్తిప్రతిభలనుబట్టి ప్రకృతిమాత తన చైతన్యాన్ని చూపిస్తూంటుంది. వారు తమ కావ్యాలలో ఈచైతన్యమును పొందుపరుస్తారు. కావ్యపఠనాసక్తుడైన చదువరిముందు జడప్రకృతి సజీవమై తిరుగులాడును. చైతన్యమగు ప్రకృతిని వెలయించడము కావ్యానికే సాధ్యము కావడముచేత కావ్యము చదువలేని జడుడు తన భౌతికదృష్టితోనే ఆమెను దర్శించి మట్టిబొమ్మ అని అనుకుంటాడు. కావ్యము చదువరికి కవిదృష్టినిస్తోంది. చదువరిదృష్టి విశాలమేకాక ఉదాత్తముకూడా అవుతున్నది. అప్పుడే అతనికి నిండారబాఱు నఖండగోదావరి దాగిన చాళుక్యనాగరికతా, పల్లెపదాల జీవము నిల్పికొన్న పల్నాటి వీరుల రక్తనాళపటిమా కనబడును. అప్పు డాతడు తన్మయతతో,

విపినబంధుర వృక్షవాటిక
నుపనిషన్మధు వొలికె నిచ్చట
విపుల తత్త్వము విస్తరించిన
విశ్వమణి యిదె తమ్ముడా!

అని పాడును.

సత్కవిత్వము చదువరినికూడా కవిని చేస్తుంది. కవి అంటే ఎవరు? ప్రకృతిసంగీతములోని కళల కన్నిటికీ ప్రతినాదమిచ్చే హృదయము కలవాడే కవి. భ్రమరనాదము చెవి కెక్కిన కీటకము తానుకూడా భ్రమరమైనట్లే కవి హృదయముయొక్క ప్రతినాదమును తరచు వినే చదువరికూడా మొదట సహృదయుడై (వ్యుత్పత్తిలో) పిమ్మట రసికుడై, తర్వాత తానే కవి అవుతాడు. ప్రబంధ కవులలో పెక్కురిలాంటివారే. ఈపాట చూడండి:

యెనకజల్మములోన యెవరమో నంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలకనాయెంకి
ముందు మన కీజల్మ ముందోలె యంటి
తెలతెల్ల బోయింది పిల్ల నాయెంకి
యెన్నాళ్లు మనకోలె యీసుకము లంటి
కంటనీ రెట్టింది జంట నాయెంకి

ఇలాంటి పాటలు చదివినా, విన్నా, చిత్ర దర్శనమువల్ల మనకికూడా చిత్రకారుని హృదయాన్ని జనించిన భావాలు మొలకెత్తినట్లే, మన హృదయాలు సురభిళములవుతాయి. ఆసమయాలలో మనముకూడా కవనము చెప్పగలుగుతాము. గేటీ మహాకవి శాకుంతలాన్ని పఠించి,

తొలిపూవుల్ కడపండు లేటివరుసన్
తోడ్తోడ సేవింపగా

> ఏల తేనిక్ జెలికాడ, జీవితసుస
> ర్వస్వంబు ప్రాపించి భూ
> తలముక్ స్వర్గము రెంటు గూడునెడ నా
> త్మానంద సామ్రాజ్య సం
> కలనక్ నిల్వ, మదిక్ శకుంతలనె సం
> లక్షింపు లక్ష్యంబుగక్.

అని వర్తించాడట. కృష్ణశాస్త్రి గురజాడ అప్పారాయకవిమీాద రచించిన ముత్యాల సరాల్లోని

> యోగయుగంబులనుండి మ్రోగే
> విశ్వగాన వియత్తరంగిణి
> భంగముల సుష్వంగు నాతని
> గీతశీకరముల్.

అనేది మనహృదయాల్లో జనించే ఉత్సాహావేశానికి భాషారూపమేకదూ? కాబట్టి కావ్యము పఠించినప్పుడు, కవికి వర్ణ్యవస్తు సందర్శనవేళ జనించిన భావాలే మనకీ కలుగుతాయి. శివశంకరుల "కరస్పర్శ" చదవండి. కాశ్యపీసతనోన్ముఖుడైన కవికాయాము ను మనోజ్ఞశీతలహస్తము తో తాకి మెలకువతెప్పించిన వ్యక్తి యెవరా అని ఆలోచించే చదువరి హృదయము

> అరిగె నాసాధ్వి స్థూలదేహమ్ము విడచి
> సప్తవర్షమ్ములకు ముందు స్వర్గమునకు
> అవ్యయంబైన యాయమదివ్యయాత్మ
> నన్ను గాపాడుచున్న దీనాడు కూడ.

అని చదివేసరికి మీాటిన వీణతీగెలాగు రింగు మంటుంది. ఈమూగసంగీతానికి భాషారూపమిస్తే కవిత్వమౌతుంది. శివరాత్రిప్రభల చప్పుడు నృత్యాన్ని విన్న కవికొండల వేంకటరావు హృదయములో పుట్టిన అవ్యక్త సంగీతమే అతని గొంతులో చేరి "శివరాత్రి ప్రభ" అయింది. ఈరకపు ఆవ్యక్తసంగీతము కవిత్వమును చదవడమువల్లకూడా కలుగుతుంది. కవిత చదువరిహృదయతంత్రుల్ని మీాటి పాడించగలదు. మనుచరిత్రము ఎన్ని కావ్యాలకి తల్లిఅయింది? అంతదూరమెందుకు? మన తిరుపతివేంకటేశ్వరులెందరు కవులను చేయలేదు? తోకచిచ్చులాగ ఆంధ్రదేశమంతా రాజసందర్శనముకోసము పర్యటించిన వారి కవితాసరస్వతి ఎందరు కావ్యకన్యలను కలిగించింది? ఇప్పుడు కృష్ణాజిల్లాలోని కవులించుమించు అందరూ వారు చేసినవారే. నేను మరొక్కమెట్టు పైకెక్కుతాను. వారి పద్యపఠనపద్ధతే ఎందరినో లాగింది కవిత్వములోకి.

కావ్యము గురువుకూడాను. భగవద్గీత గొప్ప ఉదాహరణము. అది కావ్యమని నా అభిప్రాయముకాదు. అది గ్రంథము. కావ్యముకూడా గ్రంథములాగే శిష్యులు తన నిర్దేశాన్ని జవదాటలేకుండా ఉపదేశము చేయగలదు. ఐశ్వర్యలోభముచే దుర్యోధనుడు దాయాదుల హక్కులు చులకన చేశాడు. అందువల్ల అన్నదమ్ములతో నశించాడు. పరాక్రమ గర్వముచేత హిరణ్యాక్ష హిరణ్యకశిపులు సమసిపోయారు. పరమ భక్తులైన ప్రహ్లాదుడు, అంబరీషుడు నారాయణుని కృపకి పాత్రులయారు. అనేసంగతులు పురాణ కవిత చెప్పుతుంది. ఇది తల్లి, తండ్రి చెప్పినట్లుంటుంది. భయభక్తు లున్నవారు వింటారివి.

లేనివాళ్లు "శ్రీరంగ నీతుల్రా"అని తోసి పారే స్తారు. కాని భార్యచెప్పే నీతులుకాని, నిజాలు గానీ ఇలాగుండవు. ఆమె బహిరంగముగా కాక తన ఉద్దేశము పాలించబడేరీతిగా, అన్యాపదేశముగా చెప్పుతుంది. కావ్యము ఇలాగు చెప్పుతుంది తన ఉపదేశము. శాంత శృంగారరసములవిచిత్రసంఘట్టనములో శాంత రస మద్భుతవిజయము పొందుతుంది. "సతుల మాయలు ధీరచిత్తములను కలంచజాలవు." లాలసావేశుడైన గంధర్వుని కృత్రిమప్రేమా, రూపముగ్ధురాలయిన వరూధిని ప్రాణప్రదమైన వలపూ ఋణానుబంధము తెగినప్పుడు ఒండొరుల బాసిపోవును. వీరి విపరీత సంయోగమునకు ఫలము కామకలావేశుడైన స్వారోచి. స్వారోచిషమనుసంభవానికి వనదేవత క్షేత్రము కాగా, తిర్యగ్జంతువుల ఆసన్నవైరాగ్యానికి విస్మితుడైన స్వారోచితేజస్సు బీజమయింది. వీరి సంయోగానికి ఫలితము మనువవ దాని కధికారము గల స్వారోచిషమనువు. అనే ఈ సంగతుల్ని మనుచరిత్రము పైకి చెప్పకుండా చెప్పుతుంది. ఈ ఉపదేశాన్ని ఇటీవలివార్త లంటున్నారు. తెలుగుదేశపు సిరులని గురించి ముక్తకంఠాన్ని గానముచేసిన రాయప్రోలు కవి "చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వలచరిత్ర హృదయములు చీల్చి చదువుడో సదయులార" అనే సువార్తని బ్రతికిచెడ్డ ఆంధ్రులకిచ్చి జాతీయకవనానికి స్వస్తి చెప్పినాడు. "కష్టాలు వచ్చినాకాలమే తరిమినా కన్నీరు రాల్చకే కలుషమెరుగని చెలీ" అని "చెలి"నాశ్వాసించిన తురగా వేంకటరామయ్య "ప్రేమలీలా సుధాస్వామి రాధాకృష్ణు వేణువే సత్యమై వెలసె మనకోసమే" అని ఓదార్పుని పూర్తిచేసినాడు. "హేమంతకృష్ణానంతశర్వరి" యైన కృష్ణశాస్త్రి "ప్రేమ పట్టునకు" బిచ్చగాని చేయి చాపినాడు. ఫలితము చూడవలసియున్నది. దారిలేని శోకంపు టెడారులందు ఏ విసుగువేసటలులేక తిరిగిన వేదుల సత్యనారాయణశాస్త్రి, "ఏది ఇంకొక్కమా రూదరా నీ మురళి" యని బాలకృష్ణుని వేడినాడు. విశ్వమంతటికీ గొంతువిప్పే గీతి ఇతని గొంతుని ఎలా మధురిస్తుందో చూడాలి.

వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు అనుభవమువల్ల గొంతువిడి భరతఖండము పులకింపులతో వినేటట్లు విశ్వగానము వినిపించారు. వీరిగీతాలు విన్న ఆలంకారికులు "నా నృషిః కురుతే కావ్యమ్" అని లిఖించారు. జీవన్ముక్తుల సుధామధురోక్తులు విని పాలించగలిగినవారు భ్రమరకీటన్యాయాన్ని పునీతులౌతారు. మినుకుమినుకుమని వెలిగే జీవజ్యోతులు సత్కావ్యపఠనమువల్ల చుక్కలై ప్రకాశిస్తాయి. వాగులులాగ ఆరంభించిన మన నాగరికత సింధునదియై నిలచి గంభీరముగా పారుతుంది. దొరకిన ఆధారాన్ని దేనినైనా సరే ఔత్సుక్యముతో గ్రహించే దీనత్వములో నున్న మన జీవలత కావ్యపఠనమువల్ల సత్యసుందరుని చుట్టును అనురాగముతో అల్లుకుంటుంది.

కన్యాశుల్క-నాటక విమర్శనము

శ్రీపాద కామేశ్వరరావు

౧. కథాసంగ్రహము

కృష్ణరాయపురము అనే అగ్రహారంలో అగ్నిహోత్రావధాని అనే గృహస్థు ఉండెను. అతనికి ఇద్దరుకూతుళ్లు, ఒకకొడుకు కలరు. అవధాని వేదము జటాంతము అధ్యయనము చేసెను; కాని తద్వారా ధనార్జనము చేయలేక పెద్దకూతురు బుచ్చమ్మను ఒక సహస్రమాసజీవికి పెళ్లిచేసి అతనివద్ద రు ౧౬౦౦ లు పుచ్చుకొనెను. ఇట్టి ద్రవ్యమునకు కన్యాశుల్కమని పేరు.

అగ్నిహోత్రుని కొడుకు వెంకటేశము విజయనగరములో ఇంగ్లీషుచదువుకొంటూ ఉండెను. ఇది తండ్రికి ఇష్టములేకపోయినా, కొడుకు గొప్పగొప్ప ఉద్యోగములు చేసి ధనము గడించగలడనే ఆశ కుర్రవాని చదువుకు వీలుకలుగజేసింది; వాని విద్యమాత్రము అభివృద్ధి నొందలేదు. ఒకసంవత్సరము పరీక్షపోతే గిరీశము అనేవానిచేత ఇంటివద్ద చదువు (tuition) చెప్పించుకొనెను. అదీ వ్యర్థమై పరీక్షపోయింది. ఇంతలో కిసిమిసి (Christmas) సెలవులు రాగా ఇంటికి పోతే తండ్రి చావకొట్టుననే భీతిచేత వెంకటేశము మొగము వేలవేసినాడు.

తన పరిస్థితులు బాగుండకపోవడముచేత విజయనగరమునుండి పారిపోవలెనని గిరీశము నిశ్చయించుకొని, వెంకటేశముతో సెలవులు గడుపవెంచి, వాడు పరీక్ష Pass అయినాడని తండ్రితో చెప్పుతానని ధైర్యము పుట్టించినందున ఇద్దరూ కృష్ణరాయపురం చేరుకొన్నారు.

అక్కడ వెంకటేశముఅక్క బాలవితంతువు బుచ్చమ్మ కనపడగానే గిరీశముమనస్సామెపై పోయి ఎలాగైనా బోధించి పునర్వివాహమునకు ఒప్పించి పెళ్లాడవలెననే కోరిక పుట్టించెను. అందుకై వీలున్నప్పుడెల్ల గిరీశము ఆమెను పెళ్లిచేసుకొమ్మని ప్రోత్సహిస్తూండెను.

రెండోకొమార్తె సుభద్ర (సుబ్బి)ను లుబ్ధావధాని అనే వృద్ధునికి రు ౧౫౦౦ లు శుల్కము నిర్ణయించుకొని వివాహముచేయడానికి అగ్నిహోత్రుడు మాట యిచ్చెను. లుబ్ధావధాని గిరీశముపెత్తల్లికొడుకు. ఈపెళ్లి అగ్నిహోత్రుని కుటుంబములోనివాళ్లకుకాని, గిరీశంకికాని ఇష్టములేదు. కావున దీని నెట్లయినా కాకుండా చేయవలెనని అనేక విధముల యత్నములు జరుగుతూండేవి.

లుబ్ధావధానివయస్సు అరవైయేళ్లని ఒకరు, నలభైఅయిదని ఒకరూ చెప్పినారు. అతని ఊరు రామచంద్రపురం అగ్రహారము. అందు రామప్పంతులనే కరణము కలడు. అతడు లోకవ్యవహారమందు ఆరితేరినవాడని ప్రతీతి. సుబ్బిని పెళ్లాడుమని లుబ్ధావధానిని పురికొల్పినవాడు ఇతడే. మధురవాణి అనే వేశ్యను గిరీశము ప్రాపకమునుంచి తప్పించి తానుంచుకొనెను. లుబ్ధావధాని సుబ్బిని పెళ్లాడడము మధురవాణికి కిట్టదు. కాటికి కాళ్లుచాచుకొన్నవాడు చిన్నపిల్లను పెళ్లిచేసుకోవడము కేవలము అన్యాయము కావున ఈపెళ్లి తప్పించవలసిందని రామప్పంతుల్ని ఆమె నిర్బంధపెట్టుతూండెను.

సుబ్బితల్లి యీసంబంధము చేయవద్దని ఎంత మొత్తుకొన్నా భర్త ఆమెమాట వినలేదు. పెళ్లి తప్పకుంటే నూతిలో బడి చచ్చిపోతానని ఆమె భీష్మించుకొన్నది.

బుచ్చమ్మకూడా సుబ్బిపెళ్లి తప్పించుమని గిరీశమును కోరింది. ఈలాగు సర్వత్రా పరిస్థితులు పెళ్లికి ప్రతికూలముగా నుండెను. మొదట ఈదారితీసినవాడు సుబ్బిమేనమామ కరటకశాస్త్రి. ఇతడు తన శిష్యునికాడవేషము వేసి లుబ్ధావధానికి పెళ్లిచేయ నిశ్చ

యించెను. ఈపని తానొక్కనివల్ల అయ్యేదికాదు. సర్వసిద్ధమైన సుబ్బిపెళ్లి లుబ్ధావధాని మానుకొంటాడా? ఏదో గొప్పఎత్తు వేయవలెను. ఇందుకు తగిన తంత్రగాడు రామప్పంతులు. అతనిని లోబర్చుకొంటే అసాధ్యమైనదానిని సాధ్యము చేయగలము. కావున అతనియింటికి శాస్త్రి స్త్రీవేషమున ఉన్న తనశిష్యుని వెంటబెట్టుకొని వెళ్లగా అక్కడ మధురవాణి తానుకూడా సాయపడుతానన్నది. రామప్పంతులు రాబోయే కన్యాశుల్కములో ఐదోవంతిస్తే పెళ్లి సానుకూలముచేస్తానని ఒప్పుకొని అగ్నిహోత్రావధాని వ్రాసినట్లు లుబ్ధావధానికి—"మీరు పిసినిగొట్టులు, ముసలివారు, క్షయరోగపీడితులనీ, మీకూతురు వర్తన బాగులేనందున మిమ్ము వెలివేసినారు అనిన్నీ తెలిసినందున మీకు మాపిల్ల నివ్వదలుచుకోలేదు"—అని ఉత్తరము వ్రాసెను. ఈసమయమునసే గిరీశము లుబ్ధావధానిపేర—"సుబ్బికి వైధవ్యలక్షణము లున్నవి. మీరు పెళ్లి మహావైభవముతో చేసుకొంటారని తెలిసి పెద్ద పటాటోపముతో అగ్నిహోత్రుడు ఏనుగులు, గుఱ్ఱాలు, లొటిపిటలు, పల్లకీలుకాక యాభై బళ్లతో పెళ్లికి తర్లివస్తూన్నాడు. ఇందువల్ల మీకు చాలాధనవ్యయమవును కావున ఈసంబంధము మానుకోవలెను"—అని వ్రాసెను. రెండు ఉత్తరాలూ ఒక్కనాడే అందినవి. అంతతో లుబ్ధావధాని గుండెజారి రు ౧౨౦౦ లు శుల్కమిచ్చి కరటకశాస్త్రిశిష్యుని పెళ్లాడ నిశ్చయించెను. శుభముహూర్తము నిర్ణీతమయ్యెను. వివాహకాలమున నగపెట్టించండని కరటకశాస్త్రి రామప్పంతుల్ని వేడుకొనెను. కాని లుబ్ధావధాని ఒప్పుకోలేదు. రామప్పంతులు మధురవాణికంటె ఎరువుతెచ్చి పెళ్లికూతురి కిచ్చి లౌక్యులను పిలువడానికి పొరుగూరికి పోయెను. అతడు తిరిగిరాకుండానే ఏకరాత్రివివాహము చేయించి కరటకశాస్త్రి తనదారిని పోయెను. రామప్పంతులు వచ్చి తనకు రావలసిన శుల్కభాగము శాస్త్రి ఎగవేసినాడని గ్రహించి చిందులుతొక్కి లుబ్ధావధానిని కంటెయైనా ఇమ్మనుమని గద్దించెను. కాని అతఁడా ఊసే ఎరుగ" ననెను. ఇంతలో మాయసుబ్బి లుబ్ధావధానియింట దెబ్బలుతినలేక కంటె తీసుకొని పారిపోయెను. లుబ్ధావధానికూతురు మీనాక్షిద్వారా కంటె సంపాదించనెంచి రామప్పంతు లొకనాటిరాత్రి ఆమెచెంత జేరి, పెళ్లాడెదనని ప్రమాణముచేసి కంటె తెమ్మని బతిమాలుకొనెను. వీరి సల్లాపము లాలించి లుబ్ధావధాని ఇద్దరికీ కాయశుద్ధి చేసి కూతురిని ఇంటి నుండి గెంటెను. మీనాక్షి పంతులువెంట పడినది. ఇద్దరూ పంతులుగారింటికి వెళ్లగా కంటెతెస్తేనే కాని తలుపుతెరవనని మధురవాణి పట్టుపట్టింది. అంతలో పంతులు ఊరుబైటికి పరుగెత్తెను. మీనాక్షి తండ్రి దగ్గరకు పోయెను. ఇంతలో తెల్లవారింది.

ఊరుబైట చెరువుదగ్గర కోలాహలముగా నుండెను. అగ్నిహోత్రావధాని ఆర్భాటముతో చెరువుపక్క తోటలో విడిసి, లుబ్ధావధాని తనకు స్వాగతమిచ్చుటకు ఎవరినైనా పంపునని ఎదురుచూస్తూండెను. అంతలో రామప్ప లుబ్ధావధాని వేరే సంబంధము కుదుర్చుకొని పెళ్లాడినాడని చెప్పగా అగ్నిహోత్రుడు మండిపడి లుబ్ధునితో జగడమాడి నాలుగు తన్నిందిచాలక అతనిపై దావాతేవడమునకు రామప్పసాయము కోరెను. కుర్చీలకు సొమ్ముకావలసి బుచ్చమ్మనగ తాకట్టుపెట్టదలని ఆమెను పిలిచేసరికి ఆమె లేదు, గిరీశమూ లేడు. అగ్నిహోత్రు డందుకు చింతించి తాతలనాటి తన చేకడియము తాకట్టుంచి దావా నడిపెనుకాని ఫలములేకపోయింది. పైపెచ్చు కడియము చేజిక్కించుకొని రామప్ప ఉడాయించెను.

రామప్ప లుబ్ధావధానిమీది కసిచేత మాయసుబ్బి నతడు చంపినాడని వాదువేసి పోలీసువాళ్ల సాయము చేత కూనీకేసొకటి బనాయించినాడు. అవధాని ప్రాపేదీ లేక సౌజన్యారావనే ప్లీడరుశరణుజొచ్చి మనస్సమాధానము చేసుకొనెను.

ఇట్టివేళ నితనికి సాయపడవచ్చి గిరీశము అన్ని విషయములూ చక్కబెట్టుటకు వీలుండేటట్లు తన్ను పెంచుకోనడముగాని, లేదా Power of attorney ఇవ్వడముగాని తగినకర్తవ్యమని లుబ్ధావధానికి బోధిం

చగా ఆమెర పెడచెవినిపెట్టి "అన్నిటికీ నాకు సౌజన్యారావుగారే దిక్కని జవాబిచ్చెను. గిరీశం రావుగారివద్ద జేరి తాను గొప్పస్వార్థత్యాగి, సంఘసంస్కరణపరాయణుడని నచ్చచెప్పి ఆయనమెప్పు వడసి గుంటూరుశాస్త్రిపతా బయలుతీస్తానని మాటయిచ్చెను.

మధురవాణికూడా లుబ్ధావధానికష్టములు తొలగించదలచి మగవేషము వేసుకొని అర్ధరాత్రివేళ సౌజన్యారావుగారి యింటికి వెళ్లెను. రావుగారు వేశ్యలను చూడనేచూడరు. అట్టి యభిప్రాయము కేవలము అయుక్తమనీ, వేశ్యలలోకూడా గుణవతులు ఉండవచ్చుననడానికి నిదర్శనముగా గుంటూరు శాస్త్రికృత్యమంతా వివరముగా తెల్పి గిరీశము కేవల వాక్శూరుడేకావున అతని చర్య సమంజసముగా నుండకపోవడమువల్ల బుచ్చమ్మను పెళ్లాడతగడని సనిదర్శనముగా సూచించెను. ఈరీతిగా సుబ్బిపెళ్లి తప్పిపోయి లుబ్ధావధాని మీది కూనీకేసు తేలిపోయెను.

౨. ఆఖ్యానవస్తువిన్యాసము

ఈకథలోని ముఖ్యాంశము కన్యాశుల్కము. దీనివల్ల కలిగే కీడు చూపించి ఈదురాచారమును మట్టిలో కలుపవలసిందని కవిఉద్దేశము. ఈ నాటకములో శుల్కవివాహాలు మూడు కలవు. బుచ్చమ్మమీనాక్షులకు పెళ్లి అయింది. సుబ్బికి పెళ్లిసన్నాహ మయింది. మొదటి రెండు పెళ్లిళ్లూ దుష్పరిణామముకలవే. ఇద్దరినీ బాల్యముననే పెద్దవాళ్లకిచ్చినందున త్వరలోనే వైధవ్యము ప్రాప్తించింది. బుచ్చమ్మ తల్లిదండ్రులచాటున భయభక్తులు కలిగి మెలగిందికావున సచ్చారిత్ర అయింది. మీనాక్షి తల్లిగతించినపిమ్మట లుబ్ధుడు రెండుమూడు పెళ్లిళ్లు చేసుకొన్నందున ఇంటిలో పెద్దఆడదిక్కు లేకపోవడమూ, తండ్రిగారు తరుచు దావాలకై తిరుగుతూండడమూ పట్టి మీనాక్షికి స్వాతంత్ర్యముకలిగి దుర్వర్తనమలవడెను. యావజ్జీవదాస్యమూ, వ్యభిచారమూ శుల్కవివాహముల ఫలములని చూపి సుబ్బిని లుబ్ధుని కిప్పించకూడదని కవిఉద్దేశ్యము. సర్వసన్నద్ధమైన పెళ్లి తప్పించడము సులభసాధ్యముకాదు. కేవలహితోపదేశము కార్యకారికాదు. "శఠం శాఠ్యే సమాచరేత్", "విషానికి విషమే విరుగుడు." బుచ్చమ్మా, ఆమెతల్లీన్నీ మొత్తో పెళ్లిచేయవద్దని ఎంత మొఱపెట్టినా మూర్ఖుడైన అగ్నిహోత్రుడు మానలేదు. లుబ్ధావధానికి కూడా ఎందరో చెప్పియుందురు. అతడూ మానుకోలేదు. ఇక కుట్రచేసి పెళ్లిమాన్పించవలెను. కరటకశాస్త్రి తనశిష్యునికి స్త్రీవేషము వేసి లుబ్ధునికి పెళ్లిచేస్తే సుబ్బిపెళ్లి కాబోదని తలచి కార్యక్రమము కవి మొదలుపెట్టెను.

లుబ్ధుని పెళ్లి కొప్పించవలెనంటే రామప్ప సహాయము కావలెను. శాస్త్రి రామప్పవద్దకు వెళ్లేసరికి తలవనితలంపుగా మధురవాణిసాయముకూడా దొరికింది. అదివరకే ఆమె లుబ్ధునికి సుబ్బిని పెళ్లిచేయవద్దని పంతులుతో పోరుతూండెను. శాస్త్రి రాగానే ఆమె మరింతబిగిసి పంతులుతో మాటలాడడము మానివేసింది; దగ్గిర చేరనివ్వలేదు. రామప్ప లంచగొండి, శాస్త్రి కూతురికి రు ౧౨౦౦ లు ధరపెట్టి అందులో ఐదోవంతు తనకు ఇచ్చేటట్టు బేరము కుదిర్చెను. బుచ్చమ్మ ప్రేరేపణవల్ల గిరీశముకూడా ఉత్తరము వ్రాసి ఇందు భుజము కలిపెను. లుబ్ధునికి డబ్బుఖర్చంటే కిట్టదు-సుబ్బిని పెళ్లాడవలెనంటే శుల్కానికితోడు పెళ్లిఖర్చు హెచ్చవనీ, అసలు పెళ్లికూతురికి కొన్ని అవలక్షణాలున్నవనీ భయపెట్టితే పెళ్లి మానుకుంటాడని గిరీశంఊహ. ఇది కొంతవరకు నిశ్చయము. ఉత్తరము చూడగానే ఆడపెళ్లివారి ఆర్భాటము చూసి లుబ్ధుడు పెళ్లికిష్టపడలేదు. అప్పుడే రామప్ప బనాయించిన ఉత్తరమూ అందింది. లుబ్ధుడు తమ పిల్లకు తగినవరుడు కాడనే అగ్నిహోత్రుని మాట వినగానే తన ఆత్మగౌరవము తగ్గించవని లుబ్ధుడెంచి సుబ్బిని పెళ్లిచేసుకొనితీరుతానని పట్టుబట్టదలచెనుకాని ధనవ్యయమునకు జంకి చవకబేరమని కరటకశాస్త్రిశిష్యుని వివాహమయ్యెను. ఇంతవరకు కథ సూటిగా సాగి సుబ్బిపెళ్లి కాజాలదన్న నమ్మకము పుట్టించింది.

ఈ మాయపెళ్లి జరిగినట్టు కృష్ణరాయపురములో తెలియకపోవడముచేత అగ్నిహోత్రుడు అత్యాశ్చర్యముతో తనకూతురుపెళ్లికి రామచంద్రపురం తర్లివెళ్లి తోటలో దిగెను. కొద్దికాలములోనే జరిగిన స్థితి నెరిగి లుబ్ధునివద్ద దారిఖర్చులైనా పుచ్చుకోలేక తహతహపడి అతనితో తగవులాడి నాలుగుతన్ని పైపెచ్చు దావాలోకి దిగెను. దావావెచ్చమునకు తాకట్టు పెట్టుకోవలసివచ్చింది.

ఇక బుచ్చమ్మచరిత్ర పరిశీలింతాము. ఈమె భక్తిశ్రద్ధలతో తల్లిదండ్రులను కొలుస్తూ పూర్వాచారపరాయణయై తదాదర్శములూ, ఆచారములూ జరుపుతూండెను. గిరీశ మామెకంటపడి డాబులు కొట్టి పునర్వివాహమునకు పురికొల్పెను. కాని అట్టిపెళ్లి అవైదికము, అశాస్త్రీయము, అనాచారము అవుటవల్ల ఆచరణీయముకాదని ఆమెదృఢమైన నమ్మకము. దీనిని తన ప్రతికూలబోధనచేత గిరీశము పూర్వపక్షము చేసి పునర్వివాహము పాపకర్మ కాదని సిద్ధాంతీకరించి దానివల్ల కలిగే లాభము అమితసౌఖ్యదాయకమని నిరూపించెను. బోధన బుచ్చమ్మకు నచ్చింది. కాని ఇంటిలోనుండి లేచిపోవడానికి ఆమె జంకింది. ఈ సమయమున పెళ్లికి తర్లివెళ్లవలసివచ్చింది; అది కనిపెట్టి బుచ్చమ్మ తనతో సుబ్బిపెళ్లి కానీయకుండా యత్నముచేయుమని పోరుతూంది కనుక తద్విషయకయత్నము బుచ్చమ్మచేతనే కాగలదని చెప్పెను. ఈ మాట ఆమె కర్థముకాలేదు. పిమ్మట అతడు—"నీవు నావెంట రావడానికి ఇష్టపడితివా నీబండివానికి లంచమిచ్చి, త్రోవతప్పించి రామవరము తీసుకొనిపోయి నిన్ను శాస్త్రీయముగా పెళ్లాడుతాను. నీవు కనిపించకపోవడముచేత అందరినడుములూ విరుగుతవి, గుండెలు చెక్కలవుతవి. అంతతో సుబ్బిపెళ్లి ఆగిపోతుంది" అని వివరించిచెప్పెను.

చెల్లెలియందలి ప్రేమచేత బుచ్చమ్మ సమ్మతించింది. గిరీశంకోరిక ఇంతవరకు కొనసాగింది—ముందున్నది ముసళ్ల పండుగ. వితంతువును పెళ్లియాడదలచినవాడు ఆమెభరణపోషణమునకు చాలినంత సొమ్ముకాని, తదితర-ఉపపత్తికాని చూపవలసియుండెను. ఇదికాక వేరొక ఆటంకముకూడా ఉండెను. సుబ్బివివాహ మాగిపోయి అగ్నిహోత్రుడు సురక్షితముగా ఇల్లుచేరుకొంటేనేకాని బుచ్చమ్మ పెళ్లికి ఒప్పుకోదు. ఈ రెండు ఆటంకములు తీరేలోపల గిరీశము రామచంద్రపురం వెళ్లవలసివచ్చెను.

లుబ్ధావధానికి విషమసంకటము ప్రాప్తించినది. ఒకవైపు కూనీకేసు, రెండోవైపు అగ్నిహోత్రావధాని ఒత్తిడి, మూడోవైపు మీనాక్షిదురాచరణము. ఇందొకదైనా తప్పేదారి తోచలేదు, పరవసలేదు. అందుచేతనే సౌజన్యారావు శరణుజొచ్చెను. గిరీశం రావుగారియెదుట డంబములుపల్కి తాను సదాచారసంపన్నుడైన సంస్కరణాభిలాషి అనిన్నీ, బుచ్చమ్మమీది అవ్యాజప్రేమచేతనే ఆమెను వివాహమాడ నిశ్చయించెనుకాని లాలసచేత కాదనిన్నీ నచ్చచెప్పి లుబ్ధుని ఆస్తి తనకు చిక్కునట్లు ఏర్పాటుచేయవలెనని కోరెను. మోసమూరుతైన రావుగారు గిరీశం మాటలు నిజమనుకొని గుంటూరుశాస్త్రిల భోగట్టా తెలుసుకొనివస్తే తగినసాయము చేస్తాననగా అందుకాతడొప్పుకొనెను. ఇంతవరకూ గిరీశంపాచిక పారింది.

ఈతరుణమున మధురవాణి సౌజన్యారావుగారిని చూడవచ్చెను. ఆమె కనబడగానే గిరీశంగుండెలో రాయిపడ్డది. అన్యాయవర్తనము ఒంటిగా నున్నంతకాలము చెలరేగునుకాని న్యాయపరుల ఎదుట తలచూపలేదు. అందుచేత ఆతడు శీఘ్రముగానే జారెను. మధురవాణి లుబ్ధావధానిగండము తప్పించి ప్రసంగవశమున గిరీశము గుట్టు బయలుపెట్టక తీరిందికాదు; ఇందువల్ల అతని వలలోనుంచి బుచ్చమ్మ దాటిపోయింది, గిరీశముగారికి తగినశాస్తి అయింది.

ఈవిన్యాసమున ముఖ్యములైన ఘటనలుమాత్రమే చెప్పబడినవి. సుబ్బిపెళ్లి మొదట స్థిరపడి, తరువాత రద్దుచేయబడి, అనంతరము కొంచెము తడబడి, తుదకు భంగపడెను. ఈకుంతితగతి నిరూపించడమందు కవిచాతుర్యము కానవచ్చును. పెళ్లిపక్షాన పనిచేసినవాళ్లు అగ్నిహోత్రావధాని, రామప్పంతులు, లుబ్ధావధాని.

వీళ్లయత్నము నిరాటంకమయితే వివాహ మయితీరును. అట్లే జరిగితే వస్తుజటిలత (Complexity of plot) సమకూడదు. అందువల్ల కవి ఈఘటనకు ఘాత చేకూర్చెను. పెళ్లిప్రతిపక్షమున పనిచేసినవాళ్లు కృష్ణరాయపురములో బుచ్చమ్మ, ఆమెతల్లి వెంకమ్మ, కరటకశాస్త్రి, గిరీశము; రామచంద్రపురంలో మధురవాణి, రామప్పంతులు. ఈయిరువీడులవారి ప్రయత్నములు ఒకదానితో నొకటి కలియనంతకాలము పెళ్లియొక్క గతి అనుకూలముగా నుండెను. కరటకశాస్త్రి రామప్పంతుల సహాయము సంపాదించి ప్రయత్నములు జోడించగానే పెళ్లి ముప్పాతికపాలు ఆగింది. గిరీశమూ, రామప్పంతులూ వ్రాసినఉత్తరాలు లుబ్ధునకు చేరినవెంటనే అడుసునపాతిన స్తంభమువలె ముందుకీ వెనకకీ ఊగులాడింది. గిరీశంఉత్తరము పెళ్లికి ప్రతికూలించగా రామప్ప ఉత్తరము పెళ్లిని కొంత ఆపి మాయసుబ్బిపెళ్లి కనుకూలించింది. తరువాత అగ్నిహోత్రుడు తర్లిరావడము సుబ్బిపెళ్లిని కొంచెము ముందుకు నెట్టగా అతనికీ లుబ్ధునికీ జరిగిన జగడము దాన్ని వెనక్కి పూర్తిగా నెట్టివేసింది. ఇంతతో ఈఘటన అంతమై మాయసుబ్బిపెళ్లి తలయెత్తింది. ఈసుబ్బి పరారికావడముచేత కూనీకేసు పుట్టి లుబ్ధావధానిమనస్సు కలతపెట్టి పశ్చాత్తాపము పుట్టించి తలప్రాణము తోకకు తెచ్చింది. ఇంతవరకూ అధర్మమూ, అన్యాయమూ, అసత్యమూ ప్రజ్వరిల్లి కార్యక్రమమును వంచనాకలితముగా చేసినవి. పాపకార్యము లొకదానినుండి ఇంకొకటి పుట్టినవి. ఇందు పాల్గొన్నవా ళ్లందరూ స్వార్థపరులు, మోసగాళ్లు, ఈర్ష్యాపరులు. వీళ్ల ప్రభ వెలిగినంతకాలము పాపము చెలరేగి అందరికీ శృంగభంగముచేసి లుబ్ధావధానిపీక కురి అయింది. ముసలివాడు మతిపోయి ప్రాణాలమీద ఆశ విడిచి దిక్కులేనివా డయినాడు. పాపవృక్షముయొక్క ఫలము విషయుక్తమవుట వింతకాదు. ఈసంతతి నిర్మూలముకావలెనంటే ధార్మికులు, పరార్థవ్యాపృతులు, స్వార్థత్యాగులూ కార్యభారము వహించవలెను. ఇట్టివారీనాటకపాత్రములలో ముగ్గురున్నారు—కరటకశాస్త్రి, మధురవాణి, సౌజన్యారావు. వీరు కార్యనిర్వహణము మొదలుపెట్టగానే వంచనామేఘము లొక్కొక్కటి విరియబారి క్రమముగా పటాపంచలై స్వార్థధ్వాంతము దిశలకు పారెను. "ఒకపాపకృత్యమువల్ల కలిగిననష్టము ఇంకొక పాపకృత్యమువల్ల నశింపనేరదు. పాపము నాభిదుంపవంటిది; మొలకలు తెంపినంతమాత్రాన దాని వృద్ధి మానదు; దానిని చంపవలెనంటె దుంప నూడపెరికి నిర్మూలముచేయవలెను. పాపచిత్తులు ఏకార్యము పూనుకొన్నా భగ్నమనోరథులై పశ్చాత్తాపదగ్ధు లవుతారు." అని ఈనాటకము బోధిస్తున్నది. అగ్నిహోత్రుడు, లుబ్ధుడు, గిరీశం, రామప్ప-వీరు నలుగురూ చెడ్డవారే-మొదటివాడు ధనాశాపీడితుడు. రెండవవానిని ధనేషణేకాక దారేషణ, పుత్రేషణకూడా పీడించెను. తక్కిన ఇద్దరినీ ఈషణత్రయమేకాక మోహమదమాత్సర్యములున్నూ పీడించెను. ఇట్టివా ళ్లెన్నటికీ సత్కార్యనిర్వాహకులు కానేరరు. కించిత్కాలము లబ్ధవిజయులైనా తుదకు వీళ్లకి శృంగభంగము తప్పదు. "సత్యమేవ జయతి నానృతమ్"—ఇదే కావ్యన్యాయము (Poetic Justice). ఇట్టి కావ్యములే మన సాహిత్యములో నుండదగినవి. ఇవి మన కానందము కలుగజేయడమేకాకుండా హితముకూడా ఉపదేశించును.

నాటకరచన :—

౧. గీర్వాణఫక్కి

మన ఆలంకారికులు నాటక కథను రెండుభాగములు చేసినారు:— ౧. ఆధికారికము, ౨. ప్రాసంగికము. మొదటిదానిలో ఫలభోక్త నాయకుడు; రెండోదానిలో ఫలము నాయకేతరులకు చెందును. ప్రాసంగిక కార్యములవల్లనే కథ జటిలమగును. వీటి కన్యోన్య సంబంధము కల్పించినందువల్ల కొన్నికార్యములు ఆధికారికమునకు అనుకూలించి మరికొన్ని ప్రతికూలించును. ఈకార్యపరంపర సాగించడమందే నాటకకళాప్రకర్ష వ్యక్తమవుతుంది. ఇందుకే పలురంగములు (స్థలములు—Scenes) కూర్చబడును. అందలి పాత్రములు చెప్పే మాటలు, చేసేపనులు పరిశీలిస్తే కథాచమత్కృతి, పాత్రగుణములూ విశదమాతవి. కొన్నిరంగములలో సమ

కాలిక — ఆచారవ్యవహారములు వ్యక్తమగును. దీనికే Local coloring అనిపేరు. ఈమూడు విషయముల యందున్నూ దేశకాలపాత్రములు ప్రతిఫలింపజేయడమే నాటకోద్దేశము. కవితాసారమునకు ఇవే నికషపాషాణములు.

కథావిన్యాసఫక్కి వివరిస్తే కన్యాశుల్కము నాటకమవునో కాదో తేలుతుంది. దశరూపకమనే నాటకలక్షణగ్రంథమందు కథ ఐదుభాగములుగా విభజింపబడినది:— ౧. బీజము, ౨. బిందువు, ౩. పతాక, ౪. ప్రకరి, ౫. కార్యము. ఇవి "కన్యాశుల్క"మందు ఈక్రిందిరీతిని వివరించవచ్చును. సుబ్బిని లుబ్ధావధానికి పెళ్లిచేసే సంకల్పము బీజము. తద్విషయకప్రయత్నములు, అనగా సంబంధము నిర్ణయించుకోవడము, మధ్యవర్తులద్వారా వర్తమానములంపడము, శుల్కనిర్ణయము, తాంబూలాలివ్వడము మొదలైన చర్య బిందువు. అగ్నిహోత్రుడు బంధువులను పెళ్లికి పిలవడము, ఏనుగులు, గుర్రాలు, ఒంటెలుమొదలైనవి సమకూర్చుకొని రామచంద్రపురం తర్లివెళ్లడము పతాక. బుచ్చమ్మ కనబడక పోవడము, లుబ్ధావధాని మాయసుబ్బిని పెళ్లాడడము ప్రకరి. సుబ్బిపెళ్లి తప్పిపోవడము కార్య (భంగ) ము.

ఈ వివరణబట్టి "కన్యాశుల్కము" నాటకమే అని గ్రహించవచ్చునుకదా? ఇది ప్రహసనము (Farce) అనే విమర్శకులు ఈగ్రంథమును చులకనచేసి "It is after all a farce" అనుట విచారకరము. ఈగ్రంథమందింకోచిత్ర ముంది. పైని వివరించిన నాటకఫక్కి ఆధికారికకార్యమునందేకాక ప్రాసంగిక కార్యములందు కూడా కనబడుతూన్నది.

అగ్నిహోత్రుడు సుబ్బిపెళ్లి చేయడానికి ఎంత పాటులాడినాడో కరటకశాస్త్రి పెళ్లి తప్పించడానికి అంతయత్నము చేసినాడు. అట్టియత్నమును కథాసంగ్రహమందు వివరించినాము. కనుక ఇచ్చట విభాగ ప్రక్రియమాత్రము సూచిస్తాము:— సుబ్బిని లుబ్ధున కివ్వవద్దని వెంకమ్మపట్టు బీజము. బుచ్చమ్మపోరు, కరటకశాస్త్రిచేసిన మాయ బిందువు. మధురవాణిపట్టుదల పతాక. గిరీశమూ, రామప్పంతులూ వ్రాసిన ఉత్తరాలు ప్రకరి. మాయసుబ్బివివాహము కార్యము.

ఈరెండుకార్యములకూ పరస్పరవిరోధముఉండుటచేత మొదటిది విఫలమయి రెండోది సఫలమయింది. ఆకార్యము ఖేదాంతము, ఈకార్యము మోదాంతము. మొత్తముపై నాటకము ఖేదమోదాంతము (Tragi-Comedy). మన వాఙ్మయమునందలి ప్రసిద్ధనాటకములు—నళీయము, హరిశ్చంద్ర, శాకుంతలము, ఉత్తరరామచరిత్రమున్ను ఇట్టివే.

౨. పాశ్చాత్యఫక్కి

ఇప్పటి విద్యార్థులు కొందరు "దశరూపకము" ఆధునికలక్షణగ్రంథము కాదనిన్నీ, ఆంగ్లసాహిత్యపరిచయము విదేశాదర్శపక్షపాతము కలిగించడమువల్ల నాటకమునాడెము సెంచే (Appreciate) టప్పుడు పాశ్చాత్యనియమా లుపయోగించవలెననిన్నీ అభిప్రాయ పడుతూన్నారు. వీళ్లనికూడా సంతోషపెట్టడ మవసరము. కనుక సుప్రసిద్ధ-ఆంగ్లవిమర్శకులైన Bradley గారు ఏర్పరచిన నాటకకథావిన్యాస నియమము గీటురాయిగా ఉపయోగించి చూతాము. ఆమహనీయుడు అయిదుభాగములుగా కథావిన్యాసమును విభజించెను:—

ఖేదాంతనాటకము

౧ Exposition (కార్యవివరణ)

౨. Complication (కార్యాతిశయము)

౩. Crisis (సంకటావస్థ)

౪. Resolution (కార్యవిజృంభణము)

౫. Catastrophe (చరమవిపత్తి)

మోదాంతనాటకము

౧. Situation (కార్యవివరణ)

౨. Complication or entanglement (కార్యాతిశయము)

3. Denouement (కార్యపరిణతి)

ఖేదాంతములయందు నిర్దేశించిన ౨,౩,౪ అవస్థలు మోదాంతములలోని రెండో అవస్థయందలి భాగములుగా గణిస్తే రెండురకాల నాటకాలకూ మూడు భాగములే ఏర్పడును. ఏకార్యనిర్వహణమందైనా సర్వసాధారణముగా కనబడే అవస్థలు మూడే:— ఆరంభము, అతిశయము, అంతము. ప్రస్తుత నాటకకథాసంవిధానము ఈమూడుభాగములయందు చక్కగా ఇమిడిపోవును.

ఏనియమాలబట్టి పరీక్షించిచూసినా "కన్యాశుల్కము" నాటకమనక తీరదు.

ఘటనారచన :—

ఈనాటకమందలి ఘటనలలో ముఖ్యమైనది సుబ్బివివాహసంకల్పము. దీనికి తక్కిన ఘటనలతో సన్నిహితసంబంధ ముంది. దీనితోటి దూరసంబంధ ముండి ఈనాటకపాత్రముల గుణోన్మీలనము చూపించే ఘటనలు చాలా కలవు. అవి పాత్రపోషణకు పనికివచ్చును. మరికొన్ని ఘటనలు దేశకాలపరిస్థితులను సూచించును. వ్యర్థమైన ఘటన కానరాదు. ప్రతిరంగమందలి సంభాషణ సార్థకముగా నుండును. వ్యర్థమైన మాట వెతికినా కనబడదు. మచ్చుకి రెండురంగములు పరిశీలింతాము:—

మొదటి అంకమందు రెండురంగము లున్నవి. వాటియందు పూటకూళ్లమ్మల స్వభావము, గిరీశము బోటి రిజాలాయువకుల చరితము, భోగముదాని చిత్తవృత్తి, కాసుకి గతిలేకున్నా నూటికి పర్వాలేదనే డాంబికులు చిత్రింపబడినారు.

రెండో అంకములో అగ్నిహోత్రావధానినీ, బుచ్చమ్మనూ పునర్వివాహపక్షమునకు తిప్పవలెనని గిరీశం పాటుబడగా మొదటిప్రయత్నములో అంతా వ్యర్థమైనా రెండోయత్నములో కొంతవరకు జయము ప్రాప్తించెను.

ఈయంకమందు మూడోరంగములో గిరీశం తన అభిప్రాయములను కొంత మార్చుకొనెను. చిన్నబాలికలను ముసలివాళ్లకు పెళ్లిచేయడము మంచిదనీ, శుల్కము పుచ్చుకోవడము న్యాయమనీ అతని ఇప్పటివాదము. ఈ పరివర్తనము హాస్యరసమును పోషిస్తూ స్వార్థపరులు ఏయెండకు ఆగొడుగు పట్టుటకు కొంకరని బోధిస్తుంది. అగ్నిహోత్రునికి కోర్టులు, దావాలన్న ప్రీతి అని గ్రహించి ఆయనను సంతోషపెట్టడానికిన్నీ, గిరీశం తన కార్యము సాధించుకొనడానికిన్నీ ఈమార్పవసరము.

జ్యోతిషమంటూ, భూతాదులయందూ జనులకెట్టి మూఢవిశ్వాస మున్నదో మూడు, అయిదు అంకములలోని మొదటిరంగములో చూపబడ్డది. జాతికాల బనాయింపు, దయ్యములను సీసాలలోకి దింపి భూస్థాపన చెయ్యడమూ, లుబ్ధావధాని కొండలమూ నీని కుదాహరణములు.

రామప్పంతులు లేనివేళ పుస్తె ముడివేయించి రూపాయి లెగవేసి శాస్త్రుల్నీ, ఎరువుకంటె పట్టుకొని శిష్యుడున్నూ పారిపోయినందుకు ఉగ్రుడై పంతులు లుబ్ధావధానితో "శాస్త్రి నీకు రెండోపెళ్లి ముండని కట్టిపెట్టినా"డని అన్నంతమాత్రాన అవధానికి పీడకలలు వచ్చి అందులో "మాయసుబ్బి (శిష్యుడు) మొదటి మగడు నాసిక నులుముతూన్నా"డని కేకలువేసి గోలపెట్టి దాన్ని ఇంటినుండి గెంటివేయవలెనని నిశ్చయించినాడు. ఇంతకన్న మూర్ఖు డుంటాడా?

పేకాటరంగము (ఐదో అంకము రెండోరంగము) కున్నూ, నాటకమందలి ముఖ్యఘటనలకూ సన్నిహితసంబంధము అంతగా లేదు. కాని యీరంగమువల్ల తమ్ముపోషిస్తూన్న మహాజను లింటికి రానప్పుడు సానులు కాలయాపన మేలాగు చేస్తారో తెలుస్తుంది; పోలిసెట్టిసైజము తేటపడుతుంది. రామప్పంతులుకి తెలియకుండా కరటకశాస్త్రిశిష్యుడు మధురవాణికి కంటె నిచ్చి ముందుకథకు బీజము నాటినాడు. దానివల్లనే కథ సాగింది. కంటెసంగతి రామప్పకు తెలిస్తే కథ ముగిసినట్టే; మానీకేసుబనాయింపు కవకాశము ఉండదు; లుబ్ధావధానికి ఏదిగులూ ఉండదు, పశ్చాత్తాపమే కలుగదు; కథావైచిత్ర్యము తగ్గిపోవును.

సారాదుకాణమునీను కూడా అవాంతరఘటనే. దానివల్ల బైరాగుల దురాచారములు, అమాయికులను వాళ్లు వంచించే తీరులూ, వాళ్ల మెట్టవేదాంతాలు, పోలీసువాళ్లు దొంగసాక్ష్యము బనాయించడమూ, పైకి పెద్దమనుష్యులులాగు కనబడేవాళ్లు రహస్యముగా చేసే తప్పుపనులూ తెలుస్తవి.

ఇదేరీతిని జాగ్రత్తతో పరిశీలిస్తే ఈనాటకమందు ఘటనాసార్థకత కనబడుతుంది. ఘటనలు చాలా ఉండడముచేత ఆఖ్యానవస్తువు జటిలమై రసస్ఫూర్తి అలవడినది. ఘటనలలో ఘాతప్రతిఘాత ముందని ఇదివరకే చూపినాము. కొన్నిఘటనలు కథను ముందుకు నెట్టగా, కొన్ని దానిని వెనుక కీడ్చును. ఇదికాక నాటకమునందలి ముఖ్య పాత్రములకు "ఇది చేయనా? అది చేయనా?" అనే సంకటావస్థ (Crisis) ప్రాప్తించింది. ఒక్క మధురవాణికిమాత్రము ఈయవస్థ పట్టలేదు. ఆమె కార్యనిపుణ, దుష్కర్మకు పూనుకోలేదు. ఈకారణములచేత ఆమెకు భావసమరము (Internal Conflict) లేదు. నాటకరచనలో భావసమరము ముఖ్యాంశమని Bradley గారి అభిప్రాయము. ఇట్టిగతి ముఖ్యపాత్రములకు కల్పించునట్లు కథను రచించినకవి ఉత్తముడు. ఇట్టివానికి సంస్కృతాలంకారికులు "మహాకవి" అనే సార్థకమైన పేరు పెట్టినారు. "ఆచార్య", "ఉపాధ్యాయ", "మహాకవి" మొదలైన బిరుదులు మొదట సార్థకములై నానాటికి నిరర్థకములైనవి. పూర్వము శంకర, రామానుజ, గంగేశ, మొదలగు మహాత్ముల కుపయోగించిన బిరుదు లిప్పుడు వంద మూడుటోలీలకింద వాడబడుతూన్నవి; వంటచేసేవాడూ ఆచార్యుడే!

(సశేషము)



శ్రీ గోవిందరాజస్వామి దేవాలయగోపురము, తిరుపతి

—డి. గోపాలరావు.

౧

౨

3

౪

బిల్హణకథ

డి. ఎ. నరసింహం, యం. ఏ., యల్. టి.,

(గతసంచికతరువాయి)

IV పాత్రపోషణము

బిల్హణకావ్యములోని ముఖ్యపాత్రములు కాశ్మీరకవి బిల్హణుడు, రాజకుమార్తెయగు శశికల, రాజగు వీరసింహుడు, పట్టపురాణియగు సుతారా, పురోహితుడు. వీరిలో రాజు వీరసింహుడు వీరుడు; కళలయందును, విద్యయందును అభిరుచిగలవాడు; గాంభీర్యము, ధైర్యము, గొప్ప దానగుణము గలిగి లోకమును పాలించుచుండెను:

"యో వైరివీరవరవారణదర్పసింహో
విద్యావినోదవివిధాభిరసః కలావాన్,
గాంభీర్యధైర్యగురుదానగుణైః సలోకం
పాతిస్మ వీరనృపతి ర్నిజరాజధర్మైః."

కుమార్తెయొక్క సహజమగు బుద్ధిసూక్ష్మతను, గానకౌశల్యమును చూచి ముదమంది సాహిత్యమును చెప్పించవలె ననుకొనుచుండగా కాకతాళీయముగా గుణవంతుడగు ఈ రాజును చూచుటకు బిల్హణకవి వచ్చెను. అతని పాండిత్యమును, కవితాశక్తిని పరీక్షించి సంతోషించి తనకుమార్తెకు విద్యగరుప నాతని నియమించెను. ఆతని నడత తెలిసి పురోహితునిద్వారా పలుసారులు మందలించెను. కవియును, తన సుతయును తనకు ప్రియులైనందున చాలాయోచించి విధిలేక తుదకు కవిని శిక్షింపనాజ్ఞచేసెను. జను లందరును, రాణియును, అమాత్యపురోహితులును చేసిన విన్నపములను మన్నించి కవిని ఆదరించి కూతునిచ్చి పెండ్లిచేసి, బహుమానములనిచ్చి పంపెను. ఈరాజు ఔదార్యసాహసములను, సమయోచితబుద్ధిని, యుక్తాయుక్తవిచక్షణను గలిగియున్నాడు.

బిల్హణచరిత్రమునందు మదనాభిరామనృపాలుడు అధికముగా వర్ణింపబడలేదు. 'భూపాలచూడామణిః' అని ప్రారంభమున పొగడబడినాడు. కుమారీవిద్యాయత్నములో మంత్రిసలహా ననుసరించి కవికి అంధత్వమును, కన్యకు కుష్ఠత్వమును ఆరోపించి కుట్రపన్నినాడు. తన యేర్పాటుకు వారిద్దరిని ఒడబరచినాడు. రహస్యప్రణయప్రసంగము వినగానే ఉగ్రుడై కవిని బంధించినాడు. బుద్ధిగా నుండినచో కన్యతప్పు సైరించి వేరొకని కిచ్చి పెండ్లిసేతు నన్నాడు. ఆమెధీరప్రతిజ్ఞను విని కోపించి కసరివేసినాడు. కోటిపాలుని (తలారి) యొక్క శాంతిమాటలను నిరాకరించి తగిలివేసినాడు. కాని తుదకు ప్రజలందరు వచ్చి కవియొక్క ప్రణయైకాగ్రతను విన్నవింపగా మనసుకరగి కవిని మన్నించి ఆదరించినాడు.

ఇక ప్రబంధములోని మదనాభిరాముడు మొదట కపటి, తరువాత మూర్ఖుడు, చివరకు కవిశాపభీతుడు. నాయికానాయకులయొక్క స్థితిలో కరుణశోకరసములను వృద్ధిపొందించుట కీగుణములు తోడ్పడుననియే ప్రబంధకవి చూచుకొనినాడుగాని వీనివలన రాజునందు గౌరవము తగ్గిపోవునని మరచినాడు. కలాభిమానియగు రాజు తనయూరనున్న ప్రసిద్ధకవివరుని తెలియకయుండు టెట్లు? ఇట్టి విద్యాభిమాని వధ్యస్థానమునుండి కవి పాడిన ప్రణయగీతమును, కవి కనుపరచిన ప్రణయైకాగ్రతను నిరసించు టెట్లు? ఇవి ప్రబంధమున లోపములని నాకు తోచినది. కాని చివరకు శాపభీతివల్ల "తరుభయదృఢతరస్నేహసారంబును, తత్కవితామహత్త్వంబును" ఆయనకు బోధపడినపిమ్మట సహజమగు ప్రేమను, దయను జూపి తన రాజదర్జాను నిలువబెట్టుకొనినాడు.

నాటకములోని మదనాభిరామునియందు ఈ మూర్ఖత మిక్కిలి వెగటుగలిగించునట్లుగా ప్రదర్శింపబడినది. కుమార్తెతోగాని, రాణితోగాని, చెలికత్తెలతో

గాని మాట్లాడునప్పుడు వీనియందు ప్రాకృతజనోచిత ధోరణియే కనుపడునుగాని రాజోచితధోరణి గనుపడదు. రాజు వధ్యస్థానమునకు తాను స్వయముగా బోయి తలారిని స్వయముగా తొందరబెట్టుట ఈచెడుగుణమును కడుహేయముగా మార్చెను. షేక్స్పియర్ నాటకమున ఋణస్థునిపై కసిదీర్చుకొనుటకు వాని కండలను గోయ నుద్యమించుచున్న షైలాక్ (Shylock) యూఘుని పాత్రము ననుకరించునట్లు చేయబడినాడీమదనాభిరాముడు.

ఇక రాణినిగురించి చరిత్రలోగాని, ప్రబంధములోగాని అధికముగా నేమియు చెప్పబడలేదు. ప్రబంధమునం దీమె కూతురిమొర నాలించలేదని మాత్రము రాజకుమార్తె విలాపమువలన తెలియుచున్నది. నాటకమున వసుమతి, రాణి కూతురిని మన్నించమని, సహజదాక్షిణ్యమును విడనాడవలదని ప్రేమగల తల్లికిని, సాధ్వియగు నిల్లాలికిని తగినరీతిగా రాజుకు చెప్పినది. కొంచెము కరుణరసమును తగ్గించినచో ఈమెసంభాషణము రాణి కుండవలసిన ధీరత్వమును కనుపరచియుండును. బిల్హణకావ్యమున రాణి సుతార, పురస్త్రీలు ఈ ఘోరముల రెండింటిని వారింపుమని చెప్పగా మూర్ఛిల్లినది. కూతురినడతను, స్థితిని దలచుకొని ఖిన్నురాలైనది. అయినను మనస్సును దృఢపరచుకొని రాజును వేడుకొనుటకువెళ్లినది. ఈమెయందుగౌరవముచేతనే రాజు తన నిశ్చయమును మార్చుకొనెనని చెప్పనగును. ఈసుతారాదేవియందు తల్లికిని,ఇల్లాలికిని, రాణికిని ఉచితమగు గుణములు ప్రదర్శింపబడియున్నవని నాఅభిప్రాయము.

కావ్యమునందు పురోహితుడు నీతిజ్ఞుడు, స్నేహపాత్రుడు. రాజమనోనువర్తియై సమయోచితమగు సలహానిచ్చి కవిని శిక్షింపుమని చెప్పినను తుదకు మంత్రులతోను, ప్రజలతోను ఏకీభవించి బ్రహ్మహత్యా స్త్రీహత్యలను వర్జింపుమని రాజుకు బోధించెను. చరిత్రమునం దీపాత్రము కనుపడదు. అమాత్యుడు రాజునకు కపటోపాయము చెప్పి తెరపన్నుగడ జేసినపిదప కథలో వాని ప్రసంగ మేమియులేదు. నాటకమునందు ఈకపటోపాయము రాజుకే స్ఫురించినది. అమాత్యున కీపాటి ప్రాముఖ్యమును ఇవ్వబడలేదు.

ప్రబంధమున తలారికిని, నాటకమున చెలికత్తెయగు కళావతికిని ప్రాముఖ్య మివ్వబడినది. తలారి వీరసేనుడు కవియం దెంతేని సానుభూతిని గనుపరచి, కవి చెప్పిన పద్యములను వ్రాయించి, సాహసముతో సారెసారెకు రాజునకు పంపించి, తుదకు కవియొక్క విడుదలకు కారణభూతుడై, రాజకన్యచే బహుమానము నొందినాడు. పండితుడు కాకపోయినను కవితామహత్త్వమును గ్రహింపగలిగినాడు. దయాగుణము, సాహసము, యుక్తాయుక్తవిచక్షణ గలిగి యువకుల నిశ్చలప్రేమను మెచ్చుకొని వారికి సహాయము చేసినాడు. ఇట్టి ఫలాపేక్షలేని పరోపకారపరాయణు లప్పుడప్పుడు కథలలోనేగాక జీవితమందును కనుపడుచుందురు.

నాటకమున నాయికయొక్క చెలికత్తె కళావతి రాజుకు ధర్మబోధచేసినది. దానిమాటలు యుక్తములని మనస్సులో తెలుసుకొన్నను రాజు వానిని నిరసించెను. ఈపాత్ర నాటకమున నెంతయు బాగున్నది. రాజసభలో పండితుల గోష్ఠి యిటులుగాక ప్రహసనమునకు మాత్రమే తగియున్నది.

ఇక నాయకుని పాత్రను పరిశీలింతును. బిల్హణకవి ధీరలలితుడు, పండితుడు, అసమానకవితాశక్తి గలవాడు. కావ్యమునం దీతని సౌందర్యము సూచింపబడినదిగాని వర్ణింపబడలేదు. రాజకన్య "భావ్యర్థభావితమనోభవతుల్యకాంతా" (ముందు సృష్టింపబడునని ఈశ్వరునిచే తలంపబడిన ఈమన్మథునకు తగిన కాంత) యని వర్ణింపబడుటలో ఈతడు నవమన్మథుని వలె నున్నాడని ఊహించదగును. ఒకప్రతిలో రాజకన్య "వక్త్రం విలోక్య సుకవే ర్నయనాభిరామమ్" (సుకవియొక్క నయనాభిరామమగు ముఖమును చూచి) అట్లనే నితంబనిహితహస్తయై నిలబడిపోయెనని వర్ణింపబడియున్నది. బిల్హణచరిత్ర మీత డసమానశరీరసౌందర్యము గలవాడగుటచే రాజు కుమారీవిద్యకొరకు కాండపటరూపమగు కపటోపాయమును పన్నవలసివచ్చెనని

చెప్పుచున్నది. ప్రబంధమునం దీకవి సౌందర్యము మిక్కిలి అతిశయోక్తులచే వర్ణింపబడియున్నది. నాటకమును ఇట్లే నిరూపించినది. కుష్ఠగాత్రులను చూడనను వ్రతము కావ్యమునందు కవికి ఆరోపింపబడలేదు. ధర్మసందేహము గలిగినట్లు, కలగనినట్లు నాటకమున నున్నది. కాని ఇవి తక్కిన కావ్య, చరిత్ర, ప్రబంధములలో కనబడవు.

కావ్యమునందు కవి ఆత్మనిగ్రహము గలిగియున్నను శిష్యురాలియొక్క విలాసదృష్టులకు శీఘ్రము లొంగిపోయెనని యున్నది.

'విద్వాంస మాశు వశినంచ వశీచకార'

ఒకప్రతిలో అన్యోన్యానురాగము ప్రబలగా "తెర ఎందుకిక మనకు" అని కవి యనగా రాజకన్య తెరను తీసివేసి ఆయనదర్శనము చేసెనని యున్నది. అన్యోన్య ప్రియవాక్యములు పలుకు కొనినతరువాత

'రాజప్రియోఽపి వివిధాగమపారగోఽపి
భుంక్తే స గూఢచరితో నరరాజపుత్రీమ్,
శాస్త్రోదితా న్యనుదితానిచ మోహనాని
పశ్య న్నహర్నిశ మతీవ నిగూఢచేతాః.'

(రాజుకు ఇష్టుడైనను, సర్వశాస్త్రపారంగతుడైనను అతిరహస్యచరిత్రుడై ఆమెయందు శాస్త్రమున గలవి లేనివి అనేకమోహనకరములగు విలాసములను కనిపెట్టుచు రాజకన్యను అనుభవించుచుండెను.)

రాజువలని భయమున్నను ఇట్టిమోహినిని విడిచి పెట్టలేనని నిశ్చయించుకొన్నాడు. "సింగముయొక్క గుహ యెదుటనున్నదైనను, సుగంధఫల్లవభూషితమగు సల్లకీవృక్షమును మాతంగము విడిచిపెట్టునా?" రాజపురోహితుడు రహస్యముగా దూతిచే చెప్పించి మందలించినను, తనకుతాను ఎన్ని వేదాంతవైరాగ్యబోధనలు చేసుకొనినను ఆమెను తన యంతరాత్మ మరువజాలదన్నాడు.

'తదపి న హరిణాక్షీం విస్మర త్యంతరాత్మా.'

ఆపదలో రాజద్వారమువద్ద నిలచి తనను చూచుచున్న ప్రియురాలినిచూచి 'మరణమందును నీవే నాకు శరణ' మన్నాడు:

'బాలే త్వమేవ శరణం మరణేఽపి భూయాః'.

శిక్షకుముందు తలారి ముక్తిప్రదుడగు దేవుని ధ్యానించుకొమ్మనగా "ఇప్పటికిని (అద్యాపి) నాకిక్కడ కనుపడునది ఆమెయేగాని అదిదేవుడు గా"దని బదులుచెప్పి "అద్యాపి" అనుశబ్దము ప్రథమమునగల ఏబది వసంతతిలకావృత్తములతో మనోహరప్రణయస్మృతిగీతమును బాడెను. ఈగీతము మామూలురీతిని నాయికయొక్క శృంగారచేష్టలను, స్థితులను, ప్రలాపములను స్మరించుచున్నను, ఈప్రణయమును మిక్కిలి పవిత్రముగా గణించుచు తన ప్రియురాలిని స్మరించుట గురూపదేశమును స్మరించుట యనినాడు. అర్జునుడు సర్వత్ర కృష్ణునే గనినట్లు ఈకవి సర్వత్ర తన మనోహారిణియగు రాజపుత్రినే గనుచున్నాడు. నిశ్చలచిత్తుడై తనలో కొంచెమైన మంచివర్తన, సుగుణము, దేవపూజాదికము ఉన్నయెడల జన్మజన్మములయందును శశికలయే తనకు భార్యయగున ట్లనుగ్రహింపుమని సర్వదేవతలను ప్రార్థించుచున్నాడు:—

'హరిహరవిధిముఖ్యా లోకపాలాః సమేతాః
వచఇహ మమసర్వైః శ్రూయతాం సాక్షిభిర్యత్,
నివసతి యదిచేష్టం భావనాయాం సుతథ్యం
భవతు శశికలా మే జన్మజన్మేఽపి జాయా'

'మమయది సుకృతంస్యాత్ పూర్వజన్మార్జితంచేత్
యది సకలసురాణా మర్చనం మేఽస్తి కించిత్,
యజనహవనవేదాధ్యాసనం యన్మమాస్తి
తదపి శశికలా మే ప్రాణనాథా సదాస్తు.'

ఇది చితాగ్నిచుట్టు ప్రదక్షిణముచేయుచు సీత 'రాముడే తనకు ప్రియుడు' అని పాడిన రామాయణములోని గీతమును జ్ఞాపకముచేయుచున్నది.

ఇట్లు దేవతలకు విన్నవించుకొని, మౌనమును ధరించి, అంతమును నిరీక్షించుచు కవి నిలబడెను. దేవుని

యం దుండవలసిన భక్తి స్త్రీప్రణయమందు లీనము చేయుట విద్వాంసునకు తగదని కొంద రూహింప వచ్చును. కాని "ప్రేమపాలిత మీజగం"బనియును, ప్రణవస్వరూపి ప్రణయస్వరూపియనియును మన మెన్నడును మరువరాదు. ఈకవిప్రణయము కేవల మైహికవాసనలచే నిండినదిగాదు. ఈశ్వరుడకు జీవుడు తన శక్తికొరకు తపస్సుచేయుటను నిరూపించుచున్నదని నాకు తోచుచున్నది. శక్తి ఈశ్వరునికొరకెట్లుతపస్సు చేయుచున్నదో అట్లే తనశక్తిని కలియుటకు ఈశ్వరుడగు జీవుడును "గోవువెంట దగులు కోడెభంగి" తదేకచిత్తుడై తపమాచరించును. ఇదియే యోగపరమరహస్యమని మహనీయులవలన వినియున్నాను. బిల్హణకవి మొదట రహస్యప్రణయముచేత నమ్మిన ప్రభువును మోసగించుటవలన తన నడవడికి కలంకము కలిగినను ఇట్టి నిశ్చలప్రేమ తపస్సువలన అత్యంతధీరతకు, ప్రణయమునకు ఆదర్శమైనాడు. బిల్హణచరిత్రగూడ కవియం దిట్టి తన్మయతను కనుపరచినది. తాను చనిపోయిన తరువాత తన శరీరమునందలి పంచభూతములను తన ప్రియురాలి సన్నిధిని చేర్చుమని బ్రహ్మను వేడుకొన్నాడు. ప్రబంధమునందును ఇట్లే:—

'తన పృథ్వి యాఘనాఘనవేణి చరియించు
క్షితిభాగమున మండజేయుమయ్యా,
తన రసం బాసుధాధర క్రీడలాడెడు
శృంగారసరసిలో జేర్పుమయ్యా,
తన తేజ మాత్తకవకాంగి దర్శించు
దర్పణాంతరమున దార్పవయ్యా,
తన వాయు వాసుగంధశ్వాస విసరించు
కొను వ్యజనంబున గూర్పవయ్యా,
తన నభం బారమణియింట నునుపవయ్య
యీశరీరంబు పంచత్వ మెనసినపుడు,
స్వాంశములతోడ భూతంబు లైదునైదు
గూర్పవయ్య విధాత నాకోర్కిదీఱ.'

చరిత్రమునను, ప్రబంధములోను రాజకపటమువలన నాయకుని నడవడియందు దోష మంతగా స్ఫురింపదు. వానిలో నీదోషమంతయు రాజకాపత్యఫలమేయని నాయిక యనును. ప్రబంధమునను, నాటకమునను నిందనంతయు నాయిక తనపైనే వేసుకొనును. ఇది ప్రేమకు సహజము. బిల్హణకావ్యమునందు రాజుపై నింద లేనేలేదు. నాటకములో కవికి ధర్మసందేహము పొడముగా రాజకన్య యుక్తితో నాసందేహమును పోగొట్టును. నాయకునియెడ దోసము నిది తగ్గించినను, నాయికయం దిట్టి ప్రగల్భత సమంజసమా? మన నాటకములలో చిత్రాంగిపాత్రకు ఇట్టి ప్రాగల్భ్యము, చాతుర్యము అమర్చబడుచుండును గాని ఆ పాత్రమునకుగూడా ఆమెస్థితిని, ఆమెయెడ లోకమొనర్చిన ద్రోహమును ఆలోచించగా ఇట్టి ప్రాగల్భ్యచాతుర్యములు అస్వాభావికములని నాకు తోచుచున్నది. ఈవిషయమునందు మానవస్వభావమును, కవుల యూహలను విచక్షణులు చర్చించి నిర్ణయమొనర్తురుగాక.

ఇక నాయికనుగురించి చర్చించెదను. కాశ్మీర కావ్యములో శశికల మిక్కిలి సౌందర్యవతి, సూక్ష్మబుద్ధిగలది. మధురమైన కంఠస్వరము గలిగి ఏమాటలాడినను తండ్రికి మిక్కిలి మోదమును గలుగజేయుటవలన తండ్రి యీమెకు తగినవిద్య చెప్పించుటకు తగిన గురువును వెదకుచుండెను. గురువు లభించగనే "శుకశారికలతో నాడుకొనుటను విడిచి గురువునొద్ద శాస్త్రమభ్యసింపు" మని కూతురికి నచ్చజెప్పెను. బిల్హణచరిత్రలో నీమె వయస్సువచ్చిన కన్యయని వర్ణింపబడినది. మధురవాక్కు, స్వచ్ఛస్వరము గలిగి సంగీతవిద్యయం దారితేరి ప్రాగల్భ్యగర్వాన్వితయై యున్నదని చెప్పబడినది. అందుచే ఈమెకు అపాయము లేకుండ సాహిత్యము చెప్పించుటెట్లని రాజు ఆందోళనపడుచుండెను. ఆంధ్రప్రబంధము దీనినే అనుకరించుచున్నది:

'ఈకులపవిత్ర సురుచిరహేమగాత్ర
చంద్రకళగద సంగీతజలధి కిపుడు,
దీనికిని సర్వవిద్యలు తేటపడగ
చేర్చి సాహిత్య మొదవ జెప్పింతు ననుచు.'

ప్రబంధకవి 'చంద్రకళ' యను శబ్దము ప్రయో గించుట "యామినీపూర్ణతిలక" యను నామమున కర్థ ము ను జూచియే గాని కాశ్మీరబిల్హణకావ్యమునుండి గ్రహించినట్లనుకొనుటకు వీలులేదు. వేరుసూచన లేవియును లేవు.

విద్యారంభ మైనతరువాత నాయిక గురువును, తండ్రిని, సరస్వతిని మెప్పించునట్లు సంస్కృతప్రాకృత ములందు శాస్త్రములను నేర్చెననియు, తరువాత కామ శాస్త్రమును పఠించెననియు అన్నిగ్రంథములయందును గలదు. పఠనానంతరము శాస్త్రము తెలిసియుండుటను, వయస్సు వచ్చియుండుటను స్మరబాణవిద్ధయై కవికి పూర్వజన్మసతి యగుటవలన ప్రేరితయై, యీ నూతన మన్మథునకు తగిన రతియై కాంతునియందు కటాక్షా దిక శృంగారరసవిలాసములను కనుపరచెను.

'విజ్ఞాతమన్మథకలా స్మరబాణవిద్ధా
త స్యాన్యజన్మరమణీ నరనాథపుత్రీ,
భావ్యర్థభావిత మనోభవతుల్యకాంతా
కాంతే రసా న్వికిరతిస్మ దృశో ర్వికారాన్.'

తరువాత వానిని వశముచేసుకొనెను. అతడు మన స్సులో "అన్నియును విచారించి" ఆమెను గాంధర్వ విధిని వివాహమాడెను. ఇది దైవఘటనమని కావ్యము అభిప్రాయపడినది.

'దైవా త్తయో రఘటితం ఘటితం బభూవ.'

కవిని చూడవలెనను కుతూహల మామెకు పుట్టించినది కవికృతచంద్రవర్ణనమని చరిత్ర చెప్పు చున్నది. వర్ణన విని, సందేహము గలిగి, తెరతీసి చూచెను. చూచి మోహించెను. ఈవర్ణన వినుటకు ముందు ప్రబంధము ఆమెకు ఉద్యానవిహారసమయమున నొకకలను కల్పించి, అందు సుందరదివ్యపురుషదర్శ నము చేయించి ఆమెమనస్సుకు ఉద్వేగము కలిగించినది. అట్టి ఉద్వేగములో చంద్రవర్ణన కుతూహలమునుకలి గించుట న్యాయమేకదా. ఆమెయందు దోషము తగ్గిం చుటకు ప్రబంధకవి యిట్లు చేసెను. నాటకము ఇద్దరికిని కలలను, అన్యోన్యస్వప్నదర్శనమును, భవానీదేవివర మును కల్పించి నాయికానాయకులయందు దోషము నింకను తగ్గించెను. పూర్వము వీరిద్దరును విద్యా ధరదంపతులు. శాపోపహతులై ఇట్లు జన్మించి శ్రమల నొందినారని భవానీదేవిచేత చెప్పించి వీరియొక్క దోషమే లేకుండజేసెను. ఈకల్పన లన్నిటిలోను బిల్హణకావ్యములోని కల్పనయే స్వాభావికముగా నున్నది. అద్భుతరససాహాయ్యము లేకుండగనే స్వాభా వికముగా అన్యోన్యప్రేమ గలిగినట్లు నిరూపించునట్టి శృంగారరసమే హృదయంగమముగా నున్నదని నాయభి ప్రాయము.

ఈరహస్యప్రణయవృత్తాంతము రాజునకు తెలిసి రాజు కవిని శిక్షించునప్పుడు శశికలయొక్క ప్రవర్తన ఉత్తమజాతిస్త్రీకి తగిన ట్లున్నది. దీనతకు లోనుగాక తన కిప్పుడు కర్తవ్య మేమియని విచారించుకొనినది. పతి ననుకరించి ప్రాణత్యాగముచేయుటయే సద్వంశ జాతయగు స్త్రీకి తగు నని నిశ్చయించుకొనినది. కృతనిశ్చయురాలై, తొందరపడక, తలుపులుబిగించి, వస్త్రమును గట్టిగా కట్టుకొని, మేడపైకి పోయి సమయమును నిరీక్షించుచున్నది. చరిత్రమునం దిదేమియు లేదుగాని తండ్రి పెండ్లిచేయుదు ననగా "సర్వము కవికి సమర్పించియున్న నాయొక్క నిశ్చేతనమైన కాయము నెవరికిత్తువు" అన్నది. అటుతరువాత ఈమె సంగతి వివాహమగువరకు ఎత్తుకొనబడలేదు. ప్రబం ధము ఈమెయొక్క విలాపమును అతికరుణముగా ప్రద ర్శించినది. అంతే. నాటకములోని నాయిక సఖీజనుల సలహాపైని కవితో సంప్రతించినపిదప తండ్రివద్దకు వెళ్లి కవిని మన్నించుమని వేడుకొనినది. నిరసింపబడి చావునకు నిశ్చయించుకొనినదిగాని నేలమాళిగలో ఖైదు చేయబడినది. భవానీకృపవలన సంకెల లూడ ఈవలికి వచ్చి వధ్యస్థానమున నున్న ప్రియుని గలసికొనినది. గ్రంథములన్నిటిలోను ఈనాయికపాత్ర మనోహరము గానే యున్నను, బిల్హణకావ్యమందు నాయికానాయక పాత్రలును, వారి ప్రణయమును స్వాభావికముగను, భావౌన్నత్యముతోను ప్రదర్శింపబడియున్నవని తల చెదను.

ఈ లోకములో సంఘపుకట్టుబాట్లు పలురీతులుగా నున్నవి. అవియును కాలానుగుణముగా మారుచుండును. ప్రకృతియొక్క కట్టుబాట్లకును వీనికిని సంఘర్షణ ముదయించినపుడు ప్రకృతియే గెలుచుచుండును. శశికలాబిల్హణుల ప్రణయ మిట్టి ప్రకృతివిజయమున కొక యుదాహరణము. "ప్రణయముయొక్క పద్ధతి ప్రణయముదే. అది యింకొక పద్ధతికి కట్టుపడదు." అని 14-వ శతాబ్దపు ఆంగ్లేయకవి ఛాసర్ (Chaucer) పాడినాడు. "ప్రేమ కేవలబహిరుపాధుల నాశ్రయించి కలుగదు. నిరూపించుటకు వలనుపడని ఆంతరహేతు వేదియో యొకటి పదార్థములను చేరదీయును."

'వ్యతిషజతి పదార్థా నాంతరః కోఽపి హేతు
ర్నఖలు బహిరుపాధీన్ ప్రీతయ స్సంశ్రయంతే.'

అని భవభూతి పాడినాడు. ఇచ్చట శశికలాబిల్హణుల ప్రణయమునకు వారి మనోహరరూపములు, యౌవనము ముఖ్యకారణములుగా నిరూపింపబడినను, పూర్వజన్మవాసన ఆంతరకారణముగా సూచింపబడియున్నది. పురుషకార మనుచో సంఘనీతికి విరుద్ధమై నిరసింపబడదగిన లంపటము దైవకారమగుటచేత ఉత్తేజకమై మనోహరమైన ప్రణయముగా మారినది. తారాశశాంకుల ప్రణయము ఉభయులయెడలను జారత్వమే, ద్రోహపూరితమే. దీనికి మదోన్మత్తత, అవినీతియును మాత్రమే కారణములు. ఈశశికలాబిల్హణుల కథయన్ననో కులగర్వమును, హ్రస్వదృష్టిభావములను అతిక్రమింపజాలి పొంగిపారలు స్వాభావికప్రణయవాహినిని ప్రదర్శించుచున్నది. ప్రబంధకవుల అభిరుచులవలన పచ్చివర్ణనలచే నింపబడినందున అధునాతనయుగసంస్కరణమునకు పాల్పడినది. సందు దొరికితే చాలును, ఉత్ప్రేక్షలు, అతిశయోక్తులు, కచకుచనితంబాదివర్ణనలు, స్మరక్రీడాదివర్ణనలు గుప్పించబడును, ప్రబంధములందు. పక్షపాతములేక అందరునాయికలు, నాయకులును చంద్రబింబమువంటి ముఖముగలవారు, సింహమువంటి నడుముగలవారు, పద్మాక్షులు, పద్మహస్తులు, పద్మపాదులుగా వర్ణింపబడుదురు. ఇట్టి అభిరుచి కవితకు వేరుపురుగువంటిది. దీనివలననే బిల్హణచరిత్రములోను, బిల్హణీయ ప్రబంధములోను కవి నాయికను మొదటిచూపుననే కంటి కగుపడని శరీరభాగములనుగూడ వర్ణించునట్లు చేయబడెను. పచ్చివర్ణనలను ప్రస్తుతకాలాభిరుచినిబట్టి వదలినను ఆంధ్రకవిత యిప్పటికిని ఈ ప్రబంధశైలిని అనుకరించి ఉత్ప్రేక్షాతిశయోక్తిభూయిష్ఠమై యున్నదనియే నాఅభిప్రాయము.

బిల్హణకవిమానసము నేగాక నేటివరకు సకల హైందవపాఠకలోకహృదయములను రంజింపజేయు నీశశికల (యామినీపూర్ణతిలక) యొక్క సౌందర్యమునుగురించి కొంచెము తెలిసికొనగోరితిమేని గ్రంథములన్నిటిలోను ఉత్ప్రేక్షలే కనుపడును. కావ్యములో నీ షు పద్మిని:

'శ్రీపద్మపత్రనయనాం వరపద్మహస్తాం
పద్మప్రకౢప్తచరణాం శుచిపద్మగంధామ్,
తాం పద్మినీమివ సుపద్మనికేతనాంచ
మేనే కవిః శశికలామివ కామవల్లీమ్.'

పరదేవతను "పద్మకాంతిపదపాణిపల్లవపయోరుహాననసరోరుహాం" అని ఒకేపద్మసూత్రముతో బంధించి వర్ణించియున్నారుగదా మహనీయులు! చరిత్రలో "ముఖమఖిలం నయనయుగం" అని యీమెను వర్ణించు నొక యుత్ప్రేక్ష గలదు. చూపు లంతజీవకళ గలిగియుండి అపూర్వబుద్ధిసూక్ష్మతను తెలియజేయుచున్నవని మనము అర్థముచేసుకోవలయునుగాబోలు. ఇంకొకచోట అప్పుడే స్నానముచేసి తెల్లనిచీర గట్టుకొని, తడిజుత్తును చేతబట్టుకొని నిలుచున్న ఆమెను జూచి క్రొత్తగా సానబెట్టిన కత్తివలెను, నిండువెన్నెలను వెదజల్లు శారదరాత్రివలెను, శృంగారసముద్రమునుండి వెలువడిన రెండవ లక్ష్మివలెను ఉన్నదని యామినీపూర్ణతిలక వర్ణింపబడినది. మొదట తెరతీయగా ఆమెను చూచినప్పుడు ఆమెయొక్క మెరుపువిగ్రహమును కవి వర్ణించు శ్లోకమును, ప్రబంధములోని పద్యమును ఉత్ప్రేక్షామయములయినను నేటికిని పఠింపబడుచున్నవి. ఇవి మొదటనే ఉదాహరింపబడినవి.

చోరపంచాశికలోని మొదటిశ్లోకము ఈమెను "కనకచంపకదామగౌరి" (పరమసువర్ణ చంపక విభాసురగౌరి) యని వర్ణించెను. మొదటిచూపున కీమె బంగారులతవలెను, మెరుపుతీగవలెను, చంపకపుష్పముల సరమువలెను గనుపడెనని తేలును. ఇందులో గాత్రసౌష్ఠవమును, కాంతియును ద్యోతితము లగుచున్నవి.

ఇక నీమెవిలాసంబులు పలుతెరగుల చోరపంచాశికలో వర్ణింపబడినవి. ప్రబంధమున తృతీయాశ్వాసమున రమణీయముగానే తెర్జుమా చేయబడియున్నను, మాతృకలోని వసంతతిలకావృత్తములవలె ఈదీర్ఘవృత్తములు స్మృతిభావమున కనువుపడినట్లు నాకు తోచదు. అశ్లీలములు లేని కొన్నివర్ణనలు మిక్కిలి మనోరంజకములుగా నున్నవి. రాత్రి కవి తుమ్మినప్పుడు, కోపముచే మామూలుగా "చిరంజీవ" యనువాడుకదీవనను ఉచ్చరించక జీవశక్తిని వృద్ధిజేయు బంగారుచెవికమ్మను తనకు తాకించినదట, యొకమారు. ఇంకొకమారు వెనుకనుండి వచ్చి కవి కన్నులుమూయగా, సఖులు ఎవరో చెప్పుకొమ్మని యడిగిరి. సంభ్రమపులకిత కంఠదేశయై, కొంచెము చిరునవ్వుగల స్వరముతో "అమ్మో, నాకు తెలియదు" (మాత ర్నవిద్యే) అని బదులుచెప్పినదట. తాను తలుపువద్ద నిలుచుండగా, ఆయనను చూడనిదై, ప్రియు డెప్పుడువచ్చునో యని చేయి మోమున జేర్చి ఎదురుగచూచుచు, కవియం దనురాగమును వెల్లడించు పాటను మెల్లగా కాకలీస్వరమున పాడుకొనుచుండుట విని కవి మిగుల మోదమందెనట. ప్రేమ ప్రియురాలియం దనంతశృంగారలీలలను గనిపెట్టుచుండును. ఇవన్నియు శశికల సౌందర్యదేవతయేగాక, విద్యావతియైనను, రాజవంశజయైనను సహజముగా గర్వములేని ముగ్ధ, ఉత్సాహవతి, ప్రేమమూర్తియు నైయున్నదని చదువరులకు ద్యోతనముచేయుచున్నవి. చోరపంచాశికలో వర్ణింపబడిన ప్రియురాలి లీలలు కావ్య, చరిత్ర, ప్రబంధములలో రమణీయముగా సమర్పబడియున్నను, నాటకరచన ఈప్రణయస్మృతిగీతమునకు చోటివ్వలేదు.

V ముగింపు

కవిచేత జేయబడిన చంద్రవర్ణన, నాయికావర్ణన చరిత్రయందును, ప్రబంధమునందును ప్రాముఖ్యమువహించుచున్నవి. నాటకమున చంద్రవర్ణనమాత్ర మమర్పబడినది. నాయికావర్ణన కంత ప్రాముఖ్య మివ్వబడలేదు. నాటకముయొక్క ప్లాను వేరు. ప్రబంధమున ద్వితీయాశ్వాసమునందు పూదోట, అందు రాజకన్యావిహారము, ఆమె కలగని లేచి విభ్రమమునొందుట మొదలగునవిగల భాగము శైలి శ్లేషభూయిష్ఠముగా నున్నను అతిలలితముగా నున్నదని తలచెదను. విస్తరభీతిచే నిచట వానిని నే నుదాహరించుటకు సాహసింపలేదు.

ఈ ప్రబంధశైలి కొన్నిచోట్ల మనుచరిత్ర పోకడలను, కొన్నిచోట్ల భాగవతపు పోకడలను అనుసరించుచున్నది.

ఈ వ్యాసమును ముగించుటకుముందు ఇన్నిగ్రంథములు చేర్చి పరిశీలించుటలో నాకు దోచిన రెండు మూడు చిన్నయంశములను పొందుపరచుచున్నాను:—

౧. కాశ్మీరకావ్యమున కవికి శిక్ష చోరునకు తగిన శూలారోపణము (కొరతవేయుట) అని నిర్ణయింపబడినది. తక్కిన అన్నిగ్రంథములలోను శిరశ్ఛేదమని యున్నది. రాజు మంత్రుల నీవిషయములో సలహా అడిగినట్లు కావ్యమున నున్నది. చరిత్రలో రాజు ఎవరిని సలహాఅడుగకయే నిర్ణయించెను. ప్రబంధములో సభచేసి అభిప్రాయమడిగినను సభ్యులు దండింపుమనిరేగాని దండనస్వరూపమును రాజే నిర్ణయించెను. ఈసభ ప్రబంధకవియొక్క సొంతకల్పనయేగాని కాశ్మీరకావ్య పరిచయఫలమని ఊహించుట కాధారములు లేవు.

౨. విద్యాభ్యాసముకొరకు "సప్తావని" యను పేరుగల ఒక ప్రాసాదమును ఏర్పాటుచేసి యిచ్చెనని కావ్యమందున్నది. అచ్చటనే కవినివాసమునకు తగిన ఏర్పాటులును చేయబడినవి. చరిత్రలోను అట్లే. కాని చదువుకొను శాలలో శయ్య లమర్పబడినట్లు చరిత్ర

యం దుండుట వింతగానున్నది. రాత్రివేళ రాజకుమారి తన శయనమునకు వచ్చినట్లును, కవి చంద్రుని వర్ణించుట విని కుతూహలముతో తెరదీసి చూచినట్లును గలదు. శయ్యాగేహము, విద్యాగారము రాజభవనములో నొకటిగా నుండుట అసంభావ్యమని తలచెదను. చరిత్రలో కొన్నిభాగములు స్పష్టముగా లేవు.

3. కవి "చేతోజాతాకులితహృదయుడై" చంద్రవర్ణన చేసెనని యున్నది. ఈమన్మథ ప్రేరేపణకు దృశ్యకారణము లేదు. శృంగారభావవిలసితమని యనుకొనవచ్చును. వర్ణనలో నొకచో:

'పశ్యోదితం శారద ముత్పలాక్షి
సంధ్యేందిరాకందుక మిందుబింబమ్'

(సంధ్యాలక్ష్మి యాడుకొను బంతివలె నుదయించిన శరత్కాలచంద్రబింబమును చూడు మోఉత్పలాక్షి) చంద్రబింబమును చూచునప్పుడు "కలువరేకులవంటి నేత్రములుగలదానా" యని సంబోధించుట మంచి ఔచిత్యమును గలిగియున్నను ఈ ఉత్పలాక్షి ఎవరు? ఎవతెను సంబోధించుచున్నాడీకవి? రాజకుమార్తె సమీపమున నున్నట్లుగూడ తెలియుదే. ఇందుచేతనే అనేక చాటుశ్లోకములను చేర్చి యీ దక్షిణదేశ బిల్హణ చరిత్రము కూర్పబడియుండునని నాకు తోచుచున్నది. కాశ్మీరకావ్యములోను అన్వయలోపములు గలవు గాని అవి వ్రాతలలో కాలక్రమేణ సంక్రమించినవని తలచెదను.

బిల్హణకవిప్రణయమునుగురించిన యీగ్రంథములన్నిటిలోను స్వాభావికవర్ణనలు గలిగి, మృదులమై నాతిక్లిష్టమగు వైదర్భీశైలిని గలిగి, శైలియందును కథాసందర్భములందును చోరపంచాశికను, మిక్కిలిగా అనువర్తించుచున్న కాశ్మీరబిల్హణకావ్యము మన యాంధ్రదేశములోని సమర్థులగు పండితులచే పరిష్కరింపబడి, వ్యాఖ్యానముతో ప్రచురింపబడ తగియున్నదనియును, దీని శైలిని, వృత్తములను అనుకరించు ఆంధ్రీకరణము కూడ వాంఛనీయమనియును చదువరులకు విన్నవించుకొనుచు ఈవ్యాసమును ముగించుచున్నాను.



కోటగిరిలోని బజారు, నీలగిరి

—టి. గోపాలకృష్ణ.

ఖాన్‌ఖానా అబ్దుల్ రహీమ్‌ఖాన్

రామమోహన్ రాయ్

యద్యాత్రయా వ్యాపకతా హతా తే,
భిదైకతా వాక్పరతాచ నుత్యా,
ధ్యానేన బుద్ధేః పరతా పరేశ,
జాత్యాఽజతా క్షంతు మిహార్హ సి త్వమ్.

—"రహీమ్‌కావ్యము" నుండి.

(ఓ పరమాత్మా, తీర్థయాత్రలకు బోవుట నీ విచట లేవని యంగీకరించుటయే దీనిచే నీసర్వవ్యాపకత్వము నవమానించిన ట్లగుచున్నది. నమస్కారాదికములచే జీవబ్రహ్మల యైక్యము, స్తోత్రములచే వాగతీతత్వము నంగీకరింపన ట్లగుచున్నది. జీవబ్రహ్మల కైక్యము నంగీకరించుచో నమస్కారము చేయువాడెవడు? చేయించుకొనువాడెవడు? స్తోత్ర మొనరించుచో వాగతీతుడను టెట్లుచెల్లును? ధ్యాన మొనరించుచో బుద్ధికతీతుడ వనుటను త్రోసివైచినట్లే! అవతారము లంగీకరించుచో నీయజత్వమును ధ్వంస మొనర్చినట్లే! పరమ ప్రభూ, మాయీాయవివేకమును క్షమింపుము.)

పై నుదాహరించిన "రహీమ్‌కావ్యము"ను వ్రాసినవాడు అక్బరుపాదుషా ప్రధానమంత్రి యగు అబ్దుల్ రహీమ్‌ఖాను. ఈతనిపుణ్యచరిత్ర సంస్కృతపాఠకులకు చిరస్మరణీయము. ఈతని మృదుమధురకవితాకుసుమములు సంస్కృత వాఙ్మయమునకు శిరోభూషణములు.

రహీమ్‌ఖాను సుప్రసిద్ధమగు 'కరా కూాయలూ' వంశమున జన్మించెను. ఈతని పూర్వులందరు జాగీర్దారులు, సర్దారులు నై విఖ్యాతిబడసినవారే. ఈతని పితామహుడు బాబరువద్ద సర్దారుగా నుండి యాతనితో భారతదేశమునకు వచ్చెను. నాటినుండియు ఆతడు భారతభూమిలోనే యుండిపోయెను. హుమాయూనుచక్రవర్తికాలమున ప్రధాన మంత్రిగను, సేనాధ్యక్షుడుగను ఉండి ఆతని యనంతరము అక్బరుపాదుషాకు సంరక్షకుడుగ ఢిల్లీసామ్రాజ్యమును శాసించిన ఖాన్‌ఖానా బహరామ్‌ఖానుడు రహీమ్‌ఖానునితండ్రియే.

రహీమ్‌ఖానుని చిన్నతనముననే యాతని తండ్రియగు బహరామ్‌ఖానుడు చనిపోయెను. పితృమరణమునాటి కీతనివయస్సు నాలుగేండ్లు మాత్రమే. అప్పటినుండియు నక్బరుపాదుషాయే యీాతని చేరదీసి విద్యాబుద్ధులు గరపించెను. రహీమ్‌ఖానుని సత్యసంధత, బుద్ధి నైశిత్యముల కలరి చక్రవర్తి యీాతనికి 'పాటిన్' జాగీరొసగి గౌరవించెను. నాటి కీతని వయస్సు పదునెనిమిదేండ్లుమాత్రమే. బుద్ధినైశిత్యముతోబాటాతని సాహసవిక్రమములుగూడ అనుపమానములు. విక్రమశకము ౧౬33-వ సం. న గుజరాతుయుద్ధమున ఖాను చేసిన సహాయమునకు సంతుష్టుడై చిన్నవాడనియైన తలపక చక్రవర్తి ఇరువదేండ్లవాడగు రహీమును గుజరాతునకు సుబేదారుగా నియమించెను. ఈ దినములలో రహీమ్‌ఖానుని

యదృష్ట మత్యున్నతస్థానమం దుండెనని చెప్ప వచ్చును. ఒకదాని వెనుక నొకటిగ నాత డతి శీఘ్రముగ నున్నతస్థానములు బడయసాగెను. సామాన్యముగ నధికానుభవము గలవారికి గాని యొసగబడని 'మీర్-అర్జ్' అనుపదవి నీత డిరువదినాల్గవయేటనే బొందగలిగెను. తరువాత ఎనిమిదిమాసములకే 'అజ్మీరు' నకు సుబేదారుగా నియమితుడై దర్బారులో నున్నతస్థానమలంకరించెను. పాదుషా యీతని యోగ్యతకు ముగ్ధుడై యెట్టి యున్నతపద మొసగుటకుగూడ వెనుదీయలేదు. తన యిరువదియారవయేట నీతడు యువరాజసలీమునకు సంరక్షకుడుగను, విద్యాశిక్షకుడుగను నియమితు డయ్యెను. ఇరువది తొమ్మిదవయేటనే 'ఖాన్‌ఖానా' యను బిరుదము వహించెను. తరువాత మూడుసంవత్సరములకే ఖాన్‌ఖానా అబ్దుల్ రహీమ్‌ఖాన్ ప్రధానామాత్యుడుగా నొనర్పబడి సామ్రాజ్యమునం దత్యున్నతాధికార మొందెను. నాటి కీతని వయస్సు ముప్పది మూడేండ్లుమాత్రమే.

అక్బరుపాదుషాయనంతరము జహాంగీర్ చక్రవర్తిగూడ ఈ సమర్థుని సముచిత గౌరవముసగి పూజించెను.

ఖాన్‌ఖానా ప్రధానామాత్యపదవియందించుమించు ముప్పదియేండ్లు పనిచేసెను. ఈమధ్యకాలమం దీతడు మహాగౌరవముతో బాటు మహదైశ్వర్య మనుభవించెను. పాదుషా కుమారుడగు 'షాహ్‌జాదాఖుర్రమ్' ఖాన్‌ఖానా ప్రథమపుత్రుడగు శాహ్‌బాజ్‌ఖానుని పుత్రికను వివాహమాడెను. చక్రవర్తితోడి బాంధవ్యముగన్న ఖాన్‌ఖానాకు ప్రార్థనీయము, గౌరవనీయము నగునది వేరొం డేమున్నది?

యౌవనముతోబాటు రహమానుని యదృష్టచక్రముగూడ తిరిగిపోయెను. ఈయన కుమారులు ముప్వురలో పెద్దవా రిరువురు మరణించిరి. ఇంతలో మనుమరాలి మగడగు ఖుర్రమ్ పాదుషాపై తిరుగబడుట సంభవించి ఖాన్‌ఖానా రాజపుత్రునిపక్ష మవలంబింప వలసివచ్చెను. యుద్ధమున ఖుర్రమ్ పరాజితు డయ్యెను. ఖాన్‌ఖానా మహబత్ఖానుచేతిలో బందీయయ్యెను. చెరసాలలో నీవృద్ధు డనేక దుఃఖములకు లోనయ్యెను. అచటనే యీతడు తన తృతీయపుత్రుని శిరమును విద్రోహాచరణమునకు బహుమానముగా బొందెను.

కొంతకాలమునకు జహాంగీర్ - ఖుర్రమ్‌లకు సంధి జరిగెను. వెంటనే ఖాన్‌ఖానా చెరవీడి తిరిగి పూర్వపదమున నియుక్తు డయ్యెను. కాని యీమారు రహీము తనపదవిని చిరకాల మనుభవించలేదు. మరుసటి సంవత్సరముననే యీవృద్ధుడు తన డెబ్బదిరెండవయేట దివంగతుడయ్యెను.

ఈతని ప్రతిభ యొక్క రాజకీయరంగముననేగాక సాహిత్యపీఠమునగూడ దివ్యద్యుతుల వెలార్చెను. ఖాన్‌ఖానా కేవలము రాజనీతివేత్తయేగాడు; పండితకవి. ఈతడు అరబ్బీ, ఫారసీ, హిందీ, సంస్కృతభాషలలో

కూలంకషమగు పాండిత్యముగలిగి రసవంతముగను, ఆశువుగను కవిత చెప్ప నేర్చియుండెను. ఈతని కవితాశైలి మృదులమై, మధురమై, హృదయంగమమై యుండును.

సంస్కృతభాషలో నీతడు వ్రాసిన గ్రంథములు రెండు:

౧. ఖేటకౌతుకజాతకము

ఇది యొక జ్యోతిషగ్రంథము. ఫారసీ పదయుక్తమగు సంస్కృతభాషలో దీనిని రచించి ఖాన్‌ఖానా గ్రంథరచనమున నూతన మార్గము ద్రొక్కెను. ఈ గ్రంథము ముద్రితము. మంగళాచరణానంతర మీక్రింది శ్లోకముతో గ్రంథ మారంభింపబడినది:

"కరోమ్యబ్దుల్ రహీమోఽహం
ఖుదాతాలా ప్రసాదతః,
పారశీకపదై ర్వ్యక్తం
ఖేటకౌతుక జాతకమ్."

౨. రహీమ్‌కావ్యము

భక్తిరసపూరితమగు గ్రంథము, అలభ్యము.

రహీమ్‌ఖాన్ జాతిచే తురుష్కుడైనను కృష్ణభక్తుడు. ఈమహాకవి రసవంతములగు కవితాకుసుమముల తన యిష్టదైవతము నర్చించెను. అపద్యముల సంగ్రహమే 'రహీమ్ కావ్యము.'

'రహీమ్‌కావ్యము' యొక్క వైశాల్యమూహించుటకు నేడు మన కెట్టి యవకాశములు లేవు. కాని ప్రస్తుత మారేడుశ్లోకములుమాత్రము కాలగర్భమున నశించిన యాయుత్తమగ్రంథముయొక్క యాత్కృష్ట్య మునకు సాక్షిమాత్రములుగ నిలిచియున్నవి రచనామాధుర్యము, విశాలభావములు గలిగి హృదయస్పర్శియగు కళతొలికించుచు యాశేషించిన శ్లోకము లాశిథిలకావ్యముయొక్క యాత్కృష్ట్యమూహించు నవకాశమును గలిగించుచున్నవి.

ఖాన్‌ఖానా మహదైశ్వర్య మనుభవించినది ప్రధాన మంత్రియగుటచే గాదు; విస్తృతకీర్తి బొందినది పెద్దబిరుదములచేగాదు. అమృతరసనిష్యందినియగు నాతని కలమే పాదుషాల మన్నలకు పాలుచేసినది; ప్రజాహృదయమున స్థాన మిప్పించినది. నేటికిగూడ ఉత్తర హిందూస్థానమున నే హిందూకవియొక్క కవితకు లేని వ్యాపనము, కీర్తి ఈతురుష్కకవికి గలవు. ప్రజ లెల్ల రీతనిని ఖాన్‌ఖానాగాకన్న మహాకవిగానే యెరుగుదురనుట సత్యదూరము గాదు. ఇట్టి మహాకవిగ్రంథము సమగ్రముగ లభించకుండుట విచారకరము.

ఈతని కావ్యములో శిథిలశేషములగు శ్లోకములు నాకు లభ్యమైన వీక్రింద వ్రాయుచున్నాను:

"ఆనీతా నటవన్మయా తవపురః
శ్రీకృష్ణ యా భూమికా
వ్యోమాకాశ ఖఖాంబరాబ్ధివసువ
త్త్వత్ప్రీతయేఽద్యావధి,
ప్రీత స్త్వం యదిచే న్నిరీక్ష్య భగవన్,
స్వం ప్రార్థితం దేహి మే

నోచే ద్బ్రూహి కదాపి మా నయ పున
స్త్వాతాదృశీం భూమికామ్."

"రత్నాకరోఽస్తి సదనం గృహిణీచ పద్మా
కిందేయ మస్తి భవతే జగదీశ్వరాయ,
రాధాగృహీతమనసే మనసేచ తుభ్యం
దత్తం మయా నిజమన స్తదిదం గృహాణ."

ఈ క్రింది శ్లోకములుగూడ ఖాన్‌ఖానా విరచితములే:

"ప్రాప్య చలా నధికారాన్
శత్రుషు మిత్రేషు బంధువర్గేషు,
నాపకృతం నోపకృతం
నోపకృతం కిం కృతం తేన."

"అచ్యుత చరణతరంగిణి
శశిశేఖరమాలిమాలతీమాలే,
మమ తనువితరణసమయే
హరతా దేయా, న మే హరితా."

"భగవతి, మునికన్యే,తారయే పుణ్యవంతం
సతరతి నిజపుణ్యై స్తత్ర కింతే మహత్త్వమ్,
యదిహ యవనజాతం పాపినం మా పునీహి
తదిహ తవ మహత్త్వం తన్మహత్త్వం మహత్త్వమ్."



హాంటు ప్లెజంటు, కోటగిరి
(నీలగిరి)

—టి. గోపాలకృష్ణ.

ప్రేమపాశం

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

(తరువాయి)

రెండో అంకం

మొదటి రంగం

[బంగారమ్మ వీధిఅరుగుమీద గోడకి ఆనుకొని కూచునివుంటుంది.]

బంగారమ్మ—(స్వగతం) మళ్లీ యెప్పుడు వస్తాడో బావ! మాయింటోనే భోజనంచేస్తూ మాయింటోనే వుండరాదూ? భోజనంకోసం యీయింటికీ, ఆయింటికీ పరిగెత్తడం యేం సుఖమూ? ఒకచోట పొద్దోతుంది. అప్పుడు పొద్దున్న వుండడం కష్టం. ఒకచోట తొమ్మిదింటికే అవుతుంది. అప్పుడు రాత్రి దాకా వుండడం కష్టం. రూపాయలకి రూపాయలు కాఫీహోటళ్లలో గుమ్మరించాలి. ఇక వారాల లాభం యేమిటే? కాకపోయినా, వొకయింటో పప్పూ, కూరా, చారూ—యిలాంటివి పెడతారు. కొన్ని యిళ్లల్లో వట్టివూరగాయే వేసి పెడతారు. వొకర్తి "యేదో తింటాడు, పోతాడు" అని నిర్లక్ష్యంగా పెడుతుంది. వొకర్తి విధిలేక రుంజుకుంటూ పెడుతుంది. ఆపేరించి పెట్టే యిల్లాళ్లు తక్కువవుంటారు. యెలా తింటున్నాడో బావ? యెలా కాలం గడుస్తోందో?

మాయింటోనే యెందుకుండగూడదమ్మా? మా నాన్న మేనమామాయెను. తను మేనల్లుడు. మా అమ్మ భేదం యెరగదు. నేను ప్రాణం యిస్తాను. యేంలోటు? యేం తక్కువా? చాలామంది యిళ్లల్లాగ అసహ్యంగా వుండదు మాయిల్లు. వేసంకాలంలో డాబామీద పడుకుంటే యెంతసుఖంగా వుంటుందీ? యిల్లంతా నాప రాయేకదా? తను ప్రత్యేకంగా వొకగది పుచ్చుకో వచ్చు.

నేను వుండమంటే వుంటాడు. నేనంటే దయే బావకి. వొళ్లో కూచుంటే సంతోషించాడు కదా? అయితే యిదోకష్టం వచ్చిలావుంది. నిన్న యిట్టే వచ్చి పదిరూపాయలు చేతిలోపెట్టాడు. ఇందాకా వీడు మిఠాయి తీసుకువచ్చాడు. వొద్దు మొర్రో అని యెంత చెప్పినా ససేమిరా అన్నాడు; గాని మానేడా? వచ్చినప్పుడల్లా యిలా అయితే కష్టమే. సంగీతంపాడి సంపాదించుకున్న డబ్బంతా యిలాఖర్చుపెడితే—యింకా పెళ్లికావాలి కూడానూ.

(అప్పుడు వెంకన్నవస్తాడు.)

వెంకన్న—(స్వగతం) బంగారం అరుగుమీదే కూచుంది. నేనంటే దీనికిష్టమే. నన్ను చూసిందంటే ముందు తనే పలకరిస్తుంది. (ఆమెయెదట ముసిముసి నవ్వులు నవ్వుతూ నుంచుంటాడు)

బంగారమ్మ—(స్వగతం) వీడు వచ్చాడెందుకూ యిప్పుడూ?

వెంకన్న—(స్వగతం) పలకరించదేం?

బంగారమ్మ—(స్వగతం) మొద్దులాగ నుంచున్నాడెందుకూ?

వెంకన్న—మాట్లాడవేమే బంగారం?

బంగారమ్మ—నువ్వెందుకు మాట్లాడావుకాదూ?

వెంకన్న—మావూరునుంచి వస్తే—

బంగారమ్మ—ఎప్పుడు వచ్చావురా?

వెంకన్న—యిప్పుడేగాదూ యింకా వస్తున్నానూ? మూట యింకా బుజంమీదే—

బంగారమ్మ—అయితే యింటోకిపద.

వెంకన్న—(స్వగతం) తను లేవదేం? (ప్రకాశం) మాఅమ్మగూడా వస్తోంది.

బంగారమ్మ—ఏదీ?

వెంకన్న—అదిగో (వీధికేసిచూసి) అమ్మాయి! బంగారం వీధిలోనే కూచుందేవ్!

(అప్పుడు కోటమ్మ వస్తుంది.)

కోటమ్మ—ఇదిగో బంగారమే! వీధిలో కూచున్నావేమే?

బంగారమ్మ— వీధిలో కూచోలేదు, పెద్దత్తా, అరుగుమీద కూచున్నాను గానీ.

కోటమ్మ—అదీయిదీ వొకటికామా? ...పోనీ, మీనాన్న వూళ్లో వున్నాడా?

బంగారమ్మ—వున్నాడు. బజారుకికామోసు వెళ్లాడు.

వెంకన్న—యింటోకి వెడదాంరావే బంగారం!

బంగారమ్మ—మీరు పదండి, నేను. తరవాత వస్తాను.

కోటమ్మ—నడవరా.

(తల్లీ, కొడుకూ లోపలికివెడతారు)

బంగారమ్మ—యిప్పుడు వచ్చారెందుకూ వీళ్లూ? ఎక్కడికో వెడుతున్నారు కాబోలు. చదువూ లేదు సంధ్యాలేమూ, మాటలు మాత్రం మెయ్యగలడు వీడు. పెద్దత్త యెక్కడికి వెళ్లినా వీణ్ణే తీసుకువెడుతుంది. చచ్చుపెద్దమ్మ. అప్పుడే పద్ధెనిమిదేళ్లు వెళ్లాయి. నేనే నయం, ఆరోతరగతి చదివాను.

(వెంకన్న మళ్లీవస్తాడు)

వెంకన్న—వోశావ్! బంగారమ్మోయ్! నీ కోసం పోకుండలు తెచ్చింది మాఅమ్మ. రా యింటోకి వెడదాం.

బంగారమ్మ— పోకుండలా? యెలా వుంటా యవీ? యేంచేసు—

వెంకన్న—తియ్యబెల్లం. తింటే వదలవు నువ్వు. పైకి బూరెల్లాగ—వేయించిన కొబ్బరికాయముక్కలూ, నువ్వుపప్పూ—యెంతరుచిగా వుంటా యను కున్నావ్?

బంగారమ్మ—నేనెప్పుడూ ఆపేరే వినలేదూ. యిప్పుడెందుకు తెచ్చారూ?

వెంకన్న—నీకోసమే. తిందువుగాని రా యిం చక్క. నీమీద మాఅమ్మకెంతో యిష్టం. మవ్వంటే నాకెంత—(గుడ్లుతిప్పుకుంటూ) అనుకున్నావ్? నిన్ను పెళ్లాడతానునేను. మాఅమ్మ ముహూర్తం పెట్టించడానికే వచ్చింది. రా చిలకాగోరింకల్లాగ యింటోకి వెడదాం. (చెయ్యి పట్టుకోపోతాడు)

బంగారమ్మ—వుండు. అక్కడ నుంచోలేవూ? నువ్వుపో యింటోకి. నే నిప్పుడురాను. పో! నుంచుంటావేం?

వెంకన్న—తొరగారావాలి సుమా కాళ్లు కడుక్కోడానికి నువ్వే యిస్తావంది మ అమ్మ, నాకు నీళ్లు. (వెళ్లిపోతాడు.)

బంగారమ్మ—వోరిచచ్చు —

వెంకన్న—(మళ్లీవచ్చి) నువ్వు వచ్చీదాకా పోకుండలమూట విప్పను. (వెళ్లిపోతాడు.)

బంగారమ్మ—వీడి పోకుండలు కాలా. దున్నపోతూ. నన్ను పెళ్లాడతాట్ట. అవ్వ. (అని నోరుమూసుకొని) సిగ్గుసిగ్గు. యిక్కడకూచుంటే మళ్లీవస్తాడు. వాళ్లసూరమ్మతో ఆడుకుంటాను వెళ్లీ.

(బంగారమ్మ వెళ్లిపోతుంది. వెంకన్నా, పోకుండలమూటతో కోటమ్మా మళ్లీవస్తారు.)

కోటమ్మ— నేను తీసుకువస్తానుండు. నిన్ను చూసి సిగ్గుపడింది. మొగుడంటే సిగ్గెరగదనుకున్నావా యేమిటి, పన్నెండేళ్లపిల్లా?

వెంకన్న—ఏదీ?

(ఇద్దరూ వెళ్లిపోతారు.)

కోటమ్మ—యేదారినో యింటోకే వెళ్లింది, రా.

(ఇద్దరూ లోపలికివెడతారు.)

రెండోరంగం

[వాకట్లో వెంకటశాస్త్రి, కాంతమ్మా, కోటమ్మా, వెంకన్నా చేవరి కూచునివుంటారు. బంగారమ్మ తల్లి పక్కని కూచునివుంటుంది.]

వెంకటశాస్త్రి—"సంగతి యిదీ" అనిచెప్పకుండా "నేనెందుకు వచ్చానో తెలుసునా తమ్ముడూ?" అంటే యెలా తెలుస్తుందే అక్కయ్యా?

కాంతమ్మ—గంపంత వూహ మనస్సులో పెట్టుకుని వచ్చినట్టుంది పెద్దవొదిన.

వెంకన్న—మామ బంగారాన్ని నాకే యిస్తాడు.

కోటమ్మ—చెప్పాలిట్రా తమ్ముడూ నోరు చేసుకునీ? అయినా చల్లకివచ్చి ముంతదాచడం యెందుకూ? ఇలారా బంగారం వోమాటూ.

(బంగారమ్మ మాట్లాడదు. అలావెళ్లదు. మెలికం వంచుకుంటుంది.)

కాంతమ్మ—అదేమిటో చెప్పు వొదినా, బంగారం వస్తుందిలే. అయినా పెద్దత్త పిలుస్తోంది, వెళ్లవే.

వెంకటశాస్త్రి—అమ్మాయిమొగమాటం మాపెద్దక్క యెరిగిందే-దగ్గిరికి వెళ్లదేమిటే? ఏమిటేఅక్కయ్యా?

కోటమ్మ—చెప్పడాని కేంవుంది తమ్ముడూ? బంగారాన్ని మావెంకడికి అడగడానికీ—యింకెందుకూ? ముహూర్తం స్థిరపరిపించడానికే వచ్చాను.

(కాంతమ్మ చకితురాలవుతుంది. బంగారమ్మ తల్లికేసి చురచురాచూసి వీథిలోకి వెళ్లిపోతుంది. వెంకన్న కనబడినంతసేపూ ఆమెనే చూస్తాడు.)

కాంతమ్మ—(స్వగతం) యిదా అమ్మా? మంచి మాటే. అమ్మాయి చెప్పుదెబ్బ కొట్టినట్టు మహాబాగా వెళ్లిపోయింది.

వెంకటశాస్త్రి—(స్వగతం) పెద్దయిత్తే!

వెంకన్న—(స్వగతం) పెళ్లిమాట చెప్పాటప్పటికి బంగారం చటుక్కున అవతలికి వెళ్లిపోయింది. ఎల్లమాలిన సిగ్గూ దానికి.

కోటమ్మ—ఏమంటావు తమ్ముడూ?

వెంకటశాస్త్రి—నువ్వడగనూ వచ్చు, నేనివ్వనూ వచ్చు. యిందులో యేమీ తప్పూలేదు, వింతాలేదూ. అయినా బంగారం చిన్నపిల్ల. అప్పుడే తొందరేమిటే?

కోటమ్మ—అకేమిట్రా అలాఅంటావూ? పన్నెండేళ్లు వెళతాయిరేపు కార్తీకం పున్నానికి. తల్లి పద్నాలుగేళ్లదాకా వున్నా, అమ్మమ్మ పదకొండేళ్లకే సమర్తాడిందిట. పిల్ల బొబ్బిల్లాగ బొద్దుగాకూడా వుంది. ఈయేడు పెళ్లిచెయ్యకపోతే కష్టంసుమా, యేమనుకున్నావోగాని నువ్వూ.

వెంకటశాస్త్రి—రజస్వల అయితేమాత్రం కొంప మునిగిపోతుందా యేమిటి అమాంతంగాను?

కోటమ్మ—పట్టంలో ప్రవేశించాక యిలాంటి బుద్ధులు పుట్టాయేమిట్రా నీకూ? మనవంశం యెలాంటిది? మనతాత యెంతచదువుకున్నాడు? నాయనమ్మ యెంత ఆచారంగా వుండీది? అమ్మ చాదస్తం—

వెంకటశాస్త్రి—ఏమిటో? చూడూ పెద్దక్కా! అదంతా పూర్వకాలం. ఇప్పటివాళ్లకి ఆపద్ధకులు నచ్చవు.

కాంతమ్మ—దానికేంగానీ: ఈయేటికి మేం పెళ్లిచెయ్యలేము వొదినా! నీకు తెలవందేముందీ?

వెంకటశాస్త్రి—అదీ వొకకారణమే. మొన్న మొన్ననే మేడపని పూర్తయింది. కోమట్లపుణ్యమా అని నాలుగు వేలతో కొంప వేసుకొన్నాం. ఆమంచి యిల్లాలు రాధాబాయమ్మగారు మొన్ననే నుయ్యి కట్టించిపెట్టింది. యింకా యింటికి తగిన హంగు సంపాదించుకోడం తరవాయే. యిలాంటప్పుడు అమ్మాయికి పెళ్లిఅంటే మాట తక్కుతుందా?

కోటమ్మ—పెళ్లి పేరుచెప్పి ప్రత్యేకంగా యెవరూ యివ్వకపోతే మాత్రంనువ్వు విడిచేతులతోవున్నావా యేమిటి? అయినా యేదోకార్యం అయిందనిపించుకుని వెళ్లిపోతాంమేము. నువ్వేమీ పెద్దపరుగులు పెట్టనక్కర్లేదు. లోకంలో అందరూ యిస్తున్నారు గనక నువ్వు

కవెండికి మురుగులూ, వెండిమరచెంబూ, వెండికంచమూ, పట్టుతాపితాలూ ఇయ్యి. పైగా రొక్కం నూటప దహార్లు చాల్లే. యింటికి పెద్దాడబడుచునైనందు కిది వరకీ నువ్వు నాకు లోటుచెయ్యలేమా. యికముందూ చెయ్యవూ. నామాటకేమిలే. నీకు తోచినంత యివ్వ వచ్చు. వొక్క ఆడపడుచుకనక మాఅమ్మాయికి వొక్క యాభై రూపాయలు ముట్టచెప్పు. నేనేమీ యెక్కువ అడుగలేదు. పప్పూ వణ్ణమూపెట్టు. తాంబతో రావ డం వీ కిష్టంలేకపోతే వరపంచకంగా వస్తాం మేము.

వెంకన్న—(స్వగతం) పట్టుతాపితాలు నే నెప్పుడేనా కట్టుకుంటూంటాను. రోజూ కట్టుకుంటే మాసిపోతాయి.

కాంతమ్మ—(స్వగతం) ఇవన్నీ-యింకా యివ్వ వలసిన సమ్మంధమే. పెళ్లికొడుకుని చూశాటప్పటికి మరొకళ్లయితే గుమ్మరిస్తారు. (నవ్వుకొంటుంది)

వెంకన్న—(స్వగతం) అత్త నవ్వుకుంటోంది. యిష్టమే.

వెంకటశాస్త్రి—(స్వగతం) వరుడంటే శ్రీ కృష్ణుడుతిరవాత వీణ్ణేచెప్పాలి. వెయ్యిన్నూట పద హార్లుకూడా వీడికి తక్కువే.

కోటమ్మ—(స్వగతం) వొప్పుకుంటారు. నేను తక్కువ అడిగానేమో! అయిదువంద లడగవలసింది... మించిపోయిందేంవుందీ? పెళ్లిలో పట్టుపడితేసరీ (ప్రకాశం)వూరుకున్నావేం తమ్ముడూ? నీవుద్దేశం కూడా చెప్పవే మరదలా!

కాంతమ్మ—నాయిష్టం యేంవుంది వొదినా! మీ తమ్ముడూ మీరూ, ఆలోచించుకోండి.

వెంకటశాస్త్రి—నువ్వేమీ యెక్కువ కోరలేదు. కాని మాకంత తాహతు వుందా అని యోచిస్తున్నాను.

కోటమ్మ—నీతాహతు నీమేడే చెబుతోందిరా.

వెంకటశాస్త్రి—మీసాలపెరుగులాగ పైకి మేడ కనుపడుతోం దందరికీనీ. అయితే: యేంచదువుతు న్నావురా యిప్పుడూ?

వెంకన్న—శబ్దాలు నేర్చుకుంటాను, కోతలయి పోయాక. నేను కూడా రాజమండ్రిలోనే వుంటాను యికముందు, పురాణాలు చెబుతూనూ.

వెంకటశాస్త్రి—ఇదివరకేం చదివావూ?

వెంకన్న—రెండో కళాసు.

వెంకటశాస్త్రి—ఎన్నో యేడే నీకొడుక్కి?

కోటమ్మ—పద్ధెనిమిది వెళ్లాయి. దాచుకోడం యెందుకూ?

(వెంకటశాస్త్రి కాంతమ్మకేసి చూస్తాడు. ఆమె మందహాసం చేస్తుంది.)

కోటమ్మ—(స్వగతం) యెన్నివిధాల పోరినా వెవసాయంలో ప్రవేశపెట్టారు; గాని చదువుకో నిచ్చారా తండ్రీ? ఇంగిలీసులో ప్రవేశపెడితే యీపా టికి యెప్పే అయిపోవును.

వెంకన్న—(స్వగతం) శ్రద్ధపడితే శబ్దాలెంతా? శబ్దాలువస్తే కావ్యాలు పేలాప్పిండే.

కోటమ్మ—ఇప్పుడు చదువులెవరూ చూడ్డం లేదే మరదలా! నేల వుంటేగాని యీకాలంలో పెళ్లి కావడంలేదు మొగపిల్లలికి. ఎంతచదువుకున్నా నేల లేక పోతే వాడు గుటుక్కుమన్నాడంటే యిక పిల్లకి గతేదీ? మావూళ్లో కరణాలు యిలాగే చదువు మాని యిచ్చాటప్పటికి పెళ్లయిన నాలుగునెల్లకి చచ్చివూరు కున్నాడు పెళ్లికొడుకు. ఇప్పుడాపిల్లకి మనువర్తికేనా దారిలేదు.

వెంకటశాస్త్రి—సెబాస్!

కాంతమ్మ—(స్వగతం) చివరికి మంచిధోరణి లోనే పడుతోంది. యింకా మాట్లాడనిస్తే యింతకంటే పాడుమాటలు వస్తాయి. (ప్రకాశం) ఆలోచించి చెబు తారులే వొదినా!

వెంకటశాస్త్రి—అలా చేద్దామే అక్కయ్యా!

కోటమ్మ—పిల్లతరవాత యిబ్బంది—

వెంకటశాస్త్రి—ఆలోచించి చెబుతామన్నాను గామా? యింక అధికంగా ప్రసంగం యెందుకూ?



మధురమైన విటమిన్ ఆహారము

మాల్టుసారమును, కాంతివంతమైన పాలక్రొవ్వును ఏ. బి. సి. డి. విటమినులు విరివిగాగల యితర పదార్థములును, యిందు మిళితమైయున్నవి.

అమూల్యమైనది

ఎదిగేపిల్లలకు ఆరోగ్యము నిచ్చుటలోను, దంతములను, ఎముకలను చక్కగా నిర్మించుట యందును, అసమానమైనది.

రేయాల్టు

కృంగి కృశించెడివారికిని, పాండురోగమునకును, సామాన్య దుర్బలత్వమునకును, గర్భిణ సమయమందును, ప్రసవానంతరమును సరియైన పోషణ నొసగుటకును ఉపయోగించును.

Bengal Chemical &
Pharmaceutical Works, Ltd.,

CALCUTTTA.

మద్రాసుస్టాకిస్టులు:—యస్. దేశాయిగౌండర్, బందరువీధి,

చిల్లరప్రదర్శనశాల:—చైనాబజార్ రోడ్డు, రాజుగారి ప్రతిమకు యెదురుగా.

తంతివిలాసము : "లీవర్ క్యూర్" టెలిఫోను నెం. 8139.

దీని మాదిరి మందులను చూచి మోసపోకుడు.

లీవర్ అండు స్ప్లీన్ (కడుపులో బల్ల) వ్యాధులకు



డాక్టరు జమ్మి వెంకట రమణయ్యగారి
అమోఘమైన ఔషధములు

శిశువులకు గలుగు అన్నివిధములైన లీవర్ అండు స్ప్లీన్ వ్యాధులను రానీయకుండుటకును, చికిత్స చేయుటకును ప్రత్యేకౌషధము.

ప్రముఖులగు వైద్యులచే పరీక్షింపబడినది.

డాక్టర్ జమ్మి వెంకటరమణయ్య,

లీవర్ అండు స్ప్లీన్ స్పెషలిస్టు, నెం. 8, శాలైవీథి, మైలాపూరు, మదరాసు.

స్వల్పధర! ఫల మధికము !! పూర్తి తృప్తి!!!

100 కి 100 గురు సంతృప్తిచెందియున్నారు

లోకామయహార కస్తూరి మాత్రలు

పిల్లలు మొదలు ముసలివారివరకు అందరి మందము, మలబద్ధము, పడిసెము, దగ్గు, గూరలు, శీతలముచే కాళ్లులాగుట, కడుపుబ్బరము, కడుపునొప్పి, పక్క-లయందునొప్పి, ఆహారజీర్ణకాలమందు తలనొప్పి, చలిజ్వరము, జ్వరము, ప్లేగు, ఇన్‌ఫ్లూయంజా ఇంకను అనేకవ్యాధులను గుణపరచును. స్త్రీలు ప్రసవించిననాడు, స్నానమునాడు (కస్తూరికి బదులుగా) ఈ మాత్రలు 4-5 ను, 2-3 తమలపాకులలో నమలి మ్రింగవలెను. సాంక్రామికరోగులతో నుండవలసినవారు, దినము 1-2 మాత్రలను సేవించిన ఆరోగ్యదృఢాంగులగుదురు. ఈమాత్రలసీసాతో గల అనుపానపత్రమును చూడుడు. 300 మాత్రలు గల సీసా 1 కి 4 అణాలవంతున ప్రతిషాపులోపలను దొరకును. పోస్టుమూలకముగా 6 సీసాలు రు. 1-8-0, 12 సీసాలు రు. 2-12-0, 25 సీసాలు రు. 5-3.0.

సారస్వతాసవం :—మెదడుకు బలమును కలిగించి, జ్ఞాపకశక్తిని వృద్ధిచేయును గావున, మెదడు దుర్బలమువలన గలిగియుండు సమస్తవ్యాధులను పరిహరించి నరములకు మంచిత్రాణను, రక్తవృద్ధిని కలుగజేయును. సంగీతపాఠకుల కంఠస్వరమునకు మృదుమధురత్వము నిచ్చును. పాడను పాడను ఉత్సాహము నింపును. బలహీనులైన స్త్రీలకు నెత్తినడుము (నెత్తినోరు చాల మెత్తగా వుండుటవలన) మాట్లాడను నడువనుకాని పిల్లలకు సంజీవివంటిది.

6 ఔన్సుల సీసా 1-కి రు. 1-0-0. పోస్టుఖర్చులు ప్రత్యేకము.

శ్రీ సీతారాఘవ వైద్యశాల, మైసూరు.

కోటమ్మ—అలాగే ఆలోచించుకోండి. నుంచున్నపాళంగా చెప్పడానికి—మీరుమాత్రం ఆలోచించుకోవద్దూ ? ఏమయినా నేను పెద్దాడబడుచుని గదా ? పుట్టినప్పణ్నుంచీ బంగారం నా కోడలంటూనే వున్నాను నేను.

వెంకటశాస్త్రి—సరే.

కోటమ్మ—గోదావరివొడ్డున మావూరి కరణాల పిల్ల వుంది. చూసివస్తాను భోజనాలవేళకి. ఈ లోపుగా మీరు బాగా ఆలోచించుకోండి.

వెంకటశాస్త్రి—వెళ్లి రా.

కోటమ్మ—అంటూ సొంటూ లేని సమ్మంధం కదా ? మీస్థితీ, మా తాహతూ, మా యిదీ మీరు—

వెంకటశాస్త్రి—వెళ్లిరమ్మన్నాను కాదూ ?

వెంకన్న—యీవూళ్లో శబ్దాలు బాగా చెప్పగలవాళ్లున్నారా మామయ్యా ?

వెంకటశాస్త్రి—నీకు చెప్పగలవాళ్లు యీ వూళ్లోనే గాదు, సాధారణంగా యెక్కడా కూడా—యింతకీ, నువ్వు చదువుకోసం రాగలిగేటప్పటికి ఆవేళకెక్కణ్ణుంచో యెవడో వొకడు వూడిపడకపోతాడూ ?

వెంకన్న—భక్తిశ్రద్ధలతో చెప్పేవాళ్లని కాస్త చూస్తూవుండు.

కోటమ్మ—యిక తండ్రిపెత్తనం యెలాగా సాగనివ్వను. యింగ్లీషు లేకపోతే లేకపోయింది, మన వేదమ్ముక్కలేనా చెప్పిస్తేగాని బాగాలేదు. మంచి గురువుని చూసిపెట్టు. యిక వాడిబాధ్యతఅంతా నీదే.

వెంకటశాస్త్రి—కూతుర్నివ్వడం వచ్చినప్పుడు అది వేరే చెప్పాలా ?

కోటమ్మ—రారా నాయనా !

వెంకన్న—మామా ! వెళ్లివస్తాను. అత్తా ! వెళ్లివస్తాను.

(కోటమ్మా, వెంకన్నా వెళ్లిపోతారు. వెంకటశాస్త్రీ, కాంతమ్మా వొక్కక్షణం వొకర్నివొకరు గంభీరంగా చూసుకొని ఫక్కున నవ్వుతారు.)

కాంతమ్మ—యిలాంటి సమ్మంధం యిక దొరకదు.

వెంకటశాస్త్రి—సందేహమేమీ ? అల్లుడు పొరుగింటికి వెడుతూ మన యిద్దరితోటీగూడా చెప్పాడు చూశావా ?

కాంతమ్మ—భయభక్తులెక్కువ—.

వెంకటశాస్త్రి—వీడికి భక్తిశ్రద్ధలతో శబ్దాలు చెప్పే గురువు కావాలిట. పైగా యికముందు పురాణాలు చెబుతూ యీవూళ్లోనే వుండిపోతాడుట, విన్నావా ?

కాంతమ్మ—మామగా రోవీధినీ, అల్లుడోవీధినీ పురాణాలుచెప్పి దోచెయ్యవచ్చు, దాటిపోనివ్వకండి.

వెంకటశాస్త్రి—బాగా కనిపెట్టావు.

కాంతమ్మ—కనక పిల్లనివ్వండి. లేకపోతే—పెద్దాడబడుచూ, లోకం హర్షించదు.

వెంకటశాస్త్రి—నీకిష్టమేగదా ?

కాంతమ్మ—యెంత అందంగానో వుంది.

(అప్పుడు బంగారమ్మ వస్తుంది.)

బంగారమ్మ—ఏమే అమ్మా ! వాళ్లేరీ ?

కాంతమ్మ—సమ్మంధం నిశ్చయమైపోయింది. వాళ్లు వెళ్లిపోయారు.

బంగారమ్మ—(బిక్కమొగంతో కిందకి చూస్తుంది.)

వెంకటశాస్త్రి—ఏంతల్లీ ? (కాంతమ్మకేసి తీక్ష్ణంగా చూసి) యిలారా అమ్మా! (చేతులు చాపుతాడు.)

బంగారమ్మ—(నుంచునే వుండి మాట్లాడదు. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరుగుతాయి.)

కాంతమ్మ—ఏం తల్లీ! ఏంమామ్మ! (అని లేచివెళ్లి, పొదివిపట్టుకొని) లేదమ్మ! నిన్నతని కిస్తామా? బెంగ పెట్టుకోకమ్మ.

వెంకటశాస్త్రి—అదేమిటమ్మా! వెఱ్ఱిదానా! నిన్ను ఆవాజమ్మకిస్తానా? (కాంతమ్మతో) అమ్మాయిని నువ్వేడిపించావు.

కాంతమ్మ—వూరికే అన్నానండీ, చిట్టితల్లి యేమంటుందో అనీ. లేదమ్మ లేదు. వూరుకో మాతల్లీ! వాళ్లని వచ్చినదారినే పొమ్మంటాములే. (బంగారమ్మ కళ్లు తుడుస్తుంది.)

(అప్పుడు పేరుభట్టు వస్తాడు.)

పేరుభట్టు—ఏంచేస్తున్నావు మామయ్యా?

వెంకటశాస్త్రి—ఏమీ లేదు కూచోరా.

కాంతమ్మ—కూచోవోయి! బావ వచ్చాడు చూడు తల్లీ!

బంగారమ్మ—(తల వంచుకొని కుమిలికుమిలి దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—ఏంమామా! ఏమిటత్తా అదీ? అదేమిటి బంగారం? (దగ్గిరికి వెడతాడు.)

(బంగారమ్మ పేరుభట్టుదగ్గిరికి వెడుతుంది. అతనామెని పొదివిపట్టుకొని ఆమె "అలా పద" అనగా మేడమెట్లెక్కి పైకి తీసుకు వెడతాడు.)

కాంతమ్మ—చూశారా?

వెంకటశాస్త్రి—ఏమంటావు?

కాంతమ్మ—ఏమిటంటారూ?

వెంకటశాస్త్రి—కష్టమూ సుఖమూ, మంచీ చెడ్డా తెలిసే వయస్సూ. పైగా అమ్మాయి నిశితప్రతిభావంతురాలు.

కాంతమ్మ—వెంకన్నని చూసి దిగ్గున లేచిపోయింది. పేరుభట్టుని చూసి దగ్గిరికి చేరింది.

వెంకటశాస్త్రి—కనిపెట్టావుగదా? మనస్సులో వుంచుకో.

కాంతమ్మ—మీ పెద్దక్కా, వెంకన్నా యిక్కణ్ణుంచి వెళ్లిపోయేదాకా అమ్మాయి అన్నం ముట్టదు. వాళ్లున్నంతసేపూ అది యింటోనే వుండదు. తొరగా పంపెయ్యండి, యేదో చెప్పి వాళ్లని.

వెంకటశాస్త్రి—రాత్రిబండిమీదే పంపేస్తాను (చిటికలువేస్తూ) తొరగా వంటకానియ్యి.

కాంతమ్మ—నిప్పురాజేశానంటే క్షణం. వేపుడు కూరలా, పిండివంటలా?

వెంకటశాస్త్రి—(లేచి నుంచుని) పన్నెండేళ్ల పిల్ల. పాతికేళ్ల వాడికేనా మొగాడికి వుండదంత బుద్ధి. సెబాస్! యిలాంటి కూతురుండగా యిక కొడుకుల్లేరని విచారం యెందుకూ? (వీధిలోకి వెళ్లిపోతాడు.)

కాంతమ్మ—చిట్టితల్లి యెంత నాజూకుమనిషీ! తారతమ్యం పెద్దవాళ్లేనా కనిపెట్టలేరింతగాను. గాజురాయేదో, రత్నం యేదో విడమర్చేసింది క్షణంలోను. వాళ్లు వచ్చినప్పణ్ణుంచీ అది యెలాగో వుంది. యేం చెప్మా అనుకున్నాను గాని కనిపెట్టలేకపోయాను. నేను బతిమాలినా, తండ్రి వోదార్చినా పోని దుఃఖం దానికి పేరుభట్టుని చూశాటప్పటి కేమయిపోయిందో గాని—పేరుభట్టూ అలాంటివాడే పాపం. బిడ్డ విచారంగా వుండడం చూశాటప్పటికి చివుక్కుమందతని మనస్సు. ప్రాణం యిస్తున్నాడు బంగారం అంటేను. వారి కభిమానం వున్నట్టుంది. నేను కాదనను. చిట్టితల్లి వూహ యెలా వుంటే అలా నడుస్తాను.

(లోపలికి వెళ్లిపోతుంది.)

మూడోరంగం

[పేరుభట్టుగది. భద్రయ్య అనే సహాధ్యాయి కూచునివుంటాడు.]

భద్రయ్య—యేమిటి గతి? భవిష్యత్తంతా అయోమయంగా వుంది. ఆరుమాసాల్లో యింటావిడ సిద్ధం. గిన్నిలు కాకపోతే కుండలతో వండుకుందామన్నా బియ్యపునూక లెలావస్తాయి? సాహిత్యంలో బుద్ధి

పాకిపోతోందన్న సంబరమేగాని ముందు సంసారం చెయ్యడం యెలాగా అని యింతవరకూ ఆలోచించ నైతిని. డబ్బుసంపాదించే లక్షణాలు యేమీ పట్టుపడ లేదు. అమాంతంగా సంసారం మీదపడిపోతే అప్పు డేమిటి చెయ్యడం?

వా! ప్రయోజకుడెవరూ అంటే పేరుభట్టుని చెప్పవయ్యా! పాటలో అంతవాడు యీ పట్నంలో మరివొకడు లేడుకదా? పేరుభట్టుగారి పాటంటే సభ నిండిపోతుంది కదా? వూరికే పాడినా యేవో బహు మతీలు వొస్తూనేవుంటాయి. మహా మృదువైన గాత్రం. అతను తరుచు పీడర్లతో సార్టుబళ్లమీద తిరుగుతూవుంటే నాకు సంతోషమే; కాని విద్యార్థిగాళ్లంతా అలా యేడుస్తారెందుకూ? వాళ్లసొమ్మేం పోయిందీ, అతను పూర్వజన్మంలో చల్లాడు. యిప్పుడు పండుతోంది. నేను చల్లకుండానే పండాలని కోరుతున్నాను.

ఆరునెల్లు ఆక్టింగయితే అయింది, హితకారిణీ హైస్కూల్లో తెలుగుపండితుడుగా చేరదామంటే గురు వుగారు కూడా దానికి రహస్యంగా ప్రయత్నాలు చేస్తున్నారుట, యేమిటిదారి? నిజానికి వారూరుకో వలిసింది. దగ్గిర పదిరాళ్లు వున్నాక బీదవాళ్లమీదకి పోటీయెందుకూ? మొదట నన్ను ప్రోత్సాహంచేసింది వారేఆయె. అయినా, పడుచుపెళ్లాం పోరుతూవుంటే ఆయన యేం చెయ్యగలరూ?

సాహిత్యంవిషయంలో తోటివిద్యార్థిగాళ్ల కందరికీ మొనగాణ్నే. అయితే వొకటి తోచిందికాదు. పేరుభట్టు యీవూరు వచ్చినప్పణ్నుంచీ—స్నేహం కలిసి నప్పణ్నుంచేనా శ్రద్ధచేస్తే యీపాటికి పదిరాగాలు రాక పోవునా? సాహిత్యానికి తోడు కాస్త రాగజ్ఞానం వుంటే హరికథలు చెప్పుకొని వకరుగా బతకవచ్చునే! తుదకిపురాణంచెప్పినా పదిరాళ్లూ దొరుకును, గౌరవం గానూవుండును. పేరుభట్టుమేనమామ పురాణం చెప్పే గామా, దోచేస్తున్నాడూ?

నిజంగా నేను ప్రపంచకాన్ని కనిపెట్టలేక పోయాను...... ఇప్పుడయితేమాత్రం యేం? పేరు భట్టు నాకోరిక తిరస్కరించడు. నేను సంస్కృతా భ్యాసంలో సాయపడుతున్నాను గనక తప్పకుండా చెబుతాడు. నేను తనకేమీ అడ్డురానుకదా? రానియ్యి, మాట్లాడుదాం.

(అప్పుడు సూరన్న వస్తాడు)

సూరన్న—అయ్యా! పేరుభట్టనే విద్యార్థి నెరుగుదురా మీరూ?

భద్రయ్య—యెరక్కేమీ?

సూరన్న—వాడిబస యెక్కడండి?

భద్రయ్య—ఇదే.

సూరన్న—వున్నాడా?

భద్రయ్య—వొకప్లీడరుగారి కూతురికి సంగీతం చెప్పడానికి వెళ్లాడు. వచ్చేవేళయింది. మీ దేవూరండి?

సూరన్న—వాడు మాతమ్ముడే.

భద్రయ్య—అలాగా? దయచెయ్యండి.

(సూరన్న వచ్చి కూచుని వొకమాటు గదిఅంతా పారచూశాడు.)

సూరన్న—మావాడూ మీరూ సహాధ్యా యులా?

భద్రయ్య—సహవాసులం. వొకరిదగ్గిర చదువు కుంటున్నాం కూడానూ.

సూరన్న—ఈగదికి అద్దెయెంతండి?

భద్రయ్య—అయిదు రూపాయలు.

సూరన్న—యిద్దరూ పెట్టుకుంటారా సమానం గాను?

భద్రయ్య—నేనేమీ యివ్వలేనంటే మీ త మ్ముడు స్నేహరీత్యా "రావోయి" అన్నాడు,

సూరన్న—(స్వగతం) డబ్బంతా యిలా తగ లేస్తున్నాడన్నమాట వీడు. (ప్రకాశం) ఈరవివర్మప టాలెవరివండి? ఈట్రంకుపెట్టీ, ఈపెద్దద్దమూ, ఈ

పరుపూ, ఈమడతమంచమూ, యీ బట్టలబీరువా, ఈ మడతకుర్చీలూ—

భద్రయ్య—నేను బీదవాణ్ణని ముందే మనవి చేసుకున్నాను. అన్నీ మీ తమ్ముడివే. ఆరైలుసంచీ మాత్రమే నాదీ.

సూరన్న—విద్యార్థిగాడి కింతవేషం యేమిటండీ?

భద్రయ్య— వూరికే వస్తే పుచ్చుకోవద్దన్నారా?

సూరన్న—సంపాదించడం మంచిదే; కాని వారాలు చేసుకునీవా డింతవేషంవేస్తే చూసినవాడు వారం యిస్తాడా? దొరికిందల్లా వీలయినప్పు డింటికి పంపేస్తే మళ్లీ యెవళ్లనేనా అడగడానికీ, సంపాదించడానికీ బాగుంటుంది. ఏమంటారు?

భద్రయ్య— మీరుచెప్పింది సర్వోత్తమంగా వుంది; గాని మీవాడు ఆమాత్రపు మనిషి కాడండి.

సూరన్న—నిజంచెప్పారు. అయితే మీరెందుకూ కలేశారు కారూ?

భద్రయ్య—తోచిందికాదు. ఇక చెబుతాను.

సూరన్న—అయితే మావాడు యిలాగ వేషాలు వెయ్యడమేనా, యేమేనా డబ్బ—

భద్రయ్య—విద్యార్థిగాళ్లకి సంపాదనఅంటే యేమిటి? ఇలాంటి పట్నంలో వారాలు దొరకడమే కష్టం. యింతకీ మీతమ్ముడు సంగీతపాటకుడు గనక—

సూరన్న—చూడండీ. విద్యార్థి గాళ్లలో మాత్రం సంపాదించేవాళ్లు లేరూ? నిజానికి విద్యార్థిగా వున్నప్పుడు సంపాదించలేనివాడు తిరవాతా సంపాదించలేడు. నేను మాత్రం చదువుకునేటప్పుడు మూతిబిగించుకూచ్చోలేదు సుమండీ; కాని మావాడిలాగ కాక దొరికిందల్లా యింటికి పంపేసి మళ్లీతయారయివాణ్ణి.

భద్రయ్య—మీరు సంసార రాజులన్నమాట; కాని నోరుచేసుకొని మీవా డెవణ్ణీ అడగలేడండీ.

సూరన్న—మరి యివన్నీ యెలా వచ్చాయి?

భద్రయ్య—(స్వగతం) జలగలాగపట్టుకున్నాడే? వీణ్ణి బోల్తాకొట్టించడం యెలాగా?

సూరన్న—ఏమిటో ఆలోచిస్తున్నారు. నిజం చెప్పండి.

భద్రయ్య— అదేమిటండోయి, అలా సెలవిస్తున్నారు. అబద్ధాలు చెబితే నాకేం వస్తుందీ?

సూరన్న—అదికాదు. మీరు పొరబడుతున్నారు—

భద్రయ్య—బాగుందండోయి మహానుభావా! నాది పొరపాటూ, మీది వాస్తవమూనా? అలా అన్నారేమిటండీ?

సూరన్న—నేనేమన్నానూ, యిప్పుడు తఫా వస్తుమాటా?

భద్రయ్య—ఘుట్టిప్రశ్నే వేశారు; కాని నాకు తీరుబడిలే దిప్పుడు. యింకా పాఠంచూసుకోవాలి కూడాను. నేనవతలికి వెడతాను. మీరు కూచునివుండండి. మీవాడు వస్తూవుంటా డీపాటికి.

సూరన్న—ఆ కష్టం మీకెందుకూ? ఈగదిలోనుంచి మిమ్మల్ని అవతలికి వెళ్లమనడానికి నాకేం అధికారంవుందీ? బజారుకివెళ్లాలి. మళ్లీ అరగంటలోపుగా వస్తాను. మావాడు వస్తే యీమాట చెప్పి, వుండమని చెప్పండి. (లేస్తాడు.)

భద్రయ్య—అవశ్యమూనూ.

సూరన్న—(వెడుతూ) తేలేపోయింది. పేరిగాడేమాత్రమో సంపాదిస్తున్నాడు. వీడికి తెలుసు నా సంగతి. కాని దాచాడు. వెట్టిమొఘం. అడిగినదానికి సూటిగా జవాబు చెప్పకపోవడమే అడిగింది వొప్పుకోడంకాదూ? పేరిగాడిదగ్గిరవున్నది—ఈసామానులో కూడా కొంత పట్టుకుపోవాలి. (వెళ్లిపోతాడు.)

భద్రయ్య—శనిలా వున్నాడే. కొంపలు కూల్చే రకం. వీడికి నేను లొంగుతానూ! హిహ్హి.

(పేరుభట్టు వస్తాడు.)

భద్రయ్య—వచ్చావా? కూచో. నీకోసం పోలీసు వచ్చాడోయి!

పేరుభట్టు—సర్కిల్ ఇనస్పెక్టరుగారు పంపించారు కాబోలు. నెల్లాళ్లనుంచి పోరుతున్నాడాయన తనయింటో పాడమనీ.

భద్రయ్య—అది గాదోయి పప్పా. దొంగ పోలీసు.

పేరుభట్టు—అంటే ?

భద్రయ్య—నీసంపాదన యెలావుందో, నీదగ్గర యేమాత్రం నిలవవుందో, సొమ్ము యేంచేస్తున్నావో, యీ పరుపూగిరుపూ యేలావచ్చాయో—

పేరుభట్టు—అర్థంలేనిమాటలు—

భద్రయ్య—నిజమే. మళ్లీవస్తాడులే కూచో. నిన్ను వుండమని చెప్పమన్నాడుకూడాను.

పేరుభట్టు—ఏమిటోయి నీగడబిడా ?

భద్రయ్య—హాహాహా. కూచో ముందు. మీ అన్నయ్యట—

పేరుభట్టు—ఏ అన్నయ్యా? పేరు—

భద్రయ్య—అడుగలేదు. పళ్లు పొడుగూ.

పేరుభట్టు—వాడా? మా చిన్నన్నయ్య. నిలువు నా విమమూ. ఏమన్నాడేమిటి ?

భద్రయ్య—యీగదికి అద్దె యెంత ? నువ్వు చెరిసగమూ యిచ్చుకుంటున్నావా లేదా ? యిలాగ గుక్క తిప్పుకోకుండా వూదరగొట్టేశాడు.

పేరుభట్టు—యిదంతా తనకెందుకూ?

భద్రయ్య—సంపాదించిందల్లా యింటికి పంపేస్తే గతిలేదు బాబోయని మళ్లీ మొత్తుకోవచ్చుట. తను అలాచేసీవాడుట.

పేరుభట్టు—వాడిమొఖం. వాడు చదువుకునే టప్పుడింటికి పంపడానికి సంపాదన అంటూ వుంటేనా? కట్టుకునీబట్టలుకూడా యింటిదగ్గిర్నుంచి పట్టుకుపోయీ వాడు. యెప్పుడో వొకమాటు వొకపట్టురైక మాత్రం తెచ్చి మాఅమ్మకిచ్చాడెలావచ్చిందో గానీ.

భద్రయ్య—బాగుంద ; కాని మంచిప్రశ్నలు వేస్తాడోయి !

పేరుభట్టు—నీవంటి వెఱ్ఱిపెద్దమ్మ దొరికితే వెయ్యకేం ? రానీ నన్నడిగితే నేనేం చెబుతానో విందువుగాని.

భద్రయ్య—పాఠం మానేస్తానయితే.

పేరుభట్టు—అది నీయిష్టం. మా తగవులు వింటూ కూచోడం లాభమో, పోయి పాఠం చెప్పకోడం లాభమో ఆలోచించుకో.

భద్రయ్య—మహా బాగా కొట్టావుదెబ్బ. అవునవును. వొకళ్ల గృహచ్ఛిద్రాలింకోడు వినడం తప్పే. అయితే: ఇవాళ నాటకంలోకి వెడతావు కాదూ నువ్వు ?

పేరుభట్టు—తప్పకుండాను.

భద్రయ్య—నన్నుకూడా తీసుకువెళ్లాలి సుమా.

పేరుభట్టు—అలాగే.

భద్రయ్య—టిక్కట్టు లేకుండాసుమా.

పేరుభట్టు—డబ్బు ఖర్చులేకుండా తీసుకు వెళ్లగలను ; గాని టిక్కట్టు లేకుండా నావల్ల గాదు.

భద్రయ్య—వాయించేశావే ! (యెదటచూసి) అదిగో మీఅన్నగారు వస్తున్నారు. (గదిలోనుంచి వీధిలోకి వస్తాడు.)

(అప్పుడు సూరన్న వస్తాడు.)

సూరన్న—వాయించేశా వంటున్నా రేమిటండోయి ?

భద్రయ్య—మిమ్మల్ని కాదు. అదిగో మీ తమ్ముడు. వెళ్లండి. (వెళ్లిపోతాడు.)

(పేరుభట్టూ, సూరన్నా వొక్కక్షణం గంభీరంగా చూసుకొంటారు.)

సూరన్న—యెక్కడికి వెళ్లావురా?

పేరుభట్టు—వొకపిల్లకి పాఠంచెప్పడానికి.

సూరన్న—నెలకి యేమిస్తారూ?

పేరుభట్టు—యెనిమిదీ.

సూరన్న—యిలా యిచ్చేవాళ్లెంతమంది వున్నారూ?

పేరుభట్టు—యీవొక్కపిల్లే.

సూరన్న—ఇంతే?

పేరుభట్టు—అంటే?

సూరన్న—మొత్తానికి సంగీతం యెంతమందికి చెబుతున్నావూ?

పేరుభట్టు—ఎందుకేమిటి?

సూరన్న—నేనామాట అడిగితే తప్పా?

పేరుభట్టు—నేనీమాట అడిగితే మాత్రం తప్పా యేమిటి?

సూరన్న—బాగానేవుంది. యింతకీ: అదంతా నాకెందుకా. నీ. వొకకోకా, వొక ఆడకట్టుజమారూ, రెండు పరికిణీలూ కావాలిట. రూపాయలేమేనా ఇవ్వాలి.

పేరుభట్టు—యెక్కడ తేనూ?

సూరన్న—యెక్కడేనా తేవాలి. లేకపోతే సంసారం యెలాగెడుతుందీ? ఆభారం అంతా నేనొక్కణ్ణీ మొయ్యగలనా?

పేరుభట్టు—నువ్వు మోసీదేమిటోయి?

సూరన్న—అంటే యేమన్నమాటా?

పేరుభట్టు—శిస్తేమవుతోందీ?

సూరన్న—సముద్రంలో కాకిరెట్ట. పెత్తనం చేస్తే తెలుస్తుంది. మాటలుచెప్పడంకాదు.

పేరుభట్టు—నువ్వు తప్పుకో పోనీ. మళ్లీకలిసి అంతా పెద్దన్నయ్య చక్కబెడతాడు.

సూరన్న—అయితే మూడోమేలు ఇంతకంటే వుందీ?...అలాంటిమొగాళే సంసారాలు దిద్దడం?

పేరుభట్టు—మళ్లీఆనాలికమడతమాట యేమిటీ?

సూరన్న—వొకొక్కక్క తవ్వాయి వచ్చినప్పుడు నేను పడీపాట్లు దేవుడికెరుక. దానికేంగానీ, అసలే యేమీ లేదంటే యెలాగా? పోనీ, పదిరూపాయలు తే.

పేరుభట్టు—దమ్మిడీకూడా యివ్వలేను.

సూరన్న—యీసామానంతా యెలా వచ్చిందీ? పట్టంచుల చాపు కట్టావు. సిల్కుచొక్కా తొడిగావు. నేలంకందువా పైనవేశావు. డబ్బంతా యిలా పాడు చేస్తూ—

పేరుభట్టు—మహా పోషిస్తూవున్నవాడిలాగే పరీక్షచేస్తున్నావే?

సూరన్న—యివన్నీ యిలా యెదురుగా పెట్టుకు చొకపోతే యింటికి పంపెయ్యరాదూ?

పేరుభట్టు—నాకోమరీ?

సూరన్న—మళ్లీ సంపాదించు.

పేరుభట్టు—మంచి సలహాయే. నాకు తోచింది కాదు. యిదివరకే యెందుకు చెప్పావుకాదూ మరీ?

సూరన్న—చెప్పాలీ వొకరూ?

పేరుభట్టు—అందరికీ నీకున్నంత ప్రతిభ వుంటుందా?

సూరన్న—అయితే నువ్వు చిన్నమామతోటీ వాళ్లతోటీ మాట్లాడ్డం లేదుగదా? వాళ్లయింటికి వెళ్లి వద్దు నువ్వు. అమ్మ గట్టిగా చెప్పమంది యీమాట నీతోటి.

పేరుభట్టు—వాళ్లమాట యెందుకు వచ్చిందీ?

సూరన్న—మ వ్వీవూళ్లో వున్నావుకనకా. ఆపయిని నీయిష్టం. అమ్మ చెప్పమన్నమాట చెప్పాను.

పేరుభట్టు—నీపని తీరిపోయిందిగదా?

సూరన్న—రూపాయలమాటో మరీ? అమ్మ పది మాట్లు చెప్పింది.

పేరుభట్టు—చదువుకొనేవాడిదగ్గిర డబ్బేం వుంటుందీ? యెలా వస్తుందీ? నువ్వెక్కడికేనా వెళ్లి సంపాదించరాదూ?

సూరన్న—యిల్లు కదలడానికి వీలా నాకూ? పిల్లలు తుమ్ముతారు. దగ్గుతారు. మానేవాళ్లెవరూ?

పేరుభట్టు—పిల్లలు నీకొక్కడికే వున్నారా? పెద్దన్నయ్య యెలా వెడుతున్నాడూ?

సూరన్న—వొదిన భయంలేని మనిషి. మీచిన్న వొదిన వొట్టిబేలమనిషి. నువ్వెరగవా యేమిటి?

పేరుభట్టు—జమాఖర్చురాస్తే తగిలీదంతా పెద్దన్నయ్య పెట్టుకుంటా నన్నాడు గదా—

సూరన్న—దాపెయ్యడాని కదో యెత్తూ. లెక్కలు పెట్టకపోతే, నేను హరిస్తున్నాననుకున్నావా, లెక్క రాయడం నాకు చేతకాదనుకున్నావా. సంసారంగుట్టు చెడిపోతుందని గాని.

పేరుభట్టు—జమాఖర్చులు రాస్తే గుట్టెలా చెడిపోతుందీ?

సూరన్న—లెక్కలు మొదలు పెట్టామంటే పెద్దాడు వాళ్లనీ, వాళ్లనీ తీసుకువచ్చి, మాటిమాటికీ చూపించమంటాడు.

పేరుభట్టు—కుటుంబమర్యాద వాడికి తెలవదూ?

సూరన్న—ఆసంగతంతా నీకే తెలుసు. పోనీ, బట్టలు అరువేనా యిప్పించు. వూళ్లో వర్తకులందరూ నీకు స్నేహితులుట.

పేరుభట్టు—దైవానుగ్రహంచేత స్నేహితులికీ లోటులేదూ, అరువూ పుడుతుంది; గాని ఆబాకీ నువ్వు తీరుస్తావా?

సూరన్న—ఈవూళ్లోవుండి నువ్వేంచేస్తావూ?

పేరుభట్టు—అయితే కోక యెవరికీ?

సూరన్న—మీచిన్నవొదినికి.

పేరుభట్టు—నీపెళ్లానికి నేనెందుకొనాలీ?

సూరన్న—సంసారంఅంతా నేను మొయ్యడం లేదూ?

పేరుభట్టు—యెవ రెవరిసంసారం మోస్తున్నావోయి?

సూరన్న—అంతానూ.

పేరుభట్టు—పెద్దన్నయ్య వేరున్నాడాయె. నేనూ, తమ్ముడూ యెప్పుడూ యింటోనే వుండడం లేదాయె. యిక నువ్వూ, నీపెళ్లామూ, నీపిల్లలూ—

సూరన్న—ముసలిదీ, చెల్లెలూనో?

పేరుభట్టు—ఆస్తి వాళ్లకి వదిలేసి పెద్దన్నయ్యలాగే నువ్వు పైగాపో.

సూరన్న—పెద్దాడు తనకి పడీధాన్యం వుమ్మళ్లో నుంచి తీసుకోడం లేదూ?

పేరుభట్టు—నేను మానిపిస్తాను.

సూరన్న—ముసలిదాన్నీ, పెళ్లిగాని చెల్లెల్నీ మీలాగే వదిలెయ్యనా? అదంతా నాకు తెలవదు. అమ్మ బట్టలు కావాలని నీతో చెప్పమంది. నేను చెప్పాను. నువ్వుచెప్పిన సమాధానాలు అమ్మకి చెపుతాను. నాకేం?

పేరుభట్టు—అమ్మ నాబుఱ్ఱ తీసేస్తే అప్పుడు చూద్దాంలే.

సూరన్న—అయితే: నేను వెడుతున్నాను. చిన్నమామగారియింటికి వెళ్లడంగాని, వాళ్లతో మాట్లాడ్డంగాని చేశావుసుమా. యిప్పుడు డబ్బులేకపోతే యింటికి వచ్చాటప్పుడేనా కొనిపట్టుకురా బట్టలు. పరికిణీలు మానేసినా, ఆడకట్టుజామారూ, మూడోనాలుగో పెడితే వస్తుంది, వొకచీరా పట్టుకురా. మరిచిపోకు సుమా.

పేరుభట్టు—చెల్లికి పరికిణీలక్కర్లేదా?

సూరన్న—డబ్బుంటే పట్టుకురా.

పేరుభట్టు—మరి అలా అన్నావేం? కోక మానేసి పరికిణీగుడ్డలు తెస్తేనో?

సూరన్న—నీయిష్టం. యెలా చేసినా సరే. నువ్వులేకపోతే కుటుంబఖర్చులకోసం ఋణంచేస్తాను. నాకేం? (వెళ్లిపోతాడు.)

పేరుభట్టు—(స్వగతం) తేలిందా? యిలావుంది వీడిసంగతి. మాఅమ్మకి యేమీ తెలవడం లేదు. చిన్నబ్బా

యంటే సత్యహరిశ్చంద్రుడనుకుంటోంది ......రుణాలు పెరిగితే పెరిగాయి. నేను నావాటా వదులుకుంటాను. దిక్కుమాలిన తగువులు నాకు పనికిరావు. ఫిడేలే నాకు ఆస్తి.

(తెర దించవలెను)

నాలుగోరంగం

[పేరుభట్టు గది. గోడకానుకొని పేరుభట్టూ, పక్కని భద్రయ్యా కూచునివుంటారు. పేరుభట్టు యెదట ఫిడేలు గోడుగావుంటుంది.]

పేరుభట్టు—శ్రద్ధచేస్తే ఆరుమాసాలు చాలు. పురాణానికి సంగీతం ఆట్టే అక్కర్లేదు. సంగీతం వస్తేనూ, సాహిత్యం వుంటేనూ పురాణం చెప్పడం సాధ్యంకాదు. ఆకళ వేరూ.

భద్రయ్య—సంగీతం లేకపోతే పద్యంలో వున్న గాంభీర్యమే పోతుంది. పద్యానికి రాగమే ప్రధానం.

పేరుభట్టు—రాగం అంటే బొమ్మలాటలోనూ వుంటుంది. భాగవతంలోనూ పాడతారు. నాటకాల్లోనూ, హరికథల్లోనూ కూడా పాడతారు. సంగీతకచేరీలలో సరేసరి. యిందులో—

భద్రయ్య—పురాణరాగాలు వేరోయి!

పేరుభట్టు—అంటే యేమన్నమాటా? ఆధోరణి సహజంగా కలగాలి గాని; సంగీతం నేర్చుకుంటే రాదు. అయితే: మొన్న నువ్వు ప్రభలవారియింటో సత్యనారాయణవ్రతకల్పం చెప్పినప్పుడు విన్నాను. కొంచెం శ్రద్ధ చేస్తే పురాణం బాగానే చెప్పగలుగుతావు.

భద్రయ్య—యేలాగో నాలుగురాగాలు కాస్త శ్రావ్యంగాపాడడం నేర్పితివా, నాకు జీవనాధారం కలిగించినవాడ వౌతావు.

పేరుభట్టు—అది భగవంతుడే యేర్పరిచాడు. పురుషకారంవల్ల ఆ వరం స్వాధీన మవుతుంది. వున్న చిక్కల్లా యేమిటంటే? ప్రతీవాడూ తనకి నచ్చిన వృత్తిలో దిగబోతాడు. దాల్లో వాడికి బుద్ధి ప్రవేశించకపోవచ్చు. అలాంటప్పుడే మనవాళ్లు దైవాన్ని నిందిస్తారు. నీకు పురాణంచెప్పి డబ్బు సంపాదించాలని వుంది; గాని అందులో నీబుద్ధి ప్రసరించకపోతే—

(తెరలో)

పేరుభట్టుగారూ!

పేరుభట్టు—వుత్తరాలుంటే కిటికీలో నుంచి పడెయ్యవోయి!

(వొకకవరు కిటికీలోనుంచి పడుతుంది. పేరుభట్టు విప్పి చదువుకుంటాడు.)

భద్రయ్య—రహస్యమా యేమిటి?

పేరుభట్టు—నాకు రహస్యాలేమిటోయి! కాకినాడలో గానసభ అవుతోంది. గాయకురాలు మెడ్రాసు నుంచి వచ్చింది. నాలుగుకచేరీలు గుత్త. మొన్న వొకటి జరిగింది. ఫిడేలుగాడు జ్వరపడ్డాడు. నన్నురమ్మనీ. వెడితే వెళ్లడమే. లేకపోతే తంతికొట్టాలి. కచేరీ వొక్కటికి యెనభైరూపాయ లిస్తారుట.

భద్రయ్య—వెడతావా యేమిటి?

పేరుభట్టు—రెండువందల నలభైరూపాయలు చేదా, విషమా?

భద్రయ్య—బోగందానిపక్కని హంగు—

పేరుభట్టు—అదేం మాటోయి?

భద్రయ్య—ఏమీ?

పేరుభట్టు—ఇది విద్య చూపించడమోయ్!

భద్రయ్య—బోగంది భాగోతం కడుతూవుంటే పక్కని తిత్తివూదడమూ, తాళం వెయ్యడమూ—

పేరుభట్టు—ఎంత చక్కని పోలిక తెచ్చావూ?

భద్రయ్య—అంతకంటే యిది యేవిధంగా మంచిదీ?

పేరుభట్టు—బ్రాహ్మడు తాలూకాకచేరీలో డవాలీపని చెయ్యవచ్చునా?

భద్రయ్య—ఛా!

పేరుభట్టు—తహసీలుదారీ?

భద్రయ్య—వో!

౫



౬

౭



౮

పేరుభట్టు—సత్రంలో గుమాస్తాగిరీ ?

భద్రయ్య—త-ప్పు-లే-దు.

పేరుభట్టు — అయితే యేసూత్రంప్రకారం డవాలీపని తప్పన్నావూ ?

భద్రయ్య—అది నౌకరీ.

పేరుభట్టు—తహస్సీలుదారీ, గుమాస్తాగిరీనీ ?

భద్రయ్య—అవి వుద్యోగాలు.

పేరుభట్టు—అదేసూత్రం యిక్కడానూ.

భద్రయ్య—నాకు తృప్తికాలేదు.

పేరుభట్టు—ఫిడేలు వాయించడం బాగా నేర్చుకో ముందు.

భద్రయ్య—నన్నెంత చచ్చుపెద్దమ్మకింద కట్టేశావూ ?

పేరుభట్టు—ప్లీడరుకి లా చదువుకు నేటప్పుడుండే న్యాయపక్షపాతంవ్యవహారం ప్రారంభించాకవుండదుట.

భద్రయ్య—నేనొప్పుకోను. పువ్వుపుట్టగానే పరిమళం అన్నాడు.

పేరుభట్టు—నువ్వు ధర్మనిర్ణయం మహా చక చక చేసేస్తున్నావు గానీ, మొన్నటి పుష్కరాల్లో నువ్వు నీ పెళ్లానికి పంపించిన రెండు కాసులూ నీకెలావచ్చాయో?

భద్రయ్య—అవునూ. నేను స్నానంచేసి స్వామి దర్శనం చేసుకుని వస్తూవుంటే అప్పుడే స్నానంచేసి వస్తూవున్న మావూరి పరంజ్యోతీ, దానికూతురు అమ్మణ్ణీ యిచ్చారు నాకు మంచిబ్రాహ్మణ్ణనీ.

పేరుభట్టు—వేశ్యలు స్నానంచేసి, గోదావరి వొడ్డున డబ్బివ్వడమూ, నేను మంచిబ్రాహ్మణ్ణని పిలిచి పీగే పెద్దమనిషి పుచ్చుకోడమూ—

భద్రయ్య—వొకదాన్లోనుంచి వొకదాన్లోకి లాగుచున్నావు.

పేరుభట్టు—పోనీ, ఆ పరంజ్యోతి నువ్వు మంచి పండితుడవని తాంబూలం యిస్తుంది. పుచ్చుకుంటావా?

భద్రయ్య—యెలాంటి తాంబూలమూ ?

పేరుభట్టు—యెలాంటి హంగూ ?

భద్రయ్య—అన్నిటికీ యుక్తే ప్రధానమా ?

పేరుభట్టు—తాను చేస్తే ప్రధానం. ఇతర్లు చేస్తే అప్రధానం. తీసెయ్యవోయ్ !

(వీరావధాని వస్తాడు.)

వీరావధాని—తీసేస్తూనేవున్నారు లెక్కలే కుండాను. ఇవాళ యిన్నిస్ పేటలో ఆరుగురు. ఆర్యాపురంలో పదకొండుగురు. వీరభద్రపురంలో యెనమండుగురూ. లక్ష్మీవారప్పేటలో ముప్ఫయిముగ్గురు. మంగళవారప్పేటలో పద్దెనమండుగురు. వూళ్లో ముప్ఫయిమంది. చింతకాయలు దుల్లినట్లే.

పేరుభట్టు—యేమిటోయి యీవుద్ధృతం ?

భద్రయ్య—అయితే యిక క్షణం వుండను నే నీవూళ్లో.

వీరావధాని—(చంకలోని మూట చూపించి) చూశావా ? గఫ్‌చిఫ్ ! (వెళ్లిపోతాడు.)

భద్రయ్య— రాత్రిబండిమీద వెళ్లిపోవడమే. ఏమంటావు ?

పేరుభట్టు—ఇంత ధైర్యంవుంది మీకు. సరే. నేను కాకినాడవెళ్లివచ్చి యిక్కడే వుంటాను. వారాలు మానేసి యీ కలరా తగ్గేదాకా—

భద్రయ్య—నీయిష్టం. బతికివుంటే బలుసాకు తిని బతకవచ్చు. ఈరాత్రి యిక్కడవుంటే భయమే రోగకారణం అవుతుంది. తప్పుకో. రైలుసంచీ సద్దుకోనియ్యి. గురువుగారితో చెప్పేం ?

పేరుభట్టు—వారుగూడా వెడితే చెప్పలేను. ఆలస్యం చేస్తే బండి దొరకదు.

భద్రయ్య—జెండా యెత్తేశాం.(వెళ్లిపోతాడు.)

పేరుభట్టు-(స్వగతం) ఈరాత్రి మామగారి యింటో భోంచేద్దాం. కాకినాడలో వారందినాలు పడుతుంది గనక యీసామానుగూడా అక్కడ పెట్టేస్తే మంచిది. తరవాత చూసుకోవచ్చు. మళ్లీ వచ్చేటప్పటికి స్నేహితులందరూ క్షేమంగావుంటారా ? ...అంతా దైవాధీనం......"నగుమోమూ గనలేనీ—"

(తెర దించవలెను.)　　(సశేషము)

మేఘుఁడు

జి. జాషువ

ఏనుఁగుపిల్లమాదిరి మహీధరశృంగమునందు దోఁచి నె
మ్మే నిసుమంతలోఁ బెనిఁచి, మింటిని కౌఁగిటఁబట్టి, బృంహిత
ధ్వానము లాచరించు నవవర్షపయోధర, భేకసంఘముల్
గానముసేయుచున్నవి, జగంబున నించుము కుంభవర్షముల్.

జలదా, యింద్రధనుస్సు వట్టుకొని నీసాన్నిధ్యమందున్న యా
విలుకాఁ డెవ్వఁడు? లక్ష్యమేమిటి? భవద్విద్యుల్లతాహాసలీ
లల యొయ్యారము లేమి? కర్షకుల కుల్లాసంబు గల్పించి, నె
మ్ములు నాడించెడు నీవిచిత్రచరితంబుల్ మాకు బోధింపుమా!

మద్దెలకాఁడు నీహృదయమధ్యమున న్నివసింపకున్న యా
గద్దరిగర్జనధ్వనులు గల్గుట కేమికతంబు? చెల్వముల్
ముద్దులు మూటగట్టు నగుమోము తళుక్కునఁ జూపి డాఁగు న
మ్ముద్దియలెల్ల నీయనుఁగుపుత్రిక లేకదరా, వలాహకా!

అంభోధిజలమునం దవగాహనముసేయు భానుమంతునిచేతఁ బ్రభవమంది
ధరనున్న ప్రతిపదార్థమును జ్ఞప్తికిఁదెచ్చు లెక్కింపరాని పోలికలఁ బోల్చి
నెమిలికన్నుల రమణీయవర్ణములచే పచ్చని శక్రచాపములు వ్రాసి
శుక్తికన్యకల విశుద్ధగర్భములలో ముత్యాల సంతానమును ఘటించి
చేతనాచేతనంబుల చిత్తమలర - నమృతదానంబుసేయు మోహనుఁడ వగుచు
భీకరములైన పిడుగులు విడిచెదేల? - యీస్వభావంబు మానుమోయీ పయోద!

వితరణవిలాసివై యభ్రవీథి నేలు - ఘనుఁడవగు నీకు హంసతో కలహ మేల?
తగదు తగ దంబుదా, సమాధానపడుము - వానకోయిలచే రాయబార మంపి.

మా సంసారాలు

టేకుమళ్ల కామేశ్వరరావు

"ప్రియమైన తమ్ముడికి,

ఈమధ్య నేను చేసిన ఒకపరిశోధనసంగతులు నీకు తెలియజెయ్యాలని బుద్ధిపుట్టి, దీనివల్ల నీకు కలిగే లాభ మేదేనా వుంటే కలుగుతుందని, యీ వుత్తరం, అనేకపనుల్లో తెరిపిచేసుకుని రాస్తున్నాను.

"నేను యెన్నోమార్లు అనుకున్నాను, ఆడదాని సంసారం చాలాకష్టమనీ, మొగవాడి పనిలాగు సుళువైనది కాదనీ, మొగవాడిపని యేముంది—యిట్టేభోం చెయ్యడం, వెళ్లడం, ఆఫీసులో కూచోడం, యింటికి రావడం; ఆడదో మరి, పొద్దున్న అయిదుమొదలు రాత్రి పదకొండింటివరకూ తెరిపిలేకుండా కాలు వంచడానికేనా వీలులేకుండా, నడుమువాల్చడానికేనా అవకాశం లేకుండా పనిచేస్తూవుండవలసిందే అని. అంచేత యెప్పుడూ మాఆవిడే నాకంటే యెక్కువ కష్టపడుతూందనీ, పాపం! దానిఋణం నేను యెప్పటికీ తీర్చుకోలేననీ అనుకునేవాణ్ణి. కాని యెప్పుడెప్పుడేనా కొంచెం పరిశీలించి చూసేవాణ్ణి. చూస్తే యెంత సేపూ కడిగిందే కడగడం, తుడిచిందే తుడవడం, చేసిందే చెయ్యడం అని అనిపించేది. అయినా నాపరిశీలనే తప్పని నాలో నేను బుద్ధిచెప్పుకుని వూరుకునేవాణ్ణి. ఈపరిశీలనయినా యెందుకొచ్చేదంటే, ఎప్పుడేనా 'ఈ పుస్తకం చదువు, ఇది యెంతో బాగుంటుంది, ఇది చదువు' అనేవాణ్ణి. కాని ఆపుస్తకం మొదటిపుటేనాయెప్పుడూ తిప్పివుండడం నేను చూసివుండలేదు. అంతటితో ఆపుస్తకంమీద నాకూ, దానికీ కూడా విరక్తి పుట్టిపోయేది. 'పోనీ, నువ్వు పుస్తకాలు చదవక్కర్లేదులే. ఇంటికి తెప్పిస్తూన్న ఆంధ్రపత్రిక చదువు, చాలు. నాకు అంతకంటే నువ్వు మరేమీ వుపకారం చెయ్యక్కర్లేదు. అసలు నువ్వుకూడా చదవడానికనే నేను తెలుగుపత్రిక తెప్పిస్తున్నాను' అని అనేకసార్లు చెప్పేను. కాని ఆ పత్రికేనా అది చదవగా నేను యెన్నడూ చూసివుండలేదు. 'పాపం! పని తెరిపిలేదు. అంచేత చదవలేదు' అని అనుకునేవాణ్ణి. అంతేకాని మరొకమోస్తరుగా బద్ధకమనిగాని, పనులు తెముల్చుకోలేదని కాని యెన్నడూ అనుకోలేదు. ఎప్పుడెప్పుడేనా మీావదిన కుచ్చెల కథ తీసేది. అదేనా నాలుగు బంతులు చదివేది. అంతటితో సరదా, ఉత్సాహం తగ్గిపోయేవి. ఏకొడుకు వెధవో చదవనియ్యకుండా వున్నాడు, ఈవెధవలతో చదువేమిటి నామొహ మని వాళ్లని నాలుగుతిట్టి చరుపులు చరిచి ఆపుస్తకం ఒకమూలకి గిరవాటేసేది. ఈ మోస్తరుగా నడిచింది కాలం.

"ఆమధ్య మా మామగారు 'కూతురినీ, పిల్లలినీ ఒకమారు మావూరు పంపించు, నాలుగురోజులుండి వస్తారు' అని వుత్తరం రాసేరు. 'నేను అనేక పనుల్లో వుంటున్నాను. నా కిప్పుడు వీలులేదు' అని చెప్పి వుత్తరం రాసెయ్యా లనుకున్నాను. కాని 'ఇంతకంటే మనకు మరొకప్పుడుమట్టుగు తెరిపి తగలదు తుందా' అని అనిపించీ, ఇంతకీ మరొక కారణముంది కూడా, మరేం లేదు, నేనొక్కడినీ సంసారం చేసి చూస్తే యెలాగుంటుందో, మాఆవిడ పడ్డ కష్టాలన్నీ నేనూ పడి తెలుసుకుందామనీ యోచనకలిగి, ముఖ్యంగా యీ పరిశోధనకోసమే దాన్ని పుట్టింటికి పంపేసేను. వెళ్లేటప్పుడు అది పిల్లలనందరినీ తనతో తీసికెళతానంది. కాని నేనే వాళ్లని విడిచిపెట్టలేక పెద్దవాణ్ణి మాత్రం నాదగ్గిర వుంచుకొని చిన్నవాళ్లిద్దరినీ తనతో తీసికెళ్లమన్నాను. పెద్దవాణ్ణి నాదగ్గిరే వుంచుకొన్నాను. వెళ్లేముందరే మీావదిన నన్ను 'ఒటేల్లో జేరిపొండి. లేకపోతే మీారు నెగ్గలేరు. పోనీఅంటే ఆవు, దూడ వున్నాయి. వాటికి చాకిరీ చెయ్యాలి. ఈపాట్లు పడలేరు. వంట గింట పెట్టుగోకండి. ఆవేశంవకుక్కరు మళ్లా పైకి తీస్తారేమో' అంటూ హితంచెప్పింది. నేను అన్నిటికీ 'ఊ' కొట్టేను. అదీ వెళ్లిపోయేక కుక్కరు పైకితీసి వండుకోడం ప్రారంభించేను. కుక్కరుసంగతి నీకు తెలియనేతెలుసు, అదెంతసుళువో. అమృతంలా వుంటుంది పచనం. అయిదునిమిషాలపని, అంతే.

"నా క్రొత్తసంసారంలో నౌకరివాడు తనపని తను చేసుకుపోయేవాడు, దాసీది దానిపని అది చేసుకు పోయేది. ఆచారవ్యవహారాల్లో మీవదినెపనికీ, నా పనికీ యెంతేనా భేదముంది. తను అంటూ సంటూ అని పేరు చెప్పి, గిన్నె తగిలినా తగలకపోయినా సరే, చేతులు కడుక్కునేది. మరి నేనో, అంట్ల గిన్నెలు ముట్టుకున్నా సరే చేతికి ఏదేనా అంటుకుంటేనే చెయ్యి కడుక్కునేవాణ్ణి, కాని లేకపోతే మానేసేవాణ్ణి. ఈ మోస్తరుగా నీళ్ల ఖర్చు తగ్గిపోయింది. ఇల్లు యెప్పుడూ తేమగా వుండక, పొడిగా శుభ్రంగా వుండేది. నీటిలో మునిగి తేలుతూ వుండకపోడంవల్ల నా కాళ్లూ చేతులూ వొరిసిపోలేదు.

"మీ వదినకి యిరవైయారు రకాల మడి. తలకు నీళ్లుపోసుకుంటే ముట్టుగోవచ్చు కొన్ని. కంఠస్నానం చేస్తే ముట్టుగోవచ్చు మరికొన్ని. మడిబట్ట కట్టుకుంటే ముట్టుగోవచ్చు కొన్ని. బట్ట లేకుంటే—దానికె పెద్ద మడి అనిపేరు—ముట్టుగోవచ్చు మరికొన్ని. నాతో యిన్నిరకాల మడి లేదు. చెయ్యి శుభ్రంగా వుంటేసరి, అన్నివస్తువులూ ముట్టుగోవచ్చు. అంతా వొక్కమడే. ఇన్నిరకాల మడి వున్నా మీవదినెకి కొన్నికొన్ని రోజుల్లో కొన్నికొన్ని పనికి రావట! ఆదివారంనాడు వుసిరీపచ్చడి ముట్టుగోదు! అమావాస్యనాడు పెద్ద బచ్చలికూర వండదు! నాతో యిలాంటి చిక్కు లేమీ లేవు. పైఆచారాల్లో వేటినీ నేను పాటించలేదు, జ్ఞానవంతులిని నమ్మించగలిగిన అంశం వాటిలో వొకటే లేదు కాబట్టి.

"మీ వదినె యెప్పుడూ దాసీదాన్ని రాచ్చిప్పలూ, రుబ్బురోలూ, పాలకుండా కడగనిచ్చేదికాదు. ఆచారానికి పనికిరాదుట! కాని తక్కినవాటికీ వీటికీ భేదం నాకేమీ కనబడనందువల్ల వాటినికూడా దాసీదానిచేతే కడిగించేవాణ్ణి, తరవాతిసంగతేమైతే అదవుతుందని. ఎవళ్లమట్టుకు వాళ్లు వాళ్ల పనులన్నీ చేసుకుపోతూ వుండేవాళ్లు. కొంసకి కూరలదానితోనైనా నే నెప్పుడూ రెండుమాటలకంటే యెక్కువ ఆడి యెరగను. ఆఖరికి నా కనిపించింది, ఆ సంసారమంటే యెంతసుఖమో అనీ, యెంతసుళువో అనీ, మొగవాడు పడేపాటులో యిది యెన్నోవంతో అనీ. ఎటొచ్చీ సాయంత్రం షికారుమట్టుకు నష్టపోయేవాణ్ణి. ఎంచేతంటే, పనిచేసే మనిషి అంట్లకోసం ఆవేళకే వస్తుంది. అటుతర్వాత దూడలు వస్తాయి. పాలుతీసేవాడు వస్తాడు. అంచేత సాయంత్రం షికారువెళ్లడానికి వీలులేకపోయేది. పొద్దున్న వెళ్లడానికి వీలుండేదికాదు. అదొక్కటే యిబ్బందని అనిపించింది.

"చెబితే నువ్వు నమ్మతావో నమ్మవో-మీవదినె యింట్లో లేకపోయిండె, ఎన్నిపనులు చేసుగోవలసి వచ్చిందో అని నాకు ఒక్కనాడేనా అనిపించలేదు. ఆవూళ్లో అదీ పిల్లలూ క్షేమంగా వున్నారో లేదో అన్నమాటేగాని మరేమీ నాకనిపించలేదు. ఇలాగుంటూ వుండగా—రెణ్ణెల్లయింది అది వెళ్లి-మామగారి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది-'మీవూరికి పిల్లను పంపిస్తున్నాను. రైలు మీవూరికి రాత్రి పదింటికి వస్తుంది. పిల్లలతోటి వస్తూందికాబట్టి నువ్వు రైలు స్టేషనికి వచ్చి జాగ్రత్తగా వాళ్లని యింటికి తీసుకువెళ్లవలసింది' అని. 'సరే' అని అనుకున్నాను. అది వచ్చేరోజున నేను స్టేషనికి వెళ్లేను, పిల్లాడితోకూడా ట్రయినుమీద వచ్చింది. అందరం యింటికి ఎద్దుబండిమీద వచ్చేసేం. పిల్లలూ తనూ వాళ్ళవూళ్లోనే సాయంత్రం భోంచేసి రైలెక్కుతారని యెరిగివుండడంవల్ల నేను వాళ్లకి వంటప్రయత్నం చెయ్యలేదు. ఏదో కబుర్లన్నీ చెప్పుకున్నాం. ఇంతట్లోకి తను లాంతరుపట్టుకొచ్చి 'మీచెయ్యి ఇలా చూపించండి' అంది. 'ఏమీ యెందు' కన్నాను. 'చూపిద్దురూ, యెందుకో' అంది. పెళ్లానికి గాక మరి వూళ్లోవాళ్ళకా చనువని చెయ్యి చూపించేను. చూసింది. 'ఆచెయ్యి యియ్యండి' అంది. ఇచ్చేను. 'ఏదీ కాళ్లు చూపించండి' అంది. 'ఎందుకూ' అంటూ కాళ్లుకూడ చూపించేను. చూసి ఆశ్చర్యంతో 'మీకాళ్లూ, చేతులూ యీపాటికి వొరిసిపోయి నాకాళ్లూ చేతులులాగే వుంటా యనుకున్నాను' అంది. ఇంటిదగ్గిర వంటచేసుకుంటున్నానని నేను వెనకే వొకవుత్తరంలో రాసేనులే. 'అయితే యెలాగున్నా'యన్నాను. 'రాళ్లలాగున్నా'యంది. 'అదే

మొగాడిసంసారానికీ, ఆడదాని సంసారానికీ 'భేద' మన్నాను. 'మీ అనాచారపు పనులుచూస్తే నీళ్ళకి కూడా భయమే, లేకుంటే కాళ్లూ, చేతులూ వొరిసి పుచ్చిపోయి వుండవూ యీపాటికి' అంది మీ వదినె కాళ్లూ, చేతులూ యెప్పుడూ వొరిసి పుచ్చి పురుగు లోడుతూ వుంటాయి. ఆసుపత్రినుంచి నేననేకసార్లు మందు తెచ్చియిచ్చేను. నేను చెయ్యగలపని అంతే. తనెప్పుడూ తనకు తోచి మందుపెట్టుకున్న పాపాన్ని పోలేదు. నేను పోరగా పోరగా యెప్పుడేనా మందు పెట్టుకునేది.

"తెల్లారింది. ప్రయాణపు బడలికచేత ఆరింటికి లేచింది. నౌకరీవాడు వచ్చేడు. వచ్చినవెంటనే నాలుగు తిట్లు తిన్నాడు. 'ఇంతఆలస్యంగా వచ్చేవేం వెధవా?' అన్నది మొదటివాక్యంగా. ఆతిట్లు చెవుల్లో పడి నేనూ లేచి మళ్లా రెండునెల్లకి విన్నానుకదా యీ కంఠస్వర మని మనస్సులోపల సంతోషించేను. వాడు 'అమ్మ గారూ, అగ్గిపెట్టి యిత్తారా అండి, కుంపటి యెలిగిత్తా కాఫీకి' అన్నాడు. 'అగ్గిపెట్టె అడుగుతావుట్రా వెధవా? నువ్వు ముట్టుగుంటే అగ్గిపెట్టి యెందుకేనా పనికొస్తుందిట్రా, పెంటమీద పారేసుగోవాలికాని? నీఅనాచారం పనులు నాదగ్గిర పనికిరావు, నీ అయ్య గారిదగ్గిరగాని' అని మొదలెట్టింది. వాడు వూరు కున్నాడు. ఒక తాటికమ్మ పట్టుగొచ్చేడు. అది వెలిగించియిచ్చింది ఆవిడ......పళ్లు తోముకుంటూవుంటే కాపది వచ్చింది. వచ్చి 'అమ్మగా రొచ్చేరా అండి. చాలాకాల మయిందండి యెల్లి' అంది. ఆమాటలకి జవాబుక మోషు! 'ఇంత ఆలస్యంగా వచ్చేవేం? ఇంకా అయ్యగారే పనిచేస్తున్నా రనుకున్నావేమిటి? ఎవళ్లేనా బ్రాహ్మలన్నవాళ్ల యింట్లో, యిప్పుడా పాచిపనిచేస్తారు, అడిగేవాళ్లు లేకగాని?' అని మొదలెట్టి కోపపడింది. అది వూరుకుంది. కాలకృత్యాలయేక అంట్లు-అంటే కుక్కరుగిన్నెలు-దాసీదానికి పడేసింది. నేను వంటింటిపక్కని వసారాలో కూచున్నాను, చంటిపిల్లాణ్ణి దగ్గిరపెట్టుగుని. మీవదినె వంటగదిలో కాలుపెట్టి శొక్కగంతు యీవలికి వేసింది. వేసి, 'నరకం, నరకం, మహానరక మంటే నమ్మండి. మహాప్రభో, యిలాంటి కొంపలో నాబోటి [దొక్క]క్షణమేనా వుండగలదా? నేను వెళ్లేటప్పు డెలాగుంది? ఇప్పు డెలాగుంది? ఏమేనా అంటే నానోరు బయటపడడమేగాని......' అని వొకచిన్న ఉపన్యాస మిచ్చి 'వారంరోజుల వరకూ యిల్లు సవరించుగోడమే అయిపోతుం'దని సూచించి సంస్కరణ మొదలుపెట్టింది. ఇంట్లోవున్న వుప్పులూ, పప్పులూ-నే ననాచారంగా ముట్టుకున్నానుగా మరి; అంచేత పనికిరావు—దాసీదాని కిచ్చేసింది. నూనినేతిగిన్నె లివతలపారేసింది. పోపుసామగ్రి వాకిట్లోకే వచ్చింది. బుట్టలూ, తట్టలూ గోడవతల విసిరేసింది. ఇంట్లోవున్న బిందెదగ్గిరనుంచి గుళ్లీవరకూ యివతల పడేసింది. ఇవన్నీ దాసీది తోమడానికే! నేను మాటాడకుండా అవతలికి వెళ్లిపోయేను; చెప్పి లాభమేమీ నాకు కనబడలేదు, అంచేత. ఇల్లంతా గోడల దగ్గిరనుంచి, పీటలదగ్గిరనుంచి కడిగేసింది. అంతిపనీ అయేటప్పటికి తొమ్మిదింపావు అయింది. అప్పుడు బిందెపట్టుకుని గోదావరికి స్నానానికి బయలుదేరింది. ఒక అరగంటలో వచ్చింది. పొయ్యిలో నిప్పువేసింది. ఆఫీసుకి వెళ్లడానికి నేను కోటూగట్రా వేసుగున్నాను. 'ఓయ్! మధ్యాన్నం సెలవుపుచ్చుగువస్తా భోజనాని' కన్నాను. 'రండి అప్పటికి తెములుతుందలెండి' అంది. నేను ఆఫీసుకి బయలుదేరేను. మా పెద్దబ్బాయికి దారిలో హోటేలులో భోజనంపెట్టించి స్కూలుకు దిగబెట్టేను.

'మధ్యాన్నం వచ్చి భోంచేసేను. సాయింత్ర మయింది. షికారు అలవాటు తప్పిపోడంచేత యింట్లోనే కూచున్నాను. దాసీది వచ్చింది. అంట్లగిన్నెలు అవతల పారేసింది మీవదిన. అంట్లు తోమింది దాసీది. దాసీది ఇల్లూడ్చింది, ఆవులసాలలో పనిఅంతా చేసింది. ఇంక వెళిపోతా నంది. అది వెళిపోతానంటే యేదోపని పురమాయించింది, మీవదిన. అబ్బాయీ! నే నెప్పుడూ కూడా చూడలేదు, దాసీదికాని, నౌకరుకాని యింటికి పోతానంటే సంతోషంతో మీవదిన యింటికి వెళ్లమనడం. ఏదోపని పురమాయించి వాళ్లు

యేడుస్తూవుంటే పంపడం. నెల అయినవెంటనే వాళ్లకి యెన్నడూ సరిగ్గా జీతంరాళ్లు యిచ్చి యెరగదు. నాలుగు రోజులు ఆలస్యంచేసో, లేక ఏదోకొంత యిచ్చేసి కొంత అట్టేపెట్టుకునో, యేదో యిలాగే చేస్తూవుంటుంది. నెలాఖరున వెంటనే జీతమిచ్చేస్తే వాళ్ల బద్ధకం బలిసిపోతుందిట. ఆ జ్ఞానం మరెవరికీ లేదు. గవర్నమెంటువారు యీ తెలివిలేకే మాకు నెలఅయిన వెంటనే జీత మిచ్చేస్తున్నారు..........దాసీది వెళిపోయింది. ఆతర్వాత అన్నంగిన్నె తీస్తూవుంటే దీపందగ్గిర రవ్వంతమసి కనపడినట్టనిపించి అంచుకింద నిదానంగా చూసింది చూస్తే ఆవగింజలో సగమంతమసి కనపడింది. దానితో దాసీదానిమీద మండిపడిపోయి, తప్పేలా తోముకుని, నూతివగ్గిర స్నానంచేసింది.

"అటుతర్వాత వంటకి పొయ్యిలో నిప్పువేసింది. అప్పుడు నేను అన్నాను, 'పోనీ కుక్కరుతో వండు. కుక్కరువంటరుచి నీకు తెలుస్తుంది. మరింక విడిచి పెట్టవు' అని. 'ఆకుక్కర్లు గిక్కర్లు నాకు పనికిరావు, మీవంటలక్కేగాని. మనుష్యజాతి పుట్టినదగ్గిరనుంచీ వుంది యీవంట' అంది. దానికి నేను 'ఉండవచ్చులే. అదికాదు నేనుచెప్పేది.నీకు పని తెరిపి వుంటుంది. ఎందుకలా హూనమయిపోతావు పొయ్యిదగ్గిర? రెండుగంటలనర సేపు పొయ్యిదగ్గిరే కనిపెట్టుకుకూచుంటావు. పొగవల్ల కళ్లు చెడిపోతాయి. వేడివల్ల వొళ్లుచెడిపోతుంది. మరి కుక్కరయితే అయిదునిమిషాలలో పని అంతా పూర్తిచేసుకుని మరొకగంటసేపటికి వచ్చి భోంచెయ్యవచ్చు' అన్నాను. అందుకు తాను 'దానిరుచి బాగుండదు' అంది. 'అవును, దానిరుచి దానిది, పొయ్యివంటరుచి పొయ్యివంటది. బూర్లరుచి బూర్లది, గార్లరుచి గార్లది. ఒకదానితో వొకటి పోల్చగలమా' అన్నాను. ఏదైనా దాన్ని వొప్పించలేకపోయేను. పోనీకదా అని అప్పటికి వూరుకున్నాను. మరొకప్పటికి వాయిదావేసేను. వంటయేక భోంచేసి నిద్రపోయేము.

"మర్నాడు పొద్దున్న యేదో పెద్దపనివున్నట్టుగా పెంద్రాడే లేచింది మీవదిన. దాసీదాన్ని రానిచ్చి దానిదగ్గిర ఒకగంటన్నరసేపు లెక్చరిచ్చింది, నిన్న గిన్నెకు మసివుండడంమీద. అది యింటిదగ్గిర వున్నంతసేపూ పురుగులికినట్టుగా గొలికేసింది. అది యెప్పుడేనా ఖర్మంచాలక ఒకమాట అంటేచాలు, మళ్లీ మరొకమాటు పెళపెళ మనిపించేసేది. 'భోంచేస్తూవుంటే నాతో చెప్పింది, 'దాసీదాన్ని యివాళ ఝూడించి విడిచిపెట్టేసేనండి' అని. అందుకు నేను 'నీమీద యెంతతప్పున్నా నేనెప్పుడేనా నిన్ను ఝూడించి విడిచిపెట్టేసేనా' అనిఅడిగేను. దానితోటి మొహం ఆల్చిప్పంత చేసుకుంది. సాయంత్రంవరకూ ఘుమఘుమలాడుతూ నేవుంది. నాతో మాటాడలేదు. పోనీ అని నేనూ వూరుకున్నాను. రాత్రి రాజీపడ్డాం.

"అబ్బాయీ! ఎందు కిన్నిచెప్పడం. మళ్లీ మొదలు-కూరగాయలదానితోటి, బియ్యపుమనిషితోటి, అపరదినుసలు తెచ్చే మనిషితోటి—ఒకటేమిటి ఒక అరగంటసేపు వాదిస్తేగాని ఒకకూరగాయేనా కొనదు. నిన్నటికినిన్న దాసీది పిడకలు తిరగవెయ్యలేదని గంటన్నరసేపు లెక్చరిచ్చింది. ఈఘటనలే నాకూ వచ్చేవి. కాని నేను దాసీమనిషితో 'ఆపిడక లివాళ తిరగవెయ్యాలి' అని ఒకమాట అనేవాణ్ణి. అది తిరగవేసేది. ఒక్కమాటతో తెమిలిపోయేదానికి ఒకగంటన్నరసేపు వుపన్యాస మివ్వడం. ఇదీ ఆడదాని స్వభావం. ....దాసీది చెప్పిందిట, నేను దానికి రాచ్చిప్పలూ, పాలకుండా తోమడానికి వేసేవాణ్ణనీ, రుబ్బురోలు దానిచేతే కడిగించేవాణ్ణనీ. అంచేత రాచ్చిప్పలూ, పాలకుండా దాని కిచ్చేసింది. రుబ్బురోలుమీద పసుపునీళ్లు చల్లి పదిబిందెల పేడనీళ్లతో శుద్ధిచేసింది. ఇంకెందు కిన్నిసార్లు చెప్పడం, స్నానాలూ, కడుగడాలూ, నీళ్లలో మునిగితేలుతూవుండడం మళ్లా మొదలు.... ఆఫీసువేళకి సరిగ్గా వంటచేసిపెట్టిన రోజు లేదు. లేనిపోని పనులు కల్పించుగుంటూవుంటే వేళ కెక్కడ వండగలదు? రాత్రి పదకొండింటికికూడా యిల్లు కడుగుతూన్నచప్పుడే, అవెన్నిపను లున్నాయోగాని.

"నూతివగ్గిర పొరుగువాళ్లతో యుద్ధమయిపోతూవుంటుంది రోజురోజూ. ఒకొక్కొక్కప్పుడు మ

హాభారతయుద్ధమంత అయిపోతూవుంటుంది. నిన్న పక్కయింటివాళ్లయింట్లోంచి కాకి అన్నంకెరడు యెత్తుకుపోయి మాపెరడుమీదుగా యెగురుతూపోగా పెరట్లో నాలుగుమెతుకులు రాలేయి. దానికోసమని పక్కయింటివాళ్లతో తగవులాడింది! ఏమని చెప్ప మన్నావు, పగలు పన్నెండుగంటలూ యీమోస్తరు గానే కాలక్షేప మయిపోతుంది. పుస్తకం ముట్టడాని కేనా అవకాశ ముండదు. ఈమోస్తరుగా కాలక్షేపం చెయ్యడం మనతరంకాదు. ఏదైనా దాన్ని యెప్పుడూ పల్లెత్తుమాట అని యెరగను. తిట్టడంగాని, కొట్టడం గాని యెన్నడూలేదు. తిట్టడంవల్లా, కొట్టడంవల్లా బాగుపడ్డసంసారం యింతవరకూ నాకు ఒక్కటేనా కనబడలేదు. అంచేత నే నెప్పుడూ దాన్ని యేమీ అనను. నేను చేసే పనేమిటంటే సలహా చెప్పడం, హితోపదేశం చెయ్యడం. అంతే. ప్రేమ, దయ వల్ల జయించవలసిందేకాని దీనికి మరొకదారి లేదు. ముమ్మాటికీ లేదు.

"నా ఒక్కసంసారమే యిలాగ వుందనుకుంటున్నావేమో! అన్నిసంసారాలూ యింతే. కోటికొక్కడేనా ఒకటి వేరుగా వుందేమో! అంచేతే నాకు ప్రత్యేకవిచారం లేదు. చదువుకొన్నవాడికీ, చదువుకోని ఆడదానికీ సంసారంచెయ్యడంలో యింత తేడావుందికదా అని నాకు ఆశ్చర్యం వేస్తూవుంటుంది. ఏపనికయినా చదువు అవసరమే. చదువుయొక్క లాభం తెలిసేక ఆడవాళ్లకి చదువువద్దన్నవాళ్లని గుండేసి కొట్టేసినా పాపంరాదు అని అనిపిస్తూంది. నిన్న మీ పెద్దపిల్లని చదువులో ప్రవేశపెట్టమని అంటూవుండడం చదువు వుపయోగ మెరిగే. అంతా క్షేమం.

ఇట్లు : నీప్రియసోదరుడు,
సూర్యారావు"

ఈమోస్తరుగా హఠాత్తుగా ముగించబడివుంది. వుత్తరం. పైవుత్తరం మాఅన్నయ్య దగ్గిరనుంచి వచ్చింది. నేను "భారతి" పత్రిక్కి యేదేనా వ్యాసం రాయాలను కొంటూవుండగా యీవుత్తరం వచ్చింది. ఈఉత్తరమే వొకవ్యాసంలా వుండడంవల్లా-అంతకంటే ముఖ్యమైన సంగతి-దీనివల్ల జనులు నేర్చుకోవలసిన సంగతులు చాలా వుండడంవల్లా, యీనెల నా వ్యాసంబదులు యీ వుత్తరాన్నే పంపిద్దామని తలచి దీనికి 'మా సంసారా'లని పేరుపెట్టి భారతికి పంపించేను.

గమనిక

ఇకమీద భారతియందు 'పాతపాటల'ను ప్రకటింపజాలమని మనవి.

—భా. సం.

'మిస్ లైలా'

గొల్లపూడి జోగారావు

(రెండవభాగము)

౧

నేను దాదివృత్తిలో ప్రవేశించి రెండుసంవత్సరము లవుతుంది. నాది పవిత్రజీవనము. నారోగులను యెంతో వుత్సాహంగా నర్సుచేసేదాన్ని. 'లైలా, నీనర్సింగుతోటే సగంరోగము పోతుంది' అని శ్లాఘించే వారు డాక్టరుగారు. మేరీ, నేనూ సహవాసులమే. మాయిద్దరిదీ వొకటేవార్డు. నాది రాత్రిడ్యూటీ. మేరీ యెప్పుడూ సరదాగానే వుండేది. "లైలా, నారోగుల హృదయముల నువ్వు ఆకర్షిస్తున్నావు నిన్ను నేను envy చేస్తున్నా" ననేది. నే నెంత అదృష్టవంతు రాలిని. నాపూర్వపురోజులు తలచుకొన్నపుడు ఒక మానవహృదయం భరింపరానంత దుఃఖం వచ్చేది. ఇప్పుడు ఇట్టి పవిత్రజీవనము చెయ్యడానికి వీలుకలిగించిన డాక్టర్ని, మేరీని నిత్యమూ మన్నించేదాన్ని. నాభర్తకు, డాక్టరుగారికి వుండే స్నేహము, ఆమె క్షాయనయెడల నుండే గౌరవము చెపుతూ మేరీ తరచుగా మందలిస్తూ వుండేది నన్ను.

నాటిసాయంత్రము హాస్పిటలురూములో కూర్చున్నాను. మేరీ అప్పుడే వెళ్లిపోయింది. టెలిఫోనుగంట మ్రోగింది. దగ్గరకు వెళ్లి పట్టుగున్నాను.

"లైలా!"

"ఆఁ"

"నెం. ౧౨ రూముకి వెళ్లు."

మరేమీ వినబడలేదు. డాక్టరు వెళ్లిపోయా రనుకున్నాను. ముందుగానే బయలుదేరా ఆరూముకేసి. తలుపు దగ్గరగా వేసుంది. మెల్లగా లోపల ప్రవేశించాను. నలుబది వత్సరముల స్త్రీ మంచంమీద పడుకొనుంది. మంచందగ్గరగా వెళ్లేను. ఆమె నాకేసి చూచింది. మాయిద్దరికీ యిల్లా సంభాషణ జరిగింది:

నేను—ఏమిటి బాధ?

ఆమె కడుపుచూపెట్టింది.

నేను—ఆపరేషన్ చేస్తా మన్నారా?

ఆమె—అవును.

నేను—ఎప్పుడు?

ఆమె—రేపుదయం.

నేను లాకరు (locker) కేసి చూస్తున్నాను.

ఆమె—మీ పేరు లైలాగదూ?

నేను—అవును. మీ కెల్లా తెల్సు?

ఆమె—ఇక్కడ ఆయా చెప్పింది మీరు వస్తారని.

నే నామెటెంపరేచరు తీసుకోడానికి దగ్గరకు పోయాను. పరిచయం వున్న మొగంమల్లే కనబడ్డాది. నిదానించి చూచేను. మనసు చలించింది. హృదయం ఆరాటపడ్డాది. బాధ పైకి తోపనీలేదు. థర్మామీటరు తీసుకొని నామొగం చటుక్కున తిప్పేసేను. మరల యిట్లు ప్రశ్నించేను:

నేను—మీ రెక్కడున్నా రిప్పుడు?

ఆమె వూరుకుంది.

నేను—మీది రాజమండ్రీ కాదూ?

ఆమె—అవును.

నేను—మీరు చెన్నపట్నం వచ్చి యెంతకాలమయింది?

ఆమె—ఆరునెలలు.

నేను మాటలాడలేదు.

ఆమె—మరేమి భయంలేదుకద?

నేను—లేదు.

ఆమె—కడుపుకాదన్నారు డాక్టరుగారు.

ఆమె నాకేసి చూచింది.

"మీ రక్తే మాట్లాడకండి."

ఆమెకు వలయు సదుపాయములు చేసాను. ఆమెకు ధైర్యం చెప్పేను.

"వార్డు చూచుకొనివస్తా."

ఆమె వూరుకుంది.

"మరేం భయములేదు, పడుకోండి."

"నిద్ర పట్టలేదు."

ఆమె నిద్రపోవడానికి మందిచ్చేను.

"మళ్లీ వస్తారుకదూ?"

"నేను రాత్రల్లా యిక్కడే వుంటాను."

ఆమె కనులుమూసింది. నేను బయలుదేరాను. మనసులో శాంతిలేదు. వార్డు చూచుకొని రూములోకి పోయాను. ఎన్నో ఆలోచనలు తట్టేయి. 'అత డిక్కడే ప్రాక్టీసుపెట్టేడా?'......'రాజేశ్వరీ, న న్నెన్నిబాధలు పెట్టేవు?' ఆనిర్దాక్షిణ్యురాలి కిప్పటికి పాపఫలము పండిందా అని సంతోషించాను. అమా యికురాలగు లీలను పెట్టినబాధలకు యిప్పు డిల్లా అనుభవిస్తోం దనుకున్నాను. పతిమీద చెలాయించిన అధికారమునకు ఈస్థితి అని ఆనందించేను. అంతట్లోనే నాహృదయం కరగిపోయింది. ఆమె కఠినహృదయు రాలైతేనేమి, నేను జాలివహించకూడదా అనుకున్నాను. ఆమె నన్ను తరిమితేనేమి, నేను ఆదరిద్దామని నిశ్చ యించుకొన్నాను. ఇంతకీ నాప్రస్తుత ఉద్యోగాన్ని బట్టి నేనల్లా ఆచరించడం నావిధిగా భావించు కొన్నాను.

ఊర్లో గడియారం ఒంటిగంట కొట్టింది. నెం. ౧౨ రూములోకి పోయాను. ఆమె పడుక్కునుంది. ఆమె నిశ్చేష్టితమైన ఆకారంకేసి చూసేను. ఎందుకో నేత్రగోళములు చెమ్మగిల్లేయి. ఆయాతో 'జాగ్రత్త' అని చెప్పి అడుగులువేసా కారిడరుకేసి.

౨

కనులువిచ్చి చూచేసరికి కర్టెనుసందునుంచి గవాక్షమార్గంద్వారా సూర్యకిరణాలు పడుతోన్నాయి గదిలో. లేచి వాచీ చూసేను. తొమ్మిదయింది. రాజేశ్వరి యెల్లాగుందో? ఆపరేషను చేసేరా? మేరీ పదకొండుగంటల కొస్తుంది. ఎన్నో వినూత్నభావ ములను రచించినది మనసు. 'ఆనిర్దయురాలి విషయము నా కెందుకో?' అనుకున్నాను. 'ఆమె బ్రతుకు తుందా?' అని అంతరాత్మని ప్రశ్నించేను. మనసు శాంతించలేదు. 'ఎందుకీఆతురత? నా జీవనప్రవృత్తిలో ఆతురతకు తావేలేదా?' అనుకున్నాను. మేరీ వచ్చే దాక మనసు వుండబట్టలా. హాస్పిటలుకి బయలుదేరేను. మేరీవున్న వార్డుకేసి పోయాను. గదిలో మేరీ యేదో మందుసీసా చూస్తోంది.

"ఎలాగుంది?"

"ఎవరు?"

"నెం. ౧౨ రూముపేషెంటు."

"తెలివిరాలేదు."

"బ్రతుకుతుందా?"

"ఏమో..."

"డాక్టరుగా రేమన్నారు?"

"ఏమీ చెప్పలేదు."

మేరీ వడిగా వెళ్లిపోతోంది.

"మేరీ!"

ఆమె వెనుదిరిగింది.

"ఆమె......"

"............"

"ఆమెను నీకు తెలుసా?"

"తెలీదు."

"మేరీ, ఆమెను నేను పోల్చేను."

"ఎవరు?"

"రాజేశ్వరి."

మేరీ తెల్లబోయింది. ఆమె నమ్మలేదు.

" మేరీ, ఆమె నన్ను పోల్చలేదు. నే నిక్క డున్నానని ఆమెకు తెలీడం నా కిష్టంలేదు. "

మేరీ వెళ్లిపోయింది. రాజేశ్వరి ప్రక్కతావస్థకు జాలేసింది. Quarters కి బయలుదేరాను. రూములోకి పోయాను. శాంతిలేదు. రాత్రివరకు బ్రతుకుతుందా? ఏసును ప్రార్థించా మనసులో. తలుపువేసుకొని పడుకున్నాను.

* * * *

ఎవరో తలుపుతట్టేరు. చర్చిలో గంటలు కొడుతున్నారు.

" లైలా ! "

తలుపు తెరచేను. మేరీ నించునుంది.

నాహృదయం కొట్టుకుంది. "ఆమె చనిపోయుంటుందా? ఎంతమంది మరణించుట లేదు " అనుకున్నాను.

" అతడు చనిపోయాడు. "

" ఎవరు ? "

" ఆవైశ్యుడు. Heart palpitation వల్ల చనిపోయాడు. "

" ఏవైశ్యుడు ? "

" నిన్నల్లరిపెట్టిన వైశ్యుడు. "

" ఎప్పుడు ? "

" ఎనిమిదిగంటలకి- డాక్టరు చెప్పేరు. "

మేరీ నాముఖంలోకి చూస్తూంది.

" మేరీ, నువ్వెందు కలా చూస్తావు ? "

" నీకు సంతుష్టిలేదా ?

" లేదు. ఆమె యెలా వుంది ? "

" తెలివివచ్చింది. "

ఏసును ధ్యానించా వొక్కసారి.

3

సాయంకాలము ఏడుగంటలకి కారిడరుమీద మేరీ కలుసుకుంది.

" వెళ్లిపోయాడా ? "

" ఎవరు ? "

" అతడు. "

" గంటక్రిందనే వెళ్లిపోయాడు. "

" ఆమె ఎలా వుంది ? "

" నీరసంజాస్తీగా వుంది. "

"............"

" నేను పోతున్నా. "

మేరీ వెళ్లిపోయింది. తనలో ఆత డెంత కలత జెందుతున్నాడో అనుకున్నాను. 'మావయ్యా, నిన్నెంతేడిపించి దామె ' అనుకున్నాను. 'నీ జీవితములో మరి శాంతిలేదేమో ' అని వలవల యేడ్చేను.

" లైలా ! "

కనులుతుడుచుకొని తిరిగి చూసేను.

డాక్టరు యెదుట నిలబడ్డారు. మాయిద్దరికీ యిల్లా సంభాషణ జరిగింది:

డా—ఏమి టాలోచిస్తున్నావు ?

నేను—ఆమెవిషయమై.

డా—ఈరాత్రికి గడిస్తే బ్రతకొచ్చు.

నేను—గడవదా ?

డా—రాత్రల్లా మేలుకోవాలి నువ్వు.

శూన్యదృష్టులతో అతని ముఖంకేసి చూచేను.

డా—అత డొచ్చేడు.

నేను—చూచేను.

డా—ఇప్పుడే వెళ్లిపోయాడు.

నేను—మేరీ చెప్పింది.

డా—ఆనందరావు నేనూ సహాధ్యాయులమని చెప్పేను.

నేను తెల్లబోయేను.

డా—కన్నుల నీరునించే డాతడు.

నేను మాట్లాడలేదు.

డా—నీ విక్కడున్నావని చెప్పలేదు.

నేను—ఇంతకాల మూరకున్నా డేమి ?

డా—Pregnancy అని యేమరి వూరకున్నారు. నీరసం అధికమైంది. డాక్టరుకి చూపెట్టేరుట. కడుపు కాదు. ఓవరియన్‌కిస్టు (Ovarian Cyst). ఆపరేషన్ చేయాలిసుంటుంది. హాస్పిటలుకి తీసుకువెళ్ల మన్నాడు.

నేను—డాక్టరు! నన్నేమిచెయ్యమంటారు ?

డా—ఆమెను కనిపెట్టివుండాలి. రాత్రి తప్పితే భయములేదు.

నేను—నే నామెమొగం చూడలేను. మేరీ వుండకూడదా ?

డా—ఆమెకు స్వస్థతగా లేదు...........
...ఆతనికోసము నువ్వు కష్టపడు.

డాక్టరు వెళ్లిపోయారు. నేనల్లాగే నించుండిపోయాను.

*   *   *   *

తలుపుతెరచేను.

"లైలా!"

దగ్గర కెళ్లేను.

"నే బ్రతుకుతానా ?"

"తప్పకుండా."

ఆమెచూపుల్లో ఆశ మందహాసంచేస్తూంది.

"ఆసంగతి ఆతనితో చెప్పేరా ?"

"చెప్పేము."

ఆమె సంతుష్టి జెందినది.

"అతడు వట్టి అమాయికుడు. రేపు మళ్లా వస్తారు."......"అందాకా ఉండనూ?"

"ఉంటారు."

ఆమె నాకేసి చూచింది. ఆమె చూపుల్ని మళ్లించుకొన్నాను.

"లైలా, యిల్లా రా. నాశరీరాన్ని పట్టుగో."
వెళ్లి ఆమె శరీరమును పట్టుగున్నాను.

"చల్లగా వుందికాదూ ?"

"లేదు."

"చలిగాలి వేస్తూంది, కిటికీ వేసిపెట్టు."

గ్లాసు ప్లేన్సు వేసీసేను.

"లైలా, నువ్వు రాత్రల్లా యిక్కడే వుంటావుకాదూ ?"

"ఊఁ."

"నీఋణము తీర్చుకోలేను......నీవు దేవతవు."

ఆమె యేదో గొణుగుకుంది.

"మీ రట్టే మాట్లాడకండి. పడుకోండి."

"పడుక్కుంటా...మీరుమాత్రంవెళ్లిపోవద్దు."

"వెళ్లను."

ఆమె కనులుమూసింది. వాచీ చూచేను. పదయింది. ప్రక్కని స్టూలుమీద కూర్చున్నాను. ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. ఆమెచేతుల్లో నే నేలాంటి బాధ లనుభవించేనో తలంచుకొన్నాను. 'కాల మెప్పుడూ యిల్లా వుంటుందా ?' అంటే...
"వుంటుం" దను ఆమెఅహంకార మిప్పు డేమయిందనుకున్నాను. 'రాజేశ్వరీ, యిప్పుడు నీలీలావతే నీకు గతయిందే' అనుకున్నాను. 'నీవు పొమ్మనిన యీలీల నిద్రమానుకొని యిల్లా కూర్చుంది.' ఆమెమొగంకేసి చూచేను. నిశ్చలంగా పడుక్కునుంది. 'రాజేశ్వరీ, నీవల్ల యెన్నో కష్టా లనుభవించానుకాని నీమీద నాకిప్పుడు కోపంలేదు.' ఆమె నిశ్చలాకారానికి భయము వేసింది. ఆమె బ్రతికుందా ? దగ్గరకు పోయి, నాడిపరీక్షించేను. రిస్టువాచీ చూచేను. పదకొండయింది. తలుపుతీసి కారిడరుమీది కొచ్చాను. నిశ్శబ్దంగా వుంది ఆప్రదేశమంతా. ఉదయిస్తోన్న చంద్రుణ్ణి చూస్తూ నించున్నా ఒకగడియ.

"లైలా...లైలా!"
త్వరగా లోపలికి పోయాను.

"లైలా!"

"ఏమి?"

" ను వ్వెళ్లిపోయావు...నేను చచ్చిపోతాను. "

" భయములేదు. "

" నీరసం జాస్తిగా వుంది. "

డాక్టరుపెట్టిన మందు గ్లాసులో పోసి ఆమెకు త్రావించేను.

" బలం చేస్తుంది. "

" ను వ్వెళ్లిపోకు. "

" లేదు. "

" నావిషయమై నువ్వు చాలా కష్టపడు తున్నావు. "

" నాకు కష్టములేదు. "

" నీపేరు లైలాకామా ?..."

" మీరు మాట్లాడకండి......నీరసం హెచ్చవు తుంది. "

" ఆమె నీయంతే వుండేది. "

" ఎవరు ? "

" మాలీలావతి. "

మంచము వదలి నేను లాకరుకేసి పోయాను. ఒళ్లు వణికింది.

" ఇప్పు డామె యెక్కడుందో... "

" మీరు పడుకోరూ ? "

" పడుకుంటా. "

ఆమె కనులుమూసింది. నేను బయటబడ్డాను. " రాజేశ్వరీ, ని న్నెన్నోమాట లంటున్నాను. ని న్నిప్పు డేమీ అనకూడదు. " అనుకున్నాను. " మావయ్యకు ని న్నప్పజెప్పగలనా ? " అనుకున్నాను. ఆమె నెల్లాగో బ్రతికించుకోగలనని ధైర్యం వహించేను. క్రిందికి చూచాను. ఆయాలు అక్కడక్కడ మేలుకొని వున్నారు.

అల్లా నించున్నా.

ఒంటిగంట కొట్టేరు.

*   *   *   *

రెండు.

*   *   *   *

మూడు. అలాగే వున్నా, ఆచలిగాలిలో.

*   *   *   *

నాలుగు.

గదిలోకి పోయాను. ఆమె లేవలేదు. శరీరము పరీక్షించేను. చల్లగా వుంది. నాకు భయంవేసింది. నాడి మాత్రం వుంది. అరగం టయింది. ఆమె కదిలింది.

" లైలా! "

" ఎందుకు ? "

" దగ్గరకు రా. "

" ఏమీ ? "

" నాకు భయంవేసింది. "

మందు త్రావించేను.

ఆమె నాముఖంలోకి చూచింది.

" లీలావతీ, నువ్వే ! ! "

ఆమె మూర్ఛపోయింది.

నాకు మతిపోయింది.

స్టిములెంటు మిక్ప్చరు (Stimulent mixture) త్రావించేను. అయిదునిముషాలు చూచేను. ఆమెకు తెలివి రాలేదు. పైకి వచ్చాను. గ్రుడ్డివెన్నెల కాస్తోంది. Duty డాక్టరుకి ఫోనుచేసా. అయిదునిముషాలలో డాక్టరొచ్చారు.

" లైలా, ఆమె కేమీయు భయములేదు."

" బ్రతుకుతుందా? "

" తప్పకుండా. "

*   *   *   *

౪

రూముకొచ్చి యెల్లా పడుకున్నానో. తెలి వొచ్చేసరికి మూడయింది. మేరీగదికేసి వెళ్లేను. ఆమె అప్పుడే వెళ్లిపోయింది. నాగదిలోకి పోయి టెలిఫోను తీసేను.

"మేరీ!"

"ఆఁ."

"డాక్టరుగారెక్కడున్నారు?"

"ఇంకా రాలేదు."

"ఆమె యెల్లావుంది?"

"నయంగా వుంది."

మనసు సంతుష్టిపడ్డాది.

అరగంట పోయింది.

టెలిఫోనుగంట మ్రోగింది.

"ఎవరు?"

"మేరీని."

"ఎందుకు?"

"సత్యనారాయణగారొచ్చేరు. వెళ్లికలుసుగో."

Dress వేసుకోని బయలుదేరాను హాస్పెటలుకి. గదిలో డాక్టరుగారూ, ఆయనా మాట్లాడుతున్నారు. లోపలికి వెళ్లాను. ఆయన పరికించి చూచేడు.

"లీలావతీ!"

"అవు" నన్నాను.

ఆమె నన్ను పిలిచింది.

దగ్గరకు పోయాను. ఆమెజాలిచూపులు రక్తిమవహించేయి.

"లీలా...నిన్నెన్నోకష్టాలు పెట్టేను. నిన్ను దిక్కుమాలినదాన్ని చేసా......అట్టి నన్ను రక్షించావు. నన్ను క్షమించు. చిన్నదానివైనా నీకు భక్తిపూర్వకంగా నమస్కారము చేస్తున్నా."

ఆమె చేతులు జోడించింది.

నాహృదయము కరగిపోయింది.

ఆమెచేతులు విడదీసా.

"నీ పవిత్రత నే గ్రహించలేకపోయాను. నేను దురదృష్టవంతురాలిని......ఇంటికి వెళ్లిపో రా."

"నాకు కష్టమని తోచినపుడు వస్తాను."

అతనికేసి చూచేను. వలవల యేడుస్తున్నాడతడు.

"మావఁయ్యా, నీవు దుఃఖించవద్దు. నాకిక్కడ సుఖముగానే వుంది."

అతడు సెలవుతీసుకొని వెళ్లిపోయాడు. నెల రోజులలో రాజేశ్వరికూడా వెళ్లిపోయింది. వెళ్లిపోయేటప్పుడు రమ్మని బ్రతిమాలింది. అదే జవాబు చెప్పేను. కాని యిప్పటికింకా యీపవిత్రజీవనమే చేస్తున్నాది లైలా.

శీఘ్రావృతి (చిత్రకారుడే బ్రహ్మాయైనచో) ౧: సంగీతమన్న యిష్టములేనివాడు



సూరన

ఉభయభాషాప్రవీణ, అయినంపూడి గురునాథరావు

౧

చలువయుఁ గోమలత్వమును సౌరభమున్ మధురత్వ మొక్కటన్
గలిగి యపూర్వమైచను నొకానొకవస్తువుఁ బోలి ముద్దులన్
గులికెడు సత్కవిత్వమునకున్ దెరువుల్ సరిదీర్చి యింపుమై
నలలితకీర్తిఁగొన్న కవిచంద్రుని సూరనఁ బ్రస్తుతించెదన్.

౨

కవితాభిజ్ఞను భావికాలకవికిన్ గల్పింపఁ దత్పూర్వస
త్కవిరాణ్ణిర్మితకావ్యమార్గముల స్వాతంత్ర్యమ్ము దీపింపఁగా
నవరింపన్ దలపెట్టి నవ్యకవితాసామ్రాజ్యధౌరేయతన్
స్తవనీయంబుగఁ గొన్నసూరనకవీంద్రా, నీకుఁ గేల్మోడ్చెదన్.

౩

కవితారీతిరహస్యమంతయును సాకల్యంబుగా నేర్చు మే
టివి; కానన్ మృదులప్రబంధముల మూఁటిన్ మూఁడుమార్గమ్ములన్
గవులెల్లన్ వినుతింపఁ గూర్చి యసమఖ్యాతిన్ గనంజాలి తీ
యవనిన్ గైతను నీకుసాటి కవిధీరా, నీవ వేయేటికిన్.

౪

భావముమించు శైలియును, భాసురశైలినిమించు భావముల్
ప్రోవయి వన్నెగూర్పఁగ నపూర్వఫురీతులు సొంపునింపఁగాఁ
గేవలకల్పనాకథ లిఖించి కవీంద్రులమెప్పుగొన్న నిన్
భావమునన్ స్మరింతు ననివారితధారకు నోయి సూరనా!

౫

నీసమకాలికుండగు మనీషియ షేక్స్పియరున్; మహోన్నతిన్
భాసిలుచుండ్రు మీరు శశిభాస్కరులట్టుల నెప్డు వాఙ్మయా
కాశమునందు; ఆవిమలకాంతిని నేఁడు కవిత్వయాత్ర నా
యాసములేక సల్పి చరితార్థులుగారె కవీంద్రు లెల్లరున్.



డచ్చికోట శిథిలములు, అంజెంగోవద్ద

శాంపిల్సు ఉచితము.

సహజమైన హెయిర్ టానిక్ తో మీ శిరోజములకు అందమును తెచ్చికొనుడు.

కామినియా నూనె (రిజిస్టర్డు)

శిరోజములకును, మెదటికిని, యిది చాలా శ్రేష్ఠమైన నూనె. చలువ నొసగు పదార్థము లనేకము మిళితమై యున్నవి. కామినియానూనె మాడుపట్టును శుభ్రపఱచి, శిరోజ బీజములకు బలము నిచ్చి, వెంట్రుకలను పట్టువలె బాగుగా పెంచును. మంచి పరిమళ మిందు చేర్చబడినది. దీని నుపయోగించిన ప్రకాశవంతమగు శిరోజము లేర్పడును.

నేడే ఒకబుడ్డిని పరీక్షింపుడు. వెల బుడ్డి రు. **1-0-0**, 3 బుడ్లు రు. **2-10-0.**

వి. పి. ఛార్జీలు ప్రత్యేకము.

పోస్టేజినిమిత్తం ఒకఅణాస్టాంపునుపంపిన శాంపిలును ఉచితముగా బడయగలరు.

పరిమళ రాజు

ఓటో దిల్ బహార్ (రిజిస్టర్డు)

OTTO DILBAHAR.

దీనికి సాటియైనది లేదు. దీని పరిమళము యింపుగాను, ఆనందదాయకము గాను యుండును. వాసన బహుకాల ముండును. కొన్ని బొట్లు మీ చేరుమాలుమీద వేసి చూడుడు. మీ చుట్టును అద్భుతమైన పరిమళ మీనుచుండును.

వెల ¼ ఔన్సు రు. 1-4-0. 1 డ్రాము సైజు 0-12-0 అణాలు.

వి. పి. ఛార్జీ ప్రత్యేకము.

పోస్టేజినిమిత్తం రెండుఅణాల స్టాంపులను పంపి శాంపిలును ఉచితముగా పొందుడు.

ఆసియాలో ప్రధాన సబ్బులు

కామినియా టాయిలెట్ సబ్బులు

వాడుకలో పోడిమి.

ధరలో పోడిమి.

పరిమళ మానందదాయకము.

రకము అసమానము.

నానావిధ పరిమళములందును దొరకును

కామినియా ట్రాన్సుపరెంటు గ్లిసరిన్ సబ్బు.

కామినియా లవండరు సబ్బు.

కామినియా చందన సబ్బు.

కామినియా వైట్ రోజ్ సబ్బు.

దిల్ బహార్ సబ్బు.

ఈ సబ్బులు మీకు సంపూర్ణసంతృప్తి నొసగగలవు.3 బిళ్లలుగలపెట్టె 1-కి 0-15-0. వి. పి. ఛార్జీలు ప్రత్యేకము

మీకు సమీపములోగల దుకాణములో అడగండి లేక మాకు వ్రాయండి.

కొనునపుడు ప్రతిపెట్టెమీదను కామినియా అను పేరుండుట గమనింపుడు.

ఈపేరు స్వచ్ఛతకును, గుణమునకు గ్యారంటీ నిలచును.

సోల్ ఏజెంట్లు:—ఆంగ్లో-ఇండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెనీ,

నెం. 285, జుమ్మామసీదు, తపాలాపెట్టె 2082, బొంబాయి.

శాంపిల్సు ఉచితము.

కుసుమాల్ హెయిరాయిల్ (రిజిస్టర్డు)

శిరోజములకు, మెదటికి, శాకములతోచేయబడిన సహజమైన నూనె. శిరోజబీజములను కాపాడి, మాడుపట్టును శుభ్రముగాను ఆరోగ్యముగాను ఉంచును. ఇందు చలువనిచ్చుపదార్థములు మిళితమై యుంటచే ఆలోచనాపరుల కద్వితీయముగా పనిచేయును. మంచి పరిమళము గలది.

వెల బుడ్డి 1-కి రు. 1-0-0.   3 బుడ్లు రు. 2-10-0.

వి. పి. ఛార్జీలు ప్రత్యేకము.

ఉచిత శాంపిలుకొరకు ఒకఅణా స్టాంపును పోస్టేజినిమిత్తమై పంపుడు.

కేటి వైట్‌రోజ్ హెయిరాయిల్ నెం. 777 రు (రిజిస్టర్డు)

తాజా గులాబిపుష్పముల పరిమళమందు ప్రతిబింబించియున్నది. మెదటికి చలువనిచ్చును. శిరోజములకు మంచి టానిక్.   వెల సీసా 1-కి 0-14-0 అణాలు.

వి. పి. చార్జీలు ప్రత్యేకము.

కొనునపుడు నెం. 777 రును గుర్తించి కేటి వైట్‌రోజ్ హెయిరాయిలునే కొనుడు.

నమూనాలను అంగీకరింపకుడు.

కేటి ఓటో రోజ్ నెం. 777 రు (రిజిస్టర్డు)

మంచి తాజా గులాబీపుష్పముల పరిమళము గల యత్తరువు. ఎక్కువకాలము వాసనపోకయుండునట్లు బాగుగా తయారుచేయబడినది. ఒకసారి పరీక్షించిన మీకే తెలియగలదు.

వెల ¼ ఔన్సు బుడ్డి రు. 1-0-0.   వి. పి. ఛార్జీలు ప్రత్యేకము.

పోస్టేజినిమిత్తం రెండణాల స్టాంపులను పంపి ఉచితశాంపిలును పొందుడు.

కామినియా స్నో

శరీరమున కుపయోగించుటకు శాస్త్రీయముగా తయారైనది. మొటిమలు, పొక్కులు, మచ్చలు మున్నగువాటిని తొలగించి, ముఖవర్చస్సులో సౌందర్యమైన నవయౌవనమును నెలకొల్పును. చర్మమును మృదువుగాను, ప్రకాశవంతముగాను చేయును. మనోహరమగు పరిమళము కూడినది.

వెల బుడ్డి 0-12-0 అణాలు.   వి. పి. ఛార్జీలు ప్రత్యేకము.

సోల్ ఏజంట్లు:—**ఆంగ్లోఇండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెనీ,**

నెం. 285, జుమ్మామసీదు, తపాలాపెట్టె నెం. 2082. బొంబాయి.

ఉరిశిక్ష

తంగిరాల రాధాకృష్ణయ్య, బి. ఏ., బి. యల్.

౧



ఉస్సురుమని లేచి కూర్చున్నది. వీరమ్మకు ఆవేదన దుర్భరమయింది. పగలో రాత్రో కూడా తెలీలేదు. మూడురోజుల నుంచి నిద్రకానీ, ఆహారంకానీ లేనప్పుడు ఎట్లా తెలీడం? కునికిపాటు పడిందో లేదో, ఎవరో తనరొమ్ముమీద కూర్చొని గ్రుద్దుతూవున్నట్లయింది. ఇటు కండ్లు తెరిస్తే ఊపిరాడటం లేదు. ఏమంటే ఏముంది? ఏదో పీడకలకాబోలు అని సర్దుకొనేదే. అయితే అట్టిసమాధానమామెకు నచ్చలేదు. అబ్బా! అని పైకి చూచింది. చూస్తే ఏముంది — నిరామయం — నిర్భేద్యమైన జెయిలుగోడలు ఆమెనుప్రక్క-చూచి వాక్రుంగ చేసాయి. ఒక సన్న రంధ్రము మాత్రము కప్పవద్ద కనుపడ్డది. అరచేతి వెడల్పు వుందో లేదో, దానికీ నాలుగు గడ్డపారల లాంటికమ్మీలు అడ్డం బిగించి

వున్నాయి. దాన్ని చూచేటప్పటికి, ప్రపంచానికీ నాకు, ఇదొక్కటైనా సంబంధం వుంది కదా అనిపించిం దామెకు. ఉత్తరక్షణంలోనే దిగులు కలిగింది. ప్రపంచమంటే తనకేమి మొఖమాటం—తనకూ ప్రపంచానికీ ఏమిసంబంధము? ప్రపంచంలో వుండతగనిదనిగదా ఆమెకు ఈ వురిశిక్ష విధించారు—ఈవిష వృక్షాన్ని పెరగనీయకూడదని, ఇట్లాంటిముళ్ల కంచెలను లాగేస్తే దేశాన్ని మరామ్మతు చేయవచ్చునని.

౨

ఇంతలో తనకు ఎదురుగ్గా గోడమీద మసుగ్గా వెలుతురు కనుపడ్డది. వెన్నెలతునక పైరంధ్రంనుంచి లోపల జొరబడ్డది. పేరమ్మకు ఆవేదన ఇంకా జాస్తిఅయింది. ఈ చంద్రబింబం తనమంచికేనా వచ్చింది? ఈ వెన్నెలకు ఈ దీనురాలితో ఏమి అవసరం? లోకానికంతా రోతఅయిన యీ పేరమ్మను కూడా యీ వెన్నెల ఎందుకు కనుక్కోవాలె? ఇంకా తనకు దేముడిసంగతి ఏమైనా జ్ఞాపకంచేయడానికి వచ్చిందాఏమి?—ఛీ— తనకూ దేముడికీ ఇలాకా ఏమిటి?—

3

ఇంతలో జెయిలువెలుపల పారాజమాను కేక వినబడ్డది. జెయిలులోనుంచి ఎవ్వరూ తప్పించుకొనిపోకుండా కాపుదలచేస్తూ వున్నాడు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం. తనేనా తప్పించుకపోయ్యేది! తప్పించుకపోయేటట్లయితే యీ శిక్షలు కమామిషి ఎందుకూ? ఆహా! తప్పించుకుంటే!— ఒళ్లు పులకరించింది. మళ్లీ తనవూరు, తనవాండ్లు-హాయిగా, నిశ్చింతగా కాలంగడపవచ్చు. తనతో ముద్దాయిగావుండి తప్పించుకొన్న కోటయ్యమొఖమైనా చూస్తుందా. అరే!— కోటయ్య!— పదేళ్లుగా నమ్మించి తనతో సుఖించి, ఒకటిగా నుండి, ఆఖరుకు కష్టాలువచ్చి యీ కేసు పైనబడేటప్పటికి నేరమంతా యీపె మీదికి తోసి తప్పించుకుపోయినాడు. అబ్బా! అసలు నేరంచేసింది వాడే—తను అమాయకురాలే. తెలీక కోటయ్యను నమ్మి అతను చెప్పినట్లు చేసేటప్పటికి యింతముప్పు వచ్చింది. ఇంక ఆకోటయ్య మొఖాన ఉమ్మిఅయినా వేస్తుందా. అప్పుడు చివుక్కున ఆమెకు రామస్వామిసంగతి జ్ఞాపకంవచ్చింది. అయ్యో, ఎంతయోగ్యుడు రామస్వామి! అట్టిపెద్దమనిషిని చంపించినాడే కోటయ్య. తనో, తను ఏమర్మం ఎరుగదుగా మరి. కోటయ్య రామస్వామికి ఎప్పుడూ తెచ్చియిచ్చినట్లు ఆవేళ కూడా తెచ్చాడు మందు. పేరమ్మను కలిపి యియ్యమన్నాడు. పేరమ్మ యీ మందుకలిపి యిచ్చినగంటలో రామస్వామి ఎగిరిపోయినాడు. ఇంతలో వారు వీరు, పోలీసులు మేస్త్రీటులు, అంతావస్తే, మరి యీ పిచ్చి పేరమ్మ, "అవును నేనే మందుయిచ్చాను; మరి యిట్లయింది" అన్నది. అంతకంటె ఏంగావాలి?— పోలీసువారు "పేరమ్మ రామస్వామికి విషంపెట్టి చంపిం"దని ఛార్జీపెట్టారు. మేస్త్రీటుగారు

"ఓయబ్బో, ఇంత పెద్ద కేసుగావుందే" అని జిల్లా జడ్జిగారికి పంపించారు. జిల్లాజడ్జిగారు "ఏమీ లేకుంటే నాదాకా ఎందుకురా వచ్చిం" దని ఉరిశిక్ష వేశారు.

౪

బయటపడితే మళ్లీ తనవూరికి వెళ్ల వచ్చు. వెళ్లి తనతల్లితో సుఖంగా ఉండ వచ్చు. ఇంక పేటకు చస్తే రాననుకుంది. తన వెయ్యిరూపాయలసొమ్ము కోటయ్యవద్దనుంచి లాక్కొని వూరికెళ్లి తల్లితోపాటు సేద్య ప్పనులు చేసుకోవాలి. ఛ! ఈపేటవాండ్లను నమ్ముకుంటే ఇంతే. ఉన్నన్నాళ్లు ఉండి పొయ్యే టప్పుడు కొరివి ఒకటి కాల్చిపెట్టిపోతారు. కొరివి అనుకోగానే ఆ వెన్నెతునక మరచి పోయిన తనకండ్లకు మళ్లీ కనుపడ్డది. ఈ మూడురోజుల జాగారం దృగ్గోచరం అయింది. మళ్లీ ఊపిరాడలేదు. బయట అయితే శుభ్ర మైన గాలి అయినా తిని బ్రతకవచ్చు. ఈవేడి బరువుగాలి! ఎట్లాగా మనుషులుంటారు ఇక్కడ! పొంగిపొంగివస్తూన్న తనమనోభా రాన్ని వదిలించుకోడానికి గోడలైనా వినేవి కావే. ఇట్లా ఇంకా ఒకటిరెండురోజులు ఉండ గలుగునా! ఉరిశిక్షఅంటే ఇదేకాబోలు. ఇంకా ఉరిశిక్ష ఏమిటి?—

౫

పేరమ్మకు తట్టిలేపిన ట్లయింది. కండ్లు తెరిచేటప్పటికి మధ్యాహ్నము అయింది కాబోలు, జెయిలువార్డరు మూకుడులో సంకటివేయించి మంచిసెబ్బరలు కనుక్కొని పోతున్నాడు. పేరమ్మకు విసుకుపుట్టింది. ఆ మూడురోజులనుంచి తనకుగా వేస్తున్న సంకటి అట్లనేవుంది, ఎందుకు వీరి కీబాధ? గుండె రాయి చేసుకొని పేరమ్మ జెయిలువార్డరును అడిగింది.

"నాయనా, ఎప్పుడు—"

ఎంత కఠినుడికైనా మనసు కరుగు తుంది. ఎంతఘోరకలి, ఎంత క్రూరమైన నేరముచేసినా, అతనిని శిక్షించవచ్చేటప్పటికి అయ్యోపాపం అనిపిస్తుంది. ఆజెయిలువార్డరు ప్రొద్దునలేస్తే మనుష్యాకారాల్లోవుండే క్రూర మృగాలనూ, నాగుబాములనూ చూస్తూ వుండడమేకాని సిసలైన మనుష్యులను ఆట్టె చూడడం తటస్థించదుగా! అందుచేత అతను జాలిఅంటే ఏమిటోకూడా మరచిపోయినాడు. గిర్రుమనితిరిగి ఇంకావుంటే ఏం మాట్లాడవలసి వస్తుందో అన్నట్లుగా అతడు వెళ్లిపోయినాడు.

౬

ఇట్లా జరిగింది, కొన్నినెలలు. పేర మ్మకు పిచ్చెక్కింది. ఆకలిఅంటే ఏమిటో మరచిపోయింది. ఇక్కడ తన్ను తిట్టేవాండ్లు గాని, కొట్టేవాండ్లుగాని ఎవ్వరూలేరు. తన జోలికి వచ్చేవారు లేరు. తనసంగతి అను కొనేవారు లేరు. అంతకంటె ఈ జీవశాంతికి కావలసినదేమిటి? అట్లాఉండడంలో, తన్ను భగవంతుడికి సూటిగా ముఖాముఖి నిలపెట్టా రన్నమాట. అయితే కండ్లు విచ్చిచూచుటకు

పేరమ్మకు ధైర్యము లేదు. శక్తి చాలలేదు. సూర్యుణ్ణి ఎకాఎకి చూడడానికి సామాన్య మాత్రులకు చేతవుతుందా? గాఢాంధకారాన్నిమాత్రం మనోధైర్యం, ఆత్మశక్తి లేని వారు ఓర్వగలరా?

౨

ఒకనాటి సాయంకాలం జెయిలు వార్డరు పేరమ్మనుంచే గుహాతలుపు తటాలున తీయించాడు. తీయించి పేరమ్మను లేపి —“నీశిక్షను హైకోర్టువారు తొలిగించారు. నిన్ను విడుదల చేయడమైంది” అన్నాడు; తనకు వూరికి చేరుటకుగా రైలుఛార్జీ యిచ్చి, జెయిలుబయటికి వెళ్లగొట్టాడు. ఆరోజు ఉరిశిక్ష చెప్పినప్పుడు నిలుచున్నమనిషి నిలుచున్నట్లుగానే పడిపోయింది. ఇప్పుడుకూడా నిశ్చేష్టయై అట్లనే పడిపోయింది. ఇంచుక తెలివిరాగానే కాళ్లీడ్చుకుంటూ వూళ్లోకి బయలుదేరింది. తన్ను పలకరించేవారు లేరు. తనసంగతి అనుకొనేవారు లేరు. మతిపోయిందై ఏమిచేయుటకు తోచక నేరుగా రైలుస్టేషనుకు వెళ్లి, పేటకు టిక్కట్టు తీసికొన్నది. రాత్రి ౮ గంటలకు వాండ్లపేట చేరింది. సరాసరి కోటయ్యయింటికి వెళ్లింది. వెళ్లితే ఏముంది? ఇల్లు తాళంవేసివుంది. గుండెలో రాయిపడ్డది. అక్కడే ఆ ఇంటి ఖామందు పండుకొనున్నాడు. ఆయన్నడిగింది,“కోటయ్య ఎక్కడ, ఏమైనా” డని. ఆయన పేరమ్మను చూచి ఉసూరుమని నిట్టూర్పు విడిచాడు, ఏం పేరమ్మా అని. పేరమ్మవచ్చిన సంగతి తట్టేటప్పటికి నిర్ఘాంతపోయినాడు. పేరమ్మ ఏమిటి, మళ్లీ రావడమేమిటి? చచ్చినవాండ్లు ఎక్కడైనా మళ్లీ లేచివస్తారా! — అతని కంతా చోద్యంగా తోచింది. ‘ఏం పేరమ్మా, నిన్ను వురితీశారుగదా, ఎట్లావచ్చావు’ అన్నాడు, నిద్రకత్తలలో ఇంకా కండ్లుపులుముకుంటూ. పేరమ్మ తనసంగతంతా చెప్పింది, భారం తగ్గేటట్లు. అప్పటికి అతనికంతా తెలిసి—‘ఆహా! అట్లాగేం’ అన్నాడు. పేరమ్మ ఆమాట ఈమాట చెప్పి మళ్లీ కోటయ్య సంగతి అడిగింది.

“కోటయ్యా—కోటయ్య ఆ మరునాడే వూరు వదిలిపెట్టి వెళ్లాడుగా దేశంమీదికి— నీసొమ్మయావత్తు ఆరోజే అమ్ముకొనిపోయినాడు. ఎక్కడపోయినాడో మళ్లీ కంటి కవుపడలేదు. రంగం వెళ్లాడేమో ననుకుంటున్నారు.” అని అన్నాడు మహాకష్టంతో.

పేరమ్మకు మాట రాలేదు. అరగంటసేపు కొయ్యబారి కూర్చుంది. ఉండి ఉండి,

“ఊరికిపోయి మాఅమ్మను చూచివస్తా, ముసిలిముండ ఎట్లాఉందో” అంది.

“ఆఁ. చెప్పడం మరచిపోయినా. మీ అమ్మ చచ్చిపోయిందిగా! మీయిల్లు మీ వూరిమునసబు అదెందుకో ఏలం వేయించాడట” అన్నాడు.

పేరమ్మ నిశ్చేష్టురాలయింది.

ఇంతకాలానికిగా ఇప్పుడు ఆకలయింది. ఇన్నాళ్లనుంచి ఎక్కడపోయిందో. ఒక్క ముద్దయినా తినంది ఉండలేదు ఇంక. అన్నం

పెట్టించమని అడిగింది, ఆముసల్దాణ్ణి. పట్టకపట్టక పట్టినని్ద్ర పాడు చేసిందని తిట్టుకుంటున్నవాడు విసుక్కొని,

"ఇప్పు డేమన్నం, నా పిండాకూడు. చాల్చాలే, నా నిద్ర కాస్తా పాడుచేసావు పోపో" మ్మన్నాడు.

పేరమ్మ తన బలమంతా పోగుచేసుకొని లేచింది. ఏమీచేయడానికీ తోచలేదు. ఇశ్శబ్బా— అన్నం అడుక్కోడంకూడా తెలీదు. అదిమాత్రం చేతకా వద్దూ. బజారునపడిపోయి, పెద్ద శెట్టి మేడవాకిట నిలుచొని "అన్నంపెట్టమ్మా" అంది. లేదు పొమ్మని ఇంట్లోనుంచి కేక వచ్చింది. మళ్లీ అరిచింది. ఇంట్లో నుంచి ఒక ముసలావిడె, కొట్టే టట్టుగా వచ్చి. "నీకేం బుద్ధి లేదూ— బేహా— నీకుగాదూ చెప్పేది— దున్నపోతా" అని శరపరంపరలుగా కురిపించింది.

౮

పేరమ్మ వీధిమధ్యకువచ్చి కూలబడ్డది. లోకానికి తనయందు ఎందుకో ఇంతవిరోధం. నిమేష మాత్రం "ఇంతకంటే జెయిలే మేలేమో" ననిపించింది. ఉరే పోయి. అట్లాగే ఆకాశంవంక చూచింది. ఎందుకు చూచిందో తనకు తనకే తెలీదు. అప్పుడైనా దేముణ్ణి తలుచుకుందో లేదో చెప్పజాలదు. మిణుకు మిణుకు

మనే నక్షత్రాలను చూచింది. చల్లని గాలి సోకింది. ఛ! తాను తప్పించుకొందిగా ఉరికిశీ—చల్లనిగాలి కొట్టేటప్పటికి పై ప్రాణాలు పైకివచ్చాయి, పేరమ్మకు. అంతకు ముందు అన్నము ముట్టడానికిగూడా అసహ్యించుకున్న యీ పేరమ్మ, యిప్పుడు తనఆకలిని ఏమైనా చంపుకోగల్గిందా? అయితే ఎంత అసహాయురాలైనా తనచుట్టూ కోటగోడలు లేవు ఇప్పుడు. బరువుగాలి ఇప్పుడు తన్ను అణచడంలేదు. ఎటుచూచినా విశాలప్రపంచం కనుపడ్డది. తనకు తెలీకుండానే తన కడుపు నిండింది. అరకన్ను వేశి వెనక్కుపడ్డది, "అబ్బా—ఇదేచాలు" అని. ఆనిద్ర నుంచి ఎప్పుడులేచిందో, ఎట్లా లేచిందో ఎవరు చెప్పగలరు?

తుంగభద్రానది

శ్రీ విరూపాక్షాలయము ప్రక్కను సన్నని కొండలోయలో ప్రవహించుచున్నది.

(హంపి శిథిలములు)

—కే. యల్. నరసింహాచార్యులు, గుంతకల్లు.

వినోదశిల్పము

కుట్టుపని

కో. నరసింహాచారి

బట్టలపై అలంకారరూపములను కుట్టుట

రంధ్రముల అట్టలపై అలంకారరూపములను కుట్టినవిధముననే బట్టలపైగూడ కుట్టవచ్చును. అట్టపై కుట్టునప్పుడు అందలి రంధ్రములు కొలతలకై తోడ్పడునట్లు, బట్టపై కుట్టునప్పుడు వలవంటి యొకగుడ్డ (Canvas-చిత్రము D) యొక్క సహాయ మావశ్యకము. ఇంతమాత్రముకాక చిత్రములు A B లందు చూపబడినట్టి రెండువిధముల కొయ్య వలయములుకూడ కావలసియుండును.

కొయ్యవలయములు, లేక ఉంగరములు

A వలయము కోతలేక ఒకే ఉంగరముగా నుండును. B వలయము A ను చుట్టి రాదగి, ఒకకోతను కలిగియుండును. కోత వలయమును బిగించుటకును, వదలించుటకును వీలగునట్లు ఒక మరచీల బిగింపబడియుండును (చిత్రము B S) వలయములు ౬", ౭", ౮", ౯" లేక ౧౦" వ్యాసము గలవిగా నుండి వ్యాసమునకు దగినట్లు వెల కలిగియుండును.

వలగుడ్డ (Canvas)

చిత్రము D యం దుండునది వలగుడ్డ. ఇందు పడుగు, పేకదారములు, జంటలుగా నేయబడియుండును. పడుగును, పేకయు చేరుచోట (చిత్రము D, ౧, ౨ వలె) ఒక మూల (Cross) ఏర్పడును. ఈక్రాసులే, రంధ్రముల అట్టలోని రంధ్రములవలె, కుట్ల ఎన్నికలయందు తోడ్పడును. రంగుదారములతో కుట్టునపుడు, ఒక్కొక్క వరుసకు ఇన్నిక్రాసులని లెక్కించుకొని కుట్టుచుపోవలెను.

కుట్టు విధము

కుట్టవలసిన బట్టను దీసికొని, దానిపై వలగుడ్డను, సరిగా చేర్చిపెట్టుకొని, ఈరెండింటిని A వలయముపై చదరముగా మడతలేక పెట్టవలెను.

పిమ్మట B వలయములోని మరచీలను వదలించి, దానిని బట్టను పరచియుండు A వలయముపై పెట్టి, అదిమినయెడల రెండువలయములును ఒకే మట్టమునకు వచ్చి బట్టను బిగువుగా లాగి పట్టుకొనును. వెంటనే మరచీలను బిగించినయెడల బట్ట చదరముగాను, బిగువుగాను అమరును (చిత్రము C).

తర్వాత కుట్టుట ప్రారంభించవచ్చును. దారపుకొన ఎల్లప్పుడును బట్టకు అడుగు ప్రక్కనే ఉండునట్లు చూడవలెను. దారము చాయపోని రంగులు గలిగియుండవలెను. పట్టుదారము శ్రేష్ఠము. చిత్రములు, E, F, G లయందు చూపినవిధమునను, ఇంక ననేకవిధములగు రూపములను కుట్టవచ్చును. అన్ని రూపభేదములును ఒక్కొక్క వరుసలోని క్రాసుల సంఖ్యలయందలి మార్పులనుబట్టి ఏర్పడును. వలయముపై బిగింపబడిన భాగమందంతయు కుట్టినతర్వాత, B వలయమును వదలించి, బట్టను జరపి మరల ఆవలయమును బిగించుకొని, కుట్టును సాగించవలయును.







D



E

C





F



G

కుట్టు పూర్తియయినతర్వాత, వల టిగా లాగివేసినయెడల రంగుదారముల కుట్లు గుడ్డనుమాత్రము జాగ్రత్తగా కత్తరించి మాత్రముఅడుగునగల బట్టపై నిలచును. అందలి పడుగు, పేకదారములను ఒకటొక

(All rights reserved)

మొహెంజొదారో ప్రాచీన నిర్మాణావిష్కరణ చిత్రములు



నిర్మాణముల స్థూలచిత్రము



౨. మధ్యయుగపు కట్టడ మొకటి

తాజ్ మహాలు

క్రమధాటి జానకీగిరి

క్రీస్తుశకము ౧౬౦౭ లో, షహజహాను ౧౫ వత్సరముల బాలుడై యున్నప్పుడు (యువరాజ కురామ్) అతనితండ్రి జహాంగీర్ చక్రవర్తి కుమారునికి వివాహ మహోత్సవము జరుప నిశ్చయపరచెను. కన్య, నూర్జహాన్ సోదరుడైన ఆసాఫ్‌ఖాన్ అనువతని పుత్రిక. ఈమెకు తలిదండ్రులుంచినపేరు, "అర్జమంద్ భాను బీగమ్". "ముంతాజ్ మహల్" ('మందిర జ్యోతి'— The Light of the Palace) అనునది తరువాత ఆమెభర్తచే నొసగబడిన ముద్దుపేరు. నిశ్చితార్థమైన ఐదుసంవత్సరములకు, అనగా ౧౬౧౨ లో ఈపవిత్రకార్యము అతివైభవముగా జరుపబడెను. అప్పటికి వరునివయస్సు ౨౦ వత్సరములపై మూడు మాసములు. కన్య వరునికంటె సంవత్సరమే చిన్నది. వివాహమైన పందొమ్మిది వత్సరములలోపుగా, ముంతాజ్ బీగము ౧౪ మంది బిడ్డలను కని, తుదకు కడపటిబిడ్డను ప్రసవించునప్పుడు 30 గంటల దీర్ఘకాలప్రసూతిబాధ ననుభవించి, ౧౬౩౧-వ సంవత్సరము జూన్ నెల ౭-వ తేదీ మంగళవారమునాడు బర్హాన్‌పురమునందు పరమపదించెను.



౧. తాజ్ మహాలుయొక్క సింహద్వారము

తాజ్ బీగము మరణము

ఇందు చెప్పెడి తాజ్ బీగముయొక్క మరణవృత్తాంతవివరణము, కుదాబక్ష్ పుస్తకాలయమునందు, పర్షియాభాషలో చేతితో వ్రాసిన ఒక అపూర్వమైన పుస్తకమునందు చెప్పబడియున్నది.

షాహజహానుకు దారా, షూజా, ఔరంగజేబ్, మురాద్ అను నల్వురుపుత్రులేకాక రోషన్-ఆరా, గైతి-ఆరా, జహా-నారా, గోహర్-ఆరా అను నల్వురు పుత్రికలుగూడ నుండిరి. కడగొట్టుబిడ్డను ప్రసవించుటకు ముందు, బీగము గర్భమందలిశిశువు యేడ్చినట్లు వినబడెనట. ఆరోదనశబ్దము వినినతత్క్షణమే ముంతాజ్‌కు తన జీవములపై నిరాశ జనించెను. ప్రేమనిధియైన భర్తను సమీపమునకు రా బిలిచి "ప్రభూ, నా అంతము సమీపించినది. గర్భస్థశిశువు రోదించినపిదప, ప్రసవానంతరము దానితల్లి అసువులుబాయుట లోకవిదితమే కదా! అందుచే నే నిక ఈమర్త్యలోకమును విడిచి శాశ్వతప్రపంచమున కరుగుచున్నాను. నీయెడ నే నేనే అపరాధములు చేసియుండిన మన్నించి, నా అంత్యప్రయాణమున కనుజ్ఞ నొసగుము" అనియు, తన అంతిమపు కోర్కెల రెంటిని చెల్లింప ప్రతినచేయుమనియు ప్రార్థించెను. రాజు ఆ కోర్కెలను నెరవేర్చునట్లు ప్రమాణమొనర్చి, ఆకోర్కె లెవ్వియో తెలుపుమనెను. ఆమె "భగవంతుడు నీకు స్త్రీ పురుష సంతానములో చెరినల్వుర నొసగియున్నాడు. నీ పేరుప్రతిష్ఠల నిల్పుటకు వీరే చాలుదురు. అందుచే ఇకపునర్వివాహము జేసికొని సంతానము కోరవలదు. అట్లుచేసిన ఆమెబిడ్డలకును, నాబిడ్డలకును స్థానాధికారముకొరకు ఘోరయుద్ధము జరుగుటలో సందేహము లేదు. ఇదియే నా మొదటికోర్కె. రెండవది:

నా భౌతికదేహముపైన, ప్రపంచమునం దెందును కానరానట్టి అసమానసౌందర్యము గలిగి, శాశ్వతముగ నిలుచునట్టి యొకగోరీని కట్టింపవలెను." అని తుదిపల్కులు పల్కి గోహర్-ఆరాను ప్రసవించిన మరుక్షణమే, కోమలకాయమును వదలి భగవత్సాన్నిధ్యమున కరిగెను.

షాహజహాన్ చక్రవర్తిదుఃఖము వర్ణనాతీతము. దుఃఖాబ్ధిలో మునిగిన అతను ఒక వారమురోజులు, ఏవిధమైన రాజకార్యములను చేయజాలకపోయెను. దుఃఖతీవ్రతచే, సర్వమును త్యజించి, సన్యాసిగావలంచెను. కాని గుణవంతుడైన అతను, ఈశ్వరుడు తనపైమోపిన రాజ్యపాలన భారమును అట్లు త్రోసిచనుట, ఘోరపాప మని యెంచెను. ప్రియభార్యామరణానంతరము, చక్రవర్తి, చీనిచీనాంబరములను, వజ్రవైడూర్యాభరణాదులను ధరించుట మానెను. సుగంధలేపనాది సకలవిధ భోగములను పరిత్యజించెను. ఉత్సవాదులందు పాడెడు మంగళగీతికలు, వివిధ వాద్యనినాదములు అతనిచెవులకు శోకపూరిత ప్రలాపగీతములవలె వినపడుచుండినందువల్ల, వాటినెల్ల ఆపివేయున ట్లాజ్ఞాపించెను. ఆమె సమాధియొద్దకు వెళ్లినపుడెల్ల, దానిపై అతని కన్నీటికాలువలు వెల్లువలై పారుచుండెను. "రాజ్యము సర్వశూన్యముగ కనపట్టుచున్నది. జీవితమే జుగుప్సాకరమైన" దని అతికరుణముగ పలువరించుచుండెడివాడు. చక్రవర్తికి ముంతాజ్ బీగముగాక, ముసఫర్ ఖాన్ అనునతని పుత్రికలైన, మిర్జా, షాహ్ అను నిరువురుభార్య లుండిరి. ఐన, ముంతాజ్ యొక్క పవిత్రప్రణయసుధాంబుధిలో ౨౦ సంవత్సరములు ఓలలాడిన అతనికి, వీరి సఖ్యము కేవలము వ్యవహార సంబంధముగ తోచుచుండెనేకాని, ప్రేమబంధముగ నేమాత్రమును కనపట్టుచుండలేదు.

చక్రవర్తినియొక్క దేహమును భూస్థాపన మొనర్చుటకు, ఆగ్రా దక్షిణదిక్కున విశాలావరణము రాజా జైసింగ్ (రాజా మానసింహుని పౌత్రుడు) వద్దనుండి క్రయమునకు తీసికొనబడెను. హైందవశిల్పులలో నిపుణులైన వారికి గోరీనమూనాను సిద్ధపరచు బాధ్యత ఒప్పగింపబడెను. వాటిలో చక్రవర్తి మెప్పువడసిన ఒక నమూనా యొక్క ప్రతిరూపము మొదట కఱ్ఱతో చేయబడెను. తరువాత తాజ్‌మహాలు ౧౬౩౧-వ సంవత్సరపుమొదటిలో ప్రారంభింపబడి; ౧౬౫౩-వ సంవత్సరపు జనవరిమాసములోపుగా 3 కోట్ల రూప్యముల వ్యయముతో అల్లారుముద్దుగా పరిసమాప్తియయ్యెను. కట్టడము నిర్మాణమందు పాల్గొనిన శిల్పులలో నీదిగువ పేర్గొనినవారు అతిముఖ్యులు—



౨. మహాలుయొక్క సంపూర్ణదృశ్యము

౧. అమరనాథ్ ఖాన్ షిరాజ్. కాంధారదేశస్థుడైన యితడు, మహాలునందు 'ఘుగ్రా' శాసనములను వ్రాసియున్నాడు.

౨. శిల్పకలాకోవిద 'ఐసా'. ఇతడు తాపీపని చేసినవాడు. ఇత డాగ్రాదేశస్థుడు.

3. శిల్పిశ్రేష్ఠుడగు 'పైరా' అను నితడు వడ్రంగి. ఇతనిది ఢిల్లీనగరము.

౪-౬. భానుహార్, జాత్‌మాల్, జోరావార్. ల్లీనివాసులైన వీరు మువ్వురును రాతిలో లతాగుల్మాదులను, విగ్రహాదులను చెక్కిన నిపుణులైన శిల్పులు.

౭. ఇస్మైల్ ఖాన్ రుమి. ఇతను మహలుయొక్క ప్రధానగోపురమును, దానికి ఊతగా నొసగియుండు పరంజాను నిర్మించిన నేర్పరియైనశిల్పి.

౮. రామ్‌లాల్ కాశ్మీరీ. ఇతడు తోటమాలి.

ఈదిగువ పేర్కొనబడిన అనూల్యరత్నములు తాజ్ మహలునందు అమర్పబడియుండెను:—

౧. కార్నేలియన్ (Cornelian)- కాంధారదేశమునుండి తేబడినది.

౨. లాపిస్‌లాజలి (Lapis lazuli) అను వైడూర్యము- సిలోనునుండి తేబడినది.



౩. మహలుయొక్క ప్రతిబింబము

౩. ఓనైక్స్ (Onyx)

౪. పాటున్జా (Patunja)- ఆఫ్రికాయందలి నైల్ నదిలో దొరకినది.

౫. సువర్ణము (సువర్ణశిల Goldstone ?)- బాగ్దాపట్టణము, ఓమర్ జ్ సముద్రములనుండి తేబడినది.

౬. ఖాటు (Khatu)-జోద్‌పురపు పర్వతములనుండి తేబడినది.

౭. అజూబా (Ajuba) - కుమయోన్‌నందలి పర్వతనములయందు దొరకినది.

౮. మార్బుల్ శిల (Marble) - మక్కానుండి తేబడినది.

౯. మారియామా (Mariama) - బాగ్దాపట్టణమునుండి తేబడినది.

౧౦. బాదల్ శిల (Badal stone)-బనాస్ నదిలో దొరకినది.

౧౧. యామినీ (Yamini)-యెమెన్ (?) నుండి తేబడినది.

౧౨. మన్గాహ (Mungah) -అట్లాంటిక్ సాగరమునుండి తేబడినది.

౧౩. ఘోరి (Ghori) - ఘోర్‌బాంద్‌నుండి తేబడినది.

౧౪. టామ్రా (Tamrah) - గండకీనదినుండి తేబడినది.

౧౫. గరుడపచ్చయను రత్నము (Beryl)- బాబా బుడన్‌కొండలనుండి తేబడినది.

౧౬. ముసాయి (Stone of Moses ?)— సినాయ్‌పర్వతములనుండి తేబడినది.

౧౭. గ్వాలియర్ (Gwalior)—గ్వాలియర్ నదిలో దొరకినది.

౧౮. ఎఱ్ఱయిసుకరాయి (Red Sand Stone) - నానాస్థలములనుండి సంగ్రహింపబడినది.

౧౯. ఒకరకపు పచ్చరాయి (Jasper)- పెర్షియాదేశమునుండి తేబడినది.

౨౦. దాల్‌ఛానా (Dalchana)—ఆసాన్ నదిలో దొరకినది.

మహలుయొక్క మాన్యములు

రాణియొక్క ౧౨-వ ఆబ్దికమునాడు (౧౬౩౧ వ సం. జనవరి, ౨౭-వ తేది) షహజహాను, తాజ్

మహాలును ప్రవేశించి, ఆగ్రా, మరియు నాగార్చి పరగణాలయందలి 30 గ్రామములను ఈ మహాలుకు మాన్యముగ దయచేసెను. వీటిలో సంవత్సరమునకు లక్షరూకలు రాబడిపన్ను చెల్లుచున్నది. ఇదిగాక, గోరీకి సమీపమునందు కట్టబడిన దుకాణములు, ఇండ్లు మొదలైనవాటిలోనే మరియొకలక్షరూప్యములు అద్దె ప్రోవగుచున్నది.

ఈ ధనము, మహాలును తరచు చక్కబెట్టుచుండుటకును, అందు ఉంచబడిన ధర్మనిష్ఠాపరులైన ఫకీరులు మొదలైనవారికి జీవనాంశము లొసగుటకును వినియోగింపబడుచున్నది.

మహాలుయొక్క అందచందములు

మూడుకోట్ల రూప్యముల వ్యయముతో, ౨౨ వేలశిల్పులచే ౨౨ సంవత్సరములు కట్టబడిన ఈ భవనసౌందర్య మసమానమన్న అతిశయోక్తి గానేరదు. ప్రపంచమునందలి యపూర్వవస్తువులలోనెల్ల యపూర్వమైన ఈ మందిర మొక పెద్దముత్యమువలె కడు మనోహరముగ కడుశోభాయమానముగ కేవలము వర్ణనాతీతమై వెలుగుచున్నది. ఎఱ్ఱ చలువరాతిచే కట్టబడిన సింహద్వారముపై, ఖురానునందలి ఉత్తమపదజాలములు పుష్పలతాదులతోగూడి అతిచతురముగా చెక్కబడినవి. దాని తరువాత సగమునిలువంపుగా కట్టిన సరంబియందు (Demi vault) పలు రంగుల పుష్పలతాదులు అలంకరింపబడినవి. దానికావల సస్యశ్యామల మైన పూదోట మధ్యన చంద్రకాంతశిలచే చదనుచేయబడిన మార్గము అత్యంతరమణీయము. ఈమార్గమున కిరుప్రక్కలను, దట్టమైన పత్రసముదాయముతోగూడి స్తంభములవలె నుండు తమాల వృక్షముల శ్రేణి దుఃఖభారముచే శాంతముగనుండు ఆ స్థల గంభీరత కేయాటంకము రానీయక కావలిగాయుచున్న పహారాజవానులో యన్నట్లు కన్పట్టుచున్నవి. ఈ ప్రశాంతమార్గమునకు తుట్టతుదను, మార్గమధ్యమున నందందు అమర్పబడిన జలయంత్రములు, వేదికలు అన్నిటికినావల చంద్రకాంత శిలా నిర్మితములైన మందిర గోపురములు ప్రకాశించుచున్నవి. నట్టనడుమనుండు ప్రధాన గోపురము రజతాద్రివలె మెరయుచు చూపరదృష్టిని చూరగొనుచున్నది. ఆ చంద్రశిలాస్థగిత మార్గమున నడచుచు, ఆగోపుర సౌందర్యమును తిలకించుచున్నప్పుడు ప్రతివారి హృదయములందును, షహాజహాను చక్రవర్తి యొక్క నిర్మలప్రేమప్రభావమే పొంగి పొరలుచుండును! ఎండవేడిమి యెంతయుగ్రముగ నున్నను. యిచ్చటమాత్రము తాల, తమాల, అశ్వత్థాది వృక్షముల చల్లని నీడవల్ల, తాప మేమాత్రమును సోకుటలేదు, వేడిగాలిసైతము జాజి, మల్లె, గులాబి మొదలైన పుష్పకుంజముల నెత్తావిచే చల్లబడుచున్నది. వెన్నెల కాలములందు, మహాలుయొక్క ప్రధానగోపురము శీతల చంద్రకిరణములలో తళతళ మెరయుచు చూపరను విస్మయపరచుచుండును.

౪. పార్శ్వదృశ్యము

చంద్రశిలామార్గమందలి మొదటి వేదికను సమీపించగానే హిమశైల శిఖరమువలె విరాజిల్లు గోపురము కానవచ్చును. అకస్మాత్తుగా ఒక సుందరవదనారవిందమును చూచినప్పుడు, ఎట్టివారైనను దానిఅందమున కచ్చెరు వొందుదురేకాని, విమర్శచేయసాహ

సింపరు. అల్లే, ఈ మందిరపు గంభీరాకారమును కనుగొన్నతోడనే ఒకవిధమైన ఆనందము కల్గును. మరణముచే విస్మృతి జెందనీయకుండుటకు, పవిత్ర ప్రేమ, యెంతటి ఉద్రేకముతో పోరాడి విజయము గాంచియున్నదని ఆశ్చర్యానందవిస్మయములు కల్గి తన్మయులగుదుము. ఈ ఐక్యానుభవమున దుఃఖసమ్మిళితమైన మాధుర్య మెందున్నది. అయ్యది అనుభవైకవేద్యము. సింహద్వారముపైన, "నిర్మలహృదయులు ఈశ్వరుని యుద్యానము ప్రవేశింతురు" అని అరేబియా భాషలో వివిధములగు నగిషీపనులమధ్యన చిన్నిఅక్షరములు చెక్కబడినవి. ఈముద్దుగులుకు అక్షరముల తిలకించునప్పుడు, చక్రవర్తి అంతఃపురపు అనన్యమణియైన ముంతాజ్ మహాలు యిచ్చట దీర్ఘవిశ్రాంతిని పొందుచున్న దని నమ్రతతో తెలుపుచున్నవో అన్నట్లు తోచును. మరియు, ఇవి ఆప్యాంతరహితుడైన భగవంతునిమహిమ వేనోళ్ల బొగడుచున్నట్లు పొడకట్టును.



౫. మహాలు వెనుకభాగము

ఉద్యానము, గోపురము

సౌందర్యమున నివి ఒకటినొకటి మించుచున్నవి. ఆసియాఖండమందలి ఉత్తమరకపుచెట్లనేకములు ఇచ్చట అమర్పబడినవి. పెనురుపొదరులు, మట్టి గ్రానులు వీటిచుట్టును పెంచబడిన కదళీతరువుల విశాల పత్రములు పచ్చని జెండాలవలె వింతవిన్నాణము నొసగుచున్నవి. ఈతరువుల నడుమ నడుమ కనబడు చంద్రశిలామార్గపుతళతళలు ఎంత జూచినను తనివితీరదు. ఈమహాలు ఒకనిర్జలమైన యెడారిప్రదేశమునందు కట్టబడియుండినను, తన సౌందర్యమహిమచేతనే ఆ ప్రదేశమును సారవంతముగ నొనర్చి, మృత్యువుకంటెను శక్తివంతమైన నిర్మలప్రేమయొక్క ప్రభావమును కనబరచునట్టి దృష్టాంతముగ నుండియుండును. స్వచ్ఛధవళకాంతుల నీను ఈమందిరముచుట్టును నడచుచు పోయిన, ఒకవైపున పవిత్ర యమునాప్రవాహము, మందిరప్రాకారకుడ్యములను తన నిర్మలజలములతో ప్రక్షాళనము చేయుచుండుట కానవచ్చును. కట్టడము నలుచదరముగ కట్టబడినది. ఒక్కొక్కవైపునను ౧౦౦ గజముల కంటె నెక్కువనిడివి గలిగియున్నది. నీలాకాశమున మెరయు మంచు గోపురాగ్రము ౨౮౮ అడుగుల ఔన్నత్యము కలిగియున్నది. దూరమునుండి జూచిన, ఈకలశము, దిఙ్మండలముపైన ఒకగుండ్రని తెల్లజీమూతముభంగి కనపడును. దీని అసమానమైన అందములో లీనమై అటువైపే నడచుచు పోయిన, నేరుగా ఆర్జుమంద్ మహారాణి సమాధిని సమీపింతుము. ఈప్రదేశము చాల సరళముగ, నిరాడంబరమైన అలంకరణములు గలిగి ప్రశాంతమైయున్నది. ఇచ్చట ఒక పవిత్రజ్యోతి ప్రకాశించుచున్నట్లుండును. చక్రవర్తినిదేహము నుంచిన విశాలావరణమునందును, స్తంభములపైనను, నిలువుపట్టెములు, చిత్రపటములు మొదలైనవాటి చట్టములపైనను, అచ్చటచ్చట నమర్పబడిన తెరలవలె నుండు చలువరాతి కటకటేలపైనను ఫలపుష్పలతాదులు, మృగములు, పక్షులు, అక్షరపట్టికలు మొదలైనవి చాల నేర్పుగా చెక్కబడినవి. ఈ చెక్కడపుపనిలో మధ్య మధ్యన పచ్చరాళ్లు, గోమేధికములు, ముత్యములు, వజ్రవైడూర్యములు మొదలైన ఉత్తమోత్తమరత్న

ములు అమర్చబడియుండెను. ఆకాలపు శిల్పుల అద్వితీయ కళా నైపుణ్య వైభవము లిందు ప్రతిఫలించుచున్నవి. ముంతాజు బీగముయొక్క సుందర సుకుమారశరీరమును పాతిపెట్టినస్థలము, మందిరపు నట్టనడుమ సుస్నిగ్ధచంద్రకాంతశిలచే వలయాకారముగ చెదును చేయబడి గుర్తింపబడినది. పూర్వమున బాలసూర్య ప్రభాదీపితంబై యొప్పు పెద్దవజ్ర మొండు ఈ పవిత్ర సమాధిపై సముచితముగ నలంకరింపబడి యుండెను. చక్రవర్తిని సజీవయై యుండినకాలమున నావజ్ర మామె మకుటము నలంకరించియుండెనట. షహజహాను సార్వభౌముడు తన అగాధప్రేమకు సాక్షిభూతముగ నెలకొల్పిన ఈ శ్రేష్ఠమణులలో అనేకములు నేటికాలమున గానరాకుండుట కడు విషాదకరము. ఈ సమాధికి చాల సమీపముననే దీనికంటె జేనెడు యెత్తుకల వేదికయొకటి కట్టబడినది. ఇయ్యది అర్జుమందు ప్రియభర్తయు, ప్రభువును ఐన షహజహాను సమాధి. ఇతడు అతిలోకసుందరియైన తన మోహంపురాణి జీవముల నిలుపుకొనజాలక పోయినను, ఆమె స్మారకచిహ్నమును ఆచంద్రతారార్కము నిలుపగలిగెను. భార్యావియోగ దుఃఖముచే, ఇతడు, మహలునందు వ్రాయించియుండెడు సకరుణమైన కొన్ని వేదాంతవాక్యము లిట్లున్నవి:—

"ఈ ప్రపంచము ఒకవ్యాధివంటిది. దీనిపై నడవ తగునేగాని, నిలుకడగనుండ నిచ్చగింపరాదు. ఈయైహిక ప్రపంచము క్షణభంగురమైనది. ఈక్షణమును ఈశ్వర ధ్యానములో పవిత్రతమముగా గడపుట శ్రేయము."



౬. లోనైపునుండి కనబడు సింహద్వారదృశ్యము



జైన దేవాలయములు, హంపీశిథిలములు

—కే. యల్. నరసింహాచార్యులు, గుంతకల్లు.

గ్రంథ ప్రకటనము

'భాషాభిమాని'

ఆంధ్రదేశమున నేడు కవులకు రాజాదరణము గణింపదగినంతగా లేకున్నది. పోనీ పాఠకు లన్నినో, తేరగా పుస్తకములు లభించిన చదువువారే గాని, కొనియైనను చదువవలె నను నభిలాష గలవారు మిక్కిలి తక్కువమంది కనబడుచున్నారు. ఎంతటి యుత్కృష్టగ్రంథమైనను, ఎంతటినూతనవిషయసంకలితమగు గ్రంథమైనను, ఎంత ప్రకటన జరిగినను నూరుప్రతు లమ్ముడైన మెచ్చదగ్గవిషయము. ఎక్కడనైనను కులాభిమానమును ప్రేరేపించి యిల్లిల్లు తిరిగి మఱికొన్ని ప్రతు లవనముగా నమ్మగల్గినవారు కొంతమంది యున్న మాట వాస్తవమే. అది ప్రత్యేకవిషయము.

పదిమందచేరి పోషించు గ్రంథాలయములైనను గ్రంథములను గొని గ్రంథకర్తల నాదరించి సద్గ్రంథ ప్రకటనకు సహాయపడుట మిక్కిలిధర్మము. అయితే గ్రంథాలయాధికారు లేమిచేయుచున్నారు? "మీ గ్రంథమును దయయుంచి యుచితముగ మా గ్రంథాలయమునకు బంపుడని మనవియొకటి ముద్రించి గ్రంథకర్తలకు బంపుచున్నారు. తపాలారుసుమును గ్రంథకర్తలు భరింపవలసినదే. పత్రికలకు, బండితులకు మఱికొన్ని ప్రతులను విమర్శనార్థము గ్రంథకర్తలు పంపుకొనునాచార మొండుగలదు. అందుచేత భాండాగారములనుండియో, పత్రికాకార్యస్థానములనుండియో, పండితుల ద్వారముననో పెక్కురు నూతనగ్రంథములను చదువబడయగలరు. ఇంక నెవ్వరు గ్రంథములను గొని చదివెదరో! గ్రంథకర్తలకు ప్రోత్సాహ మెటనుండి వచ్చునో!! ఎంతకాలమునకు నమ్ముడుకాక చెదకు భయపడియో, స్థలసంకోచముచేతనో గ్రంథకర్తలు కాగితములవెలకు తమగ్రంథములను రైల్వేవాఙ్మయోద్ధారకులగు గ్రంథవిక్రేతల కమ్ముచున్నారు. ఆవిక్రేతలు మిగిలిన పుస్తకములతోపాటు అణాకు, బేడకు - విలువగల యాగ్రంథములను అమ్ముచున్నారు. ఐనను వారావిధముగనైన గ్రంథవ్యాప్తికి సహాయపడుచున్నారుగదా!

తెనుగుగ్రంథమాలలసంపాదకులైనను గ్రంథకర్తలకు దగినంతప్రోత్సాహ మొసగుటకు దేశీయులు వారి యుద్యమము నభిమానింపనిది యవకాశ మెట్లుండును? స్త్రీవిద్య యెక్కువవ్యాప్తి నొందె, స్త్రీపాఠకులసంఖ్య పెరిగిన గ్రంథములు కొనువారిసంఖ్య యెక్కువ కావచ్చునేమో! నేడు ముఖ్యముగా సామాన్యవిద్యావంతులు చదివెడుపాత్రముల కమ్మక యెక్కువగా గనబడుచున్నది. అందుకుగారణము వారి యభిరుచుల కవి సరిపోవుటయు, రైళ్లలో చౌకగా నమ్మబడుటయు నైయున్నది.

కాని నేడు తెనుగుదేశమున పుస్తకవ్యాపార మొండు జరుగుచున్నది. పఠనీయగ్రంథరచయితలు, ప్రచురణకర్తలు ముఖ్యముగా నీవ్యాపారము చేయుచున్నారు. సద్గ్రంథప్రచురణాభిలాషకంటె పెక్కుమందిని ద్రవ్యసంపాదనయే యిందు కాకర్షించుచున్నది. ఎవ్వరిచేతనో గ్రంథములు వ్రాయించి, ప్రచురణకర్తలు ఆగ్రంథము లామోదింపబడుటకును, బహుళవ్యాప్తిని బడయుటకును సహాయపడునట్టి విద్యాశాఖాధికారులను వారియామోదముతోనె గ్రంథకర్తలని ప్రకటించుటకూడ గలదట. కొన్నియెడల నట్టివారు స్వల్పమగుసలహా లిచ్చియుండవచ్చును. అంతమాత్రమున గ్రంథకర్తలు కారుగదా!

పాఠ్యగ్రంథనిర్ణయసంఘమువారు పూర్తిగా బరిశీలించి యామోదించుచున్నారా? గ్రంథకర్తల డిగ్రీలు, నామములు వారి నాకర్షించుచున్నవేమో! వాచకగ్రంథములలో నుండెరానిదోషము లున్నను ఆమోదించుట యెవరిలోపము? నవలలు, నాటకములు, వచనగ్రంథములు ఆమోదింపబడినవన్న చాలునా? ఏతరగతికో నిర్ధారణచేయుట నేడవసరముగా గన్పట్టుచున్నది.

పాఠ్యగ్రంథనిర్ణయసంఘమువారామోదించిన గ్రంథములనుండి స్థానికసంస్థలయధ్యక్షులు ఆయా తరగతుల కాయా రచయితలగ్రంథములని మరల నిర్ధారణ చేయవలసియున్నది. అటుల నిర్ధారణ చేయుటలో నధ్యక్షులు గ్రంథకర్తలయొక్కయో, ప్రచురణకర్తలయొక్కయో, వారిప్రతినిధులయొక్కయో పలుకుబడిని ఎక్కువగా గమనించుచుండిరనుట సత్యము కాదని యెవ్వరనగలరు? విద్యార్థితరగతి, అతని వయస్సు, గ్రంథముయొక్క శైలి, విషయము, అర్హత, వెల విచారింప నవకాశము వారికి లేదు. అట్టివిచారణ చేయుటకైనను స్థానికసంస్థల కెల్లప్పుడు విద్యాధికులే యధ్యక్షులుగా లభింతురని చెప్పనేరము. విద్యాధికులు లభించినను న్యాయము చేయునవకాశము వారికి నుండదు. జాతీయాభిప్రాయములకు దోహదమిచ్చు పుస్తకములను పాఠ్యగ్రంథనిర్ణయసంఘమువారు ఆమోదింపరు గదా! అట్టియెడల నీయధికారము ప్రభుత్వము వారు ప్రధానోపాధ్యాయుల కొసగిన మంచిదిగా దోచుచున్నది. సాముదాయిక లాభనష్టములకు కారణమగు పాఠ్యగ్రంథములను నిర్ణయించుటలో పాఠ్యగ్రంథనిర్ణయసంఘమువారుగాని, స్థానికసంస్థల యధ్యక్షులుకాని స్త్రీలు వ్రాసిరని గాని, నిమ్నజాతులు వ్రాసిరనిగాని భావింపక యర్హతయే ముఖ్యముగా గమనింపదగ్గది. స్త్రీలను, నిమ్నజాతులను ప్రోత్సహించుట కన్యమార్గములు గలవు.

విద్యాశాఖాధికారులుగాని, యన్యులుగాని విద్యావ్యాప్తిని మనస్సులో నుంచుకొని దేశసేవాతత్పరమతులై గ్రంథములను వ్రాయవలెనేగాని వ్యాపారమునకై గ్రంథములనువ్రాయుట నింద్యము. విద్యాశాఖలో బనిచేసి పింఛెను పుచ్చుకొన్న వాచకరచయిత యొకరు తనవాచకములను బోర్డుపాఠశాలలలో నుంచగలందులకా గ్రంథములను విద్యాధికులు, మామిత్రులు నగు నొక తాలూకాబోర్డు ప్రెసిడెంటుగారికి బంపియుండిరి. అయితే, అడిగిన వారికెల్ల మేలుచేయవలె ననుకొను దుర్బలహృదయులా ప్రెసిడెంటుగారు. పాఠ్యగ్రంథములను నియమించుటలో ముఖ్యముగా నట్టివృష్టి యెంతమాత్ర ముండరానిది గదా! నేను గ్రంథములందలి ముఖ్యదోషములను గుర్తుపెట్టి ఉన్నవానిలో నానందవాచకములే సర్వోత్తమమైనవని నాయభిమతమును జెప్పితిని. పైతరగతులకు ఉత్తమమైన శ్రీవాచకములు, వివేకవాచకములు నిన్న నేను వెలువడినవి. పైవాచకరచయిత స్వయముగ ఆతాలూకాబోర్డుప్రెసిడెంటుగారిని జూడ వచ్చిరి. ఆసమయమున వారిగ్రంథములోపల దోషముల సంగతి యేమనియడిగితిని. వారు సమాధానమును జెప్పనేరక 'పండితునిచేసవరింపించితినండీ'యనిరి. కళా, ద్రుత ప్రకృతికముల జ్ఞానమైనను వారికి లేకుండెను. ఒకానొక భాగవతకథల గ్రంథకర్తయు నాల్గయిదు తరగతుల కుపవాచకముగా తనగ్రంథమును నియమింప నడుగవచ్చిరి. ఆగ్రంథముయొక్కశైలి కళాశాలవిద్యార్థులకు బోధపడునేమో! అక్కడక్కడ కొన్నివాక్యములు చదివి వినిపించి "యిట్టికఠినశైలిగలగ్రంథము ఆతరగతుల కెట్లుపకరించును? ఆగ్రంథము ప్రాథమికోపాధ్యాయులకు బోధపడునా?" యంటిని. పాపమాయన భాగవతములోని వేదాంతఘట్టములనుగూడ విడిచినారు కాదు. ఆయన జవాబు చెప్పనేరక కాబోలు, కొన్ని తాలూకాబోర్డులలో బెట్టినారని ఆతాలూకాబోర్డులపేర్లు చెప్పి సెలవు పుచ్చుకొనిరి. వాస్తవము ఆయనకుమాత్రము తెలియదా?

ఉన్నతవిద్యావంతులు, మహోదారమనస్కులు, న్యాయపథమును వీడకుండ పరిపాలనచేయవలె నను నభిలాష గలవారు నగు జిల్లాబోర్డధ్యక్షు లొకరు పాఠ్యపుస్తకనిర్ణయవిషయమున సిఫార్సు లిచ్చుట, వానిని గమనించుట ధర్మయుతము గాదని చెప్పిరట. అట్టివారును బూర్తిగా న్యాయపక్షమునే యనుసరించిరని వారు గ్రంథనిర్ణయము చేసినపట్టికను జూచిన జెప్పనేరము. పాపము వారేమిచేయగలరు? ఎన్నికలవిధాన మట్టిది. నేటియార్థికదుస్థితిని గమనించిన ప్రాథమికపాఠశాలల పుస్తకములనైనను, తరుచు మార్చుట మంచిదికాదనిపించుచున్నది. పాఠశాలలలో గరపు ప్రతివిషయమునకు నచ్చుపుస్తకములు పిల్లలచే గొనిపింప నవసరము లేదని తలంతును.

ఆధునికచిత్రకళయందలి లోపమేమి?

"ఆధునికచిత్రకళయందలి లోప మేమి ?" యను ప్రశ్నయందలి దురభిప్రాయ మీయుగలక్షణము. పద్ధతులయందు తమయిచ్చవచ్చినట్లు మార్పుల జేయువారివలె కొందరు కళోపాసకులచేత మార్పులను జెందిన కళ వారి యిష్టానిష్టములకులోనై ప్రపంచమున కేలాటి సంబంధములేని, వేరొకవస్తువని నవీనులు తలంచుచున్నారని తేటపడగలదు.

కళ ప్రపంచగతినిబట్టి మారుచుండునుగాని ఏదేనొక యస్వాభావికమగు కారణమువలన తటాలున మార్పుజెంది క్రొత్తవస్తువుగా పరిణమించదు. ఏ యుగమునం దది యుద్భవించునో ఆయుగలక్షణముల నా కళ ప్రతిబింబించుచుండును. ప్రాచీనకాలపు కళయైనను, ప్రకృతపు కళయైనను ప్రపంచనాగరకతతో మిళితము కానంతమాత్రమున దోషపూరితమైన దనుటకు వీలులేదు. గూఢముగ నుండవచ్చును, లేక సులభముగనర్థము గాకపోవచ్చును గాని కళయందు దోషమున్న దనుటకు వీలులేదు. శీతోష్ణస్థితికిని చెట్లుచేమలకును ఎట్టి సంబంధమున్నదో అట్టిదే కళకును, అది పుట్టినకాలమునకును గలదని చెప్పవచ్చును. తాటిచెట్లు ఉష్ణమండలములందు మాత్రమే బ్రతుకగలవు. అతిశీతలమండలములందు బ్రతుకలేవు. ఈస్థితి మనకు విస్మయకారణ మగుట లేదు. ఎక్కడ ఉండనవి అక్కడనే యుండవలయునని మన మంగీకరించుచున్నాము. కళాప్రపంచమందునయిత మట్టిభావమే యుండవలయును.

ప్రతియుగమందును కళ ప్రత్యేకరూపమున అవతరించుచున్నది. గ్రీకులకు శౌర్యసాధనయందు గల పిచ్చినమ్మకము, మధ్యకాలమందలి బర్బరుల మతావేశము, పునరుజ్జీవనకాలమందలి క్రొత్తదనము ఏవిధముగ కళయందు ప్రత్యేకశైలితో ప్రత్యక్షముగ నుండెనో అట్లే యిపుడును మన "ఆధునిక" మనెడి కళ మన యుగలక్షణముల ప్రతిబింబించుచున్నది. నూటయేబది యేండ్లకు పూర్వము కళాభావముయొక్క రీతి కవిత్వమందు పల్లెలవారి పనిపాటలను భావోద్రేక ముట్టిపడున ట్లుండెను. మరియిపు డట్లుగాదు.

రాజకీయములయందు సంస్కరణ లెట్లుగలుగుచున్నవో, వాటి కనుగుణముగనే నేటికళయు మార్పుజెందియున్నది. శాస్త్రములు, కల్పనలు ౧౯-వ శతాబ్దము మధ్యకాలమునుండి పాశ్చాత్య నాగరకత నావరించియున్నవి. అందుమూలమున, కళయం దంతకుపూర్వముండిన విచిత్రము పోయి స్వాభావికత ఏర్పడినది. కాని యుద్ధానంతరము ప్రబలిన వేదాంతమార్గము కళయందు భావప్రాధాన్యమును, సరళతను వృద్ధిచెందించుచున్నది. కళ ఏకాలమునకు సంబంధించియుండునో ఆకాలమందు వర్ధిల్లు నూత్నభావములయొక్క ప్రతిబింబమని చెప్ప నొప్పును.

నేటికాలపు కళ సరళముగను, మానసిక ప్రవృత్తిని తెల్పునట్టిదిగను ఉన్నను, అయ్యది అస్వాభావికముగ ఉన్నదని కొందరనుచున్నారు. లోకులందరు సామాన్యముగ నిట్లేతలంచుచున్నారు. కళయను దానిని సరిగ నెరుగనివారు, ఏపయిన చిత్రమునుకాని, శిల్పమునుగాని చూచినపుడు, అది ప్రాణవంతమగు దానికి సరియైన ప్రతియైయుండిన, చాలమెచ్చుకొని చిత్రకళయొక్క ముఖ్యగుణ మిట్టిదని యనుకొనుచున్నారు. స్వభావ విరుద్ధముగ చిత్రించియున్న వానిని చూచినపుడు వాని తత్త్వమును ప్రజ లెరుంగలేకపోవుచున్నారు.

ప్రస్తుతపు చిత్రకారులలో కొందరు వస్తువెట్లున్నదట్లే చిత్రించుచున్నారు. కన్నుకాని, వేలు

గాని చాలస్వాభావికముగ గన్పడును. మరికొందరు చిత్రకారులు కడకు ఒకచేయినిగాని, పాదమునుగాని చిత్రించలేకయున్నారని ప్రజలు పొరపడుచున్నారు. అందువలన సామాన్యమానవుడు కళయందు తనకు దురూహ్యములైన సాంకేతికవిషయము లున్నవని తలంచుచున్నాడు. చిత్రరచనము అసలుకు సరిపోవునట్లుండుటయే సామాన్యునికి తెలిసిన విషయము. అట్లుండునదియే ఉత్తమమయిన స్వాభావికచిత్రకళయని యాతనియభిప్రాయము. నిజమైన శిల్పిగాని, చిత్రకారుడుగాని సాంకేతిక విషయములకు లోబడనివాడని యితనికి నచ్చజెప్ప బూనుట నిష్ప్రయోజనము. చిత్రకారుడు చిత్రించినదానికన్న అత డాచిత్రమందు చిత్రించు భావములు ప్రధానము లనువిషయము నతడు గమనించుటలేదు. ఒకే విషయమును చిత్రించవలసినపుడు ౧౭-వ శతాబ్ది చిత్రకారుడును, నేటి చిత్రకారుడును ఎట్లు రచించిరో పరిశీలించిన పై విషయము తెల్లమగును. ఎర్మియరు, మెటీసె అను నిద్దరు చిత్రకారులు నారగుడ్డపై "పియానోపాఠ" మనెడి చిత్రమును చిత్రించిరి.

వర్మియరు, సలక్షణమయిన డచ్చి గృహాంతర్భాగమును చిత్రించెను. పియానోదగ్గర కూర్చునియున్న ఒక అమ్మాయియును, ఉపాధ్యాయుని గంభీరమైన ఆకారమును ఇందు గననగును. అన్నిట, ఈచిత్రము గొప్పదనిపించు కొన్నది. ఈచిత్రము, చిత్రకారుడు సొగసయిన బొమ్మను చిత్రించవలయునను యభిప్రాయమును వెల్లడిచేయుచున్నది. ఈచిత్రము అందరిని రంజింపచేయునట్టిదనుటలో సందేహము లేదు. "పియానోపాఠ" మనుటలో చక్కని గృహాంతర్భాగమునకన్న కొంత ఎక్కువయున్నదని తోచగలదు.

ఇక మెటీసే వ్రాసిన చిత్తరువు ఎట్లున్నది? పియానోపాఠమనగా- ఒకచిన్నబాలుడు ఇష్టములేక, అతి విలువయైన తన ఆటకాలమం దొక అరగంట, ఈసంగీత వాద్యమునెదుట గడపుటయని యాతనిభావము. ఇం దాబాలుని తలమాత్రము చిత్రింపబడియున్నది. పటమందలి తక్కిన భాగమంతయు పియానోపాటలతోను, పియానోతోను నిండియున్నది. విసుగుతనము, ప్రయత్నముమీద తెచ్చుకొన్న మనస్తిమితము అనుమొదలగు భావము లీబొమ్మయందు అతినిపుణతతో చిత్రింపబడియున్నవి. ఈచిత్రమందు వాద్యమునకు ముఖ్యస్థాన మొసగబడియున్నది. చిత్రమున మరియొకచో ఒకముసలామె చేతులు జోడించుకొని, యీపిల్లవాని బాధగమనించునట్లున్నది. ఇదంతయు చిత్రమందు గన్పడు విశాలమగు గదులయందు లీనమై యున్నటులు మనకు గోచరము గాగలదు. ఇచ్చోటగల యినుపకమ్ముల కిటికీలవలన ఇందు శిల్పము గూఢ యున్నటుల స్ఫురింపజేయుచున్నది.

ఈరెండుచిత్రములును వేరువేరుగ నున్నవి. వర్మియరుచిత్రమందు భావము శూన్యముగను, మెటీసె చిత్రమందు పూర్ణముగను గలదు. ఈరెండును చిత్రకారుల మానసికప్రవృత్తుల దెల్పుచు వారు జీవించియుండిన కాలమందలి పోకడల విస్ఫుటముచేయుచున్నవి.

ఉన్నదున్నట్టు వ్రాయుట నేటిచిత్రకారులకు తెలియనిది కాదు. కాని వా రట్లు చేయుటలేదు. ౧౭-వ శతాబ్దమందలి డచ్చిచిత్రకారులు దృష్టికి గోచరమగునట్లే చిత్రముల చిత్రించుచుండిరి. వీరి కీవిధమయిన చిత్రరచనయం దొక ప్రత్యేకమగు ఉపజ్ఞయుండినదిగాదు కాని, వీరి కీపద్ధతియందు ఆసక్తి మెండుగ నుండెను. చిత్రరచనయందు వస్తువుయొక్క స్వాభావికలక్షణములు కనబడకపోయినయెడల ప్రజలు దీనిని అర్థముచేసికొనలేక బాధపడుచున్నారు. ఎందువలనననగా చిత్రింపబడిన వస్తువునకును దానియొక్క నిజస్వరూపమునకును అంతరము చాలగలదు. ఆశతాబ్దినాటివారికి, చిత్రరచనా పరీక్షకుండిన ప్రమాణమింతియే.

"గొప్పకళ"ను గుర్తించుటకు పూర్వకాలపు కళయొక్క స్థితిని చక్కగా నెరిగియుండవలయును. ఏకాలమందయినను కళ, బాగుగనున్నదా, లేదా, యను విషయము ఆకాలమువారు చిత్రములను, వాటి అసలు వస్తువులతో పోల్చిచూచి అందుమీదట చెప్పుచుండిరి. చిత్రకళాచరిత్రమును చదివిన యెడల కళను గూర్చి కొన్ని యభిప్రాయములు తేటపడగలవు.

బర్బరులకాలమందు కళనశించియుండినది. ఇందులకు నిదర్శనము వారి కాలపు విచిత్రచిత్రరచనయే యని యొకరి యభిప్రాయము. నేటికాలపు చిత్రకళయందలి సరళతను గూడ కళావిమర్శకు లట్లె తలంచుచున్నారు. వస్తువుల నిజస్వరూపముల చిత్రించలేక ఆధునిక చిత్రకారులు తమ చేతకానితనమును మరుగుపరచుకొనుటకు ఇట్లు చిత్రించుచున్నారని వారి నమ్మకము.

చిత్రకళ యొకవిధముగ నున్నపుడు, అది యెట్లుండవలయునను ప్రశ్నగల్గుటవలన చిత్రకారులకును ప్రజలకును గొప్పభేద మేర్పడుచున్నది. చిత్రకళాస్వరూపమును గూర్చి యడిగిన అది "సుందరము" గ నుండవలెనని యనెదరు. సుందరమనగా కొందరు. శ్రేష్ఠమై అంగసౌష్ఠవము గలిగినదే యందురు. కాని ఆధునికచిత్రకారు డట్లు తలంచుటలేదు. భావోద్రేకము గల్గించునట్టిది సుందరమగునదని ఆతని యభిప్రాయము. ఈరెండు అభిప్రాయములయం దేది శ్రేష్ఠతమమో నిర్ణయింప నలవిగాదు. గొప్పవిషయములనుండి కళగా పరిణమించినది ప్రశంసనీయముగ లేదు. అట్లే భావపూరితమగు కళయం దభిరుచి యున్నంతమాత్రమున కళాప్రవీణు లగుట లేదు.

౧౮౫౦-వ సంవత్సరమున ప్యారిసునగరస్థులు కోర్బెటుగారి స్వాభావికచిత్రకళను నిరసించిరి. ఈ విధమగు నిరసనమే హెచ్చి, స్వాభావికచిత్రకళయెడ విముఖతగ పరిణమించి, లోలుత, అంగవైకల్య ముండు నట్లగపడు మానవచిత్రముల చిత్రించిన వారిని గౌరవించిరి. గీతలసముదాయమువలన నేర్పడు చిత్రములను, కొన్నిదృశ్యముల చిత్రణము, వీనిని చిత్రించిన పెక్కురంగుల పొందిక కలసి ఏర్పడు భావప్రతిమలు మనయందు గొప్పభావముల పుట్టించగలవు కాబట్టి వీనిని గని ఆనందించు డను సుబోధనము జయప్రదమగుటకు అనేకసంవత్సరములు పట్టినది. ఈ విషయమున ఇంకను ఏకాభిప్రాయము కుదురలేదు. ఇటీవల పదిసంవత్సరముల క్రిందనే పూర్వపుటభిప్రాయములు పోయి, చిత్రరచనమందలివస్తువునకన్న గుణమునకును, భావమునకును ఎక్కుడు ప్రాధాన్య మొసగుచున్నారు. "వసంతమందు దేవకన్యల నాట్యము," "ఖైదీలతప్పటడుగులు" అను రెండు చిత్రము లున్నవనుకొందము. నేడు వీనియందు చిత్రింపబడ్డ వస్తువునకన్న భావమునకు, గుణమునకు మాత్రమే ప్రాధాన్య మీయబడుచున్నది. ఇంకను అనేకులు ఈ రెంటిలో మొదటిదానియందే ఎక్కువ మక్కువ జూపుచున్నారు. వారు బొమ్మయందున్న గుణాతిశయమును గుర్తింపకున్నారు. ఈ విధముగ కళను గుర్తింపలేక వెనుకబడియున్నవారి విషయము మన మాలోచింపవలసినదే లేదు.

ఏసంఘ మందైనను పరస్పర విరుద్ధములగు రెండు బలములుండును. సంఘమం దితరులతో నివసించుటకును, జీవనమునకు సంపాదించుకొనుటకును, పౌరవిషయములందు పాల్గొనుటకును మానవుడు కొంచెము తెలివిగలవాడై యుండవలయును. అనగా నాగరకత గలిగియుండవలయును. నాగరకతను మించగలిగినదొకటి కలదు. అది విజ్ఞానము. విజ్ఞానమే నాగరకత కంతకును మూలము. నాగరకత అందరికిని జెందియున్నది. విజ్ఞానము వ్యక్తిగతమైన వస్తువు. ఉన్నతాదర్శములు గలిగి నీతిమంతులై మెలగువారలు జ్ఞానులు. విజ్ఞానము వారి సొత్తు. ఇకనాగరకత, స్పర్శ చేతనే అందరిని నాగరికుల జేయును. భోజనముచేయుటవలె విజ్ఞానము నెవరికి వారే ఆర్జించుకో వలయును. ఈ పోలికయం దొకలోప మున్నది. ప్రతిమనుష్యుడును జీవించుటకొరకు భోజనము చేయుచున్నాడు. జ్ఞానమార్జింపుమని వానిని బలవంతపెట్టువా రెవరును లేరు.

ఎందును భేదముగపడని కళయం దిట్టిభిన్నాభిప్రాయములు గలుగుటకు కారణము విజ్ఞానమునకును, నాగరకతకును గల యంతరమే. నాగరక జనసామాన్యమున కంతయు తృప్తికరముగ నుండునది ఒకరకమయినకళ. వారిపోషణము గొనజాలని మరియొకకళ కూడ ఉన్నది. నాటకసారస్వతగ్రంథములు, "జనప్రియ"మైన సంగీతము, పారిశ్రామికకళలు అనేకుల యభిమానమును పొందకయుండిన, అవి లోకమున వర్ధిల్లజాలవు. ఈవిధముగ వ్యాపారవృద్ధికొరకు కళోపాసకులు జనసామాన్యమునకు రుచించెడి వస్తువులనే తయా

రుచేయుచున్నారు. కాని స్వార్థత్యాగులై నిజముగ కళను వృద్ధిచేయుటలేదు.

విజ్ఞాన సముపార్జనమందు ఆసక్తి గలిగిన కళను ఉపాసించు చిత్రకళాభిజ్ఞులు, శిల్పులు, సంగీత శాస్త్రజ్ఞులు, లోకమును సరకుగొనుటలేదు. వారిని అభిమానించి వారి గొప్పతనమును గ్రహించువారు కొద్దిమందియైనను చాలు. ఇట్లు లోకాభిమానము పడయజాలనందు వలన సత్యమైన కళారాధకుడు అన్యాయముగ ధనమును సంపాదింప లేకపోవుటకన్న మించినదేమియు లేదు. ప్రతికళారాధకునికిని ఇది తెలిసిన విషయమే. కాని ఎవడును తనసత్యమార్గమును త్యజించుటలేదు. ఇట్టి నిపుణులైన కళారాధకుల స్వతంత్రభావము, జనసామాన్యముయొక్క వాంఛలను తీర్పకపోవడము, అను రెండుకారణములే వీరికి వారికి గల భేదాభిప్రాయములుగ పరిణమించినవి. "ఆధునికకళయందు దోషమేమి ?" యను ప్రశ్నయుదయించినపుడు, అది వీరినిసురించియే గలిగినది.

పూర్వము కళయనునది మతమువలనను, శౌర్యము వలనను ఉద్భవించినది. నేటి కళకును అట్టికారణము లెవ్వియు లేకుండుటచే కాబోలు ప్రజలు దానిగొప్పను గుర్తింప లేకున్నారు. అంతేగాక, కళకును, ప్రజలకును గల చేతనసంబంధముగూడ తెగిపోయినది. పూర్వపు కళ నేటి చరిత్రగ పరిణమించినది. లోకముతో ఉండిన ఈసంబంధముగూడ చిరకాలముండలేదు. మానవసమత్వమనుభావమును పెంపొందించిన ౧౯ శతాబ్దము, కళకుండిన గొప్పతనమును తొలగించి కృత్రిమ(invention)ముల నభిమానింప దొడంగెను. ఈకాలపు ఛాయాచిత్రణము ప్రజలకును, కళకును భేదముల గల్పించినది.

జనసామాన్యముపక్షమునను ఒకమాట చెప్ప వలసియున్నది. ఆధునిక కళయందు ఏకీభావము గన్పించుటలేదు. చక్కనికళ యుదయించుటకు ఆదర్శప్రాయములగు ప్రమాణములు లేకుండుటయే కారణములు. నేటి విజ్ఞానావేశము ఉపయోగములేనిది. రాజకీయములందుగాని, మతములందుగాని విపరీతాభిప్రాయములు నిరుపయోగకరములు. కళోపాసకుని ప్రయత్నము రాక్షస ప్రయత్నముగావలసి యున్నది. కళయందు విముఖత జూపుచున్న ప్రపంచమునకు కళారాధకుడు చేయగలిగిన దేమన, సులభముగు విషయముల నింకను సులభముగ జేయుటయే. ఇపుడు ప్రపంచప్రవృత్తిని గ్రహించుట కెవరివలనను గాదు. ఏలనన ప్రపంచము భిన్నభిన్నాభిప్రాయముల గలిగియున్నది. ఏకీభావము లేనపుడు ప్రపంచప్రవృత్తిని చిత్రకారుడెట్లు చిత్రింపగలడు ?

పరిస్థితులనుబట్టి జూడ కళారాధకుడు నిరాశ జెందవలసిన ట్లున్నది. కాని సత్యాన్వేషకుడు తన దీక్షను వీడరాదు. బలమగు ప్రవాహమున కెదురీదు రీతి తనపద్ధతిపైనే చిత్రకారుడు కళను వృద్ధిచేయుటయే శ్రేయము. ఇదియు జరుగకపోయిన కళారాధకుడు ప్రాచీనకాలపు చిత్రకారుల ననుసరించియే చిత్రములు వ్రాయుచుండును.

కళయందు నేడు అనేకపద్ధతు లున్నవి. ఏది శాశ్వతముగ నిల్చునో తెలియరాకున్నది. అనేకులు దేని నభిమానించెదరో అదియే పైకి రాగలదు. పూర్వకాలపు చిత్రకళయు, శిల్పమును, నేటికళాతత్త్వమును నాశమొనర్చినవి. ఏలయన, సాధారణమానవుడు, వీనిని చూచునపుడు ఏదిఉత్తమమో, ఏదికాదో తెలిసికొనజాలక చిక్కుపడుచున్నాడు.

ఆధునికప్రపంచము దోషపూరిత మయిన, ఆధునికకళయు దోషపూరితమయిన దగును. వాటికేర్పడు చిక్కుల నవియే సరిచేసికొనుచుండవలయును. మన ప్రయత్నములు నిజమయినను, కాకపోయినను, ఇవన్నియు మానవుడు స్వీయక్రమవికాస పరిణామము లకు (Evolutionary Process) కల్పించుకొను సాధనములగుచున్నవి. ఆధునికకళ దోషపూరిత మయిన దనిన, పూర్వకాలపుకళయు దోషపూరిత మయినదని చెప్పవలసియున్నది. ఈకాలమునకు జెందినది ఈకాలపువస్తువే. ఈప్రశ్నకు తృప్తికరమగు సమాధానము తోచుటలేదు. ఏలయన, మనకర్థము గాని

విషయములనుండి యీప్రశ్న యుదయించినది. ఇదం తయు మననాగరకతకు సూచకమగు విషయముకాబట్టి దీనిని చాలముఖ్యముగా ఆధునికులు గ్రహించవలయు నని మనవి.

['కరెంటుహిస్టరీ' అనుపత్రిక జూను సంచికయందు Gene Lux అనువారు వ్రాసిన What is wrong with modern art అను వ్యాసమున కనువాదము. Lux శిల్పి, విమర్శ కుడు, అధ్యాపకుడును. వీరి వ్యాసములు పెక్కులు అమెరికా యూరపుఖండముల పత్రి కలయందు ప్రకటితము లగుచుండును. త్వరలో నితడు కళాచరిత్ర (History of art)అనుగ్రం థమును ప్రకటింపనున్నాడు.]

ఏనుగులశాల (నూతన దృశ్యము)

(హంపి శిథిలములు)

—కే. యల్. నరసింహాచార్యులు, సంతకల్లు.

భారతీయ విద్యాచరిత్రము

మారేమండ రామారావు, బి. ఏ. (ఆనర్సు) బి. ఇడి.

[అనువృత్తము]

III. విశేషాంశములు

ఇంతవరకును హిందూబౌద్ధయుగములందలి హిందూవిద్యావిధానమును, విద్యాసంస్థలను వర్ణించియుంటిమి. ఇటుపై హిందూమతమునందును, తద్విద్యావిధానమునందును గల విద్యావిషయకవిశేషాంశములను బరిశీలింపవలసియున్నది. ఆధునికవిద్యాసంస్కర్తలుత్తమ విద్యావిధాననిర్మాణమునకై చేయు సూచనలనేకములు ప్రాచీనహిందువులకు దెలిసియుండినవి. ఈవిషయము హిందూమతమును, వర్ణవ్యవస్థను, ప్రాచీనబోధన నియమములను బరిశీలించినచో స్పష్టము కాగలదు:

హిందూమతము: — ఆధునికకాలమున బాఠశాలలో విద్యార్థులకు బోధింపబడు విషయమును నిర్ణయించునెడ వైజ్ఞానికయుగవాదము (Culture Epoch theory) అను నొకవాదము గలదు. మానవజాతి యారంభమునుండి నేటివరకు ననేకపరిణామములను గాంచెను. అటులే ప్రతిమానవుడును పుట్టినదాదిగ ననేకములగు ననుభవములను గాంచును. ఈ జాతీయపరిణామమునందలి యవస్థలకును, వైయక్తికపరిణామమునందలి యవస్థలకును సన్నిహితమగు సామ్యము గలదు. కాన విద్యార్థి యేయవస్థలో నుండునో బరిశీలించి, దాని కనుగుణమగు జాతీయావస్థను స్మరించి యందలి యంశమునే బాలకునికి బోధింపవలెను అని యీవాదము యొక్క ముఖ్యోద్దేశ్యము. ప్రాచీనార్యులు ప్రతి మనుజునకును ఆధ్యాత్మికచింతనము, నాత్మతత్త్వజ్ఞానమునే జీవితాదర్శములని విధించియుండిరి. అవియే మతమునకును, జాతికినిగూడ నాదర్శములు. ఈయాదర్శములను గ్రహించుటకై, మానవ జీవితమంతయు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములను నాలుగాశ్రమములుగ విభజింపబడెను. ప్రతివారు నీయాశ్రమములను క్రమముగ నతిక్రమించి యందం దొడవు ప్రత్యేకానుభవములను బొంది, జ్ఞానపరిపాకమును గాంచవలసియుండెను. పై వైజ్ఞానికయుగవాదమునకును, వర్ణాశ్రమవ్యవస్థకును సామ్యము స్పష్టమగుచున్నది.

ఇప్పటి మానసికతత్త్వశాస్త్రజ్ఞులు (Psychologists) మన కెల్లప్రుడును కర్మాచరణమునకై లోపలినుండి ప్రోద్బలము (Impulse) గలుగుచుండుననియు, నట్టి ప్రోద్బలముచే జేసిన ప్రతిపనియును స్వేచ్ఛాకృతములనియు జెప్పుచున్నారు. ఆధునిక విద్యాసంస్కర్తల యభిప్రాయము ననుసరించి విద్యార్థి స్వప్రవృత్తిమూలముననే (Self activity) విషయములను గ్రహింపవలె నని వాదించుచున్నారు. ప్రాచీనహిందువులు వీనికి సరియగు నియమములనే యేర్పరచియుండిరి. యుక్తాయుక్తములను విచారించి స్వప్రవృత్తిని నియమించుకొని ప్రతివారును స్వయం కృషిమూలముననే తత్త్వమును దెలియవలెనని వారి యభిప్రాయము.

మానవునకు తనను దాను బూర్తిగ దెలిసికొని సిద్ధత్వము (Perfection) నందుటయె జీవిత పరమావధియనియు, మానవప్రవృత్తియంతయు నీవిషయమునే సాధింపవలెననియు, నందుచే జీవితలక్ష్యైక్యము (Unity of Life) గలదనియు నాధునికులు జెప్పుచున్నారు. ఈవిషయమునే ప్రాచీన హిందువులాశ్రమ విభజనచే సాధించిరి. ధర్మార్థకామమోక్షములు నాలుగు పురుషార్థములు. బ్రహ్మచర్యాశ్రమమున ధర్మమును, గార్హస్థ్యమునం దర్థకామములును, వానప్రస్థ సన్న్యాసములలో మోక్షమును సాధ్యములు. మొదటినుండి తుదివరకును మోక్షమే పరమపురుషార్థము; ఇతరములు తత్సాధనములు.

ప్రకృత మానసిక తత్త్వశాస్త్రజ్ఞులు వైయక్తిక పరిణామమున కేవలమును ప్రకృతియేకాక వాతా

వర్ణములుగూడ విశేషముగ దోడ్పడునని చెప్పుచున్నారు. ఈ విషయమును హిందువు లనేకశతాబ్దములకు బూర్వమే గ్రహించిరి. వినయవిధేయతలను పెంపొందించి, కేంద్రీకృత మనఃప్రవృత్తి కనుకూలములై, యుత్తమాదర్శ సన్నిబద్ధములై, జిజ్ఞాసావృత్తి కనుకూలములగు వాతావరణములు ముఖ్యము లను విషయమును గ్రహించియే మన ప్రాచీనులు గురుకులములను నిర్మించిరి. అనుకూలవాతావరణమునకు దోడుగ నిచ్చట విద్యార్థుల కాచార్యుని యాదర్శవిశేషముగూడ లభించుచుండెడిది. ఆధునిక విద్యాప్రపంచమున విద్యార్థుల వసతిగృహములను నిర్మింపవలెననియు, గురుశిష్యులు గలసియుండవలెననియు, విద్యార్థుల నైతిక సంపద నభివృద్ధిచేయుట విద్యావిధానమునకు ముఖ్యావధియనియు జేయబడు సిద్ధాంతములన్నియు ప్రాచీన గురుకులపద్ధతిలో నిమిడియున్నవి.

నిర్బంధ విద్యాభ్యాసము, ఉచిత విద్య (Free and Compulsory Education) యనునవి యీకాలపు సంస్కరణములలో నగ్రస్థానము వహించుచున్నవి. ప్రాచీనభారతదేశమున ప్రతివారును స్వకులోచితమగు విద్య నభ్యసింపవలసియుండెడిది. లేనిచో వాని కాకులమున తావు లేకుండెడిది. ఆకాలమునందాచార్యులెల్లరు నుచితముగనే విద్యను నేర్పుచుండిరి. స్వాధ్యాయమువలెనే ప్రవచనముగూడ ప్రతివారికిని విధియైయుండెడిది. ఆధునికులు ప్రబలాందోళన ఫలితముగ చట్టమూలమున జేయ యత్నించు నీకార్యమును మన ప్రాచీనులు సులభముగనే తమ మతసాంఘిక నియమముల మూలమున సాధించియుండిరి.

వర్ణవిభజనము:—హిందూమత నియమములకు బిమ్మట జర్చింపవలసినది వర్ణవిభజనమునందలి విద్యావిషయక విశేషములు. ప్రాచీనార్యులు సట్లెజ్ నదీతీరమునందుండినపుడు వారిలో సాంఘిక విభాగములు లేకుండినవి. ఎవరికి నేపనిజేయుటకును విధినిషేధములు లేకుండెడివి. క్రమముగ నార్యభూమియు, దన్మతమునుగూడ నభివృద్ధినందినవి. యజ్ఞయాగాదులును, దత్సంబంధమగు కర్మకాండయు బెరుగుటచే గొందరు ప్రత్యేకముగ నీవిషయమున గృషిసలుపవలసి వచ్చెను. అటులనే యార్యులు గంగామైదానము నాక్రమించి రాజ్యముల నేర్పరచుకొనినపిమ్మట రాష్ట్రరక్షణమును, కృషివాణిజ్యములు నవసరములుగాజొచ్చినవి. మతమునందువలెనే యీ యైహిక విషయములందుగూడ ప్రత్యేక పరిశ్రమ మావశ్యకమయ్యెను. కాన జనులు తమ ప్రకృతుల ననుసరించియు, దమ యర్హత ననుసరించియు నీప్రత్యేకకార్యములందు బ్రవర్తించుచుండిరి. ఇటుల వీరు నెరపు కర్మలు వేరుగ నుండినవి. ఈగుణకర్మలపైననే వర్ణవిభజన మేర్పడినది. అయిన నీ కర్మవిభాగములు చాలకాలమువరకును వృత్తివిభాగములుగనేయుండినవి. వానిమూలమున సాంఘికవిభాగము లేర్పడియుండలేదు. ఈ కర్మలను బరిగ్రహించునెడ జన్మమేవిధమగు యోగ్యతానర్హతలను దెచ్చిపెట్టియుండలేదు. జనకుడు, జాబాలి మున్నగు క్షత్రియులు బ్రహ్మజ్ఞానసంపన్నులుగ నుండిరి. క్షత్రియకులసంజాతుడగు విశ్వామిత్రుడు మహర్షియయ్యెను. పంచముడగు వాల్మీకి కవిబ్రహ్మ యయ్యెను. శీలము, మనస్సంయమము, వైదుష్యము ననునవియే యుత్తమవర్ణులకు గావలసిన లక్షణములు. ఆధునికులుగూడ ప్రతివాని ప్రకృతియు నాతని జన్మసమయముననే స్థిరపరుపబడునని, పిమ్మట నాతడు స్వయంకృషిమూలమునను, ఇతరులు, వాతావరణము నొసంగు శిక్షణమూలమునను దనకు బ్రకృతిసిద్ధములగు లక్షణములనే యభివృద్ధిపరచుకొనునని నిరూపించియున్నారు. ఆధునికవిద్యావిధానమున విద్యార్థియొక్క పారంపర్యము (Heredity) న కెక్కువ ప్రాముఖ్య మొసంగబడుచున్నది. మన ప్రాచీన వర్ణవిభజనముగూడ నీసిద్ధాంతముపైననే నిర్మింపబడినది. ప్రతివానికిని బ్రకృతి యొకవిధముగా బ్రవర్తనమును, వృత్తిని, అర్హతను (Fitness and aptitude) ఏర్పరచుననియు, నాతడట్టి వృత్తినే యవలంబింపవలయుననియు నభిప్రాయపడియుండిరి. మనస్సంయమమును, ఆధ్యాత్మికచింతనమును సహజగుణములుగ నుండువారలెల్ల నగ్రవర్ణమున కర్హులుగ నుండిరి. దేహబలమును, ధైర్యసాహసములును సహజముగ నుండినవారెల్ల క్షత్రియులుగ

నెంచబడిరి. అటులనే యాముష్మికసాధనములగు కృషి, వాణిజ్యము మున్నగువానియందు ప్రకృతిసిద్ధముగ నభిరుచిగలవార లితరవర్ణములకర్తలుగ నెంచబడిరి. ఇట్టిరో నెల్లరును దమ యిచ్ఛాప్రకృతుల ననుసరించి ప్రత్యేకవృత్తుల ననుసరించుచుండిరి. కొంతకాలమునకు పారంపర్యముగ దండ్రినుండి కొడుకులకు సంక్రమించుటచే నీవృత్తులు ప్రత్యేకత నందెను. క్రమముగ నీవృత్తి విభాగము లనుల్లంఘనీయములగు సాంఘికవిభాగములుగ బరిణమించినవి. ప్రతివర్ణము నారోగ్యములతో సాంఘికజీవితమునందలి యొక్కొకయంశమును జూపుచుండెను. కాన ప్రతివ్యక్తియు నత్యవసరమగు సాంఘికాంగముగ నుండెను. ఆకాలమునం దాత్మవికాసమును, సంఘసేవయు నత్యుత్తమాదర్శములుగ బరిగణింపబడుచుండెడివి. ఇటుల వివిధవృత్తుల కాలవాలములగు వివిధవాతావరణములలో బుట్టిపెరిగిన విద్యార్థులకు వారివారి యోగ్యతావశ్యకతల ననుసరించియే శిక్షణ మొసంగబడుచుండెడిది. ఇట్టివిద్యను నేర్చినపిమ్మట స్వప్రకృతి కనుకూలమగు వాతావరణమునందుండి ప్రతివ్యక్తియు నాత్మసిద్ధిని బడసి సంఘసేవను జేయుట సుకరముగ నుండెడిది. ఆధునికులు సహితము విద్య సాంఘికమనియు, నిర్దుష్టమగు సాంఘికజీవితమును గడపగల వ్యక్తులను నిర్మించుటయే విద్యావిధానమునకు బరమావధియనియు జెప్పుచున్నారు. ఈయాదర్శము లన్నియు బ్రాచీన హిందూ వర్ణవ్యవస్థలో గాంచనగుచున్నవి.

బోధనవిధి:—ప్రాచీన హిందూయుగమునందలి పఠనబోధనవిధులనుగూర్చి కొన్ని విశేషాంశములు దెలియుచున్నవి. ఆధునికవిద్యాతత్త్వజ్ఞులు "తెలిసిన విషయములద్వారా తెలియనివానిని జెప్పవలెను. సులభ విషయములనుండి క్లిష్టవిషయములను సాధింపవలెను; ప్రత్యక్షమునుండి యనుమానమునకు బోవలెను." అను సూత్రములను బోధనసందర్భమున ప్రతిపాదించి యున్నారు. మన ప్రాచీను లీసూత్రములను గ్రహించియే యుండిరి. దృశ్యమానప్రపంచమునందలి పదార్థములను వివరించి వాని లక్షణములను దెల్పు శాస్త్రములును, మానవీయము లగు నితరకళలునుగూడ పారమార్థికములుగనే యుండినవి. సుజ్ఞేయములును, సులభములును, ప్రత్యక్షములును నగు విషయములమూలమున ప్రాచీన భారతీయవైదుష్యమంతయు గుహ్యమును, పరోక్షసాధ్యమును, పరమార్థమును నగు బ్రహ్మపదార్థమునే జేర్చునదిగ నుండినది.

శాస్త్రనిర్మాణమున ప్రాచీనులు Inductive method నే యనుసరించిరి. పదార్థతత్త్వమును సవిమర్శముగ వివరించి శాస్త్రకారులు సిద్ధాంతములను సాధకునికే వదలియుండిరి. దానజేసి బుద్ధివికాసమును, తార్కికశక్తిని ఉపయోగించి ప్రతివారును దమకు దోచినరీతిని సిద్ధాంతముల నేర్పరచుకొనుటకవకాశ మేర్పడెను. ఇట్లు మతాంతరములు, పక్షాంతరములు నేర్పడి విజ్ఞాన మభివృద్ధినందుచుండుటయు, వ్యక్తుల కిచ్ఛాస్వాతంత్ర్య మొదవుటకును అవకాశ మేర్పడెను.

పూర్వము పరిశోధనకును, విమర్శనమునకును నెక్కుడు ప్రాముఖ్య మొసంగబడుచుండెడిని. అనేకులు తమ పూర్వు లొనర్చిన సిద్ధాంతములను విమర్శించి నూతనసిద్ధాంతములను జేసి, వాని ప్రతివాదములమూలమున వానిని బలపరచుకొని ప్రచారము చేయుచుండిరి.

* * *

రెండవ అధ్యాయము

[ఆధారములు

Dutt-Civilisation in the Buddhistic Age
Rhys Davids-Buddhist India
Samaddar-The Glories of Magadha
Satyanarayana-Bauddha Mahayugamu
NarıyanaRao- Pracheena Vidya-
Fithamulu]

బౌద్ధవిద్య

ప్రాచీనకాలమునుండి క్రీ. శ. ౬౪౭. వరకును ప్రబలియుండిన హిందూవిద్యాచరిత్రము నింతవరకు

చా క లి		—మద్దాలి సూర్యప్రకాశరావు, రాజమండ్రి.

వర్ణించియుంటిమి. క్రీ. పూ. ౨౦౦ నుండి క్రీ. శ ౬౪౭ వరకును గలకాలమున హిందూ బౌద్ధమతములు రెండును భారత దేశమున వ్యాపించినవి. ఈ కాలమున బౌద్ధమత మనేకవిధముల ఆదర ప్రోత్సాహములనంది సర్వతోముఖముగ విజృంభించి ఖండాంతరములకును దేశాంతరములకునుగూడ వ్యాపించినది. బౌద్ధులు తమ మతాచారముల ననుసరించి ప్రత్యేకవిద్యావిధానమును, విద్యాసంస్థలను నిర్మించిరి. ఈకాలపు రాజకీయాది పరిస్థితులను బూర్వప్రకరణమున వివరించియుంటిమి. బౌద్ధయుగమునందలి బౌద్ధవిద్యాచరిత్రము నభివర్ణించుటకు బూర్వము బౌద్ధసిద్ధాంతములను, బౌద్ధమతచరిత్రమును, బౌద్ధహిందూమతములకు గల పరస్పరసంబంధమును సంగ్రహముగ బరిశీలింపవలసియున్నది.

I. బౌద్ధమతము

క్రీ. పూ. ౫-వ శతాబ్దినాటికి వైదిక మతిబహుళమై, కష్టసాధ్యముగ నుండెను. వాఙ్మయమును, తత్త్వమునుగూడ కేవలపాండితీసాధ్యములై, ప్రజాసామాన్యమునకు దురవగాహములును, నిరర్థకములును నైనవి. అందుచే బామరులకు దైవంకినజీవితమునం దత్యవసరము నాధ్యాత్మికబోధనము గరవయ్యెను. అట్టిసమయమునం దిర్వురు క్షత్రియవీరులు బయల్వెడలి యీ సమస్య నెదుర్కొనిరి. వీరే వర్ధమాన గౌతములు. విశేష కష్టములేకనే ప్రజాసామాన్యము పాపభీతియు, సౌహార్దము నలవడజేసికొని శాంతియుతజీవితములను సాగించునటుల లొనర్చుటయే యీసంస్కర్తల ముఖ్యోద్దేశ్యము. గౌతము డనేకదేశముల దిరిగి ప్రజాతత్త్వమును గ్రహించియు, సుదీర్ఘకాలము చింతనజేసియు నొక నూతన తత్త్వమును గన్గొని యెల్లరకును బోధింపసాగెను. అందలి ముఖ్యాంశము లీక్రింద పేర్కొనబడియున్నవి:

౧. దృశ్యమానమగు నీప్రపంచము నశ్వరము.

౨. మానవజన్మము సుఖాపేక్షియై యనేక దుఃఖముల ననుభవించును.

3. తృష్ణయే సర్వదుఃఖములకును గారణము. దీనివలననే దుష్కార్యప్రవృత్తి గల్గును.

౪. కాన వాంఛలను తెగటార్పవలయును.

౫. నిర్వాణమే పరమపురుషార్థము. దానిని జెందుటకు భూతదయ, సౌభ్రాత్రము, సర్వసమభావము, వినయము, నిరాశ మున్నగునవి సాధనములు.

ఈ సిద్ధాంతములు సర్వజనాకర్షకములుగ నుండుటచే శీఘ్రముగ ననేకు లీబౌద్ధమతము నవలంబింప జొచ్చిరి. ఇట్టివారిలో రెండుతరగతు లేర్పడినవి. సర్వసంగపరిత్యాగ మొనర్చి సన్న్యాసులై సదా యాధ్యాత్మికచింతన మొనర్చువారలు కొందరు. వీరిలో స్త్రీలున, బురుషులునుగూడ నుండిరి. అటుగాక మరి కొందరు గృహస్థులైయుండియు బౌద్ధధర్మము నవలంబించుచుండిరి. వీర లుపాసకులని పిలువబడుచుండిరి. అనతికాలముననే బుద్ధ, ధర్మ, సంఘ-యనునవి బౌద్ధులకు ముఖ్యాదర్శములుగ నొప్పినవి. ఈమతమున మరికొన్ని విశేషాంశము లుండినవి:—

౧. ఇందు జాతివర్ణభేదములు లేవు.

౨. పండితసాధ్యమగు గీర్వాణభాషను వదలి బుద్ధుడు, నాతనియనుచరులును దమమతబోధనలను దేశీయభాషలలోనే చేయుటచే నామతవాఙ్మయ మాయాభాషలలో నిర్మింపబడినది.

3. బౌద్ధులు వేదముల ప్రామాణ్యము నంగీకరింపరు.

౪. స్త్రీపురుషులకు సమానములగు నధికారగౌరవములు గలవు.

౫. భిక్షుభిక్షుణీజనముల కేకాంతవాస మవసరమగుటచే వీరలకై యనేకములగు నారామవిహారములు నిర్మింపబడుచుండెడివి.

౬. ప్రతివారికి నెనిమిదవయేట 'పబ్బజ్జ' యను సంస్కారపూర్వకమగు మతప్రవేశమును, యిరువదవయేట 'ఉపసంపద' యను మతదీక్షయు నొసంగబడుచుండెడివి.

౭. బౌద్ధు లెల్లరును సౌశీల్య, నిస్సంపత్త్వ (Poverty), ఆత్మసంయమములను, గలిగియుండవలెను.

౮. భిక్షువులు భిక్షాటనమూలమున నాహారమును సంపాదింపవలెను.

౯. పాపకార్యముల నొనర్చినవారలు బహిరంగముగ వానిని దెలిపి నిజముగ పశ్చాత్తాపము నందుటచే బరిశుద్ధు లగుదురను సిద్ధాంతము బౌద్ధులలో నుండెడిది.

ఇటులు క్రీ. పూ. ౬-వ శతాబ్దమున గౌతమునిచే బ్రవర్తింపబడిన యీ నూతన మతమునకును, ప్రాచీనవైదికమతమునకును అనేకసాదృశ్యవైదృశ్యము లుండినవి. బౌద్ధమతము కేవలము విలక్షణమగు నూతనమతము గాదనియు, నందలి సిద్ధాంతములు, నాచారములు ననేకముగ వైదికమతముపై నాధారపడియున్నవనియు బండితుల యభిప్రాయము. పూర్వజన్మకృతకర్మవలననే సుఖదుఃఖానుభవము గల్గుచుండుననియు, జన్మబాహుళ్యము, తృష్ణావిషయేచ్ఛలే సర్వదుఃఖమూలములనియు, నిస్సంగమగు సన్న్యాసమే మోక్షసాధనమనియు, వాసనారాహిత్యమే ముక్తిలక్షణమనియు నీరెండుమతములును జెప్పుచున్నవి. వర్ణభేదమును, యజ్ఞయాగాదిరాహిత్యమును దప్ప హిందూబౌద్ధగృహస్థధర్మములకు భేద మేమియు లేదు. అయిన నీరెండుమతములకు నొక ముఖ్యవైషమ్యము గలదు. వైదికమతమంతయు పరబ్రహ్మపదార్థ నిరూపకమై యుండ బౌద్ధధర్మ మనాత్మవాచకముగ నున్నది. పరమాత్మపదార్థము కేవలము మిథ్యయని బౌద్ధుల సిద్ధాంతము.

బుద్ధునికి బిమ్మట వైదిక బౌద్ధ మతములకు విశేషముగ సంపర్క-సంఘర్షణములు జరగుటచే నీ రెండుమతములందునుగూడ గొన్నిమార్పులు జరగినవి. మొదట బౌద్ధగ్రంథములన్నియు పాళీభాషలోనే నిర్మింపబడియుండినను, దమ సిద్ధాంతములు వైదికపండితులకు సుగమములుగ నుండుటకై బుద్ధుని తరువాతివారలు తమ గ్రంథములను సంస్కృతములోనికి బరివర్తించిరి. వర్షాకాలమున సంచారమును మానివేయుట, చాతుర్మాస్యదీక్ష నవలంబించుట, అనధ్యాయదినములను బాటించుట-మున్నగు వైదికాచారములను బౌద్ధు లనుకరించిరి. మహాయానశాఖకు జెందిన బౌద్ధుల గ్రంథము లనేకములు హిందూపురాణముల కనుకరణములే. వారి యవలోకితేశ్వరచరిత్రము విష్ణుభాగవతపురాణములను సూచించును. హిందువులు బౌద్ధసిద్ధాంతములను, బౌద్ధులు వైదికసిద్ధాంతములను బఠించుచుండిరి. కాలక్రమమున హిందూమతము బుద్ధుని యొకయవతారముగ బరిగణించి బౌద్ధధర్మమును దనలో నిముడ్చుకొనియెను. వాస్తవముగ వైదికమతమునందలి యాధ్యాత్మికాదర్శములను సాధించుటకు బౌద్ధమతమునందలి నైతికసాంఘికవిధు లౌపచారికములుగ నుండుటచే నీ రెండుమతములకును తీవ్రమగు వైషమ్యము లేకుండినది. దానజేసియే యీ రెండుమతములు నేకకాలమున మహోచ్చదశ ననుభవింపగల్గినవి. వీనికి గల సన్నిహితసామ్యమే కడకు బౌద్ధమతము హిందూమతమున గలసి జన్మస్థానమగు నీదేశము రూపుమాయుటకు గారణము.

ఇంతవరకును బౌద్ధమతతత్త్వమును నిర్ణయించియుంటిమి. క్రీ. శ. ౬౪౭ వరకును గల యీమతచరిత్రమునుగూడ సంగ్రహముగ బరిశీలించినచో దాత్కాలిక విద్యాచరిత్రము సుగ్రాహ్యము గాగలదు. గౌతమబుద్ధుని యనంతర మాతనిశిష్యు లీనూతనమతము ననేకవిధముల వ్యాపింపజేసిరి. బుద్ధుడు నిర్వాణమునందిన సంవత్సరముననే బౌద్ధసమావేశ మొకటి గావింపబడెను. ఇందు బౌద్ధులందరును జేరి గౌతముని బోధనలను గూడ బల్కికొనిరి. పిమ్మట మరియొక శతాబ్దమున కింకొక పరిషత్సభ సమావేశమయ్యెను. ఇప్పటికే బౌద్ధులలో నభిప్రాయభేదములు ప్రబలినవి. వీనిని సరిచేయుటకే యీపరిషత్సభ యత్నించెను. కాని బౌద్ధులందరును రెండుశాఖలుగ జీలిపోయి నేపాళ, త్రివిష్టప (Tibet), జపానుదేశములలోనివా రుత్తరబౌద్ధులనియు, సయాం, సింహళ, బ్రహ్మదేశములందలివారలు దక్షిణబౌద్ధులనియు పిలువబడుచుండిరి. క్రీ. పూ. 3-వ శతాబ్దమునం దశోక చక్రవర్తి యిటులు క్షీణించుచున్న బౌద్ధమతమునకు జేయూత నొసగెను. ఈత డీమతమున కమూల్యము, నిరుపమము నగు సేవను జేసియుండెను. బౌద్ధధర్మములను శిలాస్తంభములపై వ్రాయించి తనరాజ్యమునందలి వివిధభాగముల బ్రతిష్ఠించియు, ననేకులగు మతప్రచారకులను

దూరదేశములకు సహితము పంపియు నీచక్రవర్తి యనేక విధముల బౌద్ధమతమును వ్యాపింపజేసెను. అంతియగాక నీతడు స్వయముగ మతదీక్షనుగొని, యప్పటికే బౌద్ధమతమునగల వైషమ్యములను సరిచేయుటకై తృతీయ బౌద్ధపరిషత్సమావేశమును గావించెను. ఈసభకుఫలితముగనే యశోకునికుమారుడగు మహేంద్రు డనునాతడు సింహళద్వీపమునకు బోయి యచ్చట త్రిపిటకమును వ్యాపింప జేయుటయును, వేనవేలుగ బౌద్ధభిక్షువులు సింహళ, బ్రహ్మ, శ్యాను, త్రివిష్టపాదిదూరదేశములకేగి బౌద్ధధర్మమును బ్రచారము చేయుటయును జరగినది. క్రీ. పూ. ౨-వ శతాబ్దమునందు మౌర్యవంశ మంతరించినపిమ్మట శుంగవంశజులు మగధరాజ్యము నాక్రమించిరి. వీరు వైదికమతావలంబులై యజ్ఞయాగాదికముల నొనర్చి బ్రాహ్మణమతము నభివృద్ధిపరచిరి. కాన దాత్కాలికముగ బౌద్ధమతమునకు గొంచె మొత్తిడి గల్గెను. దక్షిణాపథమున బ్రబలిన శాతవాహనాంధ్రులు బౌద్ధమతము ననేకవిధముల నాదరించి దేశమును విహారారామశోభితముగ నొనర్చిరి. ఈకాలమున భారతభూమిపై దండెత్తివచ్చిన విదేశీయు లనేకులు బౌద్ధమతము నవలంబించిరి. క్రీ. శ. ౧-వ శతాబ్దమున దిరిగి బౌద్ధమతమునకు మంచిదినములు గల్గినవి. అప్పటికి కుషాను లుత్తరదేశము నాక్రమించి పాలించుచుండిరి. వారిలో నగ్రగణ్యుడగు కనిష్కచక్రవర్తి యశోకునివలెనే బౌద్ధమతము ననేకవిధముల నాదరించెను. స్వబాహుబలముచే మధ్య ఆసియా నంతటిని జయించి యీతడు బౌద్ధధర్మము నచట ప్రచారము చేయించెను. ఈతనికాలముననే బౌద్ధమతమున మహాయానశాఖ ప్రబలినది. హీనయానమని పేర్కొనబడు పూర్వబౌద్ధమతమునం దీకాలమున నాగార్జునుడను భిక్షువు విశేషములగు మార్పులను జేసెను. మహాయానమున వైదికమత సంప్రదాయము లెన్నియో చొప్పింపబడినవి. బుద్ధు డొకయవతారముగను, దైవముగను బరిగణింపబడి యాతని యారాధనము, నుత్సవములు గల్పింపబడినవి. బౌద్ధధర్మము భక్తిరసప్రధానము గాజొచ్చెను. మరియును గనిష్కుడు కుండలివనమున జతుర్థబౌద్ధపరిషత్సభను సమావేశపరచెను. అప్పుడు వసుబంధువనుభిక్షు వగ్రస్థానము నలంకరించెను. అటులు సమావేశమైన పండితు లందరును జేరి బౌద్ధసారస్వతమును దరచి భాష్యములను వ్రాసిరి. ఈసభకుఫలితముగ నుత్తర-ఆసియా ప్రాంతములందెల్ల మహాయానమతము వ్యాపించినది. కనిష్కు డనేకవిహారములను, సౌధములను నిర్మించెను. ఆతనికి బిమ్మట బౌద్ధమతమునకు దుర్దినము లేతెంచినవి. ఇందలి మహాయానమతము వైదికమతమును సర్వవిధముల బోలియుండుటచేతను, బౌద్ధసంఘమున దురాచారములు బ్రబలుటచేతను, బౌద్ధమతము రూపుమాయదొడగెను. వీనికన్నను ముఖ్యమగు కారణము గుప్తవంశీయులకాలమున జరిగిన వైదికమత పునరుద్ధరణము. కుషానులకు బిమ్మట గుప్తవంశీయులు మగధరాజ్యము నాక్రమించిరి. వీరలు వైదికధర్మనిరతులై తన్మతము ననేకవిధముల బోషించిరి. ఇతిహాసపురాణాదికము లొకవంక గ్రంథస్థములగుచుండ, కాళిదాసాదిమహాకవు లింకొకవంక గీర్వాణభాషాయోషకు నూతనాలంకారములను సమకూర్చుచుండ, హిందూ దేవాయతనము లింకొకవంక వేనవేలుగ నిర్మింపబడుచుండ, నిరుపమతేజోవంతమై వెలుగొందుచుండిన హిందూదీపికలో బౌద్ధధర్మము లీనమైపోయినది. దక్షిణాపథమునగూడ నీవైదికమతవిజృంభణ మీకాలమున గాంచనగుచున్నది. గుప్తచక్రవర్తుల యనంతరము శ్రీహర్షునికాలమున బౌద్ధమతము కడసారి యొకవెలుగు వెలిగినది. ఈచక్రవర్తికాలమున బౌద్ధబ్రాహ్మణమతములు రెండును బ్రబలినవి. స్వయముగ నీతడు బుద్ధభక్తుడై బౌద్ధుల ననేకవిధముల సత్కరించెను. సర్వమతముల నీతడు సమానముగ జూచెను. ఈతడుగూడ నొకబౌద్ధపరిషత్సభను సమావేశపరచి మతవైషమ్యములను జక్కబరుప యత్నించెను. మహావైభవముతో జరగిన యీసభలో తుదకు మహాయానమతమే సర్వోత్కృష్టమని నిశ్చయింపబడినది. చక్రవర్తి తనసర్వస్వమును బౌద్ధభిక్షువులకు, నితరమతప్రవర్తకులకును ధారవోసెను. శ్రీహర్షునియనంతర ముత్తరాపథము నంతటి నేలిన ఘనుడు లేకుండెను. దానజేసి బౌద్ధధర్మము

నిరాలంబమయ్యెను. పిమ్మట మగధరాజ్యమునేలిన కడపటి గుప్తవంశీయులు గొంతవరకును బౌద్ధుల నాదరించిరి. వీరిచరిత్రము నాలందావిక్రమశిలావిశ్వవిద్యాలయముల చరిత్రమున జేర్కొనబడును.

II. విద్యావిధానము

ఇంతవరకును బౌద్ధమతసిద్ధాంతములను జేర్కొని యామతచరిత్రమును సూచించియుంటిమి. ఇటుపై బౌద్ధవిద్యావిధానమును వర్ణింపవలసియున్నది. బౌద్ధవాఙ్మయమంతయు సూత్ర, గేయ, నిదాన, వ్యాకరణ, గాథా, అవదాన, వదాన, ఇత్యుక్త, ఉపదేశ, జాతక, అద్భుత, ధర్మ, వైపుల్యయను విభాగములను జొన్నైయుండెను. ఈవాఙ్మయమును, మతధర్మమును బ్రచారముచేయుటకై యొకప్రత్యేకవిధానము నిర్మింపబడెను. విద్యాపోషణము రాజులకు ముఖ్యకర్తవ్యమై యుండెను. వారలు, గురుశిష్యులు నిశ్చలమనస్కులై విద్యావ్యాసంగము చేయుట కనువగు ప్రశాంతస్థలములలో ననేకములగు నారామవిహారములను నిర్మించి వానికి భూములను, ద్రవ్యమును దానము చేయుచుండిరి. కడపటి గుప్తపాలకులగు శక్రాదిత్య, బాలాదిత్యాదులు నాలందా విశ్వవిద్యాలయమునం దెన్నియో కట్టడములను గట్టించిరి. విద్యాభ్యాసము పూర్తియైనపిమ్మట ననేకులు రాజాస్థానముల కేగి యున్నతోద్యోగములను బడయుచుండిరి. పదిసంవత్సరములు భిక్షువులై యుండి నిష్కళంకచరిత్రులగువార లుపాధ్యాయులుగ నుండిరి. విద్యార్థికి త్రిపిటకాంతమువరకును విద్యను నేర్పి, యాతని ప్రవర్తనమును నీతిమార్గమున జొప్పించి, యాతని దనపుత్రునివలె బ్రేమించు టాకాలపు గురువులకు విధియైయుండెను. శిష్యులుగూడ గురువునెడ పుత్రునివలె బ్రవర్తించి, భిక్షాటనమునం దాతని ననుసరించి యాతనికి సపర్యలొనర్చుచు, విద్యలుపూర్తియగువరకు నాతనివద్దనే యుండవలసియుండెను. ఈవిద్యావిధానమునందలి శిక్షణముగూడ కఠినముగనే యుండెను. ఉల్లిపాయ, మద్యము మున్నగు తామసపదార్థములు నిషేధింపబడినవి. దేహమునం దస్వాస్థ్య మొదవినచో నుపవాసము విధింపబడెను. సాయంకాలమున గురుశిష్యులు కొంత దూరము నడచి దేహపరిశ్రమ మొనర్పవలసియుండెను.

ఈత్సింగ్, హ్యూన్‌త్సాంగ్ అనుచైనాదేశయాత్రికులవ్రాతలవలన బౌద్ధవిద్యాప్రణాళికను గూర్చి విశేషాంశములు దెలియుచున్నవి. సాధారణముగ బాలురకారవయేట నక్షరాభ్యాసము చేయబడుచుండెడిది. వారక్షరములను, చిన్నచిన్నమాటలను నేర్చుట కొకసంవత్సరము పట్టెడిది. ఎనిమిదవయేట వారు "సిద్ధా" యను గద్యపఠనమును జేయుచుండిరి. అటుపై "సిద్ధాంత" మను పండ్రెండుప్రకరణములుగల వ్యాకరణము వారికి బోధింపబడుచుండెడిది. ఈవిధానము మన ప్రకృత ప్రారంభవిద్యాప్రణాళికకు సరియగుచున్నది. ఇటుపై నభిరుచి ననుసరించి బాలురు కళలు, పరిశ్రమలు, వైద్యము, తర్కము మున్నగువానిలో ప్రత్యేక కృషి నొనర్చుచుండిరి. ఇయ్యది ప్రస్తుతవృత్తివిద్యకు సరియగును. అటుగాక ఇంకను విద్యాభ్యాసమును సాగింపనెంచువారు పాణినీయ సూత్రములను, ధాతుపాఠమును, ఖిలప్రకరణములను, వృత్తిసూత్రములను బఠించి, యిరువదవసంవత్సరమున విద్యాభ్యాసమును బూర్తిచేయుచుండిరి. ఇంకను విశేషప్రజ్ఞ నార్జింపదలచినవారలకుగూడ నొకప్రత్యేక ప్రణాళిక యేర్పరుపబడెను. గద్యపద్యరచనము, హేతువిద్య, అభిధర్మకోశము, న్యాయద్వారా తర్కశాస్త్రము, పాతంజలి మహాభాష్యము, భర్తృహరిసూత్రము, వాక్యవృత్తి, పెయినము, వినయపిటకము మున్నగు విషయము లిందలిభాగములు.

బౌద్ధవిద్యావిధానమునందలి బోధనవిధులలోగూడ గొంతప్రత్యేకత గాంచనగుచున్నది. బ్రాహ్మణవిద్యార్థులవలెనే బౌద్ధబాలురుగూడ ప్రాయికముగ విషయములను గంఠస్థములుగ నొనర్చుకొనుచుండినను, ఇచ్చట వాక్యార్థమునకును, చర్చలకును విశేషముగు ప్రామాణ్య మీయబడెను. విఖ్యాతవిద్యాలయములన్నిటియందునుగూడ బండితశ్రేష్ఠు లొకప్రత్యేకభవనమున జేరి యచ్చట తత్త్వమునుగూర్చి వాదోపవాదములను జేయుచుండిరి. దీనిచే విషయము సుగమమగుటయే కాక

విద్యార్థుల విమర్శనాబుద్ధి పెంపొందుటయు, స్వతంత్ర వ్యాఖ్యానములు బయల్వెడలుటయు జరగుచుండెడిది.

III. విద్యాపీఠములు

బౌద్ధవిద్యావిధానమునకును ప్రాచీనభారతీయ నాగరికతకునుగూడ బౌద్ధవిద్యాలయములు వెలలేని భూషణములు. సుప్రశాంతస్థలములలో నిర్మింపబడి యసంఖ్యాకములగు సౌధగోపురస్తూపములతో రాజిల్లుచు, రాజాదరణమును బడసి, భిక్షుభిక్షుణీజనముల తోడను, పండితప్రకాండులతోడను రాజిల్లి, సరస్వతీ నిలయములై యొప్పిన విద్యాలయము లనేకము లీదేశమున వర్ధిల్లినవి. దూరదేశములనుండి యనేకు లీ యాలయములలో విద్యాభ్యాసము చేయుచుండిరి. ఫాహియాన్ అను చైనాదేశయాత్రికుడు క్రీ. శ. ౫-వ శతాబ్దమున ఉద్యాన, పురుషపుర, మధుర, సంకాశ్య, కన్యాకుబ్జ, శ్రావస్తి, సాకేత, రామగ్రామ, కపిలవస్తు, వైశాలి, పాటలీపుత్ర, రాజగృహ, వారణాసి, గయా, చంపా, తామ్రలిప్తి మున్నగు స్థలములలో సుప్రసిద్ధ విద్యాపీఠము లుండెడివని వ్రాసియున్నాడు. హ్యూయాన్ ష్వాంగ్ అను నాతడు సింహపుర, ఉరశ, కాశ్మీర, పునచ, రాజపుర, నాలందా, వృజ్జి, హిరణ్యపర్వత, పుండ్ర, వర్ధన, కామరూప, సమతట, వేంగీ, ధనకటక, మంహాయట, భరుకచ్ఛ, వల్లభీ, ఉజ్జయినీ, మూలస్థాన విద్యాలయములను దర్శించెను. ఈత్ సింగ్ అను మరియొక యాత్రికుడు తామ్రలిప్తి, హరికేల, రాజగృహ, కుశనగర విద్యాపీఠములను గాంచియుండెను. ఇవికాక యింక ననేకములగు విద్యాలయము లుండెడివి. వాని నామములు సహితము నేడు దెలియకున్నవి. పై విద్యాలయములలో ముఖ్యములగువాని చరిత్రముమాత్ర మిట సంగ్రహముగ జేర్కొనబడుచున్నది:

నాలందా:—బౌద్ధవిద్యాలయములలోనే కాక ప్రాచీనభారతీయవిద్యాపీఠములలోనెల్ల నాలందా విశ్వవిద్యాలయ మగ్రగణ్యము. ప్రస్తుతపు పాట్నాజిల్లాలోని రాజగిరికి ఎనిమిదిమైళ్లదూరమునందున్న బారగాన్ అను గ్రామమున పాడుపడిన చెఱువులును, సుమారు 3000 అడుగులదూరము వ్యాపించిన మట్టిదిబ్బలును పూర్వపు నాలందావిద్యాపీఠ ముండిన స్థలమున నేటికి గానవచ్చుచున్నవి. ఇటీవల ప్రభుత్వమువారి యార్ష శాఖచే నీస్థలమంతయు బరిశోధింపబడి యమూల్యములగు శిథిలములు బయల్వెడలింపబడినవి. అందు సువిశాలములగు భవనములును, చక్కని స్తూపములును, వసతిగృహములును నెన్నియో గలవు. ఈవిద్యాలయము వృద్ధిలోనుండినపుడిటకేతెంచిన యాత్రికుల వ్రాతల నుండి యిందలి శిథిలములను గుర్తించుటకు వీలగుచున్నది. తారానాథుడను చరిత్రకారు డీస్థలమున శారిపుత్రుడను భిక్షువు జన్మించెననియు, నాతనిచైత్యమును జేరి యశోక చక్రవర్తి యొకయాలయమును నిర్మించెననియు వ్రాసియున్నాడు. హ్యూయాన్ ష్వాంగ్ అనునాతడు శక్రాదిత్యుడనురాజు నాలందాసంఘారామమును నిర్మించెననియు, నాతనికి బిమ్మట రాజ్యమేలిన బుధగుప్త, తథాగతగుప్త, బాలాదిత్య, వజ్ర యనువార లిచ్చట ననేకభవనములను నిర్మించిరనియు వ్రాసియున్నాడు. అటుపై నింకొకరాజీయారామములచుట్టు నొకగోడను గట్టించి యందొక ద్వారమును వేయించెను. దీనినుండి క్రీ. శ. ౫౪౦ నాటికీవిద్యాపీఠము గుప్తరాజుల యాదరము నందెనని స్పష్టమగుచున్నది.

ఇందు సుందరశిల్పవిరాజమానములగు గోపురములు, గిరిశృంగములను ధిక్కరించు బురుజులు నుండెడివి. సౌధములందలి పైయంతస్తులు మేఘమండలమును దాటియుండ వానిపై నిర్మింపబడిన గ్రహదర్శనశాలలు (Observatories) సాధారణముగ నదృశ్యములుగ నుండినవి. భిక్షువులు నివసించుటకు నాల్గంతస్తులభవనము లుండినవి. వానియందలి స్తంభములును, దూలములును చక్కని శిల్పనైపుణిని జూపుచుండినవి. వాని పైభాగమునం దమర్పబడిన పెంకులు సూర్యకాంతిలో వింతవింతలగు రంగుల నీనుచుండెడివి. ఇందలి గోపురముల మధ్య సువిశాలములు, మహోన్నతములు నగు భవనము లుండెడివి. ఇందు నిరంతరమును శాస్త్రవాదములు జరగుచుండెడివి. గోపురముల కిరుపార్శ్వములను చైత్యములును, ఆలయములును ఉండెడివి. వీనికి బాహ్య

ప్రదేశమున భిక్షువులవసతు లుండెడివి. వీని చుట్టును మనోహరములగు కాసారములు, ఆహ్లాదకరములగు మామిడితోపులు నుండెడివి. కాసారములందలి స్వచ్ఛమగు నీటిపై నల్లకలువలు, రక్తవర్ణములగు కణకపుష్పములు నీప్రదేశమున కంతటికిని విలక్షణమగు శోభ నొనగూర్చుచుండినవి. ఈవిద్యాలయమున శిక్షణము నందుటకై కొరియా, మంచూరియా, బొఖారా మున్నగు దూరదేశములనుండికూడ ననేకు లేతెంచుచుండిరి. ఇందలిజనులు ౧౦౦౦౦ లకు మించి యుండిరి. ఇచ్చటి భిక్షువులందరును మహామేధా సంపన్నులు. వారి ప్రవర్తనము నిష్కళంకము. ఈవిద్యాపీఠమునందలి శిక్షణ మతికఠినముగ నుండెను. ఇందు ప్రవేశమునందుటకుబూర్వ మెల్లరును ద్వారమును గాచి యుండు పండితశ్రేష్ఠునితో వాదించి యాతనియనుమతి పైననే లోని కేగవలసియుండెను. ఈపరీక్షయందుత్తీర్ణులైనవారలు లోపలి మహాభవనములలో జరగుచుండెడి వాదప్రతివాదముల నాకర్ణించి తమ యల్పజ్ఞతను దెలిసికొనుచుండిరి. ఇచ్చట విద్య నేర్చినవారలకు దేశమునందంతటను విశేషమగు గౌరవము చూపబడుచుండెను. క్రీ. శ. ౭-వ శతాబ్దమునందిచ్చట నెనిమిది కళాశాలలు, మూడువందలకు మించిన సౌధములు నుండెడివి. ఇచ్చటియాచార్యులలో నాగార్జున, అశ్వఘోష, వసుబంధు, దిఙ్నాగ, కమలశీల, సంఘభద్ర, శాంతరక్షిత, వీరదేవ, మంజుశ్రీదేవ, శ్రీజ్ఞాన మున్నగువారల నామములు వినవచ్చుచున్నవి. వీరిలో నెల్ల నాగార్జును డగ్రగణ్యుడు. విశేషప్రజ్ఞాశాలియగు నీతడు నాలందావిద్యాపీఠమున శిక్షితుడై వైద్య, జ్యోతిష, రసాయన, తత్త్వశాస్త్రములపై నెన్నియో గ్రంథములను రచించెను. పిమ్మట నీత డావిద్యాపీఠమున కధ్యక్షుడై మాధ్యమిక సిద్ధాంతమును బ్రతిపాదించెను. ఈవిద్యాలయమున విఖ్యాతమగు నొక భాండాగారముండెడిది. ఇయ్యది రత్నసాగర, రత్నోదధి, రత్నరంజక యను మూడుభవనములలో నుండెడిది. రత్నోదధియను తొమ్మిదియంతస్తులభవనమున ప్రజ్ఞాపారమితా సూత్రము మున్నగు బౌద్ధగ్రంథములన్నియు నుండెడివి.

రాజులందరు నీవిద్యాపీఠమున కనేకవిధముల సహాయమొనర్చుచుండిరి. హ్యూయాన్ ష్వాంగ్ కాలమున నూరుగ్రామములపై యాదాయ మీవిద్యాలయమున కొసంగబడుచుండెడిది. ఆగ్రామములందలి గృహస్థులందరును బియ్యము, పాలు, వెన్న, ఫలములు మున్నగు తినుబండములను ప్రతిదినమును బంపుచుండిరి. దానం జేసి యిందలి విద్యార్థులకు భిక్షాటనావసరము లేకుండెడిది.

ఈవిద్యాలయమున బ్రతివిద్యార్థియు నొకగురువు నొద్దనే యుండి యాతనికి శుశ్రూష చేయుచు విద్య నేర్చుచుండెను. ఇదిగాక విరామసమయములలో నాతడు ఆచార్యులు చేయు వాదోపవాదములనుగూడ వినుచుండెను. మహాయానమును, మఱి పదునెనిమిది బౌద్ధదర్శనములును, వేదములు, హేతువిద్య, శబ్దవిద్య, చికిత్సావిద్య, తంత్రము, సాంఖ్యము, వ్యాకరణము మున్నగునవియు నీవిద్యాలయమున నేర్పబడుచుండెడివి. ఇచ్చట సూత్రములను, శాస్త్రములను బోధించువారలు వేయిమందియు, తత్త్వరహస్యములను జెప్పగలవారలైదువందల మందియు నుండిరి. ఇచ్చట నూరుపన్యాసవేదిక లుండెడివి. ధర్మపాల, చన్ద్రపాల, గుణమతి, ప్రభామిత్ర, జ్ఞాన చంద్ర, శీలభద్రాద్యాచార్యు లనేకులు వీనినుండి యుపన్యాసములను జేయుచుండిరి.

క్రీ. శ. ౯-వ శతాబ్దమున విక్రమశిలావిద్యాలయము విజృంభించినపిదప నీనాలందావిద్యాపీఠము పూర్వౌన్నత్యమును గోలుపోయెను. అయిన నీవిద్యాపీఠము ౧౨-వ శతాబ్దమువరకును వర్ధిల్లి పిమ్మట మహమ్మదీయులచే నాశమొనర్పబడెను. ముదితభద్రు డనునాత డిందలి కొన్ని భాగముల నుద్ధరించెను. తుద కీవిద్యాలయము హుతాశనున కాహుతి యయ్యెను. “క్షమచే కోపమును, సత్కార్యములచే దుష్టులను, దానముచే లోభులను, సత్యముచే మృషావాదులను జయింపవలెను” “ధర్మము, నధర్మము నొకేవిధమగు ఫలము నీయవు. అధర్మము నరకమున కీడ్చుకొనిపోవ ధర్మము మనుజునికి స్వర్గమున శాశ్వతనివాసము నొనగూర్చును” అను నాలందావిశ్వవిద్యాలయాదర్శములు సర్వకాలములం

దును, సర్వదేశములందునుగూడ ప్రాచీనభారతీయుల నైతికశుద్ధిని, హృదయవైశాల్యమును వేనోళ్ళ జాట గలవు.

విక్రమశిల:—నాలందావిద్యాపీఠమునకు ప్రత్యర్థియై యనతికాలముననే దానిని మించి విజృంభించిన దీవిక్రమశిలావిద్యాపీఠము. దీని శిథిలములైనను నేడు కానరాక స్థలనిర్ణయముసహితము క్లిష్టముగ నున్నది. గంగానదికి కుడిభాగమున భాగల్పురమువద్ద నుండు పాతర్ ఘాటాకొండలపై నీవిద్యాలయ ముండియుండునని పండితులప్రకృతాభిప్రాయము. క్రీ. శ. ౮౧౦-వ సంవత్సరమున ధర్మపాలుడను పాలరాజు దీనిని స్థాపించెను. మొదట నిచ్చట నూర్గురాచార్యులు వివిధవిషయములను బోధించుచుండిరి. వీరుగాక కొందరు భిక్షువులుగూడ నిటనుండిరి. ఈ విద్యాపీఠమును ఆర్గురుసభ్యులుగల సంఘము రాజాదరణముచే నిర్వహించుచుండెను. ఇచ్చట విద్యాభ్యాసమును ముగించినవారిని రాజులు "పండిత" యను బిరుదము నిచ్చి గౌరవించుచుండిరి. రత్నవజ్ర, జేతారి, దీపంకర, రత్నకీర్తి, జ్ఞానశ్రీమిత్ర, రత్నాకరశాంతి మున్నగువార లిట్టి పండితులలో నగ్రగణ్యులు.

విక్రమశిలావిద్యాపీఠమున నారుద్వారము లుండెడివి. వానివద్ద దిగ్దంతులగు పండితు లుండిరి. వీరిలో ప్రజ్ఞాకరమతి యనునాతడు దక్షిణద్వారమును, రత్నాకరశాంతి ప్రాగ్ద్వారమును, వాగీశ్వరకీర్తి యుత్తరద్వారమును, నరోపంతయనునాతడు పశ్చిమద్వారమును నొకప్పుడు రక్షించుచుండిరని తారానాథుడను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. ఇందలి భిక్షువులకు, నాచార్యులకును రాజులు వసతుల నేర్పరచిరి. విద్యాలయమధ్యమున నొకవిశాలసౌధ ముండెడిది. అందలి యారుద్వారములకు నెదురుగా నారువిశాలము లగు కళాశాల లుండెడివి. ఒక్కొకకళాశాలలో నూటయెనమండుగు రుపాధ్యాయు లుండిరి. ఇదిగాక నీయంతర్భాగమునం దొకేసారిగ నెనిమిదివేలమంది యుపాసకులు నిల్చుటకు సరియగు బహిరంగప్రదేశ ముండెడిది. ఒక్కొకద్వారముకడనుండు పండితు డొక్కొక కళాశాల కధ్యక్షుడుగ నుండెను. విద్యాపీఠమును ప్రవేశించుటకు బూర్వ మభ్యర్థులెల్లరును ద్వారపండితునిచే బరీక్షింపబడుచుండిరి. ఈవిద్యాలయమునందు విద్యార్థులకు భోజనాదిసౌకర్యములను గల్గించుటకై ధర్మసత్రము లుండెడివి. వీనికి రాజులును, ధనికులును వసతులను గల్పించుచుండిరి. ఈవిద్యాపీఠముచుట్టును గల గోడపై సింహద్వారమునకు దక్షిణపార్శ్వమున నాగార్జునునియొక్కయు, నుత్తరపార్శ్వమునం దతిశునియొక్కయు చిత్రములు వ్రాయబడియుండినవి. ఈవిధమున పండితశిఖామణు లిచ్చట బహూకరింపబడుచుండిరి.

విక్రమశిలావిద్యాపీఠము బౌద్ధతంత్రమునకు విశేషఖ్యాతి వహించియుండెను. క్రీ. శ. ౫-వ శతాబ్దమునం దింద్రజాలాదికములతో గూడిన తంత్రశాస్త్రము బౌద్ధులలో ప్రబలి ౮, ౧౦ శతాబ్దములలో విశేషముగ నభివృద్ధి నందినది. ఏకేశ్వరాత్మకమగు మహాయానబౌద్ధమునం దీశక్త్యారాధనపరమగు తంత్రము చొప్పింపబడినది. వ్యాకరణ, వేదాంత, తర్కములు పిమ్మట పేర్కొనవలసిన విషయములు. నాలందా విద్యాపీఠమునకు బిమ్మట విశేషవిఖ్యాతిని గాంచిన యీ విద్యాపీఠము తుదకు భక్తియార్ ఖిల్జీచే నాశమొనర్పబడెను.

ఒదంతపురి:—ఒదంతపురి బీహారులో నుండినది. ఈ నగరమున కుద్దండపురమను నామాంతరము గలదు. పాలవంశీయుడగు గోపాలుడనురాజు క్రీ. శ. ౮-వ శతాబ్దమునం దీవిద్యాపీఠమును నిర్మించెను. ఇచ్చట కేవలమును బౌద్ధగ్రంథములేగాక బ్రాహ్మణవిద్యగూడ గరపబడుచుండెడిది. ఈ విద్యాలయమునందలి గ్రంథాగారము మిగుల ఖ్యాతివహించియుండెను. క్రీ. శ. ౧౧౯౭ లో మహమ్మదీయు లీయుద్దండపురిని జయించి, యిచ్చటిభిక్షువులను, విద్యార్థులను జంపి యిందలిగ్రంథాలయమును నాశమొనర్చిరి.

ఇంతవరకు నుత్తరహిందూస్థానమున బ్రసిద్ధి గాంచిన బౌద్ధవిద్యాపీఠములలో ముఖ్యములగువానిని వర్ణించియుంటిమి. ఈ సమయమున దక్షిణమునగూడ బౌద్ధధర్మము వ్యాపించి యనేకముగ నచ్చటి నాగరికత నభివృద్ధిచేసెను. విహారములు, సంఘారామములు, స్తూపములు మున్నగున వెన్నియో బయల్వెడలినవి. క్రీస్తుశక ప్రారంభమున దక్షిణాపథము శాతవాహనాంధ్రుల పాలనమునం దుండెను. వారిలో ననేకులు బౌద్ధమతము నాదరించియుండిరి. కాన నిచ్చటగూడ భిక్షుసంఘములు విద్యావ్యాసంగము చేయుట కవకాశము లేర్పడినవి. ఆకాలపు విద్యాపీఠములలో నీక్రిందివి ముఖ్యమైనవి:

ధాన్యకటకము:—ఇయ్యది ప్రకృతము గుంటూరు జిల్లాలో ధరణికోట యని పిలువబడు గ్రామము. కృష్ణా నదీతీరమునం దమరావతికి సమీపమున గొన్నిమట్టి దిబ్బలచే నావరింపబడియున్న యీగ్రామ మొకప్పుడు విఖ్యాతినందిన విద్యాపీఠముగ నుండినది. బ్రాహ్మణ బౌద్ధవిద్యలు రెండునుగూడ నిచ్చట ప్రబలినవి. క్రీ. శ. ౨-వ శతాబ్దమున బౌద్ధమతమును సంస్కరించి మహాయానసిద్ధాంతమును నెలకొల్పిన సిద్ధనాగార్జును డీధాన్యకటకవిద్యాపీఠము ననేకవిధముల నభివృద్ధిపరచెను. విదేశయాత్రికుల వ్రాతలనుండి యీవిద్యాలయమును గూర్చిన విశేషాంశములు నాలందావిద్యాపీఠము నందలి గ్రంథాగారములలో పదిలపరుపబడియుండెడివని తెలియుచున్నది. క్రీ. శ. ౭-వ శతాబ్దమునం దీదేశమునకు వచ్చి, బౌద్ధతత్త్వమును దెలిసికొనుచు, బౌద్ధగ్రంథములను సేకరించుచు బర్యటన మొనర్చిన హ్యూయన్ త్సాంగ్ అను చైనాదేశ యాత్రికు డీధాన్యకటకనగరమునం దనేకసంఘారామములు, స్తూపములు నుండెడివనియు నచ్చట విద్యావ్యాసంగములును, బౌద్ధపూజలును నిరంతరాయముగ జరుగుచుండెడివనియు వ్రాసియున్నాడు. టిబెట్ దేశము నందలి "డాపంగ్" సంఘారామ మీధాన్యకటకము నందలి నిర్మాణము ననుసరించియే కట్టబడెననుటలో నీయాంధ్రవిద్యాపీఠముయొక్క మహత్త్వము తెలియుచున్నది.

వేంగి:— బౌద్ధయుగమునం దాంధ్రదేశమున విఖ్యాతిగాంచిన విద్యాపీఠములలో వేంగిపీఠము మరియొకటి. చక్కనిశిల్పములతో విరాజిల్లు నైదంతస్థల హర్మ్యము లిచ్చటి సంఘారామమునం దుండెడివనియు, నిచ్చటిస్తూపము నిరుపమముగ నుండెడివనియు చైనా దేశయాత్రికుల వ్రాతలవలన దెలియుచున్నది. ఇచటి విద్యాపీఠమునకు దిఙ్నాగాచార్యు డధ్యక్షుడుగ నుండెను.

శ్రీశైలము:—ఇచ్చటగూడ క్రీ. శ. ౨, 3 శతాబ్దములలో నొకసంఘారామ ముండెడిది. నాగార్జును డిచ్చట నొకగ్రంథాలయమును స్థాపించి, యనేకుల నిట జేర్చి విద్యోపదేశమును జేసెను.

కాంచీపురము:—ధాన్యకటక, శ్రీశైల విద్యాపీఠములవలెనే బౌద్ధయుగమున గాంచీపురము దక్షిణదేశమునం దొక ప్రఖ్యాతవిద్యాలయముగ నుండెను. ఇట బౌద్ధబ్రాహ్మణవిద్యలు రెండును వ్యాప్తినందినవి. బౌద్ధగ్రంథములనుండి క్రీ. శ. 3-వ శతాబ్దములో నుత్తరమునుండి యిటకు గొందరు భిక్షువు లేతెంచిరనియు, నిటనుండియే బౌద్ధమతము సింహళదేశమున వ్యాపించెననియు దెలియుచున్నది. హ్యూయన్ త్సాంగ్ ఈవిద్యాపీఠమునుగూర్చి ప్రశంసించియున్నాడు.

[సశేషము]

నేటిరష్యా

నార్ల వెంకటేశ్వరరావు

(తరువాయి)

పరిశ్రమలు

విశేషసహజసంపత్తి గలిగియున్నను పాశ్చాత్య దేశములన్నిటిలోను రష్యా పారిశ్రామికముగ నేటికిని చాల వెనుకబడియున్నది. జారు చక్రవర్తులపరిపాలన కాలమున దేశీయపరిశ్రమలకు తగు ప్రోత్సాహము లభింపకుండుటయే దీనికి ముఖ్యమైన కారణము.

జర్మనుయుద్ధమునకు పూర్వము రష్యా పారిశ్రామికముగ నెంత వెనుకబడియున్నదియు క్రిందిపట్టిక వలన స్పష్టపడగలదు:—

	సకటున తలకు ఇనుము ఉపయోగము 3 ఫూడ్సులో	తలకు బొగ్గు ఉత్పత్తి టన్నులో
అమెరికాసంయుక్తరాష్ట్రములు	౧౪	౫.౧
ఇంగ్లండు	౧౧	౬
జర్మని	౧౦	౩.౮
రష్యా	౧½	౦.౨

(3 ఫూడ్ = 3౬ పౌనులు)

పైపట్టికయందు తదితర పాశ్చాత్యదేశములలో కన్న రష్యాంలో ఇనుము, బొగ్గు చాలతక్కువ వాడుకలోనుండె నన్నట్లు చూపబడినది. ౨౦-వ శతాబ్దమున ఇనుము, బొగ్గులు పరిశ్రమలకు ప్రధానావశ్యకములుగాన, అవి తక్కువవాడుకలో నున్నప్పుడు పరిశ్రమలుకూడ తక్కువగ నున్నవనుట ఊహ్యము.

ఇట్లు ౧౯౧౪-వ సంవత్సరపు ఐరోపామహాసంగ్రామమునకుపూర్వమే రష్యాదేశమున పరిశ్రమలు చాల తక్కువగ నుండెడివి. ఆసంగ్రామమునకు ఫలితముగ వానిస్థితి పూర్తిగ చెడిపోయెను. జర్మను "బ్లాకేడు" వలన పూర్వమువలె యంత్రములను, వానిసామగ్రిని దిగుమతిగావించుకొనుట దుస్సాధ్య మయ్యెను. కార్మికులలో పెక్కుమంది ఆయుధపాణులై రణరంగమునకేగవలసివచ్చెను. దేశమునగల కొలదిపెట్టుబడియు (Capital) యుద్ధపరికరములపై వినియోగింపబడుచుండెను. ఈకారణములన్నిటివలనను ౧౯౧౭-వ సం. మున సోవియటుప్రభుత్వము అధికారము వహించుసరికి పరిశ్రమలన్నియు పరిపూర్ణభగ్నావస్థలోనికి వచ్చెను.

అందుచే నధికారమువహించిన కొలదిదినములలోనే (౧౯౧౭ నవంబరు ౧౪-వ తేదీని) సోవియటుప్రభుత్వము దేశములోగల యంత్రాలయములనన్నిటిని స్వాధీనము గావించుకొని, వానిని కార్మికసంఘముల పరిపాలనలో బెట్టెను. ఈపద్ధతి వలన పరిశ్రమలు సత్వరముగ పెంపొందగలవని భావింపబడెను. కాని ౧౯౧౮-౨౦ సం. ములమధ్య ఇంటను బయటనుకూడ గలిగిన యొత్తిడివలన సోవియటుప్రభుత్వము త్వరలో పైపద్ధతిని విసర్జించి నూతనమగుమరొకదానిననుసరింపవలసివచ్చెను. ఈక్రొత్త పద్ధతికి "మిలిటరీ కమ్యూనిజము" (Military Communism) అని నామకరణ మొనర్పబడెను.

మిలిటరీ కమ్యూనిజముపద్ధతిక్రింద ప్రభుత్వమే స్వయముగ పరిశ్రమాలయముల పరిపాలనభారమును వహించెను. ౧౯౨౦-వ సం. మునాటికి దేశము మొత్తముమీద గల షుమారు ౬౯౫ పరిశ్రమాగారములలోను ౪౫౪౭ ప్రభుత్వాధికారములో నుండెను. మిగిలినవిమాత్రము వాని పూర్వపు ఆసాముల చేతులలో నుండెను.

"సుప్రీమ్ఎకనమిక్ కౌన్సిలు" (Supreme Economic Council) అను ప్రభుత్వశాఖ యుద్ధావశ్యకముల కనుగుణముగ పరిశ్రమసంస్థలను పరిపాలించు

చుండెను. దీనియధికారములో ౫౯ కేంద్రము (Head-Centres)లుండెను. ఒక్కొక్క పరిశ్రమభారమంతయు నొక్కొక్క కేంద్రము వహించుచుండెను. అనగా, రసాయనపరిశ్రమయంతయు నొకకేంద్రముక్రిందను, చర్మపరిశ్రమయంతయు మరొకకేంద్రముక్రిందను, కాగితపు పరిశ్రమ వేరొకకేంద్రముక్రిందను-ఇట్లే తదితర పరిశ్రమలు తక్కినకేంద్రములక్రిందను ఉండెను. ఇక, వివిధపరిశ్రమలలో గల యంత్రాలయముల పరిపాలన వానిలో పనిచేయు కార్మికులకమిటీలకు ఒప్పగింపబడెను.

వివిధ పారిశ్రామిక శాఖలచే నుత్పత్తి గావింపబడు వస్తుసముదాయములో నాయాశాఖలలోని కార్మికులకు వలసినభాగమును మిగిల్చి తక్కినదానిని ప్రభుత్వము వశపరచుకొనుచుండెను. ఈ శాఖలకు వలయు ముడివస్తువులను కార్మికులకు ధనరూపమున చెల్లింపవలసిన మొత్తమునకు "కరస్సీనోట్లు"ను (Paper money) ప్రభుత్వమే "సప్లయి" చేయుచుండెను.

ఇట్లు సేకరించిన వస్తుతతిని ప్రభుత్వము ప్రజలకు "రేషనుకార్డ్సు" ప్రకారము పంచిపెట్టుచుండెను. వర్తకవ్యాపారమంతయు "బార్టరు" పద్ధతిపై జరుగుచుండెను. ధనమునిచ్చి వస్తువులను కొనుట, అమ్ముట పరిపూర్ణముగ నిషేధింపబడెను.

ఈపారిశ్రామికపద్ధతి నవలంబించుటవలన సోవియటుప్రభుత్వము ఇంటను బయటను కూడ సంఘటిల్లినయుద్ధములలో జయమంది, తన యధికారమును సుస్థిర మొనర్చుకొనగలిగెను. కాని దానివలన దేశమునకు తదితరవిధముల చాలనష్టము వాటిల్లెను. వ్యక్తిగతవ్యాపారము (Private trade) నిషేధింపబడుట వలన గ్రామస్థుల కత్యంతోపయోగకరమైన గృహపరిశ్రమలు క్షీణించిపోయెను. యుద్ధపరికరముల యుత్పత్తికెక్కుడు ప్రాధాన్య మొసగుటవలన, తదితరపరిశ్రమలకు దెబ్బతగిలెను. ఇట్టివే పెక్కుకారణములవలన ౧౯౨౦-వ సంవత్సరము వచ్చుసరికి పరిశ్రమలు చాల క్షీణస్థితిలోనికి వచ్చెను. ఆసంవత్సరములో పరిశ్రమలెట్టిస్థితియందున్నదియు క్రిందిపట్టికవలన తేటతెల్లము కాగలదు:—

	ఉత్పత్తియందు ౧౯౧౩-వ సం. ములో కన్న తగ్గుదల (నూటికి)
బొగ్గు	౭౮ వంతులు
ఇనుము (ముడిపదార్థము)	౯౮౪ ,,
,, (లోహము)	౯౭ ,,
నూలు	౯౫ ,,
కిరసనాయిలు	౫౮ ,,
పంచదార	౯౮ ,,
రసాయనములు	౯౫ ,,
పాదరక్షలు	౮౯ ,,
పరిశ్రమలు మొత్తముమీద	౮౫ ,,

ఇట్లు పరిశ్రమలన్నియు కడు క్షీణించిపోవుటను గాంచి సోవియటుప్రభుత్వసంస్థాపకులలో నగ్రగణ్యుడగు లెనినుమహాశయు డొక "నూతన-ఆర్థికనీతి" (New Economic Policy)ని ప్రకటించెను. ఈ నీతియే నేటికిని రష్యాపారిశ్రామికజీవితమునకు ప్రాతిపదికగ నున్నది.

నూతన-ఆర్థికనీతి ప్రవేశపెట్టిన సంస్కరణముల నిట్లు సంగ్రహముగ పేర్కొనవచ్చును:—

౧. వ్యక్తిగత వ్యాపారముపై పూర్వపు నిషేధమును తొలగించుట.

౨. గృహపరిశ్రమలకు ప్రోత్సాహ మొసగుట.

3. పారిశ్రామిక సంస్థల పరిపాలనభారమును "ట్రస్టుల" (Trusts) పైనను, "సిండికేటుల" (Syndicates) పైనను మోపుట.

వీనిలో మొదటిరెంటినిగూర్చి వివరింపవలసిన యగత్యము లేదు. కాని మూడవవిషయమును గూర్చి కొంత ముచ్చటింపవలసియున్నది. ఒకేరకపువస్తు సముదాయము నుత్పత్తిగావించు పరిశ్రమాలయముల సమాఖ్యయే ట్రస్టు. ఈట్రస్టులు వ్యాపారసరళిపై నడుపబడుచుం

డును. వీనిలో లాభసాటిగ పనిచేయుచున్న వానినుండి ప్రభుత్వము నిర్ణీతమైన కొంత మొత్తమును పరిగ్రహించును. తద్వ్యతిరేకముగ పనిచేయుచున్న వానికి కొంత ధనసహాయము (Subsidy)నిచ్చును. ఇంతకుమించి ప్రభుత్వము ట్రస్టుల ఆర్థికవ్యవహారములో జోక్యముకలిగించుకొనదు. అవి శాస్త్రయుక్తముగ (Scientifically) వస్తుతతి నుత్పత్తిగావించి, వీలైనంత చౌకగ విక్రయింపవలెనేకాని విపరీతముగ లాభమును బడయుటకు యత్నింపరాదు. దీనికి భిన్నముగ ట్రస్టులు వర్తింపకుండుటకుగాను కొన్ని నిబంధన లేర్పరుపబడినవి. ఉదాహరణముగ వానిలో కొన్ని క్రింద పేర్కొనబడుచున్నవి.—

౧. ప్రతి ట్రస్టు జమఖర్చులెక్కలను జాగ్రత్తగ నుంచవలెను.

౨. వస్తువులను విక్రయించుటలో ప్రభుత్వ సంస్థలకును, సహకారసంఘములకును "ప్రిఫరెన్సు" చూపవలెను.

౩. ప్రభుత్వ వర్తక వ్యాపారశాఖ నిర్ణయించు ధరలకే వస్తువులను అమ్ముచుండవలెను.

సిండికేట్లు ట్రస్టులచే నుత్పత్తిగావింపబడిన వస్తుజాలమును విక్రయించుట కేర్పడిన సంస్థలు. వీనివలన వస్తువులయుత్పత్తిధరపై చిల్లరవర్తకుడు వేసుకొను లాభము తగ్గిపోవును. ఇవి నిర్వర్తింపవలసిన విధులను సంగ్రహముగ నిట్లు ఉదాహరింపవచ్చును:—

౧. మార్కెటును పరిశీలించుట. వర్తకపరిస్థితులను గమనించుట. "ఆర్డరుల" (Orders)ను సేకరించి, వానిని వివిధములగు ట్రస్టులకు తగురీతిని పంచిపెట్టుట.

౨. ప్రభుత్వపు వర్తకవ్యాపారశాఖవారితో కలిసి వస్తువుల ధరను నిర్ణయించుట.

౩. ముడివస్తువులను మొత్తముగ కొనుట, ట్రస్టులకు సప్లయిచేయుట.

౪. క్రయవిక్రయములను గావించుటకు ఏజెన్సీలను ఏర్పాటు గావించుట.

సిండికేట్లలో సభ్యత్వముగల ట్రస్టులు తాముత్పత్తిగావించు వస్తుసముదాయమును విక్రయార్థము వాని కొప్పగించును. ప్రస్తుతము రష్యాలో నిట్టి సిండికేట్లు ౨౦ కి పైగా కలవు.

ప్రభుత్వ పరిశ్రమాలయములన్నియు అనుకరింపవలసిన నీతి ముఖ్యవిషయములను "సుప్రీము ఎకనమిక్ కౌన్సిలు" నిర్ణయించును. ఈ కౌన్సిలును ప్రభుత్వపు పారిశ్రామికశాఖయని చెప్పవచ్చును. ప్రతి రాష్ట్రీయప్రభుత్వములోకూడ నిట్టిశాఖ కలదు. అందుచే ప్రభుత్వపరిశ్రమలను మూడుతరగతులక్రింద విభజింపవచ్చును:—

౧. సమాఖ్యకు సంబంధించినవి.

౨. రాష్ట్రములకు సంబంధించినవి.

౩. పురపాలకసంఘములు మొదలగు స్థానిక సంస్థలకు సంబంధించినవి.

ట్రస్టులును, సిండికేట్లును ప్రభుత్వపరిశ్రమల పరిపాలన భారమును వహించును. ఇక "సుప్రీము ఎకనమికు కౌన్సిలు" పైరెండుసంస్థలును అనుకరింపవలసిన నీతిని నిర్ణయించును.

నూతన-ఆర్థికనీతి ప్రభుత్వపరిశ్రమల పరిపాలన క్రమము నిట్లు నిర్ణయించుటయేకాక ప్రయివేటు పారిశ్రామికసంస్థలకుసహితము కొంతస్థానమును కల్పించెను. వీనిలో మూడురకము లున్నవి. * కేవలము వ్యక్తిగతముగ నిర్వహింపబడు పారిశ్రామిక సంస్థలు మొదటిరకములోనికి వచ్చును. ఇట్టివానిపై కనీసపు పెట్టుబడి (Minimum capital) ని పెట్టవలెను. ప్రతిసంవత్సరమును ప్రభుత్వమునకు కొంత "రాయల్టీ" చెల్లించుకొనుచుండవలెను. ప్రారంభముననే నిర్ణీతమైన ౨౫ సంవత్సరములో, ౫౦ సంవత్సరములో గడచినపిదప సంస్థను ప్రభుత్వవశే మొనర్పవలెను. ఈ

* These are known as "Concessions", "Leases" and "Mixed Companies."

లోఫుగ సంస్థకు సంబంధించిన ఆస్తిని అమ్ముటకుగాని, తాకట్టుపెట్టుటకుగాని వీలుపడదు, ప్రభుత్వము తాను నిర్వహింపలేక కొందరువ్యక్తులకు గాని, సహకారసంఘములకు గాని అద్దెకిచ్చు సంస్థలు రెండవరకము లోనికి వచ్చును. ఇక ప్రభుత్వము ప్రయివేటువ్యక్తులతో భాగస్వామిగ నుండు సంస్థలు మూడవరకములోనికి వచ్చును. ఇట్టివానిలో యంత్రాగారము ప్రభుత్వమునకు చెందియుండును. దానిని పనిచేయించుటకు వలయు పెట్టుబడి ప్రయివేటు వ్యక్తులదై యుండును. ఈమూడుపద్ధతులలో తుదిరెండును అధికముగ ప్రచారములో నున్నవి.

ఇట్టి నూతనమగు నీతి నవలంబించుటవలన పరిశ్రమలు త్వరితముగ వృద్ధినందసాగెను. ౧౯౨౦-వ సం॥ములో పరిశ్రమలు ౧౯౧౩-వ సం. ముతో సరిపోల్చినప్పుడు నూటికి షుమారు ౮౫ వంతులు తగ్గిపోయెనని పైన చెప్పబడెను గదా! కాని నూతన-ఆర్థికనీతిని ప్రవేశపెట్టుటచే నవి క్రమముగ వృద్ధినంది ౧౯౨౬-వ సం. మునాటికి పూర్వస్థితికి రాగలిగెను. ఈవిషయము క్రింది అంకెలవలన సువిదితము కాగలదు :—

(వేలటన్నులలో)

సం.	౧౯౧౩	౧౯౨౧	౧౯౨౨	౧౯౨౩	౧౯౨౪	౧౯౨౫
బొగ్గు	౨౮,౭౭౭	౯,౬౩౧	౧౧,౬౮౧	౧౬,౦౯౮	౧౬,౦౮౩	౨౪,౩౮
కిరసనాయిలు	౯,౨౧౬	౪,౫౨౨	౫,౨౭౫	౬,౦౭౦	౬,౯౬౦	౮,౨౦౫
ఉక్కు	౪,౨౪౭	౧౭౩	౩౦౦	౬౫౩	౧,౨౯౨	౨,౨౦౩
ఇనుము	౩,౫౦౯	౨౫౦	౪౫౭	౬౮౮	౧,౩౯౦	౨,౧౫౭
సిమ్మెంటు	౧,౧౧౮		౧౮౦	౩౫౪	౭౧౬	౧,౨౮౫

(ఇట్లే తదితరములు)

ఇట్లు ౧౯౨౮-వ సం. ము నాటికి సోవియటు ప్రభుత్వము పరిపూర్ణముగ శిథిలమైన పరిశ్రమలను జర్మను మహాసంగ్రామపు పూర్వస్థితికి పునరుద్ధరింప గలిగెను. తదుపరి రష్యాను తదితర పాశ్చాత్యపారిశ్రామిక దేశములతో సరిపోలున ట్లొనర్చునిమిత్తము "ప్రథమ పంచవర్ష పద్ధతి" (First Five Year Plan) ప్రవేశపెట్టబడెను. ఈపద్ధతిని జయప్రదముగ కొనసాగించు నిమిత్తము షుమారు ౨,౦౨౫ కోట్ల రూప్యములను వెచ్చింపవలెనని నిశ్చయింపబడెను. దీనివలన ప్రథమములో అంచనావేయబడిన ఫలితములకన్న నధికమైనవే సిద్ధించెను. ౧౯౩౩-వ సం. ము జనవరి ౭-వ తేదీని రష్యాడిక్టేటరగు స్టాలినుమహాశయు డొక సామ్యవాద పక్షసభలో నుపన్యసించుచు పరిశ్రమలకు సంబంధించినంతవరకు ప్రథమపంచవర్ష పద్ధతివలన కలిగిన ఫలితమునుగూర్చి క్రింది అంకెలను పేర్కొనెను:—

		౧౯౧౩-వ సం. ముతో సరిపోల్చినప్పుడు పరిశ్రమలలో వృద్ధి లేక క్షయము (నూటికి)
సోవియటురష్యా	+	౩౩౪
అమెరికాసంయుక్తరాష్ట్రములు	—	౮౪
ఇంగ్లండు	—	౭౫
జర్మనీ	—	౬౨

		౧౯౨౮-వ సం. ముతో సరిపోల్చినప్పుడు పరిశ్రమలలో వృద్ధి లేక క్షయము (నూటికి)
సోవియటురష్యా	+	౨౧౯
అమెరికాసంయుక్తరాష్ట్రములు	—	౫౬

ఇంగ్లండు	—	౭౦
జర్మనీ	—	౫౫
పోలెండు	—	౫౮

దీనివలన జాతీయాదాయము ౧౯౩౭-వ సం.ములో కంటె నూటికి ౭౫ వంతులును, కార్మికుల రాబడి నూటికి ౬౭ వంతులును, "సోషియలు ఇన్ష్యూరెన్సు ఫండు" నూటికి ౨౯౨ వంతులును వృద్ధినందెను.

ఈ విధముగ ప్రథమ పంచవర్ష పద్ధతివలన రష్యాకు విశేషలాభము కలిగెను. అందుచే త్వరలో (ఒకటి రెండుమాసములలోనే) ద్వితీయపంచవర్ష పద్ధతి ప్రవేశ పెట్టబడనున్నది. ఇదికూడ జయప్రదముగ కొనసాగింప బడెనేని రష్యా పారిశ్రామిక దేశములలో నగ్రస్థానము వహించి, విశేష సహజసంపత్తి గలిగికూడ పారిశ్రామిక ముగ కడువెనుకబడియున్న చైనా, ఇండియా మున్నగు దేశములకు ఆదర్శప్రాయమై నిలవ్వగలదు.

సహకారోద్యమము

జర్మనీయుద్ధమునకు పూర్వము రష్యాలో ౧౦,౦౦౦ సహకారసంఘము లుండెడివి. వానిలో సుమారు ౧౫ లక్షల సభ్యులుండెడివారు. ఆసంఘ ములు సాలీనా మూడుకోట్లపౌనుల చిల్లరవ్యాపార మును చేయుచుండెడివి. అనగా, దేశపుమొత్తము చిల్లరవ్యాపారములో నైదవభాగము పైసంఘముల ద్వారా జరుగుచుండెడిది.

యుద్ధసమయమున రష్యాసహకారోద్యమము కడువ్యాప్తిజెందెను. ౧౯౧౭-వ సం. లో బోల్షివికు విప్లవముజరుగుసరికి సహకారసంఘముల సంఖ్య ౬౫,౦౦౦ కు పెరిగెను. సభ్యులసంఖ్య సహితము కోటికి పైగా హెచ్చెను. ఈసంఘములద్వారా జరుగు చిల్లర వ్యాపారము దేశపుమొత్తముదానిలో సుమారు మూడవ వంతువరకు వృద్ధిజెందెను.

సోవియటుప్రభుత్వమొసగిన ప్రోత్సాహము వలన ౧౯౨౨-వ సం. ము వచ్చుసరికి సహకారసంఘ సభ్యులసంఖ్య ఒకకోటినలభయిలక్షలవరకు పెరిగెను. కానియప్పటిలో రష్యాలో ప్రబలియున్న కాటకపు బాధవలనను, ఇంగ్లండు, ఫ్రాన్సు మున్నగుదేశములు రష్యాపై ప్రయోగించిన బహిష్కారనీతివలనను సభ్యుల సంఖ్యాభివృద్ధి కనుగుణముగ సహకార సంఘముల ద్వారా జరుగువ్యాపారము వృద్ధినందుటకు బదులు తగ్గిపోయెను.

పిమ్మట లెనినుమహాశయుడు ప్రవేశపెట్టిన "నూతన-ఆర్థికనీతి" (New economic policy) క్రింద పరిశ్రమలన్నియు ప్రభుత్వాధికారములో నుంచ బడెను గాని వ్యక్తిగత వ్యాపారము (Private trade) నిషేధింపబడలేదు. ప్రభుత్వము స్వయముగ కొంత చిల్లర వ్యాపారము చేయుచుండెడిది. కాని తద్వారా వ్యక్తిగతవ్యాపారమును పరిపూర్ణముగ నణగద్రొక్కు టకు వీలుపడదు గాన తత్కార్యము సహకార సంఘముల కొప్పగింపబడెను. ఈ యేర్పాటువలన సహకారసంఘములకు విశేష ప్రాబల్యము వచ్చెను. ౧౯౩౭-వ సం.మునాటికి సహకారసంఘసభ్య త్వము ౭ కోట్లకు పైగాను, వానిద్వారా జరుగు వ్యాపారము ౬౫ కోట్ల పౌనులవరకును వృద్ధి నందెను. అనగా మొత్తపు చిల్లరవ్యాపారములో సుమారు సగము సహకారసంఘములద్వారానే జరుగు చుండెను.

రష్యను సహకారోద్యమపు ఘనత కేవలము దానిప్రాబల్యములోనే లేదు. దాని నీతికూడ కడు విలక్షణమైనది. "ఎక్కువ వ్యాపారము, తక్కువ లాభము" అనునదియే దానినీతి. అందువలన దేశపు మొత్తము వ్యాపారములో సగము సహకారసంఘముల ద్వారా జరుగుచున్నను, చాల తక్కువ "డివిడెండు" పంచిపెట్టబడుచున్నది. ఇంగ్లండు లో వాటాదార్లకు పెద్దపెద్ద డివిడెండ్లు పంచిపెట్టుదురు. డివిడెండులో కొంతభాగమును క్రొత్తపెట్టుబడి క్రిందకూడ విని యోగింతురు. కాని రష్యాలో లాభములో నధిక భాగము రిజర్వుక్రింద నుంచబడును. ౧౯౩౭-వ సం. ములో రష్యను సహకారసంఘములకు ౭ కోట్లు పెట్టుబడి యుండెను. దీనిలో కేవలము ౨ కోట్లు

పౌనులు షేరుధనము. తక్కినదంతయు లాభమునుండి సేకరింపబడిన "రిజర్వుఫండు."

రష్యనుసహకార సంఘములు కేవలము నామ మాత్రమున లాభమున కిట్లు వ్యాపారముచేయుటకు కొన్ని ముఖ్యమైన కారణములు కలవు. ఇంగ్లండులో నిప్పటికిని వ్యక్తిగతవ్యాపారము విరివిగ నున్నది. అందువలన సహకార సంఘములుకూడ బజారుధరలకే వస్తువులను విక్రయించుచు, మంచిలాభమును తీయు చుండును. ఇక రష్యాలో నట్లుకాదు. అక్కడ వ్యక్తి గత వ్యాపారము తక్కువ. దానినికూడ రూపుమాప వలెననియే సహకారసంఘముల సంకల్పము. అందుచే నవి దాదాపు కొన్నఖరీదుకే తిరిగి వస్తువులను విక్రయించుచుండును.

నేడు రష్యను సహకారసంఘములలో ౭౪ కోట్లసభ్యు లున్నారు. అనగా, రష్యాలో మైనారిటీ దాటిన స్త్రీ పురుషులందరిలోను ముప్పాతికపాలు సహకారసంఘసభ్యులు. వీనికి ౩౫ కోట్ల పెట్టుబడి గలదు. ఈ మొత్తములో ౧౫ కోట్ల పౌనులు షేరు ధనము. తక్కినది రిజర్వుఫండు. సంఘముల ద్వారా ౧౭౫ కోట్ల పౌనుల వ్యాపారము జరుగుచున్నది. అనగా, దేశపుమొత్తము వ్యాపారములో నూటికి ౭౦ వంతులు వానిద్వారానే జరుగుచున్నది.

చిల్లర వ్యాపారమునకు వలసిన వస్తుసముదాయమునంతయు సోవియటుసంస్థలనుండి కొనుటయు, దానిని తిరిగి విడుదలచేయుటయు మొదలగు కార్యముల నన్నిటిని ప్రస్తుతము సహకారసంఘములు నిర్వర్తించుచున్నవి. లక్షలకొలది కార్మికులు, కర్షకులు, విద్యార్థులు మున్నగువారికి భోజనసౌకర్యములను గావించుటకుకూడ సహకారసంఘములు యత్నించుచున్నవి. ఇట్లు గావించుటవలన స్త్రీలు జీవితమంతయు వంటయింటిలోనే గడుపవలసిన ఆవశ్యకత తప్పుననియు, వారు పరిశ్రమాభివృద్ధికి తోడ్పడుటకును, పాఠశాలలో జేరుటకును వీలుకలుగుననియు ఉద్దేశము. ౧౯౩౦-వ సం. లో సహకారసంఘములయాజమాన్యమున కేవలము నగరములలోనే ౫౩౦౩ హోటల్సు ఏర్పాటు చేయబడెను. ఇవి ప్రతిదినము ౮౫ లక్షలమందికి భోజనపు టేర్పాటు గావించుచుండెడివి. ౧౯౩౧-వ సం. ము జూలై నెల వచ్చుసరికి పై సంస్థలసంఖ్య ౧౩,౯౭౮ వరకు పెరిగెను. అవి ౧ కోటి ౨౦ లక్షల మందికి భోజనసదుపాయ మొనర్పసాగెను. వీని సంఖ్య ప్రస్తుతము మరికొంత హెచ్చినది. ఇట్టి హోటల్సు కేవలము నగరములలోనేకాక గ్రామములలో కూడ నున్నవి.

కేవలము భోజనసదుపాయముల నొనర్చుటయేగాక రష్యను సహకారసంఘములు రొట్టెలను చేసి అమ్ముచున్నవి కూడ. ఇప్పుడు సహకారసంఘముల యాజమాన్యముక్రింద రొట్టెలను చేయు యంత్రాలయములు ౫ వందలకుపైగా నున్నవి. ఇవి రోజుకు ౭౩౦౦ టన్నులరొట్టెను తయారుచేయుచున్నవి. కొలదికాలములో దేశమునకు కావలసిన రొట్టెయంతయు సహకారసంఘములద్వారానే సప్లయి కాగలదు.

ఈ సహకారసంఘములు తమకు వలయు ముడివస్తువుల నిమిత్తము కొన్నివేల యెకరములను సాగు చేయుచున్నవి. వానిపోషణలో ౧,౮౧,౦౦౦ ఆవులు, ౮౨౦౦ ఎద్దులు, ౬౮,౦౦౦ దూడలు, ౧,౧౮,౦౦౦ పందులు కలవు.

దేశము మొత్తముమీద కడు బాహుళ్యముగ వ్యాపారము చేయబడుచున్నను, ఖర్చులను క్రమక్రమముగ తగ్గించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. ౧౯౨౯-వ సం. ము లో సంఘములద్వారా జరిగిన మొత్తము వ్యాపారములో నూటికి ౧౭౪ వంతులు చొప్పున ఖర్చులయ్యెను. ఇవి ౧౯౩౦-వ సం. ము లో ౧౫౪ వంతులకును, ౧౯౩౧-వ సం.ములో ౧౫ వంతులకును తగ్గింపబడెను.

ప్రపంచములో మరియేదేశమందును సహకారోద్యమ మింత ప్రాబల్యములో లేదు. రష్యను సహకారోద్యమము తక్కిన దేశము లన్నిటికిని ఆదర్శప్రాయమైయున్నది. (సశేషము)

చేతిపనులు

దశిక సూర్యప్రకాశరావు

చేతిపనులకు పోటీ యంత్రపరిశ్రమలు. నాల్గువందలయేండ్లక్రిందట ఎక్కడను యంత్రములు లేవు. అంతకుపూర్వ మీఖండ మాఖండ మనుభేదములేక చేతిపనుల నాధారముగా గొనియే కొన్నిదేశములు సుప్రసిద్ధ నాగరకతాశోభ నఖండముగ ననుభవించినవి. పూర్వము అస్సీరియా, ఈజిప్టు, పారశీకము, ఇండియా మున్నగు సామ్రాజ్యముల వింతచెలువు జగమెఱిగిన దే. అటుపిమ్మట గ్రీకు, రోమకసామ్రాజ్యముల చిన్నెవన్నెలు చారిత్రకములే. తదుపరి క్రీస్తుశకము ౧౫-వ శతాబ్దివరకు సర్వప్రపంచము చేతిపనుల కళాసంపదనే యనుభవించినది.

అటుతరువాత నీనాలుగువందల సంవత్సరములకాలములో గదా, యంత్రములు విలసిల్లినవి; ప్రపంచము సమ్మోహింపబడినది. చేతిపను లొక్కపెట్టున మూలబడినవి; క్రొత్త పుంతలు త్రొక్కబడినవి; జగత్తంతయు నూతనయంత్రమున తగుల్కొన్నది; యంత్రమునకు దిగ్విజయమును ఘటిల్లినది. అది వచ్చినపనియు పూర్తియయినది.

మన మీకాలములో నున్నాము. భారతదేశమునే కాక ప్రపంచమునంతయు నెదుర్కొన్నసమస్య యిదియే. ఆర్థికసమస్యా పరిష్కారమునకు గృహపరిశ్రమల నుద్ధరించుట శ్రేయోదాయకమా, యంత్రపోషణ యుచితమా?

భారతదేశపు ప్రస్తుతస్థితియు, యంత్రపరిశ్రమలకు చేతిపనులకు గల తారతమ్యమును తెలిసికొనవలసియున్నది.

ఈకాలమున రెండు సంప్రదాయములు గలవు. ఒకటి యంత్రపారిశ్రామికప్రపంచము. రెండవది చేతిపనుల దిన్నారిచెలువులు. మొదటిసంప్రదాయ మమలులో నున్నది. రెండవది భావమం దున్నది. నిన్న మొన్నటివఱకును దేశోద్ధరణకు చేతిపనులవసరములని యెవ్వరు ననియుండలేదు. భారతదేశము సయితము అమెరికా, ఇంగ్లాండుల వలె యంత్రములను తలనుధరించి యెన్నడు కులుకగలుగుదుమా యనియే ఆశించినది. పూజ్యులయిన రమేశచంద్రదత్తు, గోపాలకృష్ణగోఖలే, మహాదేవగోవిందరానడే, శ్రీస్వామిరామతీర్థ మున్నగువారి యాశయము లట్టివే. అది కాలసూచనమాత్రమే చేయగలదు.

గాంధిమహాత్ముడు వచ్చి, యంత్రచక్రమున బానిసయై తగుల్కొన్నప్రపంచము నీడ్చి బయటకు తెచ్చి తిరిగి చేతిపనులవైపునకు దృష్టిని మఱల్చుచున్నాడు. ఆయన మతము నవలంబించువారు స్వదేశవిదేశము

లం దేర్పడుచున్నారు. ఐరిషునాయకుడగు డివెలిరా, నుహనీయుడగు ప్రఫుల్ల చంద్రరే, గాంధిమతముతో విశేషముగ నేకీభవింతురు. ప్రాపంచిక సంప్రదాయముల నీవిధముగ విడదీయుటలోగూడ మహాత్మాగాంధి నూతన శకోదయమునకు మూలపురుషు డయ్యెను.

అయితే, ప్రకృతమున నెందఱు గాంధి మతమునకు - అనగా, చేతిపనులను భారత దేశమున చొప్పించుట కనుమతింతురని తేలుదురు? అట్లు తేలుటకుముందు యంత్రముల విషయమున మహాత్ముని భావ మెట్టిదియో తెలిసికొనగోరుదురు. మహాత్మగాంధి యిట్లు వ్రాయుచున్నాడు:—

"యంత్రములు మంచిచెడ్డల విచక్షణ లేక వృద్ధిపొందుటకు నే నంగీకరింపను. యంత్రములవలన శ్రేష్ఠఫలితములు కలిగినవన, నాకు నచ్చదు. వ్యక్తికష్టమును తగ్గించి, లక్షలకొలది పనివాండ్రపనిని చులకనచేయగల చిన్నచిన్న పనిముట్లు, పరికరములు, అట్టివే యంత్రములు నున్నయెడల, తప్పక నే నంగీకరింతును."

ఈపద్ధతిమాత్ర మందఱ కంగీకారమా? చేతిపనులను సంపూర్ణముగ వికసింపజేసి, యంత్రముల బలగర్వముల క్రుంగజేసి, సర్వపరిశ్రమలను (విచక్షణతో) గృహపరిశ్రమలుగా నొనర్చి, దేశమును కళావంత మొనరించుట కెందఱు సిద్ధపడియున్నారు? నూటికొక్కరును, కోటి కొక్కరును. ఏమి? ...... మహాత్ముని సంకల్పము నిర్వీర్యమైనదేనా? ...ఆ-ఈవిషయమున ఆయనపనికిరాడనువారు కొందఱో, లేక పెక్కండ్రో కూడ నుండవచ్చును....కారణమేమి?

నవీనకాలమున భారతీయాశయముల నావహించిన భావదాస్య మట్టిది. దేశమందేమూల చూచినను పేరునకు భారతీయులును, భావమున, చూపులో, నడకలో, పాశ్చాత్యులు నయినట్లు పెక్కండ్రు గోచరింతురు.

ఆనందకుమారస్వామిగా రిట్లు వ్రాయుచున్నారు:— "ఆంగ్లదాసియయిన నవీన భారతదేశమున, మనకు సంప్రదాయసిద్ధములైన సౌందర్య రసోత్సాహములు నశించిపోయినవి. హిందూదేశము రాజకీయముగను, ఆర్థికముగను సర్వస్వతంత్రమయినను, దానియంతరంగమున పాశ్చాత్యవాసనలు నిండియుండెనా—అట్టి హైందవభూమికొఱకెవరు జీవింతురు—ఎవరు చత్తురు? దాని ప్రశంస ఎవరికి........ఇప్పటి విద్యాపద్ధతుల వల్లను, వ్యాపారలక్ష్యములవల్లను నీచత ననుభవించుచున్న ఈహిందూదేశ మెక్కడ—సౌందర్యరస ప్రపూర్ణయగు పూర్వభారత మెక్కడ?"

భావములలో కలిగిన యీమార్పువల్లనే దేశమునకు ప్రాణవంతములగు కళలు, పరిశ్రమలు నశించినవి. దానితో దుర్భరదారిద్ర్యము మెడకు చుట్టుకొన్నది. దీనికి వగపు లేదు. జీవతుల్యమగు రసవిచారము మటుమాయమైనదిగదా!

మొహెంజొదారో ప్రాచీన నిర్మాణావిష్కరణ చిత్రములు

౧. వెలువడిన ప్రాచీన భవనములు

3. నాటి బావులలో నొకటి

"కళాపరిజ్ఞానము లేకపోవుట వల్లనే హైందవపరిశ్రమలు రూపుమాసిపోయినవి. కాని ఇతరకారణము లేమియును లేవు. కనుకనే వాటిని తిరిగి నెలకొల్పు టసాధ్యముగానున్న"దని ఆనందకుమారస్వామిగారే వ్రాసియున్నారు.

ఎందఱు వచించిననేమి? యంత్రములలో నుండు సౌకర్య మెక్కడ? వాటి విలక్షణ మెక్కడ? చేతిపనులు వాటికి నీడా?—అనువా రున్నారు. వారి కిట్లు సమాధానము:

యంత్రపరిశ్రమలు—స్వేచ్ఛావాణిజ్యము

యంత్రములతో కొన్ని ఆర్థిక సూత్రములు ముడిపెట్టుకొనియున్నవి. అవి కేవలము పాశ్చాత్యవాసనాధారములయి కన్పట్టును. మానవునికోరిక లెంత వృద్ధిపొందిన నత డంత నాగరికు డగుననియే పాశ్చాత్య-ఆర్థికశాస్త్రమందలి ప్రధానసూత్రము. అవి విచక్షణతో నుండవలె ననునది ప్రాచ్యుల సంప్రదాయము. ఈ ప్రధానసూత్రమందే ప్రాచీ, ప్రతీచీ సంప్రదాయములకు విరోధమేర్పడినది. వారి దృష్టి ఐహికము, వీరిదృష్టి ఆధ్యాత్మికము. ఈ త్రాటిపైననే అల్లికయంతయు నేర్పడినది.

ప్రతీచీసంప్రదాయము ననుసరించి, ఏపరిశ్రమయు సంకుచితముగ నుండుటకు వలనుపడదు. అందువలన రాక్షసయంత్రములు కనుగొనబడినవి. వారి పారిశ్రామికవ్యాప్తికి భూనభోంతరములు చాలవు. పెట్టుబడులకు లక్షలు, కోటులు కావలెను. అందువలన జాయింటు స్టాకుకంపెనీ లుండవలెను. పెద్ద సొమ్ములు దాచుకొనుటకు, ఋణములు తెచ్చుకొనుటకు ఇంపీరియలుబ్యాంకు లుండవలెను. తమసరకులు విడుదలయగుటకు ఖండాంతరములు స్వాధీనమం దుండవలెను. స్వాధీనము లేనిచోట స్వేచ్ఛావాణిజ్యసిద్ధాంతమములులో నుండవలెను. ఇవి యంత్రపరిశ్రమల కవసరమైన భాగములు.

యంత్రపరిశ్రమవ్యాప్తికిని, స్వేచ్ఛావాణిజ్యమునకును సూత్రకారులయినరికార్డో, ఆడముస్మిత్తు, కాబ్డెను చెప్పెడుకారణము లివి: "ఏపరిశ్రమల కేప్రదేశ మనుకూలమో అది యక్కడ సహజవికాసమున విలసిల్లును. ఖండఖండాంతరముల దాని కడ్డులేని చలామణి యుండగలదు. సరకులు కాఱుచౌకగా కిట్టగలవు. కాలమును, శక్తిని ఎంతయో మిగుల్చుకొనవచ్చును. ఇంతియకాక అతీతమగు విశ్వదృష్టి యేర్పడగలదు"అని. నేటి భారతీయులును తమవాదమున కీకారణములే సూచించెదరు.

వాటికి సమాధానము ప్రొఫెసరు మార్షలు ఇట్లు చెప్పుచున్నాడు: "ఏదయినను ఆర్థికసూత్రము ఆయా కాలమానపరిస్థితుల ననుసరించి ఆ నిర్ణీతప్రదేశములం దములు జరుపుట మంచిది. దానికి తగినకారణములు నశించినవెనుక ఆసూత్రము నశించిపోవుచున్నది."

దీనివలన ఏ సూత్రమును స్థిరము కాదని, భూతభవిష్యద్వర్తమానముల నే త్రాటితోను కట్టి బంధింపరాదని తెలియుచున్నది. అందుచే స్వేచ్ఛావాణిజ్యసూత్రమే కాని, మఱియొకటి కాని ఎల్లకాలమును సమానాదరణము పొందుననుట పొసగని మాట. కాని మంచిచెడ్డల విచారించు టెప్పటి కప్పు డవసరమే.

ఆడముస్మిత్తు మున్నగువారు బోధించినది ఆదర్శముమాత్రమేయనియు, విశ్వమంతయు ప్రజాపాలనరాష్ట్రమువలె నుండవలెననియు, ప్రపంచమం దశాంతి యుండరాదనియు వారి యాశయములని చెప్పెదరు.

ప్రీడిషులిస్టు అను పండితుడు స్వేచ్ఛావాణిజ్యసూత్రము నీవిధముగా ప్రతిఘటించియున్నాడు: స్వేచ్ఛావాణిజ్యమం దీలోపములు గలవు. ప్రపంచమునూవత్తును సర్వాభిప్రాయసమ్మేళనమని భ్రమించుట పొరపాటు. ఒక్కొక్కజాతి కొక్కొకజాతీయ సంప్రదాయ ముండును; ప్రత్యేకలక్ష్యము లుండును. అట్టివాటి నన్నిటి నేమఱుచుండుట ప్రమాదము. రెండవది-పశుతుల్యమగు భౌతిక దృష్టి యేర్పడుచున్నది. ఒకజాతి రాజకీయ మానసిక శక్తులు, జీవనాధారముల హెచ్చుతగ్గులు, భూతవర్తమానభావి గతులు గుర్తించుటకు వీలులేకపోవుచున్నది. మూడవది-ప్రపంచమంతయు వివిధజాతీయతలు కలిగినదై యున్నను తాను స్వేచ్ఛగా వాణిజ్యము సాగింపగలననుటయు లోపమే.

ఈభావములు పూర్వ ముల్లేఖింపబడినవి. ఇప్పు డవి యమలుజరుగుచున్నవి. ఐరోపా దేశములలో, క్రమక్రమముగా నేమి, సాంతముగానేమి స్వేచ్ఛావాణిజ్యసూత్రమునకు స్వస్తిచెప్పుచున్నారు.

ఇక మిగిలినవి చేతిపనులును, శాంతి జీవితమును.

చే తి ప ను లు

వీటివలన కలిగెడిసుఖ మేమి? చేతిపనులందు జీవ మున్నది; చైతన్యశక్తి కలదు; కళాప్రాదుర్భావ మున్నది; జాతివికాస మున్నది; శాంతిస్థిరతలు కలవు; ఐహికాధ్యాత్మికపోషణ కలదు; విజాతీయులు కొల్లగొను నవకాశములు దొరకవు; జాతీయసంప్రదాయమునకు మిక్కిలి తగినది. అన్నిటికంటె దేశమందు నిర్వీర్యమై, శోభారహితమై, చంచలమై గాలికిపోవుచున్న అమోఘమగు మానవశక్తి కేంద్రీకృతమై జీవసంపదల నొసగగలదు.

హిందూమతాచారములు: ప్రభుత్వపు అధికారబాధ్యతలు

కొమాండూరి శఠకోపాచార్యులు, యం. ఏ., బి. యల్.

మనదేశమున కొన్ని సాంఘికవిషయములు మత విషయములు గానే చాలమందిచే పరిగణింపబడుచున్నవి. ప్రత్యేకముగా మతవిషయమును గూర్చి కాకపోయినను ఇట్టి మిశ్రితమతసాంఘికవిషయములను గూర్చి సంస్కరణములు ఇటీవల తరుచు చర్చకు వచ్చుచున్నవి. ఆసందర్భమున ప్రజాక్షేమకరములగు సంస్కరణములు చేయించు అధికారమును, బాధ్యతయు ప్రభుత్వముపై కలవనియు, అట్టిబాధ్యతను ప్రభుత్వము వారు వహించక తప్పుకొనుచున్నారనియు, ఇకముందైనను ప్రభుత్వమువారీవిషయములందు తగుసహాయము చేయవలెననియు నొకపక్షమువారనుచున్నారు. ఇందుకు వ్యతిరేకముగా ప్రభుత్వమున కట్టివిషయములలో శాసనముచేయు నధికారమే లేదనియు, ఉన్నదని భావించినను అట్టివిషయములందు జోక్యము కలుగజేసుకోమని ప్రభుత్వమువారు వాగ్దాన మొనరించినందున, అందుకు భంగముకలుగకుండ ప్రభుత్వము వారు కేవలము వ్యతిరేకులుగానో, ఉదాసీనులుగానో ఉండవలయు ననియు, మరియు హిందూధర్మవిషయమగు ఆచారవ్యవహారములందు ప్రభుత్వమువారు కల్పించుకొను మామూలు లేదనియు, అందుకు భిన్నముగా నిప్పుడు ప్రభుత్వమువారు నడువకూడదనియు రెండవ పక్షమువారు ప్రతిఘటించుచున్నారు. ఇట్టిసమస్యలీవల తరుచు శాసనసభలయెదుట వచ్చుచున్నవి. అట్టివిషయములలో ఆసంస్కరణములు ప్రజోపయోగకరములని తమ యభిప్రాయమైనను వాటికి ప్రభుత్వము వారు సహాయము చేయక ఉదాసీనులుగా నుండుటయే కాక కొంత వ్యతిరేకధోరణికూడ కనుపరుచుచున్నారు. శారదాచట్టమును, హరిజనదేవాలయప్రవేశపుబిల్లును ఇందుకు నిదర్శనములు. వీటి మూలసూత్రములు, అనగా అతిబాల్యవివాహములు సంఘమున కనర్థకరములనియు, దేవాలయప్రవేశవిషయమున కులభేదములను గమనించుట యుక్తము కాదనియు, ఆంగ్లేయజాతివారందరును అంగీకరించినదే. మరియు ఈమార్పులు ఇదివరకున్న ఆచారమునకు వ్యతిరిక్తములు. ధర్మశాస్త్రము ఇందుకు వ్యతిరిక్తముగా నున్నదా లేదా అనుసంగతి వాదోపవాదములకు లోనై సందిగ్ధముగా నున్నది. అయినను ఇండియాప్రభుత్వమువారును ఈలాంటి సందర్భమునను వహించుచున్న మాంద్యము అందరికిని తెలిసినదే యున్నది. అందువలన ఇట్టివిషయములలో ప్రభుత్వము వారి అధికారమును, బాధ్యతయు ఎట్టివి? ఇదివరలో ఇట్టివిషయములలో మన ఆంగ్ల ప్రభుత్వమువారేమి చేయుచువచ్చిరి? అను సమస్యలు ముఖ్యముగా విమర్శింపదగియున్నవి.

పూర్వము మనదేశమున మతసంరక్షణమును, ధర్మశాస్త్రప్రకారమే పరిపాలనమును చేయుచుండెడివారు. అట్టి అధికారమును బాధ్యతనుకూడ ఈఆంగ్ల ప్రభుత్వమునకు కలదని మనము భావింపవచ్చును. అందువలన దేశకాలసందర్భములను బట్టియు, ప్రజలలో బుద్ధిమంతులు కోరినప్పుడును ఇదివరలోనున్న ధర్మమునుగాని, ఆచారమునుగాని మార్పవచ్చునా, లేదా యనునదియే మొదటియంశము. ఈసందర్భమున ఈక్రింది ప్రమాణమును గమనింపదగును:

> వేదః స్మృతి స్సదాచారః స్వస్యచ ప్రియ మాత్మనః,
> ఏత చ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్యలక్షణమ్.
>
> మనుస్మృతి.

యాజ్ఞవల్క్యస్మృతిలోగూడ ఇట్లే ఆత్మకు, లేక అంతఃకరణమునకు తృప్తికరముగా తోచినది ప్రమాణమని చెప్పబడినది. ఒకప్పుడు ధర్మమును, సదాచారమును అయినదిగూడ కాలక్రమమున లోక

మునకు విరుద్ధముగాను, బాధకముగాను ఉన్నయెడల అట్టి ఆచారములను మార్పుచేయవచ్చుననియు, బుద్ధిమంతు లట్లు నిర్ధారణచేసి మార్పుచేయవచ్చుననియు కూడ బృహన్నారదీయములోని ఈ క్రిందిశ్లోకములచే తెలియగలదు:

అస్వర్గ్యం లోకవిద్విష్టం ధర్మ్యమప్యాచరేన్నతు,
సముద్రయాత్రాస్వీకారః కమండలువిదారణమ్.

ద్విజానా మసవర్ణాసు కన్యా సూపయమ స్తథా,
దేవరేణ సుతోత్పత్తిః మధుపర్కే పశోర్వధః.

మాంసదానం తథా శ్రాద్ధే వానప్రస్థాశ్రమ స్తథా,
దత్తాక్షతాయాః కన్యాయాః పునర్దానం పరస్యచ.

దీర్ఘకాలం బ్రహ్మచర్యం నరమేధాశ్వమేధకౌ,
మహాప్రస్థానగమనం గోమేధశ్చ తథామఖమ్.

ఇమాన్ ధర్మాన్ కలియుగే వర్జ్యా నాహుర్మనీషిణః.

ఆదిత్యపురాణములోని యీ క్రిందివచనములచే గూడ పూర్వము మహాత్ములు లోకగుప్త్యర్థమై, అనగా సంఘసంరక్షణనిమిత్తము చాలమార్పులు చేయుచువచ్చిరని స్పష్టము కాగలదు:

దత్తౌరసేతరేషాంతు పుత్రత్వేన పరిగ్రహః,
శూద్రేషు దాసగోపాలకులమిత్రార్ధసీరిణామ్.

భోజ్యాన్నతా గృహస్థస్య తీర్థసేవాతిదూరతః,
బ్రాహ్మణాదిషు శూద్రస్య పక్వతాదిక్రియాపిచ.

భృగ్వగ్ని మరణంచైవ వృద్ధాదిమరణం తథా,
ఇమాని లోకగుప్త్యర్థం కలేరాదౌ మహాత్మభిః.

నివర్తితాని కర్మాణి వ్యవస్థాపూర్వకం బుధైః,
సమయశ్చాపి సాధూనాం ప్రమాణం వేదవద్భవేత్.

ఇట్లు బుధులు వ్యవస్థాపూర్వకముగా నేర్పరుచు మార్పు వేదమువలెనే ప్రమాణమగునని కనబడుచున్నది. అట్టిమార్పులను శాసనముగా రాజు అమలుజరుపవలసియున్నది.

ఇక మన ప్రస్తుతాంగ్లప్రభుత్వమువారైనను విక్టోరియాప్రకటనము మొదలగువానిలో హిందువులకు హిందూ న్యాయశాస్త్రప్రకారమును, హిందూ ఆచారప్రకారమును పరిపాలన చేయుదుమని చెప్పిరేకాని అందు ముందు ఎట్టిమార్పులును చేయబడవని చెప్పియుండలేదు. మరియు మనకోర్టుల అధికారమును నిర్ణయించు మద్రాసు సివిలుకోర్టు ఆక్టు (Madras Act III of 1873) ౧౬-వ శెక్షనులో వారసత్వము, వివాహము, కులవిషయము, మతాచారములు వీటినిగూర్చి విచారించునపుడు హిందువులకు హిందూలా, హిందూ ఆచారము వర్తింపచేయవలెననియు, అయితే అట్టి లాగాని, ఆచారముగాని ప్రభుత్వమువారు చట్టముచే మార్పుచేసినయెడల ఆమార్పుచేయబడినప్రకారమే అమలుజరుగవలెననియు విధింపబడినది. అమలులోగూడ మనహిందూశాస్త్రగ్రంథములలోనిఅనేకవిధులను ప్రస్తుతప్రభుత్వమువారు సివిలుకోర్టువారును త్రోసివేసియున్నారు. ఇందు కనేకోదాహరణముల నీయవచ్చును. అనేకశాఖలకు క్రొత్తచట్టములు విధింపబడినవి. బదుళ్లు, క్రయవిక్రయములు ఇత్యాదులనుగూర్చిన మనధర్మశాస్త్రవిధుల స్థానమునకాంట్రాక్టుఆక్టు,ట్రాన్స్ఫర్ ప్రాపర్టీ ఆక్టు మొదలగు చట్టముల నేర్పరచిరి. అట్టి విషయములందు హిందువులకు మన హిందూ ధర్మశాస్త్రప్రకారమే అమలుజరుపవలెనని యిపుడు కోర్టులో వాదించుటకు హిందువులకు హక్కులేదు. (బెంగాల్ లా రిపోర్టు ౧౪-వ వాల్యూం ౭౬-వ పేజీ చూడుడు) నేరములగూర్చి హిందూధర్మశాస్త్రనిబంధనలు ఇప్పుడు అమలులో లేవు. ధర్మశాస్త్రప్రకారము బ్రాహ్మణులకు తక్కువశిక్షయు, ఇతరులకు హెచ్చుశిక్షయు ఏర్పాటుకాబడినది కాని వీటినన్నిటిని రద్దుచేసి వాటి స్థానమున పీనల్‌కోడ్డును, క్రిమినల్ ప్రొసీజరుకోడ్డును ఏర్పరిచి ఆప్రకారమే విచారణలను, తీర్పులను ఇప్పుడు జరిగించుచున్న సంగతి అందరకును తెలిసియేయున్నది. సాక్ష్యము తీసుకొనుటకు సాక్ష్యముల కీయదగిన విలువ మొదలగు విషయములను గూర్చియు స్మృతులలోని వచనములకు బదులుగా ఎవిడెన్సుఆక్టుప్రకారము అమలుజరుగుచున్నది. హిందువుల వారసత్వపు అధికారము హిందూధర్మశాస్త్రప్రకారమే జరిపెదమని చెప్పినను

దానిలోకూడ అప్పుడప్పుడు మార్పులు జరుగకపోలేదు. తల్లితండ్రులవద్దనుండి వారసత్వముద్వారా దఖలుపడిన ఆస్తి కుమార్తెకు సంపూర్ణముగ హక్కుగల స్త్రీధనమగునని మన ముఖ్యధర్మశాస్త్రమగు మితాక్షరిలోనున్నది. అయినను అట్టిఆస్తిలోగూడ ఆమెకు యావజ్జీవము అనుభవపుహక్కు మాత్రమే ఉండునని ప్రీవీకౌన్సిలువారిచే తీర్పుచేయబడినది. (ఇం. లా. రి. ౨౫ అలహాబాదు ౪౬౭, ౪౭౬ పేజీలు చూడుడు.) జ్ఞాతులందరు, అనగా సపిండులు సమానోదకులుకూడ అయి వారుకూడ లేనపుడుమాత్రమే బంధువులు, అనగా అప్పచెల్లెండ్రు మేనల్లుండ్రుకూడ వారసులగుదురని ధర్మశాస్త్రములోనున్నది. కాని ప్రజాప్రతినిధుల యంగీకారముతో ప్రభుత్వమువారు జ్ఞాతులకన్న ఈబంధువులే దగ్గిరవారసులగునట్లు చట్టము కావించిరి. (Act II of 1929) పుట్టుకనుండి గుడ్డి, కుంటి- మొదలగులోపముగలవారికి ఆస్తిహక్కు లేదని మన ధర్మశాస్త్రము. కాని అట్టివారికికూడ ఆస్తిహక్కు కలదని ౧౯౨౮ లో చట్టము చేయబడెను. మరియు ఆగమగ్రంథములు పరమప్రమాణములనియు, అందలి సంగతులను వేటినికూడ మార్చుటకు వీలులేదనియు, అట్లు ప్రభుత్వమువారు మార్పకూడదనియు ఇటీవల తీవ్రముగా వాదించిన సనాతనహిందూనాయకులగు శ్రీమాన్ వి. వి. శ్రీనివాసఅయ్యంగారే తాము మద్రాసు హైకోర్టుజడ్జిగా నుండినపుడు ఆగమములోనున్నంత మాత్రమున ప్రతివిధియును అమలు జరుపవలసినఅవసరము లేదని హైకోర్టులో తీర్పుచేసియుండిరి. (ఆలిండియా రిపోర్టరు, ౧౯౨౮ మద్రాసు ౧౧౮ పేజీ చూడుడు) హరిజనులు దేవాలయములలోనికి రాకూడదనుటకు ఈఆగమముల వచనములే శాస్త్రాధారములని యాతీవ్రవాదులు చెప్పుచున్నారు. మరియు దౌహిత్రదత్తత, మేనరికపువివాహములు కేవలము హిందూధర్మశాస్త్రములందు నిషేధింపబడినను ప్రస్తుతాచరణనుబట్టి యివి మన ప్రాంతమందలి కోర్టులచే అంగీకరింపబడినవి.

ఇంతేగాక హిందువులకును, అన్యమతస్థులకును సంబంధించిన అనేకవిషయములలో మన ప్రభుత్వమువారు కేవలము మధ్యస్థులుగా నుండక మనవారికి నష్టకరముగా ఇతరమతస్థులకు సహాయముచేసిన ఉదాహరణములుగూడ చాలగలవు. ఎన్నికలలోను, ఉద్యోగములలోను మహమ్మదీయులకును క్రిష్టియనులకును ఎక్కువలాభములు కలుగుచున్నవి. అందుచే మనకు నష్టము కలుగుచున్నది. మరియు మన ప్రస్తుత ప్రభుత్వపు ఆదాయము చాలవర కంతయు హిందువులనుండియు, మహమ్మదీయులనుండియు వసూలు చేయబడుచున్నది. కాని దానిలోనుండి యేమియు ఆయా మతముల నిమిత్తము వినియోగింపక క్రైస్తవమతాధికారుల నిమిత్తమును, క్రైస్తవదేవాలయములకొరకును మన ప్రభుత్వాదాయములో కొంత ఖర్చుపడుచున్నది. ఈప్రభుత్వశాఖకు యెక్లిజియాస్టికల్ డిపార్టుమెంటు అని పేరు. ఈశాఖపై మనభారతీయమంత్రులకును, శాసనసభ్యులకునుగూడ యెట్టి అధికారములును లేకుండునట్లు రాబోవు రాజ్యాంగమున నిబంధనలు చేయబడుచున్నవి. ఇంకొకవిషయము: ఇటీవల మనరాష్ట్రమందలి హిందూదేవాలయముల పరిశీలనలకై కొందరు ప్రభుత్వోద్యోగుల నేర్పరిచిరి. కాని వారలజీతములు, ప్రయాణములు మొదలగువానికి ఖర్చులనిమిత్తము ప్రభుత్వాదాయమునుండి ఖర్చుపరుచుట న్యాయమైయున్నను అట్లుచేయక అందునిమిత్తము మన హిందూదేవాలయములనుండి దామాషాను పన్నులను వసూలుచేయుచున్నారు. ఇట్టిచర్యలు ప్రభుత్వముయొక్క మధ్యస్థత్వమును కనపరుచుచున్నవా?

హిందువుల మతాచార విషయమునకూడ ప్రభుత్వమువారు ప్రత్యక్షముగానే మార్పులు చేయుచు సుమారొకశతాబ్దమునుండి అప్పుడప్పుడు కొన్నిశాసనములను చేయుచునేయున్నారు. వాటిలో కొన్నిముఖ్యమైనవి యీక్రింద ఉదాహరింపబడినవి. పూర్వము హిందూస్త్రీలు తమ భర్త పోయినప్పుడు సహగమనము చేయునాచార ముండెడిది. దానిని నిషేధించుచు ౧౮౨౯-వ సం. మున అప్పటి గవర్నరుజనరలగు విలియంబెంటింక్ ప్రభువుగారు ఒక రెగ్యులేషనును చేసి ఆ యాచారము నణచివేసిరి. మరియు హిందూమతము

మండి భ్రష్టులై పతితులైనవారికి, ఇతరమతములలోనికి కలియువారికి హిందూధర్మశాస్త్రము ప్రకారము కుటుంబాస్తిలో వాటాగాని, వారసత్వపు హక్కుగాని లేదు. ఈసంగతి స్మృతులలోను, మితాక్షరి మొదలగువ్యాఖ్యానములలోను స్పష్టముగా విధింపబడినది. ఆప్రకారము క్రైస్తవమతము పుచ్చుకున్న హిందువులకు తమ హిందూకుటుంబాస్తియందును, వారసత్వమునందును గూడ హక్కు నశించును. కాని ౧౮౫౦-వ సం. మున ఈనియమమును రద్దుచేయుచు ప్రభుత్వమువారు ఒక చట్టమును (Caste Disabilities Act 21 of 1850) గావించి యిదివరకున్న ఆచారమును మార్చివేసి హిందూమతమునకు చిరకాలమునుండి యున్న యీరక్షణను తీసివేసిరి. (ఇండియన్‌లారిపోర్ట్సు అలహాబాదు 33-వ వాల్యూం 356 పేజీ చూడుము.) హిందూవితంతువులు పునర్వివాహమును చేసుకొనకుండ ఉండు ఆచారము గలదు. మన ధర్మశాస్త్రముల ప్రకారము వితంతువులు పునర్వివాహము చేసుకొనకూడదని చాలమంది హిందువుల అభిప్రాయము. కాని ౧౮౫౬-వ సం. ౧౫-వ ఆక్టు అగు హిందూవితంతు పునర్వివాహశాసనము (Hindu widows' remarriage act) అను చట్టమును చేసి ప్రభుత్వమువా రిదివరకు బ్రాహ్మణాదులలో ఉన్న ఆచారమునకు గల శాసనత్వమును తీసివేసిరి. మన మతాచారములకు భార్యాభర్తల సంబంధము స్థిరమైనది. వీరిలో ఒకరికి హిందూమతభ్రష్టత కలిగినను వీరి భార్యాభర్తృ సంబంధము వీడదు. కాని ౧౮౬౬-వ సం. ములో ప్రభుత్వమువారు చేసిన Native converts marriage dissolution act అను చట్టము ప్రకారము హిందువు క్రైస్తవమతములోనికి పోయినచో ఇదివరలోనున్న తన హిందూభార్యాభర్తృ సంబంధమును నశింపజేసుకొనవచ్చును. ఇక వర్ణాంతర వివాహవిషయమై అనులోమ వివాహములు కూడునవనియు, ప్రతిలోమవివాహములు నిషిద్ధములనియు మనశాస్త్రములలో నున్నను ఇవి రెండునుకూడ చెల్లవని కొంతకాలము తీర్పులుండినవి. అట్టివారు హిందువులము కామని ప్రకటించి వివాహమును రిజష్టరుచేసుకొనవచ్చునని ౧౮౭౨ లో ఒకచట్టము చేయబడినది. హిందువులుగానుండియే అట్టివివాహములు చేసుకొనవచ్చునని యిటీవల ౧౯౨౩-వ సం. ములో ఆచట్టము సవరణ చేయబడినది. ఇవన్నియు మన ధర్మశాస్త్రములోను, ఆచారములోను చేయబడిన మార్పులే యనుటకు సందేహ మేమియు లేదు. ఇవియన్నియుగాక మన రాష్ట్రమందలి హిందూమతసంబంధమగు సంస్థలు, అనగా దేవాలయములు, మఠములు-వీటియాజమాన్యమునుగూర్చియు, వీటిపరిపాలననుగూర్చియు యిటీవలనే ౧౯౨౫-వ సం. ములోను, ౧౯౨౭-వ సం. ములోను, మనమద్రాసు ప్రభుత్వమువారిచే నొకచట్టము (Hindu Religious endowments act) కావింపబడి అమలులోనున్నది. పైనవ్రాసిన సంగతులన్నియునుగూడ మన ప్రస్తుతప్రభుత్వమువారు మనమతాచారములలో కలుగజేసికొనివాటిని తమకుచితమని తోచినరీతిని సవరించుచున్నందుకు నిదర్శనములు. అందువలన అవసరమైనప్పుడు ప్రజాభిప్రాయము కోరినప్పుడు అట్టిసంస్కరణముల చేయుటకు ప్రభుత్వమువారికి అధికారము, బాధ్యతయుగూడ కలవని స్పష్టమగుచున్నది. ఇదివరలో ౫ సం. లకు పూర్వము మొదట శాసనసభలలో ప్రజానియమిత ప్రతినిధులు కొద్దిమందిమాత్రమే యుండుటవలన అప్పుడు ప్రజాభిప్రాయము సరిగా వ్యక్తమయ్యెడిదిగాదు. అట్టిసమయమందే స్వతంత్రించి ప్రభుత్వమువారు మన మతాచారములం దనేకసంస్కరణముల గావించిరి. వాటిలో కొన్ని హిందూసంఘములకు లాభకరములు, కొన్నినష్టకరములుకూడ కలవని చాలమంది హిందూనాయకుల అభిప్రాయము. ప్రస్తుతము రాష్ట్రీయశాసనసభలందును భారతశాసనసభయందునుగూడ సభ్యులలో ప్రజాప్రతినిధులే యధికసంఖ్యాకులుగా నున్నారు. మరియు ప్రస్తుతము హరిజనుల దేవాలయప్రవేశమును గూర్చిన బిల్లులో ఆయాప్రాంతములందలి ప్రజలయభిప్రాయమును తీసుకుని ప్రజాభిప్రాయ మందులకు స్పష్టముగా నంగీకరించి అనుకూలముగా నున్నయెడల అట్టిస్థలములందుమాత్రమే ఆలయములలోనికి హరిజనులను రానిచ్చుటకుమాత్రమే యిప్పుడు చర్చలో ఉన్న

బిల్లులో నియమము వ్రాయబడినది. హరిజనులకు దేవాలయములో ప్రవేశము లేకుండా ఉండు ప్రస్తుతపు ఆచారము కేవలము హానికరమనియు, ఆయాచారము మార్పుచెందవలెననియు ప్రజలు నిశ్చయించుకొనినను కూడ అట్లు చేయుటకు వీలులేకుండ ప్రభుత్వమువా రేర్పరిచిన హిందూధర్మాదాయపు చట్టములోని నియమములే ఆటంకమును కలుగ జేయుచున్నవి. ముఖ్యముగా ఆచట్టములోని నియమములను సవరణచేయుటకే ఈ క్రొత్తబిల్లు పెట్టవలసివచ్చినది. హిందూ పబ్లికుదేవాలయములకే యీబిల్లు వర్తించునుగాని స్వంతదేవాలయములకు వర్తించదు. అట్టి పబ్లికుదేవాలయములు హిందూజనులందరికొరకును ఉద్దేశింపబడినవి. అందుకు సాధారణముగా ప్రజలఆస్తి ఖర్చుపరచబడుచున్నది. అనగా హరిజనులుగూడ జాతిలో నంతర్భాగమే యగుటచే నట్టివారినికూడ దేవాలయములలోనికి రానిచ్చుటకు హిందూజనాభిప్రాయ మిష్టపడినయెడల హరిజనులనుకూడ రానిచ్చుటకు ప్రస్తుతము దొరలనవ్ర శాసనములలో నున్న ఆటంకములను తొలగింపవలెనని యీబిల్లుయొక్క భావము. అట్టిచట్టమును చేయుటకు ప్రభుత్వమునకు అధికారము లేదనియు, అందువల్లనే మన మత మంతరించుననియు సనాతనులలోని తీవ్రవాదులు వాదించుట విచిత్రముగ నున్నది. మతవిషయములందు అస్పృశ్యతను కేవలము నిషేధించు క్రైస్తవ మతస్థులగు ప్రభుత్వమువా రట్టి బిల్లునకు కేవలముదాసీనులగుటయేకాక అందుకు వ్యతిరేకధోరణికికూడ కొంచె ప్రోత్సాహ మొసగుట మరియు విచిత్రముగ నున్నది.



కోటలోని రక్షకశాఖామందిరము, హంపీశిథిలములు

—కే. యల్. నరసింహాచార్యులు, గుంతకల్లు.

శీఘ్రావృతి (చిత్రకారుడే బ్రహ్మయైనచో) ౨:



అధికారుల ప్రియముకొరకు ఆత్మగౌరవమును విడనాడువాడు

రాజకీయ విధేయత

(Political Obedience)

శ్రీపాద గణపతిరావు

పాలకపాలితభావము చాల విచిత్ర మైనది. దానికికారణములును విచిత్ర మైన వే. "కొందఱుమానవు లధికారము చలాయించుచుండగా నంతకంటె సహస్రగుణాధికు లగు మానవులు వారికి లొంగియుండుట యెట్లు సంభవించుచున్నది?" అను ప్రశ్నకు సమాధానము చెప్పుట చాలదుష్కరము. చెప్పినను అట్టిసమాధానము జనసామాన్యమునకు నచ్చుట మఱియుకష్టము. ఏలన: మానవ ప్రకృతి అతి క్లిష్టము. అది యేసూత్రముల నైన నతిక్రమింపగలదు. అందుచేతనే గొప్ప గొప్ప మేధావంతులుసైతము ఈపాలకసేవక భావమునుగూర్చి సముచితమైన సమాధానము నొసంగజాలకపోయిరి. వీరందఱు మానవ ప్రకృతిలోనే దేనొకగుణముపైననే యూది పలికిరిగాని దాని సమగ్రస్వరూపమును పరి గణించరైరి. ఇదియే వారిలో పెద్దలోటు. ఈభావమునకు వాస్తవములు, సంభవములు నగు కారణములను నిరూపించుట కీవ్యాసమున నొక అల్పప్రయత్నము చేయబడు చున్నది.

మానవప్రకృతిలో నంతర్లీనమై 'విధేయత' యనుగుణము కలదు. ఉత్తమమగుదాని ముందు వినీతుడగుట మానవప్రకృతిలోనుత్తమ మగుగుణము. ఈవిధేయత స్థాయివలె నుండక ఆ యుత్తమవస్తువు గుణోత్తరమగుచున్న కొలందియు పరిణత మగుచునేయుండును. ప్రకృతము మనము శిక్షాసాధనసామగ్రితోటి యేతంత్రమును ప్రభుత్వ మనుచున్నామో, అది బహుశః అతిప్రాచీనమానవసంఘము నం దత్యంతగౌరవమునందుచు సంఘమునకు నాయకుడైయుండిన విద్యావయోవృద్ధునుండి పుట్టియుండవచ్చును. మానవప్రకృతిలోని యీవిధేయత యను గుణమునుండియే నిర్దేశింపబడుటకు, శిక్షింపబడుటకు, పాలింపబడు టకు 'సమ్మతి' యావిర్భవించినది. మానవుని స్వభావము చాల మితవ్యయవాది: అనగా నది తన్నుగుఱించి తాను శ్రద్ధవహించి బుద్ధిని వ్యయింపగోరదు. తనకై యెవరైన శ్రద్ధ వహించుటకే సమ్మతించును. కనుక మానవుడు తన్ను పాలించుకొనుబాధ్యత తాను వదలుకొని సంతోషపూర్వకముగా దానిని తనకు నమ్మకము, గౌరవము గల యొకవ్యక్తి పరము గావించినాడు.

'సమ్మతి' వేఱొకవిధముగాసైతము పుట్టవచ్చును. పరిస్థితులు విషమించి తప్పని సరియైవచ్చినప్పుడు మానవుడు సమ్మతింపక చేయునదిలేదు. ఇది యెట్లు పుట్టినను 'సమ్మతి' యనునది పాలకపాలితభావములో నొకయంగ మనుటయే మన కవసరము.

ఫలితము సుష్ఠుగాలభించినపట్ల నీ సమ్మతి సంతుష్టము, హృదయపూర్వకము నగుచున్నది. కాగా పాలకపాలితభావమునకు ప్రయోజనమను వేఱొకకారణ ముత్పన్నమగుచున్నది. మానవునకు జీవితములో సాధింపదగిన యర్థములు పెక్కుగలవు. వీని నన్నిటిని సాధించుట కాతనికి పైవాని సాయమగత్యము. కనుకనే మానవునికి ప్రభుత్వమగత్యము, ఉపకారకము నగుచున్నది. అనగా మానవుడు వాస్తవమగు నేదియోసాయమును కాంక్షించి ప్రభుత్వపరతంత్రు డగుచున్నాడు. ఈపరతంత్రతత విధేయతాగర్భితమనుట తెల్లమే. కాని ప్రభుత్వమునెడ మానవుని యీవిధేయత కేవలము పరిమిత మనుటయు గ్రహింపదగియున్నది.

హక్కులు, ధర్మములువలెనే బలము, విధియు పరస్పరసంబంధముగలవి. ప్రభుత్వమెంతవఱకు తనవిధిని నెఱవేర్చునో అంతవఱకే ప్రజలు దానికి విధేయులు. ప్రజలకు దానివలని ప్రయోజనమునుబట్టియు, దానియాదర్శములనుబట్టియు ప్రభుత్వము విధి నెంతవఱకు నెఱవేర్చినదియు తేలగలదు: అనగా ప్రజలకు పరిపూర్ణ ప్రయోజనకారియగుచో దానివిధి నెఱవేఱినట్లే.

ఇంతయుగాక పాలకసేవకభావములో బలాత్కృతియు గలదు. మానవప్రకృతి యెంతయుచ్చమో అంతతుచ్ఛమును. ఎల్. పి. జాక్స్ మానవస్వభావము నైతికమని యెంత వాదించినను భౌతికబలభీతిచే నది కాదాచిత్కముగా తన యున్నతాశయములను విస్మరించుచునేయుండును. వ్యక్తులపరస్పరసంబంధము నీతిసూత్రములచే నెంతదృఢబద్ధమయ్యు సక్రమముగా నడువజాలదు. కాని మన మీయంశము నంతగా పాటింప నక్కఱలేదు.

నైతికబల ముత్కృష్టమగుచోట పశుబలము పటాపంచలగుట సత్యము. బలాత్కృతి పాలకపాలితభావమున కొకయంగమే కాని దాని సాధనసర్వస్వము కాదు. ఇట్లు తలచి చూడగా పాలకపాలితభావమునకు కారణములు మానవునిలోని విధేయత, సమ్మతి, ప్రయోజనము, బలాత్కృతి అని తేలుచున్నది. ఈసంగ్రహచర్చను ముగించుటకు పూర్వము హెగెలు గ్రీను ప్రముఖులచే పరామర్శింపబడిన యొకయంశమును విచారించుట తగును. ఆదర్శప్రభుత్వమునుగుఱించిన వారి యభిప్రాయములలో ప్రభుత్వముయొక్కయు, వ్యక్తియొక్కయు ఆశయముల నైక్యము చెప్పబడినది. వారిప్రకారము మహోన్నతము, మహోదారము నగునంశ మానవులకెల్లరకు సమానమే. ఈయంశయొక్క వ్యక్తీకరణమే ప్రభుత్వము. ప్రభుత్వమునాజ్ఞకు విధేయుడగుటలో మానవుడు తనయొక్క మహోన్నతము, మహోదారము నగు నంశకు విధేయు డగుచున్నాడని చెప్పవలయును. మఱియు హెగెలు గ్రీనులమతమున స్వాతంత్ర్యమనగా శాసన విధేయత యని యర్థము. ఇట్లనుటలో విధేయ

తకు, స్వాతంత్ర్యమునకు అభేదము చెప్పివేయ బడినది. కాని, యిట్టి తలయుతోకయులేని ఆధ్యాత్మికసిద్ధాంతములవలన పని జరుగదు. మహోన్నతమగునంశ ఎల్లమానవులకు సమానము గాదు. ప్రభుత్వము వారివాంఛలకు వ్యంజకమును గాదు. ప్రతిమానవుడును తనకు తానొకవ్యక్తి. ఇట్టి యాధ్యాత్మికదృష్టిలో విచారించుటవల్ల నొకవిధమగు మానసికతృప్తి దక్క ఏమియు ప్రయోజనము కలుగదు. మానవుడు సంఘప్రేమియగు ప్రాణి యను సూత్రముకంటె నీపాలకపాలితభావమున కుచితమగు కారణము వేఱు కనబడదు. అతడు సంఘమును ప్రేమించుననుటలోనే అతడు ప్రభుత్వమును ప్రేమించునని ఉపరినిర్దిష్టచర్చవల్ల తెలియుచునేయున్నది. మానవుడు సంఘమునందు, అనగా పాలకసేవకాత్మకమగు సంఘమునందు జీవించుటకే కోరును. సంఘజీవనము కొన్ని సూత్రములకు కట్టుబడి యుండును. ఈసంఘజీవనములో సాంఘికవిధేయత ధ్వనించుచున్నది. కనుక రాజకీయజీవితము రాజకీయవిధేయతను చాటును. సంఘమునకు కొన్ని నియమము లావశ్యకములు. ప్రభుత్వము దానిని నిర్మించును. కనుకనే ప్రజలు దానికి విధేయులు.

భారతీయ చిత్రకళ

గ్రంథకర్త: తలిశెట్టి రామారావుగారు, బి, ఏ., బి. యల్.,

ఇది ఆంధ్ర గ్రంథమాలయందు పదుమూడవ గ్రంథము. ప్రాచీనకాలమునుండి భారతదేశమున చిత్రకళ పొందుచువచ్చిన మార్పులు, అభివృద్ధి మొదలయిన విషయములు, హైందవ చిత్రలేఖనోదయము, బౌద్ధకాలమునాటి చిత్రకళ, అజంతవిధానము, బాఘ్‌విహారములందలి చిత్రకళ, మొగలు చిత్రకళావిధానము, రాజపుత్ర చిత్రముల వైఖరి, నేటిచిత్రములు మొదలయినవానిని గూర్చిన చరిత్రాదులు వివరముగా నీ గ్రంథమున చర్చింపబడినవి. ఆయాకాలపు చిత్రవిధానమును దెలుపునట్టి త్రివర్ణ-ఏకవర్ణచిత్రములు నలువది ఇందు గలవు. చిత్రకారులు, చిత్రకళాజిజ్ఞాసువులు, చిత్ర కళాభిమానులు నగు నాంధ్రులెల్లరు తప్పక చదువవలసిన గ్రంథము. వెల. రు. ౧-౦.౦.

మేనేజరు : ఆంధ్రగ్రంథమాల, నెం. 7, తంబుశెట్టి వీధి, జి. టి. మద్రాసు.

చెన్నరాజధానియందు ౧౯౩౧-వ సంవత్సరము ఏప్రెలు ప్రారంభము మొదలు జూను తుదివరకు గల మూడునెలల కాలమున ముద్రితములయి ప్రకటితములయిన

ఆంధ్ర గ్రంథముల పట్టిక*

కథలు—ఐతిహాసికములు, పౌరాణికములు

గజేంద్రమోక్షము—(ప్ర) పి. నటేశమొదలియారు, మదరాసు.

జయవిజయులు—సి. శ్రీరామశాస్త్రి.

పావని—జె. సీతారామస్వామి.

పురాణపతివ్రతలు—బి. వెంకటరమణయ్య.

శ్రీకృష్ణచరిత్రము—యం. వెంకటరమణాచారి.

—కల్పితములు

దైవమిచ్చినభార్య—జి. వెంకటాచలం.

పిల్లలకథలు—యం. సుబ్రహ్మణ్యం.

భోజకాళిదాసు—యం. శ్రీరామమూర్తి.

మణిమంజూష—యస్. వెంకటసుబ్బయ్య.

మాకర్మమిట్లాకాలింది—జి. వెంకటాచలం.

మిత్రలాభము, కాకోలూకీయము—బి. వెంకటరమణయ్య.

సీమంతినీచరిత్రము—జె. వెంకటసుబ్రహ్మణ్యశర్మ.

—చారిత్రికములు

దశకుమారచరిత్రము—(ప్ర). సి. రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, మదరాసు.

భారతపుత్రులు, భా. ౧, ౨—కె. కొండలరావు.

కల్పము

పొంగలివ్రతము—(ప్ర) సి. లక్ష్మీనృసింహము, మచిలీపట్టణము.

బుధాష్టమీవ్రతకల్పము—(ప్ర) సి. లక్ష్మీనృసింహ శాస్త్రి, మచిలీపట్టణము.

హనుమద్వ్రతకల్పము—(ప్ర). సి. లక్ష్మీనృసింహ శాస్త్రి, మచిలీపట్టణము.

గణితశాస్త్రము

భూమికొలత సర్వేగణితము—యం. రామయ్య.

గేయములు

శ్రీకీరపండరీపుర విఠల్ ప్రసన్న కీర్తనలు—యం. నరసింహదాసు.

శ్రీవాసుదాసకీర్తనలు—వి. సుబ్బరావు.

సభారంజిత సంగీత కీర్తనలు, భా. ౧—(ప్ర). చంద్రిక అండ్ కో, మదరాసు.

స్త్రీలపాటలు—డి. సీతారామరావు.

స్త్రీలపాటలు, భా. ౧—జి. లక్ష్మీకాంతమ్మ, జె. శారదాంబ.

చరిత్రము

బాలహిందూదేశచరిత్రము, బుక్, ౧, ౨—వి. పార్థసారథి.

హిందూదేశచరిత్ర—డి. అప్పారావు, బి. సూర్యనారాయణ.

హిందూదేశచరిత్ర, భా. ౧—యస్. సుబ్బరావు.

చట్టము

వ్యవహారచంద్రిక—జి. సేతుమాధవరావు.

సివిల్ వ్యవహారములు—జి. సేతుమాధవరావు.

ఛందశ్శాస్త్రము

ఆంధ్రకవిత్వలక్షణము—బి. వెంకటనాంచారయ్య.

---

* ఈ పట్టికయందుగల సంకేతపదముల వివరణము: అ.—అధ్యాయము. అను.—అనువాదము, అనువాదకులు. ప.—పద్యము. ప్ర.—ప్రకాశకులు భా.—భాగము. వ.—వచనము. సం.—సంపాదకులు. సటీ.—సటీకము.

జీవితములు

కాళిదాసుచరిత్రము—యం. శ్రీరామమూర్తి.
తెనాలిరామకృష్ణుడు—యం. శ్రీరామమూర్తి.
బొల్లిని మునిస్వామినాయుడు గారియొక్క జీవిత చరిత్రము—టి. యన్. ఉమాపతిఅయ్యా.
శ్రీవీరేశలింగ సంస్మృతి—ఆర్. వెంకటశివుడు.

దండకము

భల్లాణదండకము—యన్. రామజోగికవి.

నవలలు

అన్నపూర్ణ మందిరము—నిరుపమదేవి.
ఏకాక్షి, భా. ౧, ౨—జి. నారాయణరావు.
జోరాజాని—(ప్ర). శ్రీకృష్ణాడిపో, రాజమహేంద్రవరము.
నూటపదునాలు—(ప్ర). భారతీగ్రంథమాల, కర్నూలు.
పరంతపవిజయము—యం. సుబ్రహ్మణ్యం.
మాయామయి, భా. ౬—కె. రంగయ్యా.
రాణిభవాని, భా. ౨—(ప్ర). వెంకటపార్వతీశ్వరకవులు, పిఠాపురము..
స్వార్థత్యాగము—గ. కృష్ణమూర్తి.

నాటకములు

కళాపాహాడ్—(ప్ర). చ. వెంకటరామయ్యా, రాజమహేంద్రవరము.
జయంతజయపాలము—యం. శ్రీరామమూర్తి.
ధరణికోట—యస్. రామానుజరావు.
ధార్మికపంతులు—యస్. కృష్ణమూర్తిశాస్త్రి.
శకుంతల—(అను) వెంకటపార్వతీశ్వరకవులు.
సంజయరాయబారము—వై. బుల్లికొండలరాయుడు.
సంభాజినిర్యాణము—చ. వెంకటరామయ్యా, రాజమహేంద్రవరము.
సారంగధర—వి. మైసూరయ్యా.
సావిత్రిపరిణయనాటకము—సి. సుబ్బదాసు.

నీతి

కుమారగుణబోధిని—(ప్ర) ఏ. రామమోహనరాయి, బెజవాడ.
నీతిదర్పణము—వి. గంగాధరశాస్త్రి.
నీతిరత్నావళి, భా. ౧—కె. వెంకటశాస్త్రి.

పరిశిష్టము

ఆర్తవచంద్రిక—(ప్ర) సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము.
ఇటావాసమాధి—యం. శ్రీరామశాస్త్రి.
కల్పమంజరి—ఏ. రంగనాయకులు.
కోదండరాముడు—(ప్ర) సి. కుమారస్వామి నాయుడు అండ్ సన్, మదరాసు.
కోళ్లనుపెంచుట—(ప్ర) క్రిశ్చియన్ లిటరేచర్ సొసైటి, మదరాసు.
గీతావళి—పి. వెంకటసుబ్బయ్యా.
గ్రామకరణముల పరీక్షాదర్శిని—బి. లక్ష్మీనరసింహం.
చమత్కారము—జి. నారాయణరావు.
తూర్పుగోదావరిజిల్లాసంఘము—(ప్ర) తూర్పుగోదావరిజిల్లా సంఘ సెక్రిటరి, కాకినాడ.
త్రిపురసుందరీవిలాసమును గురించి లెక్చరు—పి. సాంబశివరావు.
నవగ్రహచింతామణియను ప్రశ్నశాస్త్రము—సి. లక్ష్మీనృసింహశాస్త్రి.
పశ్చాత్తాపము—జి. నారాయణరావు.
ప్రాక్పశ్చిమములు—వివేకానందస్వామి.
క్షేమతత్వము—యం. సూర్యనారాయణశాస్త్రి.
బంగారుయోగము—జి. నారాయణరావు.
బాలరామాయణము—(ప్ర) కె. దొరసామి మొదలి, మదరాసు.
బాల్యవివాహము—(ప్ర) క్రిశ్చియన్ లిటరేచర్ సొసైటి, మదరాసు.
మాధవదాసుచరిత్రము—శేషాచలదాసు.
మారులునూతనసివిక్సు వాచకము—బి. రామమూర్తి, యన్. యస్. సోమయాజులు.

మోటారు డ్రైవర్సు గైడ్—యన్. ఆర్. వరదారెడ్డి.
రజస్వలానంతర వివాహములు—యం. సింహాచలం.
రుక్మిణీకల్యాణము—(ప్ర) పి. నటేశమొదలియారు, మదరాసు.
వావిళ్లవాచకపుస్తకము, తరగతి, ౬—జె. గంగన్న.
వినోదవల్లరి—కె. గురునాథమూర్తి.
వివేకవాచకము, బుక్. 3—సి. లక్ష్మీనరసింహం.
శ్రీ గురుసాక్షి దేవమానస గోచరిదేవలతత్వం—బి. తాతయ్య.
శ్రీ వాచకము, ౧, ౨—డి. కోదండరామస్వామి.
సస్యదోహదము—యం. సత్యనారాయణరాజు.
సస్యానందము — (ప్ర) సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము.
సూక్తిరత్నావళి, భా. ౨ — యం. వెంకటశాస్త్రి, వి. సూర్యనారాయణశాస్త్రి.
సోదరీస్మృతి—ఏ. నాగగోపాలరావు.
స్త్రీ—జి. వెంకటాచలం.

పారిశ్రామికము

మననేతపరిశ్రమ—భ. పట్టాభిసీతారామయ్య.

పు రా ణ ము

విష్ణుపురాణము—కె. భావనారాయణ.

ప్రబంధము

శ్రీమదాంధ్ర చంపూరామాయణము—(ప్ర) పి. కృష్ణమూర్తి, రాజోలు.

భూగోళశాస్త్రము

గుంటూరుతాలూకా భూగోళము—కె. రామకృష్ణయ్య.
దక్కనుచరిత్ర భూగోళముల సంగ్రహము — (ప్ర) క్రిశ్చియన్ లిటరేచరు సొసైటి, మదరాసు.
భూగోళశాస్త్రము, చెన్నరాజధాని—కె. ఏ. వీరరాఘవాచారి.
రామచంద్రపురము కాకినాడ తాలూకాల భూగోళము—ఏ. పార్వతీశము.
వాణీభూగోళశాస్త్రము, బుక్ ౧, 3 — ఏ. రామచంద్రరావు, పి. అప్పరావు.
హిందూదేశ భూగోళశాస్త్రము—కె. జగన్నాధం.

మతము—హిందు

ఆబ్దికశ్రాద్ధవిధి—(ప్ర) సి. లక్ష్మీనరసింహశాస్త్రి.
ఆస్తిక్యము—వి. వి. శివయ్య, కె. సత్యనారాయణమూర్తి.
దశాహాశౌచవిధి—(ప్ర) డి. రామబ్రహ్మశర్మ, గుంటూరు.
మతధ్వజము—పి. ఉమామహేశ్వరశాస్త్రి.
సంధ్యామంత్రార్థదర్పణము—(ప్ర) సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము.

—ఇతరములు

ఆదిక్రైస్తవసంఘచరిత్ర —యఫ్. యఫ్. (రెవ్) గ్లెడ్‌స్టన్.
కొరింథీయులకు వ్రాసిన మొదటిపత్రిక—డబ్ల్యు (రెవ్) హొవర్డ్ కాంప్‌బెల్.
క్రైస్తవమతజ్ఞానబోధిని — (ప్ర) ఏ. ఇ. యల్. సి. మిషన్, గుంటూరు.
తప్పిపోయినకుమారుడు—(ప్ర) క్రిశ్చియన్ లిటరేచర్ సొసైటి, మదరాసు.
నాయీబ్రాహ్మణ ప్రకాశిక—రేవతి ప్రసాదశర్మ.
పరిశుద్ధచరిత్రోపదేశము — (ప్ర) ఏ. ఇ. యల్. సి. మిషన్, గుంటూరు.
శ్రీబుద్ధోపదేశము—(ప్ర) వ్యాసఆశ్రమము, ఏర్పేడు.

మాహాత్మ్యము

శింగరాద్రిమహాత్మ్యము — ఏ. వెంకట రంగస్వామి అయ్యంగారు.
శ్రీచెన్నకేశవస్వామి మాహాత్మ్యము — రామకృష్ణ సీతారామసోదరకవులు.

రాజకీయములు

శాంతిసంగ్రామము—వి. వెంకటసుబ్రహ్మణ్యశర్మ.
స్వరాజ్యఢంక—బి. కోటీశ్వరరావు.

వేదాంతశాస్త్రము

అచలబోధామృతము—పి. అరుంధతాంబ.

నిష్కామయోగము — (ప్ర) మానవాదర్శ గ్రంథమండలి, అంగలూరు.

ముండకోపనిషత్తు— (ప్ర) రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, మదరాసు.

శ్రీమదాంధ్రాధ్యాత్మ రామాయణము—వి. జానకిరామశాస్త్రి.

శ్రీమద్భగవద్గీత — (ప్ర) హిందూసమాజము, రాజమహేంద్రవరము.

శ్రీమహాయోగపురుషుడు వేమనార్యుని బ్రహ్మజ్ఞానోపదేశ వాక్యంబులు—(ప్ర) పి. త్యాగరాయశెట్టి, మదరాసు.

సర్వాత్మప్రకాశిక—కె. వెంకటరెడ్డి.

సుజ్ఞానదీపిక—యం. లక్ష్మీనరసింహం.

వైద్యశాస్త్రము

అష్టాంగహృదయము— (ప్ర) వి. రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, మదరాసు.

వ్యాకరణశాస్త్రము

ఆంధ్రసంగ్రహవ్యాకరణము, భా. ౧. ౨—ఏ. వి. నరసింహం.

శతకములు

ఆరోగ్యవేంకటేశ్వర రాజరాజేశ్వరీ శతకములు—వి. రామసుబ్బారాయుడు.

దశరథరామశతకము—వి. నరసింహదాసు.

పతివ్రతాశతకము—(ప్ర) సి. రాజగోపాలరావు, నూజివీడు.

భారతాంబికాశతకము—జి. మల్లావధాని.

మాధవశతకము—జి. నరసింహాచార్యులు.

మానసబోధశతకము—ఏ. వీరబ్రహ్మచారి.

రంగనాయకశతకము—బి. నరసింహదాసు.

రామచంద్రప్రభుశతకము—కె. నరసింహము.

శూన్యలింగశతకము—వి. సుబ్బారాయుడు.

శ్రీకొమర్పురీశ్వరశతకము—టి. అప్పాస్వామి.

శ్రీ పాండురంగశతకము—యన్. శేషాంబ.

శ్రీపుల్లగుమ్మిబుగ్గరామశతకము—యల్. వెంకోబరావు.

శ్రీ భద్రశైలరామశతకము —పి. అప్పలానందము.

శ్రీ వెంకటేశ్వరశతకము—రామరాయకవి.

శ్రీ సరస్వతీశతకము—సి. సరస్వతీదేవి.

శ్రీ సర్వేశ్వరశతకము—సి. వెంకట కామేశ్వరకవి.

శ్రీ సంగమేశ్వరశతకము—పి. వెంకటాచలకవి.

స్తోత్రములు

అష్టోత్తరశతనక్షత్రమాలిక—డి. నారాయణ.

ఆర్యలఘుసంధ్యావందనం—(ప్ర) సి. బసవయ్య, గుంటూరు.

అంధ్రీకృతజితంతేస్తోత్రం— (అను) బి. శ్రీనివాసులు, ఆంజనేయులు, రాఘవయ్య, బాపట్ల.

యజుర్వేద సంధ్యావందనం—(ప్ర) సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము.

రంగనిరత్నమాల—యన్. రంగరావు.

శనిస్తోత్రనక్షత్రమాల—వి. రామసుబ్బారాయుడు.

శ్రీ భగవత్స్తోత్ర రత్నాకరము—(ప్ర) జమీందారు, నూజివీడు.

స్తోత్రకదంబము—వి. శివరామశాస్త్రి.

హరికథలు

గాడభక్తచరిత్రము—బి. ఆశన్న.

సుమతీదేవిచరిత్రము—ఏ. వీరబ్రహ్మచారి.



ఊరబావి

—యస్. దుర్గారావు.

నక్షత్రమండలము గొబ్బూరు వేంకటానంద రాఘవరావు, బి. ఏ. (కవితాసమితి)

(శ్రావణమాసము)

ఉత్తరము

తూర్పు



పడమర

దక్షిణము

ఈ పటమునందున్నట్లు నక్షత్రాగులు ఈ ఆగస్టు నెల

8-వ తేదీని సుమారు 9-0 గంటలప్పుడును, 22-వ తేదీని సుమారు 8-0 గంటలప్పుడును,

15 ,, ,, 8-30 ,, 30 ,, ,, 7-30 ,, కనబడును.

[ఈపటమును చూచి ఆకాశమున చుక్కలు గుర్తింపనెంచువారు ఈ పటమును తలకుమీదుగా నుంచుకొని ఇందు తెలుపబడిన దిక్కులు ఆయాదిక్కులకు సరిపడునట్లు పటమును త్రిప్పి పట్టుకొని చూడ

ఈనెల పున్నమనాడు చంద్రుడు శ్రవణనక్షత్రముచెంత నుండుటచేత ఈమాసమునకు శ్రావణమాసమని పేరు వచ్చినది. ఈనెల తొలిజామున సాయావేళలందు పటమునందు తెలిపినప్రకారము కానవచ్చు నక్షత్రాదులను పరిశీలింతము.

రా సు లు

పడమట కన్యారాశి అస్తమింపనై యున్నది. కన్యనుండి తూర్పునకు వరుసగా తుల, వృశ్చికము, ధనుస్సు, మకరము, కుంభము, మీనము నను రాసులు వ్యాపించియున్నవి. మీనరాశి ఇపుడిపుడే ఉదయమగుచున్నది. విషువృత్త, క్రాంతి వృత్తములు కన్యామీన రాసులలో నొకటొకటిని కలియుట పటములో కానవచ్చుచున్నది.

క్షీరోదము, ఆకాశగంగ, Milky way

ధవళధవళమైన యీవిచిత్రదృశ్యము ఇపు డీశాన్య దిశనుండి యాకాశమున రంభాదులగు నప్సరసమండలము నుండి బ్రహ్మవాహనమగు రాజహంసమండలమును జేరి యక్కడ రెండుశాఖలుగా చీలుచున్నది. పడమటవైపున నున్నశాఖ స్వల్పముగా తెలుపువర్ణము కలిగియున్నది. ఈ శాఖయే శ్రీమహావిష్ణునిపాదము లంటుచు, శేషమండలము గడచి, వృశ్చికరాశిమీదుగా దక్షిణమున మూల నక్షత్రముక్రింది యగ్నివేదికవరకు వ్యాపించినది. తూర్పునయిపుననున్నశాఖ సాంద్రధావళ్యము గలిగి గరుడమండలము (Aquila) అనగా శ్రవణమువీదుగా ధనుస్సు దాటి యగ్నివేదికకడ పశ్చిమశాఖను కలియుచున్నది. ఈరెండు తెలుపుశాఖలకు మధ్య సన్నగను, దీర్ఘముగను నల్లనిప్రదేశ మొకటి కానవచ్చుచున్నది. ఈనలుపుగల ప్రదేశమునుగూర్చి యీదిగువ నిపుడే 'ఛాయాపథ' నిరూపణసందర్భమున వ్రాయుచున్నాను.

శ్రీ మహావిష్ణుని పాదములనుండి యుత్తరముగా వ్యాపించియున్న ధవళప్రదేశము అప్సరసమండలము దాటి ఆర్ద్రి, మృగవ్యాధనక్షత్రములమీదుగా పోవుచున్నది. ఇందునలననే ఆకాశగంగ విష్ణుపాదోద్భవయనియు, దేవాంగనావిహారస్థానమనియు, శివుజటాజూటమున నిల్చినదనియు పురాణములు తెలుపుచున్నవని నా విన్నపము. ఆర్ద్రానక్షత్రము రుద్రదైవత్యము. మృగవ్యాధుడును ఒకరుద్రుడే. ఈనక్షత్రములమీదుగా పోవు ధవళదృశ్యము, ఫేనసహితమైన యాకాశగంగ యని మనబుధులును, కవులును వర్ణించుట సహజమై యున్నది. ఇట్టి ఆకాశగంగను ఈశ్వరుడు శిరమున ధరించెననిచెప్పుట ఎంతయు ఒప్పియున్నది. ఆర్ద్రి, మృగవ్యాధులకు అనతిదూరముననే యమునయు నీ దివిజగంగతో సంగమించునట్లు కనబడగలదు.

మతోద్రేకపూరితులైన విష్ణుభక్తులు కొందరు గొప్పశివభక్తులతో వాదించుచు "మా దేవునికాళ్లలో పుట్టినగంగను మీదేవుడు తలమీద పెట్టుకున్నాడు. కాబట్టి మీదేవుడు మాదేవుడికాలికిందవాడు" అని ప్రగల్భములు పలికినట్లు శ్రీబుద్ధరాజు ఈశ్వరప్పగారు మొదలగు హాస్యప్రియులు వినోదార్థము ప్రహసనములు వ్రాసినారు. ఇట్టి గాథలకు, యుక్తులకు మూలము ఈఖగోళదృశ్యమే. విష్ణుమండలసమీపమునుండి ఉత్తరముగా వ్యాపించిన ధవళవాహిని ఆర్ద్రి, మృగవ్యాధ నక్షత్రములమీదుగ పోవుటయేనని విన్నవించుచున్నాను.

ఛాయాపథము

మహాకవి కాళిదాసు రఘువంశము ౧౩-వ సర్గ, ౨-వ శ్లోకము

వలెను. అట్లు చేసినపక్షమున కుడిచేతివైపు పడమట అనియు, ఎడమచేతివైపు తూర్పు అనియు పటమున వ్రాయుటవలన కలిగినసంశయము నివారణయగును. ఇందలి దిక్కులు, చుట్టునున్న దిక్కులతో చక్కగా నప్పి సరిపోవును. చుక్కలు సరిగా గుర్తింపనగును.]

"వైదేహి పశ్యామలయాద్విభక్తం మత్సేతునా ఫేనిల మమ్బురాశిమ్, ఛాయాపథేనేవ శరత్ప్రసన్న మాకాశ మావిష్కృతచారుతారమ్" అని వ్రాసి యున్నాడు. ఇందు ఛాయాపథమనునది పాశ్చాత్యులు Milky way అని చెప్పునది యగునా ? అని నెల్లూరు నుండి మ.రా. శ్రీ, ఒంగోలు వెంకటరంగయ్యపంతులు (B. A., B. L.) గారు చక్కని ప్రశ్న వేసినారు.

రావణవధానంతరము శ్రీరాముడు పుష్పకవిమానము నెక్కి సీతతోకూడ అయోధ్యకు పోవుచు, సేతువు నామెకు చూపుచు చెప్పినట్లు రచింపబడిన శ్లోక మిది. ఈశ్లోకములో సముద్రము ఆకాశముతోను, నురుగు ఆకాశముపై జూపబడెడి ధవళదృశ్యముతోను, ఆ నురుగును వేరుచేయుచున్న సేతువు ఛాయాపథముతోను రమ్యముగా పోల్చబడినవి. ఆకాశమునందలి నురుగువంటి యీ తెలుపు సాంద్రమైన చుక్కలసముదాయమనియు, ఊహింపరానంతదూరమున నుండుటచేత నిది తెల్లని నురుగుమాత్రముగా కనబడుచున్నదనియు, టెలెస్కోపు (దూరదర్శియంత్రము) లో చూచువారందరికి స్పష్టము. ఈతెలుపుమధ్య నల్లనల్లని ప్రదేశములు విశేషముగా నగపడును. మిక్కిలి నల్లగా నున్నచోట్లు రాక్షసిబొగ్గుమూట(Coal sacks)లని పాశ్చాత్యసిద్ధాంతులు చెప్పుదురు. వాటిని మనము శ్యామసీమలంటిమి. ఈసంచిక నక్షత్రపటములో శ్యామసీమలు లేవు. కాని విష్ణు, శేష, జ్యేష్ఠప్రాంతముల నంటియున్న తెలుపునకును శ్రవణాధనూరాసులనంటియున్న తెలుపునకును మధ్య దీర్ఘముగ, సన్నగ, నల్లగ కొంతప్రదేశమున్నది. నురుగువలె బహుముఖముల నాకాశమున వ్యాపించియున్న ధవళప్రదేశము యావత్తును ఛాయాపథ మనుటకంటె ఇటునటు తెలుపుమధ్యనున్న నల్లనిప్రదేశమునే ఛాయాపథమనుట యెంతయు ఒప్పియున్నట్లు తోచుచున్నది. మల్లినాథసూరి, పైశ్లోకమునకు వ్యాఖ్యలోకూడ "ఛాయాపథోనామ జ్యోతిశ్చక్రమధ్యవర్తీ కశ్చిత్తిరశ్చీనోఽవకాశః" అని తెలిపియున్నాడు. ఆకాశగంగనుగూర్చి చర్చించుచు లోకమాన్యతిలకుమహాశయులు Orion ౧౨౨-వ పుటలో నీక్రిందిశ్లోకములను ఇచ్చియున్నారు:

౧. నేదం నభోమండల మంబురాశి ర్నైతాశ్చ తారా నవఫేనఖండాః. (సాహిత్యదర్పణము, ౧౦. అపహ్నుతి కుదాహరణము.)

౨. వియద్వ్యాపీ తారాగణగుణితఫేనోద్గమరుచిః ప్రవాహో వారాం యః పృషతలఘుదృష్టః శిరసి తే, జగద్ద్వీపాకారం జలధివలయం తేన కృతమిత్యనేనైవోన్నేయం ధృతమహిమదివ్యం తవవపుః.

"The conception of Shiva embodied in this verse is really a grand one. The poet asks his readers to imagine how great must Shiva be, the celestial stream on whose head encircles the Universe. The Milky way which girdles the celestial sphere can not be better described" అని తిలకుగారు వ్రాసినారు.

కాబట్టి యీధవళదృశ్యమును క్షీరోదము, ఆకాశగంగ అనియు, అచ్చతెనుగున పాలపుంత యనియు చెప్పుదము. అందలి నల్లనల్లని దృశ్యమును ఛాయాపథమందము. నాయం దమితసద్భావముతో ఛాయాపథమునుగూర్చి పైసూచనచేసిన మ. రా. శ్రీ ఒంగోలు వెంకటరంగయ్య పంతులుగారికి కృతజ్ఞుడనై నమస్కరించుచున్నాను.

మిక్కిలి తేజోవంతములైన నక్షత్రములు, గ్రహములు

ఈనెలలో తొలిజామున మిక్కిలి తేజోవంతములైన నక్షత్రములు ౬ మాత్రమే కనబడుచున్నవి. అవి యేవియనగా:—కన్యలో చిత్ర; మరుద్గణములో స్వాతి; వీణలో బ్రహ్మ; గరుడునిలో శ్రవణము; వృశ్చికములో జ్యేష్ఠ; కుంభముదిగువ ఇంద్రద్యుమ్నుడు.

గ్రహములలో గురుడు కన్యలో ప్రవేశించినాడు. అందుచేతనే ఈమాసములో కృష్ణాపుష్కరము. అంగార

కుడు చిత్రసమీపమున మన్నాడు; తులారాశిలో ప్రవేశించు చున్నాడు. శని శ్రవణముదిగువను కనబడు చున్నాడు.

మిగిలినచుక్కలలో —పడమటి యాకాశమున స్వాతికిని, ఉత్తరఫల్గునికిని మధ్య వేణీమండలము మిణుకు మిణుకు మనుచున్నది. మరుద్గణమున ఎగువ భూతేశ మండల మున్నది. దానికిపైగా క్రతు,పులహ, పులస్త్య, అత్రి, ఆంగీరస, వసిష్ఠ, మరీచులను సప్తఋషులును త్వరలో నస్తమింప నున్నారు. వసిష్ఠునిప్రక్కనే మహాపతివ్రతయగు అరుంధతి మిణుకుమిణుకు మనుచున్నది. పులహ, క్రతురేఖ సూచింప ధ్రువుడు లఘుఋక్షముయొక్క తోకచివరను మెరయు చున్నాడు. ధ్రువునకు క్రిందుగా కశ్యప, మహేంద్ర, అగ్నినక్షత్రములును, అగ్నికి పడమట ధాతయు, ధాతకుదిగువ విధాతయు, విధాతకు తూర్పుగా మిత్ర నక్షత్రమును ఉన్నవి. ఈయేడు నక్షత్రములతో కూడు కొనియున్న లఘుఋక్షమునకును, క్రతుపులహాదులగు సప్తఋషులతో కూడియున్న బృహదృక్షమునకును మధ్య మెలికలు తిరిగి నరకాసురు డున్నాడు.

భూతేశస్వాతిమండలమునకు తూర్పుగా నున్న శేషునిఫణములక్రింద శేష-పాన్పుపై పండుకొనియున్న శ్రీమహావిష్ణుస్వరూపము గగనమధ్యరేఖ దాటినది, ఆషాఢశుద్ధ-ఏకాదశినాడే విష్ణువు శయనింప నారంభించినసంగతి మనము క్రిందటిసంచికలో చూచినాము. విష్ణునినాభికమలమునుండి ఉద్భవించినాడని చెప్పబడు బ్రహ్మనక్షత్రము వీణా మండలము (Lyra)లో ముఖ్యమైనది, కాలుచున్న మెగ్నిసియముతీగవలె తెల్లని కాంతితో తేజరిల్లు నీబ్రహ్మనక్షత్రము మన సూర్యుని కంటె నూరురెట్లు తేజోధికమైన మహాగోళము. అచటి కాంతి మనకు చేరుసరికి నలుబదిసంవత్సరములు పట్టునని లెక్కింపబడినది. ఈమండలమునకు తూర్పుగా బ్రహ్మకు వాహనమైన రాజహంస యున్నది; కలహాశనుడైన నారదుడు మన్నాడు. ఆవల గరుడమండలము నందు శ్రవణమును, శ్రవణమున కటునిటు రెండుచుక్కలును ఉన్నవి. ఈమూడుచుక్కలును "ప్రత్తికాయ పేలినపుడు బయల్పడు ప్రత్తిబోజలలాగున నున్న"వని శ్రీనాథమహాకవి వర్ణించియున్నాడు. అందు 'గామా' గుర్తుగల పైచుక్కను అరబ్బులు త్రజేదీ (Trazed) అందురు. ఆమాటకు బందెటుదొంగ అని అర్థము. బీటా గుర్తుగల దిగువచుక్కను అరబ్బులు అల్షైన్ (Al shain) అందురు—అనగా తెల్లగద్ద. తెల్లగద్ద యనబడు బొల్లిగద్ద విష్ణువునకు వాహనము, ధ్వజము అనుట సుప్రసిద్ధవిషయము. ఉదయమగునపుడు వాహనమైనదే అస్తమించునపుడు ధ్వజ మగును. విశేషించి గరుడుడు ఇంద్రుని జయించి అమృతమును బలవంతముగా హరించినసంగతి పురాణప్రసిద్ధము. గాయత్రి గరుడాకారమున సోమము తేజనుయు, కృశాను డాగాయత్రిపై బాణ మేయుటయు లోనగు వేదగాథలు ఐతరేయబ్రాహ్మణాదులందు వర్ణింపబడినవి. (మా. ఐ. బ్ర. III 3. ౨౬) ఆగాథలు చిత్రపటములతో ముందు వివరింపబడును. గాయత్రి గరుడరూపమున సోమము హరించిన వేదగాథనుండి ఇంద్రునిజయించి గరుడు డమృతము హరించిన వృత్తాంతము పురాణములోనికి వచ్చినది. ఈగాథయే మరియొకరూపమున ఆరబిక (Arabic) జ్యోతిర్గ్రంథములలో చేరినట్లు కనబడుచున్నది. శ్రవణమునకావల వసుదేవతాకమైన ధనిష్ఠ, దానికావల కుంభరాశి, కుంభమున కావల పేద్దఘూశ్వమునందలి పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రములును, వీటికావల రేవతియు, క్రమముగా ఒకదాని కొకటి తూర్పుగా నున్నవి. రేవతి ఇపుడే ఉదయించుచున్నది. ఈశాన్యదిశను ధ్రువునికి తూర్పునను, పడమటి ఋషిమండలమున కెదురుగను రంభాదు లుదయించినారు. ఇంద్రమద ఉదయమగుచున్నది. రాజహంసకు మీదుగాను, కశ్యపమహేంద్రాదులకు తూర్పునను ఊర్వశీపురూరవసులు కానవగుచున్నారు. నైరృతిదిగ్భాగమున చిత్రకుదిగువ వహలుషునిలో రెండు చుక్కలు మాత్రము కనబడుచున్నవి. కొదువ సర్ప మస్తమించినది. ఆ దిగువను అశ్వతరమండలమున కొన్నిచుక్కలు మాత్రము అగపడుచున్నవి. అందలి అశ్వినులచే బల్లెపుపోటు తిని నోరు వెళ్లబెట్టుచున్న

వృకము విశాఖ, అనురాధానక్షత్రములదిగువ నున్నది. అనూరాధ, జ్యేష్ఠ, మూలనక్షత్రములు కూడి పెద్దవృశ్చిక రూపముతో ఆపేరుగలరాశి మెరయుచున్నది. ఈ రాశిలో జ్యేష్ఠనక్షత్రము బ్రహ్మాండగోళము. దీని వెలుగు మనకు చేరుసరికి ౧౫౩ సంవత్సరములు పట్టునని లెక్కింపబడినది. మూలదిగువను అగ్నివేదిక (Ara) ఉన్నది. ఆవేదికపై సత్యయజ్ఞము చేయుచు భగవంతుని ఇంకను ధూపదీపాదులతో నారాధించుచున్నట్లు బలి చక్రవర్తి కనబడుచున్నాడు.

అగ్నివేదికకు తూర్పుగా చిలుక ఉన్నది. ఇది ధన్వీయనబడు మన్మథుని వాహనము. మన్మథునిదిగువనే బాణాసురుడు; అప్రక్కనే వాని మయూరము (నెమిలి). దీనికి చిత్రశిఖండి యను నామాంతరమును కలదు. ఉత్తర చిత్రశిఖండిమండలము మన సప్తఋషిమండలమే. దక్షిణ చిత్రశిఖండిమండలసందర్భములు వేరొకచోట చర్చింతము. ఇక ఆగ్నేయదిగ్భాగమున నాళీకజంఘబకము. ఇంద్రద్యుమ్నమహారాజును, యుగంధరకమఠమును ఇపు డిపుడే ఉదయించుచున్నారు. వీటికిపైన మకరరాశి యున్నది.

క్షీ-ఉ-ధ్రు.

సప్తఋషులకును, ఉత్తరఫల్గునికిని మధ్య, మన పటములో "క్షీ-ఉ-ధ్రు" అని మూడక్షరములు వేసి ఒకచుక్క చూపించినాము. అది యొక గురుతుగాని నిజముగా చుక్క కాదు. ఖగోళముచుట్టును వ్యాపించి యున్న క్షీరోదమను వలయము (Galactic Belt)నకు ఈచుక్కగలచోటు ఉత్తరధ్రువ (North Galactic Pole) మని చెప్పవచ్చును. దీని దక్షిణధ్రువమును గూర్చియు, క్షీరసాగరమథనమునుగూర్చియు, ఈశ్వరుడు హాలాహలము భక్షించిన వృత్తాంతమునుగురించియు ముందు వ్యాసములలో చూతము.

ఉల్కాపాతములు

ఈనెల ౧౧-వ తేది మొదలు ౧౩-వ తేదివరకు భృగుపరశుమండలములో ఉజ్జ్వలములై వేవేగ రాలు నుల్కాసమూహము చూడనగును. లోగడ ౧౮౬౬-౭ సంవత్సరములో కనబడిన యొక తోకచుక్కయొక్క శకలము లివియని తెలియుచున్నది. భూమి సూర్యుని చుట్టును తిరుగుచున్నపుడు ఈనెలలో పై తేదీలను పై ధూమకేతుశకలములున్నతావు చేరునపు డీశకలములు ఉల్కారూపమున మనభూమిపై పడుచున్నవి.

ఇంకను ఈనెల ౧౫-వ తేదీ మొదలు ౨౫-వ తేదీవరకు నరకాసురమండలములోనుండియు చిన్న ఉల్కాపాతము కానవచ్చును.





బాల క్రీడలు

మంగిపూడి వేంకటశర్మ

౧౩. అరటిచెట్లు

ముగ్గురు బాలికలుమాత్రము పైగానుండి తక్కిన వారందరును గుంపుగా నొకచోట నిలిచియుండి చేతులు పైకెత్తవలయును. అట్లు గుబురుగా నిలిచియున్నమనుష్యులకు అరటిచెట్టు లనిపేరు. పైనున్న ముగ్గురుబాలికలలో ఒకరు ఇంటియామెయగు గొల్లదిగాను, ఒకతె ఆయిల్లు కావలికాయు కుక్కగాను, ఒకతె దొంగగాను ఏర్పడి ఆపేరులు పెట్టుకోవలయును. గొల్లది ప్రొద్దున లేచి మొగము కడుగుకొని చల్లకుండ నెత్తిమీద పెట్టుకొని కుక్కను పిలచి "కుక్కా, చల్లమ్ముకొనివచ్చెదను. అరటిచెట్లను కాయలు, పండ్లు ఉన్నవి. దొంగ లెవ్వరును వచ్చి కోసుకపోకుండా జాగ్రత్తగా చూచుచుండుము. నేను వచ్చినతర్వాత నీకు పెరుగూ, బువ్వ పెడ్తాను. ఇల్లుకూడ పదిలముసుమా" అనిచెప్పును. కుక్క 'సరే' అని యూరకుండును. గొల్లది వెళ్లిపోవును. దొంగపేరుపెట్టుకొన్నపిల్ల కుక్కతో గొల్లభామ చెప్పిన మాటలన్నీ చాటునుండి వినుచుండును. కుక్క అరటిచెట్ల సమీపమునందే ఒకచోట పండుకొని కొంత సేపటికి నిద్రపోవును. తరువాత దొంగ వచ్చి అరటి పండ్లూ, కాయలూ కోసుకొని పారిపోవుచుండును. ఆఅలుకుడువల్ల కుక్క లేచి చూచి మొరుగుచు వెంబడించును. దొంగ పారిపోవును. కుక్క మళ్లీవచ్చి ఎప్పటిచోట పరుండియుండును. అంతట గొల్లదివచ్చి అరటిచెట్లను పండ్లూ, కాయలూ లేకుండుట చూచి ఎవరో దొంగలు కోసుకపోయినారని తెలిసికొని కుక్కదగ్గరకు వెళ్లి "కుక్కా, మన అరటిచెట్ల కాయలూ, పండ్లూ కోసుకొనిపోయినారు. నిన్ను కావలియుంచి వెళ్లితిని కదా, నీవేల యూరకుంటివి? ఏమిచేయుచుంటివి?" అనికోపపడును. అందుకు కుక్క "అమ్మో! నేను ఎక్కడికినీపోక ఇక్కడే పండుకొనియుంటిని. కాని పొరపాటున కొంచెము కునుకుపట్టినది. ఆసమయమున ఎవరో దొంగ వచ్చి దోచికొని పారిపోయినాడు. అంతలో నాకు మెలకువవచ్చి తరుముకొని పోయితిని కాని ఆదుర్మార్గు డందక పరుగెత్తిపోయినాడు. నాపొరపాటును క్షమింపుము." అని వేడుకొనును. అది విని గొల్లపడుచు "అమ్మో! ఎన్నో మంచికాయలూ, పండ్లూ నిష్కారణముగా పోయినవి" అని విచారించి, కుక్కను చూచి "సరే, పోయినవేమో పోయినవి. ఇక ముందైన జాగ్రత్తగా కాచుచుండుము. నే నింటిలో లేనప్పుడు నిద్రపోకుము. అట్లు నిద్రపోతివేని ఇక నెన్నడును పెరుగుబువ్వ పెట్టను." అని బుద్ధిచెప్పి ఆహారము పెట్టును. కుక్క మేతమేసి అరటిచెట్టువగ్గర కూర్చుండును. అప్పుడు గొల్లదివచ్చి "కుక్కా, నేను పెరుగమ్మబోయెదను, దొంగలను రానీయక ఇంట జాగ్రత్తగా నుండుము." అనిచెప్పి వెళ్లిపోవును. కుక్క కొంత సేపుండి ఎక్కడికో పోవును. ఆసమయమున దొంగ వచ్చి అరటిఆకులు కోసుకొనిపోవును. ఇక్కడ ఇంకొక సంగతి తెలుసుకొనవలసియున్నది. అరటిచెట్లవలె గుబురుగా నిలిచియున్న పిల్లలు పైకెత్తినచేతులలో కొన్ని గెలలవలెను, కొన్ని ఆకులవలెను చేతులు వంచియుంచవలయును. దొంగ ఆకులుకాయలు కోసుకొని పోవునపుడు "ఇవి లేతవి. ఇవి ముదురువి. ఇవి చెడ్డవి.

ఇవిమంచివి" అని యెంచి వానిలో దొడ్డవానినే కోసి కొని పోవుచుండును. దొంగవచ్చి ఆకులు కాయలగెలలు కోసికొన్నందుకు గురుతుగా పైకెత్తినచేతులు క్రిందికి దింపి యథాప్రకారముగా నుంచవలయును. కనుక మొదట గెలలుకోసుకుని పోయినపుడు కొన్ని చేతులును, పిదప ఆకులు కోసుకుపోయినపుడు కొన్ని చేతులును వ్రేలాడవేయవలయును కనుక రెండవమారు అన్ని చేతులను వంచివేయబడి మోడులవలె వట్టిచెట్లుండును. దొంగ పారిపోవుచుండగా కుక్కవచ్చి మొరుగుచు తరుము కొనిపోవును; కాని దొంగ దొరకక పారిపోవును. కుక్క తిరిగివచ్చి తనచోట కూర్చుండి చింతించుచుం డును. అంతలో గొల్లది వచ్చి అరటిచెట్లు మొరడులై యుండుటచూచి, "అయ్యో! మాయదొంగలు మళ్లీ వచ్చి అరటిచెట్లన్నీ మోళ్లు చేసివేశారు; కుక్క ఎక్క డికి పోయినదో" యని కోపముతో వచ్చి కుక్కను చూచి "కుక్కా, నీవు నమ్మకమయినదానవు గదా యని నీ కప్పగించి వెళ్లినాను. నిక్షేపమువంటి అరటి చెట్లన్నీ ఎవరో దొంగలువచ్చి మోళ్లుచేసి పోయినారు. అయ్యో! నిన్నునమ్మి మోసపోయినాను. పెరుగు అన్నము పెట్టి పెంచినందుకా ఇట్లు చెట్లన్నీ దొంగల పాట్లనుబెట్టి చూచుచున్నావు. నీవు విశ్వాసములేని దానవు. ఛీ! నీవు మాయింట నుండవగదు లేచిపొమ్ము" అని చీవాట్లుపెట్టును. అందుకు కుక్క మిక్కిలి భయ పడి "అయ్యో! ఇప్పటిదాక నే నిక్కడే కాచుకుని ఉన్నాను. ఇక్కడ ఎవరును లేరుకదా, ఇంతలోనే ఏమిభయమని ఇప్పుడే కోమటింటికి బెల్లముకోసము వెళ్లినాను. మళ్లీ వచ్చుచుండగా, దొంగ అరటాకులు కోసుకపోవుచు నాకెదురుపడ్డాడు. నేను మొరుగుచూ వానిని కరచుటకై పరుగెత్తితిని. కాని ఆదొంగముండా కొడుకు రాళ్లతో నన్ను కొట్టుచూ గబగబ పారిపోయి నాడు. పొరపాటున తప్పుచేసితిని. ఈతప్పుకూడా క్షమించుము" అని ప్రార్థించును. గొల్లది జాలిపడి శాం తమునొంది కుక్కను క్షమించి "వెర్రికుక్కా! ఇక్కడ ఎవరును లేరుకదా యని యిల్లువిడచి దూరముగా వెళ్లుదురా! దొంగలు మాయదారులు. మనము చీమంత పరాకుపడితిమా, చిటుకలోవచ్చి దోచుకొనిపోవుదురు. ఇక ఎవరును లేనప్పుడు దొంగతనము చేయుట కడ్డమా? ఇంతటినుండి బహుభద్రముగా నుండుము." అని మంచి లించి తనపనిలో నుండును. కుక్క ఎక్కడికినీ పోక చెట్లదగ్గర కావలియుండును. సాయంకాలమైనతోడనే గొల్లభామ వచ్చి కుక్కకు పాలుఅన్నము పెట్టి "కుక్కా, నేను పాలు అమ్మబోయెదను. సదిలముగా నుండుము. దొంగలను దొడ్డిలోనికి రానీయకు." అని చెప్పి పాలచట్టిని నెత్తిమీద పెట్టుకొని "పాలమ్మో పాలు" అని కేకలువేయుచు వెళ్లవలయును. కుక్క కొంతసేపు కాపుండి ఎక్కడికో పోవును. అప్పుడు దొంగ వచ్చి ఈ అరటిగెలలకోసము, ఆకులకోసము నేను రోజు ఇక్కడకు గానేల? వారుచూస్తారేమో, వీరుచూస్తారేమో యని భయపడనేల? ఇప్పుడే గొల్లది పాలమ్మటకై వెళ్లినది. కుక్కకూడా ఎక్కడికో పోయినది. ఇద్దరును ఇప్పు డప్పుడే రారు కనుక ఈ అరటిచెట్లన్నీ తవ్వి ఎత్తుకుపోయి మాదొడ్లో వేసుకొని హాయిగా కావలసినన్ని కాయలూ, పళ్లూ కోసుకొని రోజూ సుఖించెదను." అని యనుకొని ఒక్కొకచెట్టే ఊడదీసి తన పెరటిలోనికి పట్టుకొని పోవును. అనంతరమున కుక్క వచ్చి "అయ్యో! దిక్కుమాలినదొంగలు! ఈమాటు చెట్లకుచెట్లే యెత్తుక పోయినారు. నేను ఎరుగకపోయి ఇట్టే అవతలకి వెళ్లి తిని. గొల్లది వచ్చి న న్నేమిచేయునో! కొట్టునో తిట్టునో! ఏమిచేయను?" అని దుఃఖించుచుండును. ఇంతలో గొల్లది వచ్చి, చెట్లు లేకుండుట చూచి, గుండెలు బాదుకొనుచూ ఏడ్చి కుక్కను కొట్టి, తిట్టి, ఇంటినుండి లేచిపొమ్మని కోపపడును. కుక్క భయ ముతో ఏడ్చుచూ "అయ్యో! ఇప్పటిదాకా నే నిక్కడే యున్నాను. దాహమవుటచేత మంచినీళ్లకని చెఱువుకు వెళ్లివచ్చితిని. వచ్చునప్పటికి అరటిచెట్లు లేవు. దొంగలు ఎవరును కనపడలేదు. ఎట్లు పోయినవో తెలియదు. ఇక నెప్పుడును ఇట్టితప్పు చేయను. క్షమిం చుము." అని బతిమాలుకొనును. గొల్లది కుక్కను మన్నించి, కొన్నిబుద్ధులు చెప్పి "అరటిచెట్లు అపహ

రించినవాడని ఒకనిమీద నాకు అనుమానమున్నది. ఏదో వంక పెట్టుకొని వానియింటికి పోయి అరటిచెట్ల ఆనవాలుపట్టి తగవుపెట్టి పట్టుకవచ్చెదను. ఆలస్యమైన యెడల దొంగ తనపెరటిలో పాతిపెట్టుకొనును. త్వరగా పోవలయును. నీవు పదిలముగా ఇల్లు కనిపెట్టుకొని యుండుము." అని బోధించి పిడక చేతబట్టుకొని నిప్పుకోసమని వంకపెట్టి దొంగయింటికి వెళ్లి మెల్లగా దొడ్డిలోనికి పోవును. దొంగ అరటిచెట్లు నాటుకొనుచుండును. అదిచూచి గొల్లది తన అరటిచెట్లు ఆనవాలు పట్టి "ఈఅరటిచెట్లు మావి. మీయింటికెట్లు వచ్చినవి? ఇంకా ఎవ్వరో దొంగలు ఎత్తుకపోయినారనుకొన్నాము. నీవే దొంగతనము చేసినావా? అమ్మయ్యో! ఎంతపనిచేశావు! మాచెట్లు మాకిమ్ము. లేదా, తగవుపెట్టి అల్లరిచేసి నలుగురిచేతను చీవాట్లుపెట్టించి నీపరువు తీసివేయించెదను. ఇంక నిన్నెవరును నమ్మరు. కనుక మాటలాడక వేగిరముగా మా అరటిచెట్లు మాకిచ్చి నీమానము కాపాడుకొనుము." అని బెదరించును. ఆ మాటలకు దొంగ భయపడి "పొరపాటున తప్పుచేసితిని. మీచెట్లు మీకిచ్చెదను. నన్ను అల్లరి పెట్టకుము. నిన్ను బతిమాలుకొనెదను." అని వేడుకొనును. ఆ మాటలు విని గొల్లది కోపముతో "నిన్ను క్షమించగూడదు. నీ విదివరకు రెండుమారులు దొంగపని చేసితివి. ఇదివరకు ఆకులు, కాయలేకదా అని యూరకున్నాము. ఇపుడు లోకువకట్టి చెట్లే పెల్లగించుకొని వచ్చినావు. ఇప్పుడుకూడ నీకు తగినశిక్ష చేయించక విడిచిపెట్టిన యెడల ఇంకేమి దోచుకొందువో? కనుక నిన్ను విడువగూడదు." అని కేకలు వేయును. దొంగ అతిభయముతోను, సిగ్గుతోను "అల్లరిచేయవ"ద్దని బతిమాలుకొని యేడ్చును. అప్పుడు గొల్లది "నీవు మాయింట్లో మూడుమారులు దొంగతనము చేశావా లేదా, నిజముచెప్పుము. నిజము చెప్పినయెడల విడిచిపెట్టెదను." అని యడుగును. దొంగ నిజము ఒప్పుకొనును. అంతట గొల్లది తన చెట్లు తాను తెచ్చుకొనును. ఇంతటితో ఆట అఖరు.

"అరటిచెట్టుకు నీళ్లుపోసి అరటికాయలు నేనే తింను. అరటిచెట్టుకు నీరుబోసి అరటిపళ్లు నేనే తిందు."
అని గొల్లది వెళ్లునపుడు పాడును.

౧౮. చీకటిమూతలు

మొదట ముగ్గురుబాలికలు త్రాయిగడ్డలవలె నిల్చియుండి యొకరిచేతు లొకరు పట్టుకొని పయికెత్తి చేతులు పట్టువిడిచి అందరును ఒక్కమారుగా ఎవరి యెడమచేతిలో (అరచేతిలో) వారు తమకుడిచేతితో చప్పట్లుకొట్టినట్లు అడ్డముగా వేసి కొట్టవలయును. అట్లు వేయుటలో కుడిచేతిని తిరుగవేసినసరే, బోరగిల వేసిననుసరే యెవరియిష్టము వచ్చినట్లు వారు వేయవచ్చును. అందరును చూచునందాక వేసిన చేయి వేసినట్టే యుంచవలెనుగాని తీసివేయరాదు. ఆ ముగ్గురిలోనూ ఒకరు తిరుగవేసి యిద్దరు బోరగిలవేసినయెడల తిరుగవేసిన చిన్నది పండినట్లు. ఇద్దరూ తిరుగవేసి యొకరు బోరగిలవేసినయెడల బోరగిలవేసిన చిన్నది పండి

నట్లు. కనుక ఇద్దరొకరీతిని, ఒకరొకరీతిని వేసినయెడల ఒక్కరుగానున్నవారే పండిపోవుదురు అని గ్రహింపవలయును. అట్లు పండినయామె దూరముగా నుండవలయును. తరువాత మరియొకరు వచ్చి యిద్దరితోను గలసి మొదటివలెనే చేతులు వేసికొని చూచి యెవరు పండినారో వారిని పండినబాలికతో చేర్చవలయును. ఇట్లు ఉన్నవారందరిలోనూ ఇద్దరుతప్ప తక్కినవారందరునూ పండువరకును చేయవచ్చును. ఇద్దరు మిగిలినయెడల



౮. మరికొన్ని పాతకట్టడములు



౮. మరియొకటి (నడుమ నొక జలదారి)



౯. ఒక సందు

మూడవబాలిక లేనిదే యెవరు పండిరో నిశ్చయించుటకు వీలులేదు. కనుక పండినవారిలో నొకరిని సహాయముగా తీసుకొని రావలయును. సహాయమువచ్చిన చిన్నది అదివరకు పండినదేకనుక ఆమె పండినను, పండకపోయినను పండినట్టుగానే యెంచవలయును. అనగా ఇతరులకు సహాయముగా వచ్చినబాలికయే కడపటి ముగ్గురిలో నుండుననుకొందము. ఆపంట లెక్క లేదు. అనగా మిగిలినయిద్దరిలోనూ ఎవరోయొకరు పండుదాక అట్లు మరలమరల చేతులు వేయుచుండవలయును. పండకుండ మిగిలినబాలికయే ఆడుకొనిరావలయునని మీకు తెలిసినదికదా? తరువాత ఆటపెద్దగా నున్నయామె పండనిబాలిక మొగమునకు ఒకరుమాలును కట్టవలయును. అప్పుడు అందరును ఆడుకొనివచ్చు బాలికకు కొంచెము దూరముదూరముగా కూర్చుండియుందురు. ఆడుకొనుచూ వచ్చినబాలిక యెవరినైన పట్టుకొనవలయును. అపుడు ఆటపెద్ద వచ్చి "నీవుపట్టుకొన్నవారిపేరు ఎవరు?" అని అడుగును. ఆపేరు సరిగా చెప్పినయెడల పట్టుబడినబాలిక ఆడుకొనిరావలయును. చెప్పలేనియెడల చెప్పగలిగినదాకా మరలమరల మొదటి బాలికయే ఆడుకొనిరావలయును. తమ్ముపట్టుకొన వచ్చినప్పుడు తప్పించుకొనుటకై బాలికలు తాము కూర్చున్న చోట్లనుండి కదలకూడదు. కదలి దూరముగా పోవువారు అయిపోయినట్లే యగును. మొగమునకు కట్టే రుమాలు మనుష్యుల ఆనవాలు తెలియునంతపలుచగా నుండకూడదు.

౧౫. పచ్చాకు

పచ్చని చిన్నఆకు ఒకటి తెచ్చి ఒకచోట నుంచి దానిమీద దుమ్ముగాని, యిసుకగాని పోసి కప్పి బాలికలంతా చేరి ఒకరొకరే మెల్లగా నోటితో ఆదుమ్మును, లేక యిసుకను ఊదవలెను. వరుసగా అందరును ఒకమారు ఊదినతరువాత మళ్లీ ఒక్కొక్కరుగానే పచ్చనిఆకు బయలుపడేదాకా ఊదవలయును. ఏమాత్రము ఆకు కనపడినను చాలును. ఆకు అంతా పైకిరానక్కరలేదు, కన్పడ నక్కరలేదు. ఎవరు ఊదుచుండగా పచ్చాకు బయలుపడుతుందో వారే దొంగఅవుతారు. వారే ఆడుకొనిరావలయును. ఇట్లు ఆడుకొనివచ్చేవా రెవరో తేలినతరువాత అందరూ దూరముగా పోయి ఒక్కొక్కరే అక్కడక్కడ పచ్చికమీదగాని, పచ్చని చిన్నమొక్కలమీద గాని కూర్చుండవలయును. ఆటఆడేచోటును విడిచి చాలాదూరము పోరాదు. అట్లు కూర్చున్నవారు "నన్ను ముట్టుకోకోయి! నామాలకాకోయి" అని పాడుచు ఇవతలికి వచ్చి నిల్చియుండి ఆడుకొని వచ్చువారు తన్నుముట్టుకొనుటకై దగ్గరకు వచ్చిన తోడనే చటుక్కున పచ్చికమొక్కలమీదికి పోవలయును. అందరును ఒక్కమారుగా గాని, కొందరు మాత్రమేగాని, ఒక్కరొక్కరుగాగాని లేచి తమతమ చోటులు దాటి పచ్చాకులు లేనిచోటులలో నిల్చియుండి 'నన్ను ముట్టుకోకు నా మాలకాకి' అని పైకీతిగానే పాడుచు గంతులు వేయుచు కాచుకొనివచ్చే బాలికను కవ్వించుచుండవచ్చును. తాము మొదట నిల్చిన

పచ్చికమీదనుంచి యిదివరకు ఇతరబాలికలు నిల్చిన పచ్చికపట్టులకు పోయి నిల్చియుండవచ్చును. అనగా బాలికలు ఒకరున్నచోటునుంచి మరియొక చోటుకు మారుచుండవచ్చును. ఆడుకొనివచ్చేబాలిక అందరినీ జాగ్రత్తగా కనిపెట్టిచూచుచూ ఎవరు వట్టి చోట నిల్చి పరాకుగా ఉన్నారో వారిని అమాంతముగా ఉరుకుచూ పోయి ముట్టుకోవలయును. పచ్చని ఆకుమీద నిల్చినప్పుడు ముట్టుకోరాదు. ముట్టుకుంటే

లాభము లేదు. ముట్టుకోబడ్డబాలిక దొంగ కాదు. సామాన్యముగా ఈ ఆట పచ్చికమొక్కలుగల పట్టులకు పోయి ఆడుకోవలయును. అట్టిస్థలములు లేనియెడల పచ్చనిఆకులుగాని, గడ్డిపరకలుగాని తెచ్చి అక్కడక్కడ వేసి వాటిపైని నిల్చుచూ ఆడుకోవచ్చును. పచ్చికమొలవని స్థలములో ఆడేటప్పుడు దొంగఅయినవారు పచ్చాకులు కొన్ని దాచియుంచుకొని పట్టుపడగానే తమచేతిలో ఆకులు నేలవేసి కాలికిందను తీసుకొని తాను దొంగకాలేదని బొంకుటకు వీలున్నది. కనుక పచ్చికమొలిచినచోటులలో ఆడుకోవడమే మంచిది. పచ్చాకు కాలికింద లేనప్పుడు ఎవరు పట్టుపడుదురో వారు ఆట ఆడుకొని వచ్చుచుండవలయును.

శ్రీమతి కే. రామసుబ్బమ్మగారు

ఈమె కడపమండల విద్యాసంఘాధ్యక్షురాలుగాఎన్నుకొనబడెను. యం.యల్.సి.అగు శ్రీ కే. కోటిరెడ్డిగారుఈమెభర్త.

ఆంధ్రాభ్యుదయము



శ్రీ. వేముల కూర్మయ్యగారు, బి. ఏ.,

ఇతడు హరిజనయువకుడు. ఇతని జన్మస్థానము కృష్ణామండలమునందలి మల్లవరగ్రామము. కాశీ హిందూవిశ్వవిద్యాలయమున బి. ఏ., పరీక్షయం దుత్తీర్ణుడయిన ప్రథమహరిజన యువకుడు. ఇతనికి బిర్లా గారి విద్యార్థివేతన మొసగబడినది. హిందూ విశ్వ విద్యాలయమున ప్రవేశము లభించిన ప్రథమ హరిజన విద్యార్థి యీతడు. స్వసంఘాభివృద్ధికయి పరిశ్రమించుచున్న ఉత్సాహవంతుడగు యువకుడు. ఈతడు యం. ఏ., యల్ యల్. బి. చదువుటకు మరల కాశీకి వెళ్లనుండు టానందింపదగిన విషయము.

డాక్టరు, యం. వి. రాధాకృష్ణరావుగారు,
(యం. బి., బి. యస్.)

వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయమునాదరమున విశాఖపట్టణమున వైద్యకళాశాలయందును, కింగ్ జార్జి వైద్యాలయమునందును జలోదరమును, యకృద్వృద్ధి (Liver Enlargement) ని గురించి పరిశోధనము కావించినారు. ఈవ్యాధులనుగురించి యింకను ఎక్కువ పరిశోధనమును విశాఖపట్టణము వైద్యకళాశాలయందు చేయుటకు లేడీ తాతారీసర్చి విద్యార్థివేతనము ఈ జూలయినుండి వీరికి లభించినది. ఆంధ్రవిశ్వవిద్యాలయమునందు ఆంగ్లవైద్య పరిశోధనముచేయు ప్రథమావకాశము వీరికి దొరికినది.

నాట్యకళ

కీ. శే. పిల్లలమర్రి సుందర్రామయ్యగారు

ఎ. వి. సీతారామయ్య, యం. ఏ.

శ్రీయుతులు కాశీనాథుని నాగేశ్వరరావుగారు బెజవాడలోని తమ దుర్గాకళామందిరంయొక్క ప్రారంభోత్సవం చేసినప్పుడు 'కృష్ణతులాభారం' ప్రదర్శించారు. అప్పుడు సుందర్రామయ్య నారదపాత్ర ధరించాడు, స్థానంవారి సత్యభామప్రక్కన. తులాభార నాటకంలో ప్రథమ ప్రవేశం నారదుడిది. పద్యంపాడే ప్రథమ-అవకాశంకూడా నారదుడిదే. మనరాష్ట్రంలోనికల్లా విలువైనటువంటి అటువంటి నాట్యకళోపాసన మందిరంలో ప్రారంభోత్సవంలో ప్రథమ ప్రవేశావకాశం సుందర్రామయ్యకే దక్కింది. అటువంటి గౌరవం పొందటానికి అర్హుడు గాబట్టే అటువంటి అవకాశం లభించింది ఆయనకు. అప్పటినుంచీ ఆ కళామందిరం దినదిన ప్రవర్ధమానంగా ఉత్తమనటులనేకులకు రంగస్థానమైంది.

ఆంధ్రదేశంలో సుందర్రామయ్య నారదపాత్ర చూడని నాట్యకళాభిలాషులు లేరనే నా అభిప్రాయం. సుందర్రామయ్య నారదపాత్రలోని వేషధారణ ఆదర్శప్రాయంగా వుండేది. ముఖాన దేవర్షిత్వం చిందులాడుతుంటే, వకచేతితో తాంబూర మీటుతూ, రెండవ చేతితో చిరతలువాయిస్తూ గజ్జెలు కట్టుకున్న కాళ్లతో నృత్యంచేస్తూ భక్తితన్మయత్వం మూర్తీభవించినట్లుగా అవతరించేవాడు. సత్యభామవద్ద ఆ మాయమాటలూ, ఆ కలహప్రియత్వమూ, ఆమె మూర్ఖప్రేమకు జాలీ, కృష్ణుని తనకు దానమిచ్చినప్పుడు కల్గిన ఆనందమూ, సత్యభామ గర్వభంగంతరువాత తన కార్యసాఫల్యమువలన కలిగిన సంతోషమూ, ఒంటరిగా వున్నప్పుడల్లా నిశ్చలమైన భక్తీ అఖండంగా ప్రదర్శించేవాడు సుందర్రామయ్య. పాత్రకు దగిన వేషధారణలో నరసింహారావు, నాగరాజరావు, గతించిన మాస్టరు అంజి మొదలయినవారితో సమానుడు. దొంగచిరునవ్వులతో చిందులుతొక్కే నారదుడు బొబ్బిలిపులివలె గాండ్రించేవాడు పాపారాయుడిలో. రుక్మాంగదపాత్రలో సౌందర్యమూర్తివలె రాణించేవాడు. రామసింహుడిలో రాజపుత్రయోధుడైపోయేవాడు. అటువంటి వేషధారణసామర్థ్యముండేది సుందర్రామయ్యవద్ద.

ఏనటుడిలోను లేని వక గొప్పశక్తి యితనిలో వుండేది. భక్తిరసమూ, రౌద్రరసమూ సమానకౌశల్యంతో ప్రదర్శించగల నటుడు మన ప్రస్తుతాంధ్ర నాట్యరంగంలో లేడనవచ్చు. అటువంటిశక్తి సుందర్రామయ్య పూర్తిగా కనబరచాడు. ఆతని పాపారాయుడిపాత్ర ఆంధ్రదేశాన్నంతా కదిలించింది. "ఎవడవు నీవు బొబ్బిలిపురీశ్వరమున్ మరి వారి యుద్ధమున్ బ్రబిమల శౌర్యమున్ వితతబల్కుచు లేవనుచుంటి వేమిరా" అని గర్జిస్తూ రంగస్థలంమీదకు వచ్చేటప్పటికి ఆనాటి వెలమవీరుల శౌర్యపటిమ తిరిగి మూర్తీభవించి వచ్చిందా అన్నట్లుండేది. విజయరామరాజును సంహరించే రంగంలో అతడు తన్నుతాను మరచిపోయి పాత్రలో లీనమైపోయేవాడని ఆతని ప్రక్కన విజయరాముని పాత్ర

ధరించిన ప్రతివారికీ అనుభవమే. ఆకాసేపూ ప్రేక్షకులు శిలాప్రతిమలవలె నిశ్చేష్టులై కూర్చొనేవారు. విజయరామునిమీద పాపారాయుని ప్రతీకారానికి నాటకశాలంతా కంపించిపోయేది. రంగారాయ వెంగళ్రాయ మల్లమాంబాదులను తలుచుకొని విచారపడుతూ తుదకు ఆత్మహత్య చేసుకొనే సందర్భంలో ప్రేక్షకులచేత కన్నీరు కార్పించి విచారసముద్రంలో ముంచేశేవాడు సుందర్రామయ్య.

సుందర్రామయ్య అభిమానపాత్ర హరిశ్చంద్రుడు. పామరజనులచేత పొగడ్త పొందకపోయినా రసజ్ఞులచేత మెప్పుపొందాడు, ఆవేశంలో. పద్యం చదవడంలో రామనాథశాస్త్రి నరసింహారావులతో సమానమైనచేయి. సంగీతంలో రాగంకన్నా భావానికే ఎక్కువ లక్ష్యపెట్టేవాడు. సంగీతంలో భావం ధ్వనించాలంటుండేవాడు. (Sound echoing the sense) ఈ సూత్రం- తనహరిశ్చంద్రపాత్రలో ముఖ్యంగా- బాగా విశదీకరించాడు, తనపాత్రలలో. సంగీతం బాగా పాడగలగాయకుడయినా భావానుగుణ్యంగా తగ్గించి పాడేవాడు.

‘రోషనార’లోని ‘రామసింహుడి’పాత్రలో అభినవరామసింహు డన్నారు అతన్ని. జాతీయభావం నిండిన కీర్తనలన్నా, పద్యములన్నా ఉప్పొంగిపోయేవాడు. సదా ఖద్దరు ధరించేవాడు. వీలయినంతవరకు వేషధారణలోకూడా ఖద్దరు వాడేవాడు. రోషనార నాటకంలోని యితని రామసింహపాత్ర జీవనాడిగా వెలిగింది.

నిజమైన నాట్యకళోపాసకుడుగా జీవించాడు సుందర్రామయ్య. నాటకసమయంలో నేమి, రిహార్సల్సులో నేమి, ఆఖరుకి ఎవరయినా ఒకపద్యం పాడమన్నప్పుడేమి ఆతని ‘సిన్సియారిటీ’ స్నేహితులను ముగ్ధులనుగా చేసేది. రిహార్సలురూములో స్నేహితులెవరయినా ఏదన్నా ఒకపద్యం పాడమన్నప్పుడు కళ్లు మూసుకొని కొంచెంకాలం నిశ్చలంగా నిలిచేవాడు. ‘ఎందుకయ్యా’ అంటే ‘పద్యంయొక్క సందర్భంలో లీనంగావాలి’ అనేవాడు. అటువంటి అమాయకుడు, కళోపాసకుడు. నాట్యకళకొరకు తమకున్నదంతా ధారపోసినవారిలో సుందర్రామయ్య ఒకడు. ఒకనెలరోజులు ఆతన్ని చూడకుండా వుండి కలుసుకుంటే ఎటువంటిస్నేహితుణ్ణి అయినాకావిలించుకొని నలిపివేశేవాడు. ఆతనియిల్లు మిత్రులందరికీ సత్రం. రాజభోజనంతో సత్కరించేవాడు. ఇంకా ఒకనెలరోజులకు పోతాడనగా ఎవరో కుర్రవాళ్లతోకలిసి తులాభారంలో నారదపాత్ర ధరించటానికి కాకినాడ వచ్చాడు. స్టేజిలోనికి వెళ్లి కలుసుకున్నా. గుండెల్లో నొప్పివస్తుంటుందన్నాడు. అప్పుడే అనుమానం తగిలింది నాకు, ఆయనరొప్పు, ఆయాసం చూస్తే. అదే ఆఖరుమారు ఆయన్ని చూడటం. దురదృష్టం. ఆరాత్రి ఆయనతో జరిగిన సంభాషణవలన చివరరోజులలో ఆయన చాలాకష్టంగా జీవించినట్లు తోస్తుంది-ఆర్థికంగా కూడా. అన్నిటికన్నా ఆయనను ఎక్కువగా ఖేదపరచింది తనమిత్రులు స్థానం నరసింహారావు మొదలయినవారితో విడిపోవడం. ‘రామవిలాససభ’ను దాని ఉచ్చదశను తలుచుకొని ‘ఇన్నాళ్లు బ్రతికి యీవిధమైంది’ అన్నాడు అశ్రుపూరితనయనాలతో.

ఇంటర్మీడియటువరకే చదువుకున్నా ఆంగ్లభాషలో అపారమైన కృషిచేసి బ్రహ్మాండమైన వక్తలాగ మాట్లాడేవాడు. నాటకాలు వేయటానికి ఒకమారు విజయనగరం వెళ్లినప్పుడు అక్కడ ‘సుందర్రామయ్య ప్లీడ’రని చెప్పుకుంటం విని సుందర్రామయ్య నవ్వాడు.

ఎంత వాపోతే ఏంలాభం? అనపోతనాయుడి పాత్ర చదువుతూ అటువంటి వీరరసప్రదర్శనానికి తగినప్రేక్షకులు - పిరికిపందలు, జాతీయతాద్వేషులు, కృతఘ్నులు. ఎక్కువగాగల యీకాలంలో యిక్కడ లేరనుకున్నాడుగామాలు మరి. దేవనాట్యసభకు వెళ్లిపోయాడు ఆత్మశాంతి కొరకు, కుటుంబాన్ని, మిత్రుల్ని విచారాంబుధిలో ముంచి. అతనికేం? నష్టం మనకేగా!



లాంఛనములు

మల్లాది రామకృష్ణశాస్త్రి

ప్రసిద్ధులైన కవులందరికీ, విశిష్టపదప్రయోగ విధానయోగమున లాంఛనములు గౌరవరూపమున అమరుతూ వచ్చినవి: ఆలాటిసన్మానభాజనులైన కవులందరూ సమానముగా ప్రఖ్యాతులుకారు: కాని వారి కృతులు లభియించకపోవడమే అందుకు కారణమై ఉంటుంది: వల్లభదేవుడు, శార్ఙ్గధరుడు, హరిపండితుడు మొదలైనవారికృషికి ఫలితముగా, ఆమహామహుల కొన్ని రచనలైనప్పటికి లభియిస్తూన్నవి:

ఉదాహరణరూపంగా..

(a) కాళిదాసు.. (దీపశిఖా.. కళికా అని కూడా ప్రసిద్ధము—.. కాళిదాసు)

సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ
యం యం వ్యతీయాయ పతింవరా సా,
నరేంద్రమార్గాట్ట ఇవ ప్రపేదే
వివర్ణభావం సస భూమిపాలః.

(రఘువంశము-vi—౬౭)

(b) భారవి (ఆతపత్రభారవి.. లేక ఛత్రభారవి)

ఉత్ఫుల్లస్థలనలినీవనాదముష్మా
దుద్ధూతః సరసిజసంభవః పరాగః,
వాత్యాభిర్వియతి వివర్తితః సమంతా
దాధత్తే కనకమయాతపత్రలక్ష్మీమ్.

(కిరాతార్జునీయము-v—౩౯)

(c) మాఘుడు (ఘంటామాఘకవి)

ఉదయతి విततోర్ధ్వరశ్మిరజ్జా
వహిమరుచౌ హిమధామ్ని యాతి చాస్తమ్,
వహతి గిరి రయం విలంబిఘంటా
ద్వయపరివారితవారణేంద్రలీలామ్.

(శిశుపాలవధ-iv—౨౦)

(d) రాజానకరత్నాకరకవి (తాలరత్నాకరుడు)

అస్తావలంబిరవిబింబిత యోదయాద్రి
చూడోన్మిషత్ సకలచంద్రతయాచ సాయమ్,
సంధ్యాప్రనృత్తహరవాద్యగృహీత కాంస్య
తాలద్వయేవ సమలక్ష్యత నాకలక్ష్మీః.

(హరవిజయము-xix—౫)

(e) శ్రీకంఠకవి (భవభూతి)

సాంబా పునాతు భవభూతిపవిత్రమూర్తిః.

(f) చంద్రోదయకవి

[ఈకవిదీ, మిగతాఉదాహరింపబోయే కవులవి కొందరివీ సామాన్యనామములు తెలియడము లేదు: వీరిప్రసిద్ధశ్లోకములుమాత్రమే సుభాషితావళి మొదలైనవాటియందు దొరకుతూన్నవి.]

ప్రసీద గతి రుజ్ఝ్యతాం వ్రజతు రాజహంసీ సుఖం
స్మితంచ పరిముచ్యతాం స్ఫురతు కుందపుష్పప్రభా,
నిమీలయ విలోచనే భవతు హారి కర్ణోత్పలం
కరస్థగిత మాననం కురు విభాతు చంద్రోదయః.

[సుభాషితరత్నావళి ౨౦౩౫]

(g) దగ్ధమరణకవి

యది ప్రియావియోగేఽపి
రుద్యతే దీనదీనకమ్,

త దిదమ్ దగ్ధమరణ
ముపయోగం క్వ యాస్యతి.

(h) దర్శనీయకవి (దోర్లతికాదర్శనీయుడు)

కస్మాద్దోర్లతికే నిధాయ నచిరం
ద్వారోపరోధః కృతో
లగ్నావా కిము న స్థితాపి రుదతీ
రుద్ధోత్తరీయాంశుకా,
కాలేఽస్మిన్ కుసుమాకరే ద్విగుణిత
ప్రేమ్ణి ప్రియేరాగిణాం
గచ్ఛ స్వగ్రతఏవ మూఢహృదయే
ముక్త స్త్వయావల్లభః.

[ఆఫ్రేఫ్ట్ పండితుడు సంపాదించినది.]

...(మరియిరువురు దర్శనీయు లున్నారు, ఇతడుకాక: ప్రకాశవర్షసూనుడు ఒకడు, మరియొక దర్శనీయకవియున్నా. వారిపద్యములు సుభాషితావళి యందూ, సదుక్తి కర్ణామృతమునందూ దొరుకుతవి)

(i) నిద్రాదరిద్రకవి

జానే కోపపరాఙ్ముఖీ ప్రియతమా
స్వప్నేఽద్య దృష్టా మయా
మా మాం సంస్పృశ పాణి నేతి రుదతీ
గంతుం ప్రవృత్తా తతః,
నోయావ త్పరిరభ్య చాటుకశతై
రాశ్వాసయామి ప్రియాం
భ్రాత స్తావదహం శఠేన విధినా
నిద్రాదరిద్రః కృతః.

[వల్లభదేవసంపాదితము: ౩౬౨]

(j) సీత్కారరత్నకవి

ఖ్యాతిం యత్ర గుణా నయాంతి గుణినః
తత్రాదరః స్యా త్కుతః
కింకుర్యాత్ బహుశిక్షితోఽపి పురుషః
పాషాణభూతే జనే,
ప్రేమరూఢవిలాసినీ మదవశ
వ్యావృత్తకంఠస్వనః
సీత్కారోఽపి మనోహరోఽపి బధిరే
కంనామ కుర్యాద్గుణమ్.

[జల్హణసూక్తి ముక్తావళినుండి]

(k) ఛమచ్ఛమికారత్నకవి

తప్తే మహావిరహవహ్ని శిఖావలీభి
రాపాండుర స్తనఘనే హృదయే ప్రియాయాః,
మన్మార్గవీక్షణనివేశితదీనదృష్టేః
నూనం ఛమచ్ఛమితి బాష్పకణాః పతంతి.

[బూలర్ పండితుడు]

(l) అకాలజలదకవి

భేకైః కోటరశాయిభిర్మృతమివ
క్ష్మాన్తర్గతంకచ్ఛపైః
పాఠీనైః పృథుపంకకూటలుఠితై
ర్యస్మి న్ముహు ర్మూర్ఛితమ్,
తస్మిన్ శుష్కసర స్యకాల జలదే
నాగత్య తచ్చేష్టితం
యే నాకంఠనిమగ్నవన్యకరిణాం
యూథైః పయఃపీయతే.

[ఆఫ్రేఫ్ట్ పండితుడు]

[ఈకవి దాక్షిణాత్యుడు: రాజశేఖరకవిరాజు యొక్క ప్రపితామహుడని తెలియవస్తూన్నది. (బాలరామాయణం I-౩౧: విద్ధసాలభంజిక I-౫౮: స్టైన్-కోనోవ్-కర్పూరమంజరీ భూమిక: థేడోర్ ఆఫ్రేఫ్ట్ తృతీయనివేదిక)

(m) రండానందకవి

మదనపరిపాండుగండా...
.. ..
ఖండయతు దుఃఖ మధికం
సుఖఖండకరండికా రండా.

[సుభాషితావళి ౨౩౮౫]

[ఈతనిపద్యములు వేరే ఎక్కడా లభియించలేదు: అపహాసరూపమైనబిరుదు ఈ పద్యమూలము

వనే లభియించిఉంటుందని పీటర్‌సన్ పండితుడి అభి
ప్రాయము]

(n) నగ్నాచార్యుడు.

రత్నోత్కటోత్తమాంగీ
శ్యామాథ వికంచుకా తరుణీ,
పతతు తవోరసి దయితా
క్షురికా భుజగీచ శత్రూణామ్:

[సుభాషితావళి ౨౧౨౧]

(o) ఉంఛవృత్తికవి (హరిగోపకవి)

భ్రష్టై ర్మేఘశుకాఖాత
దలితా దర్కదాడిమాత్,
ఫలై రివ మహీపింగైః
పూరితా హరిగోపకైః.

[ఈ యిరువురుకవులకు పద్యభావానురూపము లైన బిరుదములు లభియించినవని ఆటోబాట్లింక్ అభిప్రాయము]

(p) వక్షస్థలాచార్యుడు

కాంచిత్ కాంచనగౌరాంగీం
వీక్ష్య సాక్షాదివ శ్రియమ్,
వరదః సంశయాపన్నో
వక్షస్థల మవైక్షత.

(q) రత్నఖేటదీక్షితులు

తంజావూరు అచ్యుతనాయకుని ఆస్థానవిద్వాంసుడు: వ్యావహారికనామము శ్రీనివాసదీక్షితులు: ఈతని సంధ్యావర్ణనాచాతుర్యమునకు ప్రముదితుడై అచ్యుతరాయలు రత్నఖేటదీక్షితులని పేరిడి బహూకరించినట్లు తెలుస్తూన్నది: ఈవిషయమే యజ్ఞదేవేశ్వరుడు, రాజచూడామణి (రత్నఖేట దీక్షితుని కుమారుడు) మఖిరచితమైన రుక్మిణీపరిణయ మహాకావ్యవ్యాఖ్యానారంభము నందు—

సంధ్యాసంధుక్షితాంభోధర నలికగణా
దుద్గతాక్ష సీసఖండాం
స్తారాకారాన్నిరోద్ధుం శశిరవి కపటా
ద్బిభ్రతో రత్నఖేటౌ
అన్యోన్యం యుధ్యమానా వుదయచరమ భూ
భృత్ప్రివీరావితి ద్రా
గుక్త్వా ఖ్యాతాపరాఖ్యః క్షితిపతి వచసా
రత్నఖేటాధ్వరీతి.

అని వివరించియున్నాడు.

[కుప్పుస్వామిశాస్త్రిగారి శివ లీలార్ణవ భూమికనుండి]

[వక్షస్థలాచార్యుని పద్యము అప్పయదీక్షితులు చిత్రమీమాంసయం దుదాహరించినాడు: ఇది కాంచీవరదరాజవసంతోత్సవసందర్భమున చెప్పినదని తెలియవస్తూన్నది: దీక్షితుల కాతడు మూలపురుషుడు]

పై నుదాహరించినవారిలో చాలమందికృతులు దొరకకపోవడం గీర్వాణికి తీరనికొరంత: కాలక్రమమున ఆలోటు తీరుతుందేమో:

వెలువడినవి! త్వరపడుడు!! వెలువడినవి!!!

నందనారుచరితము (నాటకము)

కృష్ణకౌండిన్య రచితము వెల ౮ అణాలు

ఆంధ్రగ్రంథమాల ౨౧-వ కుసుమము.

ఆంధ్రగ్రంథమాల, నెం. 7, తంబుశెట్టి వీథి, మద్రాసు.

జర్మనువిద్యాలయములలో వార్తాపత్రికలు

'ది ఎడ్యుకేషనల్ రివ్యూ' లో జర్మను విద్యాలయములయందు వార్తాపత్రికల ఉపయోగమునుగురించి డాక్టర్ ఓట్టో హెర్బార్ట్ గారిట్లు వ్రాయుచున్నారు:—

"వార్తాపత్రికాపఠనము వీలయినంత లాభదాయకమగునట్లు చేయుటకు అనేకవిధానములు కనిపెట్టబడినవి. ఒకవిద్యాలయము వివిధములగు పండ్రెండు పత్రికలప్రతులను సుమారు మూడునెలలు పుచ్చుకొన్న యెడల ఒక్కొక్కబాలుడును ఒక్కొక్కపత్రికను వారము దినములు చదువవచ్చును. ఈవిధముగ నతను త్వరలోనే వివిధములగు నభిప్రాయములను చాల తెలిసికొనగలుగును. ఏపార్లమెంటు ఎన్నికయో, ఏజాతిసమితిసభయో జరుగు ప్రత్యేక సందర్భములయందు బాలురు తాము పత్రికలలో చదివినదాని సారాంశముల వ్రాయవచ్చును. వారి యభిప్రాయముల వైవిధ్యమును పోల్చి చూడవచ్చును; సారాంశములను తేల్చవచ్చును. ఇన్నిపత్రికలను, ఇన్నిప్రతులను తెప్పించుటకు విద్యాలయము వారికి డబ్బు చాలకపోయినచో, ముఖ్యమగు విశేషాంశములు ప్రచురింపబడిన సంచికలనే ప్రత్యేకముగ తెప్పించవచ్చును. అయితే, యీవిధముగా ఎప్పుడో ఒక్కపత్రిక సంచికను చదువుటవలన కలుగు రాజకీయ పరిజ్ఞానము తక్కువే యగును, నిజమే. ఉపాధ్యాయుడు బాలురకు చెప్పిపెట్టవలసినది అధికమగును. ఇంకొక విధమిది: ఒక్కొక్కమాదిరివిషయములయందు శ్రద్ధగల బాలురజట్టు ఒక్కొక్కటిని వివిధపత్రికలలోని ఆయా విషయములను చదువుకొననిచ్చి, వారు చదివిన వివిధ విషయములనుగూర్చియు అప్పుడప్పుడు వ్రాయనిచ్చుట. రాజకీయములనుగూర్చి తమ దృక్పథముతో నేకీభవించు పత్రికలనేగాక, వీలయినంతవరకు అన్ని పత్రికలను చదువునట్లు విద్యార్థులను ప్రోత్సహింపవలయును. ఈ విధముగ చదువుటకు కావలసిన యన్నిపత్రికలను ప్రజలకొరకు ఏర్పరచిన పఠనమందిరములనుండి సంపాదింపవచ్చును.

నానావిధములగు పాఠములను చెప్పుటకును వార్తాపత్రికల పఠనమును పయోగింపవచ్చును. చరిత్ర, భూగోళవిషయపాఠములకు వార్తాపత్రికలలో చాల శ్రద్ధను పురిగొల్పు విశేషము లుండును. పత్రికలలోని నాటక విమర్శనములును, నవీనప్రచురణములగూర్చిన విమర్శలును సారస్వతముగూర్చిన పాఠములు కాగలవు. విదేశీయములగు పత్రికలవలన భాషావిషయమగు పాఠములను నేర్పుటకు ఉపాధ్యాయునకు వీలుకలుగును. భాషలను నేర్చుకొనుటకుగాను జర్మనీలో అన్ని విద్యాలయములలోను అన్యదేశీయపత్రికలను తప్పక చదువుచుందురు.

జర్మనువిద్యాలయములలో వార్తాపత్రికా పఠనప్రయోజన ఫలితములు చాల ప్రోత్సాహకరముగ నున్నవి. విద్యాలయములలో చదువుకొనుచున్న బాలురును, చదువులుముగించిన యువకులునుకూడ ఈవార్తాపత్రికాపఠనాదిపాఠములను చాల ప్రశంసించిరి. దీనివలన సామాన్య జ్ఞానమును, నిష్పక్షపాతబుద్ధియు బాగుగ తమబాలుర కలవడుచున్నవని తలిదండ్రులును తమ సంతృప్తిని వెల్లడించిరి. జర్మనీదేశపు విద్యాంగ సంస్థయందు వార్తాపత్రిక యొక ముఖ్యాంశముగ స్థిరపడినదనియే చెప్పవచ్చును.

[అనువాదకుడు: జయంతి బ్రహ్మానంద]

—

ఆంగ్ల ప్రధానోపాధ్యాయుని నేటికాలపు విద్యార్థుల వర్ణనము

యుద్ధానంతరమున ఆంగ్ల పాఠశాలలందలి విద్యార్థులు అబద్ధము చెప్పువారుగనో, దొంగలుగనో, పిరికిపందలుగనో, డాంబికులుగనో యున్నారు. బ్రిటిషు వైద్యసంఘమందొకసమావేశ సందర్భమున అతిథిగా నుండిన లాన్సింగుపాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫ్రాంక్ బర్టు బ్లాక్స్టనుగారు పైవిధమున జెప్పిరి.

పెద్దమనుష్యులగువారికి అనాది సిద్ధముగ నున్న విషయముల నేటివారు గమనించుటలేదు. గుర్రములనెక్కి స్వారి చేయువారిని మరచి ఈ కాలపువారు క్రికెటు ఆటతో తృప్తినొందుచున్నారు. ఇంతకన్న అన్యాయమైన దేదనగా ఆంగ్లేయుని మాటయే వానికి పరమప్రమాణమని గర్వించు దినములు నశించిపోవుచున్నవి. నెపోలియను పరాజయానంతరము వెల్లింగ్టను ద్యూకుగారు పలుమారు వాటర్లూ యుద్ధమున గెలుపు ఈటనుదేశమందలి ఆరామప్రదేశములందే గలిగెనని చెప్పెను. కాని ఆధైరుపు నేటిపరిస్థితుల చూడవలయును.

నేటికాలపు విద్యార్థి యొంటరిగా నుండుటకు భయపడుచున్నాడని బ్లాక్స్టనుగారనిరి. ఒంటరితనమన్నను, విసుగుతనము పుట్టించు విషయములన్నను నేటివిద్యార్థి మిగుల భయము జెందుచున్నాడు. పూర్వకాలపు ధీరత్వగుణము నశించిపోయినది. ఈకాలమున ౧౫,౧౬ సంవత్సరముల యీడుగల బాలురు దూరదేశములకు పోయి తమకేదేని జీవనోపాయముల గల్పించుకొను విషయమున వారు ననిష్టము పై విషయముల విస్పష్టముచేయుచున్నది.

ఈ కాలమున అసత్యము ప్రబలుచున్నది. ఇందువలననే పాఠశాలల విషయము సరిచూచుట కష్టమగుచున్నది. పుస్తకములను దొంగిలించుట, గ్రామఫోను రికార్డులను దొంగిలించుటయనునవి ఎరవుతీసుకొనుట వంటివిగనే భావింపబడుచున్నది. ఒరులను దేబెరించి సాక్సులను, టైలను కొనివచ్చి యలంకరించుకొనుటయు నిట్టిదిగనే బరిగణింపబడుచున్నది. ఇవంతయు డాంబికము. ఈతరమువారిట్లు నిలుకడలేక క్రొత్తరీతిని అవస్థపడుచున్నారు. (జూలై మాడరన్ రివ్యూ)

సనాతనధర్మమననేమి?

ఆధునిక హిందూసంప్రదాయముల ప్రకారము నడచుకొను మతపిచ్చిగలహిందువులు తాము సనాతనులమని చెప్పుకొనుచున్నారు. వారట్లనుకొనుటకు వారికేమి హక్కుగలదని మనము వారిని ప్రశ్నింపనక్కరలేదు. సనాతనమన శాశ్వతమైనది; స్థిరమైనది; నాశములేనిది; అనాది. సనాతనధర్మములు, మతవిధులు, సంఘవిషయములు, సంప్రదాయములు అనాదినుండియు మార్పుజెందక నేడెట్లున్నవో యట్లే యున్నవని చరిత్రమూలమున సిద్ధాంతము చేయుటకు వీలులేదు పురాణములు, స్మృతులు మొదలగువానియందుగల విషయములకును అంతకన్న ప్రాచీనములగు వేదములయందును, ఉపనిషత్తులయందును గల విషయములకును అంతరము గలదు. (జూలై మాడరన్ రివ్యూ)

స్వాతంత్ర్య పరిపయము

(ఒక సత్యమగు సందర్భము)

భారతదేశమున ఈమధ్య నెన్నియో సంవత్సరములుగ స్వాతంత్ర్య సమరము జరుగుచున్నది. ఈ లక్ష్య ప్రాప్తికొరకు ఎందరో మహాపురుషులు బలి అయిపోయిరి. మరి నేమను ఆప్రయత్నముననే ఎందరో తగిలియున్నారు. స్వాతంత్ర్యము ఎవరభిలషింపరు? పరాధీనత ఎవరికి రుచించును? కాని, స్వాతంత్ర్యమును సంపాదించుటకై ప్రయత్నించుచున్నవారు దాని మూల్యమును పూర్తిగ నెరుంగుదురా అను విషయ మాలోచింపవలసియున్నది. స్వాతంత్ర్యము యొక్క యథార్థమగు మూల్యమును తెలిసికొనుటకయి మనము అన్యత్ర వెదకి చూడవలసియున్నది

అట్టి స్థలము అడవియే. వనచరములే స్వాతంత్ర్యమును పూర్తిగా నెరుంగునవి. ఉదాహరణముగా పాఠకులకు నేనొక సత్యము సంఘటనమును తెలుపుచున్నాను. ఒకరాజ్యములోని అడవులలో లేళ్లు దొరకవు. ఆ రాజ్యమునకుగాను వానిని పట్టియిచ్చుటకు ఈమధ్యనే నాకు 500 రూపాయలు బహుమతిగా పంపిరి. చాల శ్రమపడి తుదకు మూడునాలుగు లేళ్లను పట్టుకొనగలిగితిని. మొత్తము పదిపండ్రెండింటిని పట్టుకొని తరువాత అన్నింటిని కలిపి యొకమారే రవానా చేయవచ్చునుగదా యని ఆ నాల్గింటిని నావద్దనే బోనులలో నుంచితిని. అవి బోనులలో బంధింపబడిననాటినుండి తిండి, నీరు మానివైచి కృశించి కృశించి ప్రాణములను త్యజించినవి. పట్టుకొనునపుడు బహుశః వీనికి కొంచెము దెబ్బ తగిలియుండవచ్చుననియు, అందువలననే యివి మరణించియుండుననియు నేను అనుకొంటిని. మరల నేను వల పన్నితిని. మరల నా ప్రయత్నము సఫలమైనది. రెండుమూడు దొరికినవి. ఈమారు వీనిని నేను చాలజాగ్రత్తగ పట్టుకొంటిని. దేనికిని రవ్వంతయేని దెబ్బ తగులకుండ కాచితిని. కాని యింత జాగ్రత్తపడినను నేను వీని ప్రాణరక్షణయందు అసమర్థుడనైతిని. అప్పుడు నా కళ్లు విడినవి. వీని ప్రాణత్యాగమునకు కారణము ఒడలిమీది దెబ్బలు కావనియు, స్వాతంత్ర్యమును గోల్పోయినందున కలిగిన శోకమే యనియు తెలిసికొంటిని. ఈఘటన నాహృదయమును పూర్తిగా మార్చివైచినది. నేను తరువాత వానిని పట్టుకొను ప్రయత్నమునే మానుకొని, 'ఈకార్యము నా శక్తికి మించినది' అని ఆ రాజ్యమునకే బహుమతిధనమును వాపసు పంపివేసితిని.

'స్వాతంత్ర్యము' అన నేమియో, దాని యథార్థమూల్యము ఎంతయో నాకప్పుడు బోధపడినది. స్వాతంత్ర్యదేవత ప్రాణములను బలికోరును. ఇతరుల ప్రాణములను కాదు, స్వాతంత్ర్యమును కోరువాని ప్రాణములనే. (హిందీ 'విశాలభారత్' నుండి)

[అనువాదకుడు: జయంతి బ్రహ్మానంద]

విద్యాలయములలో ఆటలు

విద్యాలయములలోని అందరు విద్యార్థులును కూడ ఆటలయందును, శరీరవ్యాయామాదికమునందును శ్రద్ధతో పాల్గొనునట్లు ఏర్పాటులు గావింపవలయును. మద్రాసునుండి వెలువడు 'ఫీల్డు' అను పత్రికయందు డాక్టర్ జగదీశన్ యమ్. కుమారప్పగారిట్లు వ్రాయుచున్నారు:—

"భారతదేశమున మన మింతవరకును ఒక విద్యాలయమునకును ఇంకొక విద్యాలయమునకును మధ్య జరుగు ఆటలపోటీలయందు శ్రద్ధను కనబరచుచుంటిమి గాని, విద్యాలయములోని అందరు విద్యార్థులకును శరీరవ్యాయామాదికము చేకూరునట్లు ఏర్పాటులు గావించియుండలేదు. ఇట్లు విద్యాలయములవారికి పరస్పరము జరుగు పోటీలయందును, శరీరవ్యాయామమును నిరివి యొనర్చుటయందును చేయవలసినది యింకను ఎంతోయున్నది. విద్యాలయములవారికి ఒండొరుల మధ్య జరుగు ఈపోటీ పందెములు మొదలగు వానివలన శరీరవ్యాయామమునందును, ఉల్లాసమును, ఉత్సాహమును కలిగించు ఆటలయందును పందెములు వేయగలవారలు తయారగుట మేలేయైనను, పరమప్రయోజనములగు శారీరక, నైతిక, సాంఘికమూల్యములు చేకూరుట కయి వీనియందు అందరును పాల్గొనవలెనను ఆశయమున కిది పూర్ణావకాశ మీయదు. మనవిద్యాలయములలో ఆటలకును, వ్యాయామమునకును ఇంకను ఎక్కువ సౌకర్యములను కలుగజేయవలయును. ఒక్కొక్క విద్యార్థియు ఏదో ఒక నిర్ణయమగు వ్యాయామమునే క్రమముతప్పక ఆచరించునట్లు చేసినయెడల శ్రేష్ఠముగ నుండగలదు. మంచి ఫలితములు కలుగవలెనన్నచో, నియమములు కలవానిని, తెలివిగలవానిని, ఉత్సాహవంతుని నాయకునిగ నేర్పరుపవలయును. అనగా ఒక్కొక్క విద్యాలయములోను కాలమంతయు శరీరవ్యాయామపాఠములను బోధించుటకే వినియోగింపగల సమర్థుడగు అధ్యాపకుడు నియమింపబడవలయును. అతనికి అన్నిసదుపాయములును, వీలయినచో సహాయకులును కూడ ఈయబడవలెను. ఇట్టి యేర్పాటులతో

అత్యధికసంఖ్యాకులగు విద్యార్థులు ఆటలలోను, పోటీల లోను పాల్గొనునట్లు చేయవచ్చును. ఒకవిద్యాలయము వారికిని ఇంకొకవిద్యాలయమువారికిని జరుగు ఆటల పోటీలవలన విద్యార్థులకు శ్రద్ధ హెచ్చునది నిజమే. కాని యిప్పుడు ప్రతివిద్యార్థికిని పొందనగు వ్యాయామాదికమును వృద్ధిపొందించి సరియగు విలువను కలుగ జేయుట కగు దూరాలోచనయు, ధనమును, సౌకర్యములును, సరియగు మార్గదర్శిత్వమును అవసరము లయి యున్నవి. విద్యాలయములలో తప్పనిసరిగను, తర గతులవారీ భేదముతోను వ్యాయామవిద్య గరపుట వలననే విద్యాలయములలోని ఆటలు పోటీలవలని అత్యధికమగు ప్రయోజనము చేకూరును. విద్యాలయ ములలోని బోధనవిషయక్రమమునందు వ్యాయామాదిక మునకు ఇట్టి స్థాన మీయబడిననాడే, విద్యాలయముల లోని యితర సామాన్యపు పనులకు సాంఘిక నైతిక మూల్యములును, ఉత్సాహమును, పోటీకి కావలసిన పూని కయు కలుగుట కిది తోడ్పడగలదు."

[అనువాదకుడు: జయంతి బ్రహ్మానంద]

సహకార మహాసభ—౯33

ఇటీవల చెన్నపురిలో ౨౦-వ రాష్ట్రసహకార మహాసభ సమావేశమైనది. సభ జయప్రదముగా జరి గినది. సభాంగణమునకూడిన సహకారులు ఉత్సాహ మును జూపిరి. కాని, జరిగినది సహకారసభ కాకున్నచో, ఆనందోత్సాహములు వెల్లివిరిసెడివి. ఏదేని రాజకీయసమావేశమైనయెడల, సభయందలి అడుగు జాడలు ప్రజల హృదంతరాళములందు అంకితము లయ్యెడివి. ఉపన్యాసములు దేశమం దెల్లకడల నవవర్ష జల ధారలట్లు నిండిపోయెడివి. పత్రికలందలి అక్షరమక్షర మును కౌతుకాహ్లాదములతో తొలుకాడుచుండె డిది. సరిగ నీసమయమందే బర్మింగుహాములండను నగర ములలో సహకారులు కలిసికొనిరి. ఆంగ్లేయులు చూపిన ఉత్సాహములో, నాణువవంతైన మనదేశీ యులు చూపలేదు. దీనికి హేతువు దురూహ్యము కాదు. కారము రుచించినట్లు మనకు సహకార మంతగా రుచింపదు. ప్రయోజనమైనదయ్యు, ప్రయో జనములేనిదయ్యు, వెంగ్రుకలను నిలువంబెట్టు చప్పుడు వలనగాని మనము మేలుకొనము.

ఆంధ్రుడు దక్షిణదేశపు వంగీయుడు. ఇతి డధికముగా కాంక్షించునది ఆవేగము. ఆవేగబంధురమైన ఎట్టిపనికైన ముందుల కాతడు ఉఱుకును. ఈలంఘన మున నాతడు మేరువుపై నధిష్ఠించినను అధిష్ఠించును! కాలు విఱుచుకొనినను విఱుచుకొనును! బూరా చప్పుడు వినపడినంతనే ఆతడు మహారథుడై నిలు చును! సహకారమున ఉద్వేగము లేదు. బోరుకలంగు ప్రణాళిక లేదు. ఉద్వేగములేనియెడల ఆంధ్రుడుదా సీనుడై యుండును. అందుచే సహకారమును ఏమో మాఱునూల గుసగుసయని అతడూహించుచున్నాడు.

నడుముగట్టి పునాది త్రవ్వి, ఎత్తైనకట్టడము కట్టు టకు వలసినది విరాట్ప్రజ్ఞగాని యుయుధానవిజృం భణము కాదు. ఈప్రజ్ఞ మనలో నింకను గోచరింపక పోవుటచే సహకారముదెస సామాన్యులును విద్యాధి కులునుగూడ ఆదరవృష్టి పఱుపుటలేదు. దోషము కొంత సహకారోద్యమమందుగూడ నున్నదని చెప్పక తప్పదు. ప్రజలందు ఉత్సాహమును పుట్టించు క్రియా విధాన మింకను అందు చూపట్టుట లేదు. క్లిష్టమైన ఆర్థికసమస్యలు ఏకొలదిమందికోకాని జనబాహుళ్య మునకు రుచింపవు. కేవలము స్వదేశోద్యమమే కాకు న్నను, స్వదేశోద్యమమున కది వేఱుగాదనియు, స్వదేశ వస్తుప్రచారమును, ఉన్నతాశయప్రబోధమును దాని ముఖ్యోద్దేశములనియు కొంత ఆందోళనము జరుగవలెను! ఈయాందోళనమువలన ప్రభువులు ఉలికిపడరాదు. స్వదే శోద్యమమునందు పాల్గొనువారు ఇప్పటివలె మూకీ భావము వహింపక సహకారమున పాల్గొనవలెను. ఇత రోద్యమములందు జేరునట్లు యువకులును, యువతు లును సహకారోద్యమమున బాలుగొని, దానివిజయ మునకై కంకణము గట్టుకొనవలెను. యువకుడు లేని చోటులందు ఆనందము సున్న; యువతిలేనియెడలందు

ఉత్సాహము రెండుచేటిలు. పాశ్చాత్యదేశములలో విశేషముగ యువతులే వ్యాయామమును నడపుచున్నారు. మనదేశమందుగూడ పంజాబులో యువతులే సహకారమండలి తియ్యందనమును విశేషముగ గ్రోలుచున్నారు. కావున నారాష్ట్రీయమం దది సర్వజనాదరణీయమై యున్నది. మనరాష్ట్రీయులు పాంచాలీయులను, పాశ్చాత్యులను అనుకరించి, నిర్మాణక్రియావిధానమున ఎనలేని అవకాశము జూపు సహకారోద్యమమున పాల్గొని సర్వతోముఖాభివృద్ధి నందుదురుగాక!

—జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

మొహెంజోదారో

(ప్రాచీన నిర్మాణావిష్కరణము)

౧౯౨౭-వ సంవత్సరము నాదిలో మొహెంజోదారోవద్ద సుమారు ౧౩౬౧౦ చదరపు గజముల ప్రదేశము పరిశోధనకై త్రవ్వబడినది. దానికి ఫలితముగ కొన్ని చక్కని శిల్పిగృహములు వెలువడినవి.

తరువాత ౧౯౨౭-౨౮ సంవత్సరముల నడుమ ఆగృహముల ఆనుపానులను వివరముగ తెలుసుకొనుటకు మరికొంతభాగము (సుమారు ౪౫౫౫ చదరపు గజములు) త్రవ్వబడినది. మొత్తము త్రవ్వబడిన ప్రదేశముయొక్క వివరములు స్థూలచిత్రము (Plan) నందు కననవును. దానిలో నల్లని, దళసరిగీతలతోను, చుక్కలతోను గుర్తింపబడిన గృహములు వగైరాలు అర్వాచీన యుగమునకు చెందినట్లు నిర్ణయింపబడినది. కట్టడముల తాపీపనినిబట్టి యీయుగము మూడు ఉపయుగములుగ విభజింపవచ్చును. ఈ గృహములన్నియు దాదాపు మధ్యయుగపు కట్టడములపై నాధారపడినవి.

ఈ అర్వాచీనయుగపు శిల్పిగృహములను బయటికి తీయుటలో కొన్ని బావులుకూడ బయలుపడినవి. ఆకారమున నవి కర్మాగారములందలి పొగగొట్టములను పోలియున్నవి. చూడవచ్చినవారు వీనిని చూచి ఏవో శిఖరములని తరచు భ్రమసెడువారు. ఈబావులను చక్కగ పరిశీలించిన ఈరెండు యుగములందును ఆప్రదేశ మెట్టియెట్టిమార్పులను చెందినదియు తెలియవచ్చును.

ఈ త్రవ్వకములలో లోమట్టమున బయల్పడిన యిండ్లన్నియు మామూలుతీరుననే చతురస్రముగనో, దీర్ఘచతురస్రముగనో కట్టబడినవి. కట్టడములలో నగిషీపను లంతగా కనబడవు. ఒక్కొకయింటిముందును ఒక అంగణము. తరువాత తరువాత ఇంటిగోడలయం దేర్పడిన మార్పులవలన కిటికీ లుండినది, లేనిది నిర్ణయింపరాకున్నది. కాని మామూలుగవాక్షములుమాత్రము ఉండినట్లు చిన్నెలు కనుపించుచున్నవి.

నాడు ఇండ్లకు కప్పువేయుట చాల సులభమైన పద్ధతిలో జరిగెడిది. ఒక్కొకకట్టడముపైనను దళసరి, చదరపు కొయ్యదూలములువేసి, వానిపైన తుంగచాపలను పరచి వానిపైన రెండు అంగుళములమందమున వరిపొట్టు కలిపిన బురదమట్టిని పరచెడివారు. నాటి యిండ్లయొక్క నిర్మాణమును ౧-వ చిత్రమునందు చూడవచ్చును. దీర్ఘచతురస్రమైన యీ యింటిపొడవు ౪౧ అ. ౪ అం; వెడల్పు ౫౭ అ. ౬ అం. కుడిప్రక్కన కానవచ్చు తొల్లిటిద్వారము ౨౦. ౨ అ. ఇది ఇటుకలచే మూయబడియుండినది. ఎడమప్రక్క కనబడు రెండును కిటికీలవలె కనబడినను నిజమునకు, తరువాత నేర్పడినద్వారములే.

ఈ యింటిముందు తగుపాటి పరిమాణము గలిగి, ఇటుకలు పరచిన ముంగిలి కలదు. (చిత్రము ౨) కాని యీయింటికి ఆనుకొని తూర్పువైపున మరియొక కట్టడము కలదు. రెండుసందులు ఈయింటిని ఉత్తర దక్షిణములందలి యిండ్లనుండి వేరుపరచుచున్నవి. ఈరెండుసందులును కొంతకాలమువరకు రాకపోకలకుపయోగింపబడుచుండినను వెనుక మూసివేయబడినవి.

మధ్య, అర్వాచీన యుగములందలి కట్టడములలో చాలకొన్నిటికిమాత్రమే ఇటికపరపులు కనబడుచుండుట వింతగనున్నది. మధ్యయుగపు కట్టడములలో చాలమటుకు ఇటికపరపులే వాడుకయం దుండినట్లును, కాని తరువాత ఆయిటికనంతయు నూడబెరికి యితర

కార్యములకు వినియోగించుకొనినట్లును చెప్పుటకు ఆధారములు కలవు. ౭-వ చిత్రమున గల యింటిని, దాని ఇటికిరాతిపరపును చూడుడు. ఉన్న యిండ్లలో నీయిల్లే మిక్కిలి పెద్దది.

౮-వ చిత్రము లోమట్టములోని వివరములను, పనితనమును స్పష్టముగ తెలియపరచుచున్నది. ఎడమ చేతిప్రక్కనగల గదియందలి ఇటికరాతి పరపును చూడుడు. ఇట్టి పరపులను తరువాతి తరమువారు డొడ దెకికి ఇటికనంతయు తమతమయిండ్లను కట్టుకొనుట కుపయోగించిరనుట కిదియొక యుదాహరణము కాగలదు. ఇందు కనబడుచున్న బావియే తరువాతి కాలమున నేర్పడిన మార్పులతో ౩-వ చిత్రమున చూపబడినది. ఈబావియొక్క మదురులోవ్యాసము ౨ అ. ౫ అం.

దిబ్బకు దక్షిణపశ్చిమదిగ్భాగమున గల యొక కట్టడమున రెండు సోపానపథములు గలవు. ఈరెంటి నడుమ నొక మురుగునీటికాలువ పారుచుండెడిది. అది ౯-వ చిత్రమున కనవచ్చును. ముందుభాగమునగల కాలువ తరువాత ఎప్పుడో ఏర్పడినది.

కొన్నియిండ్లు బురదయిటికలతో నింపబడి యుండినవి. తరువాత కట్టబడు ఇండ్లకివి గట్టి పునాదులుగ నుండగలవను నుద్దేశ్యమే దీనికి కారణము. ౨-వ, ౭-వ చిత్రములను చూడుడు.

ఈ త్రవ్వటములలో ఇక్కడ కొన్ని క్రొత్తవస్తువులు దొరకినవి. అందు కొన్నింటి చిత్రము లిందు కలవు:

౯. పాత్రమువంటి యొక బలపపురాతి ముద్ర యొక్క ముద్రణము. ఇట్టి యాకారముగలముద్ర లిదివరకు ఇండియాలో ఎక్కడను దొరకినదిలేదు. ఇందలి బొమ్మలనిధానము, ఇది కేవలము భారతీయ నిర్మాణమే యనుటకు నిదర్శనము.

౧౦. మరియొక బలపపురాతి ముద్రయొక్క ముద్రణము. దీనిలో ఒక పిప్పలవృక్షమున వృక్షదేవత కాబోలు, ఒక స్త్రీ వ్యక్తి నిడుపైన వెండ్రుకలతోను, కొమ్ములతోను నున్నది. ఆమె ముందు మరియొక స్త్రీ వ్యక్తి మోకరిలియున్నది. ఈమెవెనుక మేకవంటి యొకవ్యక్తి మనుష్యముఖముతో నున్నది. చెట్టుఆకులను బట్టి యిది పిప్పలవృక్షమే యనవచ్చును.

౧౧. ఇంకొక బలపపురాతిముద్ర. ఒకవ్యక్తి యొక వేదికపై యోగాసనమున కూర్చొనియున్నాడు. తలపై త్రిశూలాకారముగ కొమ్ములు గలవు. చేతులు మోకాళ్లపైకి చాపబడియున్నవి. మూడో, నాలుగో ముఖములు. చుట్టును నాలుగుజంతువులు—ఏనుగు, పులి, ఖడ్గమృగము, దున్నపోతు కలవు. ఇవన్నియు తరచు మామూలుముద్రలయందు కనబడునవే. వేదికకు క్రింద మరిరెండుమృగములు కలవు. ఈ లక్షణముల నన్నిటినిబట్టి యీవ్యక్తి పంచముఖుడు, త్రిశూలధారి, వృషభవాహనుడు, మహాయోగి, పశుపతి యగు శివుడని యొకరి యభిప్రాయము.

మొదటినుండి ఒకే నాగరికత, ఒకే విశ్వాసము గల ప్రజలే ఈపట్టణమును క్రమముగ నాక్రమించుచు వచ్చిరని యీ భూవిదారణమువలన తెలియవచ్చుచున్నది. ఇంకను పరిశీలించినచో నెట్లు తేలగలదో!

[భారతపురాతనవస్తు పరిశోధనశాఖవారి వార్షిక నివేదిక (౧౯౨౮-౨౯) నుండి యిందలి చిత్రములును, విషయములును గ్రహింపబడినవి.]

బాలాదిత్య

సప్తసామ్రాజ్య పునర్నిర్మాణప్రయత్నములకు సంబంధించిన ఒక చరిత్రాత్మకమగు నవల. భారతీయ పునర్నిర్మాణప్రయత్నములు తీవ్రముగ జరుగుచున్న ఈకాలమున ఈనవల భారతీయుల కొక నూతన సందేశమును, ఉత్సాహమును ఒనగూర్చకమానదు. వివిధ జాతులమధ్యను సామరస్య మవసరము. వివిధమతధర్మములను స్థూలముగమాత్రమే చూచి వాటిసూక్ష్మతత్త్వముల నాశీంగకున్నచో దేశపతనము నిశ్చయము. ఈధర్మములు మనకు విశదమగునట్లు పాత్రలచర్యల ద్వారా బోధించుచు నవలలు, నాటకములు వ్రాయుట నిశేషప్రజ్ఞ యనవలెను.

ఈ నవలయందు బౌద్ధమతముయొక్క సాధారణనీతులను గ్రహింపకపోయిన యశోధర్మవంటి సనాతనమతశ్రేష్ఠులు, హిందూమతముయొక్క విశాలాశయములను గ్రహించలేక మోక్షధర్మపరాఙ్ముఖుడైన బాలాదిత్యునివంటి బౌద్ధమతపక్షపాతులు, అసలు మతమన్న నేమియో యెఱుగక బాహ్యాడంబరములయందు చొక్కుచు మతోద్ధారకుల మనుకొని మానవధర్మమును మఱచి రాక్షసకృత్యములకు వెనుదీయని నారాయణభట్టువంటి కపటబ్రాహ్మణులు, జ్ఞానమునది యెక్కడనుండియో యూడిపడువస్తువనుకొని దానిని పొందు తలంపుతో నెల్ల యజ్ఞానపథంబుల ద్రొక్కుచు ఎందును తృప్తిబడయక జగత్తనిన రోతగొను, అజ్ఞానాంధునివంటి సంశయాత్ములు కూడియున్న దేశమునకు మోక్షమెన్నడును సమీపస్థము కానేరదు. మనదేశముయొక్క అవస్థయు నించుమించుగా నిట్టిస్థితిలోనే యున్నది. కథావసానమునకు వచ్చుసరికి నారాయణభట్టు చచ్చి, అజ్ఞానాంధు లవ్యక్తులై బాలాదిత్యునకు మనస్సు తిరిగి యశోధర్మకు ప్రపంచతత్త్వము తెలియవచ్చుసరికి విజయము మాపుమేరయయ్యెను. కాని వీరల అసలుతత్త్వములు మారలేదు. కనుక భావిస్థితి యెప్పటివలె సంశయావస్థలో వ్రేలాడుచు నుండిపోయినది. హిందూ, మహమ్మదీయ క్రైస్తవమతాదిభేదములతోడను, బ్రాహ్మణాది వర్ణభేదములతోడను, ఆర్థిక, ఆముష్మిక, ప్రాచ్య, పాశ్చాత్య, సాంఘిక, రాజకీయ సిద్ధాంతభేదములతోను కొట్టుకొనుచున్న మనకు ఈనవల యొకకర్తవ్యాదర్శము నుపదేశించుచున్నది.

కథ సులభమగుభాషలో జాతీయములగుసామెతలు, ఉపమానములు మొదలగువానితో కూడి, దైనందిన సాధారణచర్యలతోకూడినకథవలె రాణించుచుండును. వీరవనితలు, శూరపురుషులు, క్రూరయవనరాజులు, ధీచాతుర్యముగల దేశీయులస రాయబారులు, దేశభక్తిపూరితబాలబాలికాప్రజాసమూహములు, వ్యాపారదక్షులై శ్రీమంతులైన వర్తకులు, సౌందర్యమూర్తులై సద్విద్యావిలాసినులై, సదాశయభూషితలై, పురుషులయందు భక్తిశ్రద్ధలు, వినయవిధేయతలు గలిగియే వారి ఆవేశములవలన కుటుంబములకు కాని, దేశమునకుగాని, కీడుమూడకుండ కాపాడిన సరస్వతి, చారుమతి, మహామాయ, పార్వతి, వసంతలవంటి వనితారత్నములు,

ఇంతటి అల్లకల్లోలమున న్పుట్టులును నంటుకొనక జ్ఞాన జిజ్ఞాసలయందే తన్మయులై విశ్వదృష్టిని విశాలపఱచుచున్న వరాహమిహిరునివంటి పండితశ్రేష్ఠుల శాంత గృహజీవనములు మొదలసవానితోగూడి కథయెల్లయు జీవకళల నొప్పుచుండును. ఇట్టి నవలారాజ మాంధ్ర భాషలో నిదియొక్కటియే యనిచెప్పవలెను. ఇట్టి గ్రంథము ననువదించి ఆంధ్రభాష నలంకరించినట్టి శ్రీ వరిగొండ సత్యనారాయణగారు ప్రశంసార్హులు. ఈగ్రంథ మాంధ్రులెల్లరు పఠించదగినది. ఈ అత్యుత్తమతరగతినవల ఇంటర్మీడియేటు, బి. ఏ. తరగతులకు నాన్డిటెయిల్డు తెలుగుపాఠ్యగ్రంథముగ నిర్ణయింపదగినదని నిస్సందేహముగ చెప్పవచ్చును.

గ. స.

భా ర త నీ తు లు

కొల్లాపురం స్నేహలతా కవితాసంఘమువారి ప్రకటనము. శ్రీమతి వాజపేయయాజుల మహాలక్ష్మిగారు, పంచమవేదమగు భారతమునుండి నూరు ప్రశస్తనీతిపద్యముల నెత్తి వానికి యథోచితమగు మకుటములనిచ్చి ప్రకటించినారు. గ్రంథముచివరను కఠినపదముల కర్థములు వివరింపబడినవి. భారతమహిమ మొదలు ఫలశ్రుతివరకు గల సకలనీతులును నిందు గలవు. పాఠశాలలలోని బాలికల కత్యుపయోగకరము. వెల రు. ౦-౪-౦ లు మాత్రము.

గ. స.

తే జః కి ర ణ ము లు

క్రౌను సైజు ౧౦౫ పుటల ఆంగ్లగ్రంథము. 'Rays of Light' అని దీని ఆంగ్ల నామము. స్వామి బోలానాథజీ మహారాజావారివలన రచితము. వీరు దైవికప్రేమసంఘు (Divine Love Society) స్థాపకులు. గ్రంథాదిని వీరి చిత్రపటమున్నది. దైవికమహత్త్వము, విశ్వప్రేమద్వారా దాని ననుభవించు సాధనము ఇందు తెలుపబడినవి. సందర్భవశమున గీతాతత్త్వరహస్యము, గోపీకృష్ణతత్త్వము మొదలగు విషయములు నూతన తేజోయుక్తముగ నన్వయింపబడినవి. విశ్వమానవకోటికిని, అందు ముఖ్యముగ ప్రతిభారతీయునికిని పఠనీయము, శాంతిదాయకము, మోక్షదాయకము. క్యాలికో బైండు, వెల రు ౧-౮-౦ లు. లక్నో యూనివర్సిటీ రిజిస్ట్రారు యమ్. ఆర్. ఖన్నాగారివద్ద ప్రతులు లభించును.

గ. స.

క వి త్వ ము

Poetry అనుపేరుగల ౭ పుటల ఆంగ్లగ్రంథము. సి. ఆర్. రామానుజాచార్య రచితము. Pictures and Poems Series లో మొదటి ప్రకటనము. కవిత్వమనునది భానునివలె అజ్ఞానాంధకారమును తొలగించునదియు, మారుతమువలె హృదయమును సంచలింపజేసి హాయిగూర్చునదియు, జలధివలె మనమునకు గాంభీర్యమును గూర్చునదియు నని లేఖకుని సిద్ధాంతము. ఋగ్వేదమిట్టిదని వీరి యభిప్రాయము. వెల రు ౦-౧-౦. మదరాసు మౌంటురోడ్డు హోగార్థ్ ముద్రణాలయమున ప్రతులు లభించును.

గ. స.

పాశ్చాత్య భావప్రపంచము

కర్త: ఎమ్. వి. ఎన్. సుబ్బారావుగారు, ఎమ్.ఏ. రాజమహేంద్రవరములోని ప్రాక్ప్రతీచీగ్రంథమాల లోని మొదటి కుసుమము.

క్రౌను సైజున ౧౦౪ పుటలు, ఫెదరువెయిటుకాగితములు. వెల ౧-౪-౦.

ఇందు కార్లయిలు, ఎమర్సను, గెటె, మాజిని, రినాను, టాల్స్టాయి, ఇబ్సెను, ఏమియల్ గారల గూర్చిన వ్యాసములును, కొందరి ఛాయాచిత్రములును

మొహెంజోదారో ప్రాచీన నిర్మాణావిష్కరణ చిత్రములు



౧. జంట సోపానములు



౨. కట్టడములలో నొకటి

౧౦. పొతరమువంటి బలపపు రాతిముద్ర



౧౧. మరియొక బలపపు రాతిముద్ర

౧౨. పశుపతి ముద్ర

గలవు. ఇందలి వ్యాసములు ౧౯౧౬-వ సంవత్సరమున 'ధర్మసాధని' పత్రికయందు ప్రచురణము గాంచినవి.

ఆత్మజ్యోతి

(రెండవముద్రణము)

అనువాదకులు: ముద్దా విశ్వనాథముగారు (కవితా సమితి)

ప్రకాశకులు: వ్యాసకుబేరము — మేలుపాక — ఎలమంచిలి, విశాఖపట్టణముజిల్లా.

క్రౌను, ౭౩ పుటలు, వెల రు. ౦-౮-౦

"జగత్ప్రసిద్ధమహాపురుషులలో నొకరుగ పరిగణింపఁబడుచున్న టాల్‌స్టాయి మహర్షిచే విరచితమయిన The Two Pilgrims అనుకథ కిది స్వేచ్ఛానుకరణము." ఇంగ్లమున మాత్రము గ్రంథనామము, కథయందలి విశేషములను కొంత స్ఫురింపజేయుచున్నది. 'ఆత్మజ్యోతి' యనుపేరు కథలో వచ్చుయాత్రికులలో నొకఁడగు సుదర్శనునకు జెందునట్లు గ్రంథమందొకచోట అనువాదకులు తెలిపినారు. అనువాదమునను 'ఇద్దరు యాత్రికులు' అనియుండిన గ్రంథకర్తగారిభావసూచనకును, అనువాదకుల 'స్వేచ్ఛానుకరణము' నకును నేలాటి లోపమును వచ్చియుండదు. 'చెఱకు వంకర యైనంతమాత్రాన మాధుర్యము తగ్గునా?'" 'ప్రకరణాద్యంతములఁ గూర్పఁబడిన పద్యరత్నములు— ఆంధ్రసారస్వతరంగమున క్రొత్తపోకడలతో విహరించిన కావ్యరచనా ప్రవీణులగు శ్రీవేంకటపార్వతీశ్వరకవుల దివ్యలేఖినినుండి వెలువడిన "కావ్యకుసుమావళి" లోనివి. ఆయాసందర్భములకు తగియున్నవి. ఈవిధముగ, అనువాదకులు మక్కికిమక్కిగ తెనిగించక దేశకాలపరిస్థితులను గమనించి టాల్‌స్టాయిమహర్షిని అనుకరించి వ్రాసిరి. పాత్రముల, యాత్రాస్థలముల నామములు మనకు పరిచితములయినవే. శైలిసులభమై బాలురకుఁగూడ అర్థమగునట్లున్నది. కథావ్యూహము చిక్కనిదిగాక పసిపిల్లలకుసయితము సులభముగ నర్థమగునట్లున్నది. కథ యిరువురు యాత్రికుల మనఃప్రవృత్తుల నరించినది. 'మానవసేవయే మాధవసేవ' యనునార్యోక్తిని ఈకథ విస్ఫుటము చేయుచున్నది.

నీతిబోధకములగు నిట్టికథలు పసిపిల్లలు చదువదగినవి. పాఠ్యగ్రంథనిర్ణయసంఘమువారీగ్రంథమును పాఠశాలలో ప్రవేశపెట్టదగినదిగా నిర్ణయించి ఆంధ్రదేశమునకు గొప్పసేవచేసిరి. 'మనదేశములోని తరుణవయస్కులగు ఈ తరమువారి' కిట్టి గ్రంథములు 'కడు సాహాయ్యకారు' లనుటలో అతిశయోక్తి లేదు.

గ్రంథస్వీకారము

శ్రీ మల్లేశ్వర శతకము

గ్రంథకర్త: మావుడూరు శ్రీశైల మల్లికార్జునరావుగారు, శ్రీకాకుళము. క్రౌనుసైజున ౨౭ పుటలు, వెల రు ౦-౪-౦.

నందనారు చరితము (నాటకము)

కర్త: కృష్ణకౌండిన్యుడు. ఆంధ్రగ్రంథమాల ౨౧-వ ప్రచురణము. ౧౯౩౩. డెమ్మీసైజున ౬౩ పుటలు. గ్లేజు కాగితములు. వెల రు. ౦-౮-౦. ఆంధ్రపత్రిక కార్యాలయము, ౭ తంబుచెట్టివీథి, మద్రాసుకు వ్రాసినప్రతులు బడయవచ్చును.

i. నవ్వగలవా? (మొదటి భాగము)

హాస్యములు. చిన్నసైజు, ౧౩ పుటలు, వెల మూడు కాన్లే.

ii. పెళ్లాన్ని యెలాపిలవడం?

నవ్వుతాలకథ, చిన్నసైజు, ౧౫ పుటలు, ఖరీదు ఒక్క అణాయే.

కర్త: కాంచనపల్లి వేంకటరంగారావుగారు, బరంపురం (గంజాంజిల్లా.)

యోగసంకలనము : జ్ఞానయోగము

శ్రీ అరవిందఘోషుగారిచే రచింపబడిన Synthesis of yoga కు తెలుగుతర్జుమా. వాల్యూము II. భాగము I. అనువాదకులు: మహశ్రీ దోల్తాబాదా గోపాలకృష్ణారావుగారు, బి. ఏ. కాకినాడ నాట్య కళా విజ్ఞానమండలి అయిదవ కుసుమము. ౧౯33. డెమ్మీసైజు ౧౬౧ పుటలు. వెల ౦-౧౨-౦.

భక్తముకుంద జీవితము

గ్రంథకర్త: పండిత వడ్లమాని సోమనాథశర్మ గారు; అంజనాలయము, కాకినాడ. క్రౌనుసైజు 3౨ పుటలు; వెల రు ౦-౬-౦.

క్షత్రియ కుల గోత్రప్రకాశిక

విజయనగరం క్షత్రియచారిత్రకమండలి యందు ఘాదిమ గ్రంథమాలలో తృతీయప్రకటనముగా దువ్వూరి జగన్నాథశర్మగారిచే ప్రకటితము.

క్రౌనుసైజు, ౫౨ పుటలు, వెల రు ౦-౪-౦.

భోగేశ్వర మాహాత్మ్యము

గ్రంథకర్త: మల్లంపల్లి మల్లికార్జునారాధ్యకవి. బందరు సత్యసాధనీముద్రాలయమున ముద్రితము. డెమ్మీసైజు ౮౦ పుటలు. వెల రు ౦-౧౦-౦.

మానవస్వత్వములు

థామస్ పెయినీగారి Rights of Men అను గ్రంథమున కాంధ్రానువాదము.

అనువాదకులు : వడ్లమూడి గోపాలకృష్ణమూర్తి గారు, తెనాలి. క్రౌనుసైజు, పుటలు ౫౦. వెల రు ౦-౮-౦.

అక్బరుసార్వభౌముడు

కృతికర్త: వెంపటి సత్యనారాయణగారు, సి. బి. యం. హైస్కూలు, విశాఖపట్టణము. క్రౌనుసైజు, పుటలు ౧౨3, వెల రు ౦-౪-౦.

అ రుం ధ తి

గ్రంథకర్త: జాలా రంగస్వామిగారు. రాజ మంత్రి హరిజనగ్రంథమాల ప్రథమపుష్పము.

క్రౌనుసైజు, పుటలు 3౦, వెల రు. ౦-౪-౦.

నిరుద్ధభారతము

అస్పృశ్యతాఖండనాత్మకమైన పద్యకావ్యము. తృతీయముద్రణము.

కర్త: మంగిపూడి వేంకటశర్మగారు, నిడుద వోలు. వెల ౦-౫-౦.

అస్పృశ్యత

గ్రంథకర్త: జాలా రంగస్వామిగారు. రాజ మంత్రి హరిజనగ్రంథమాల ద్వితీయ పుష్పము. క్రౌను సైజు: పుటలు ౪౪; వెల రు ౦-౪-౦.

అ డ వి పు వ్వు లు

గ్రంథకర్త: మిన్నికంటి గురునాథశర్మగారు, ఆంధ్రోపాధ్యాయుడు, టవున్ హైస్కూలు, గుంటూరు.

క్రౌనుసైజు, ౯౮ పుటలు. వెల రు. ౧-౦-౦.

త్యా గ మ హి మ

గ్రంథకర్త: గొల్లపూడి సీతారామశాస్త్రిగారు, రేపల్లె.

క్రౌనుసైజు ౪౦ పుటలు.

కథాకావ్యము

గ్రంథకర్త : త్యాగి. మార్కండేయులభవనము, నరసారావుపేట.

క్రౌనుసైజు ౧౬౪ పుటలు, వెల రు. ౦-౧౨-౦.

ఆత్మచరిత్రము

ఆఖ్యాత : రాయసం వేంకటశివుడుగారు, యం. ఏ., యల్. టి. గుంటూరు.

ఆంధ్రగ్రంథమాల ౨౨-వ కుసుమము. క్రౌను సైజున ౬౫౦ పుటలు. వెల ౧ రూ.

అభిజ్ఞానశాకుంతలము

ఆంధ్రీకర్త : కవిరాజ శ్రీ వత్సవాయి వేంకట నీలాద్రిరాజుగారు, తుని.

డెమ్మీసైజు, ౧౧౯ పుటలు, వెల రు. ౧-౮-౦

శ్రీ సోమనాథ రేఖాశాస్త్రము

(మొదటి భాగము)

వ్యాఖ్యాత : పండిత వడ్లమాని సోమనాథశర్మగారు, కాకినాడ.

డెమ్మీసైజు, ౨౪ పుటలు, వెల ౦-౮-౦.

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

(రెండవ ముద్రణము) మొదటి సంపుటము

ఇందు చరిత్రలు, ప్రకృతిశాస్త్రములు, జీవితములు, నీతి, మత, సాంఘిక, వైద్య, రాజకీయాది విషయములు, భూగోళము, న్యాయము, శిల్పము, జ్యోతిషము మొదలగు సమస్తవిషయములు చర్చింపబడును.

ఈ సంపుటమున 'అ' నుండి 'అధ్వర్యు' వఱకు గల నాలుగువందల పదములకు సంబంధించిన విషయములు చక్కగా వివరింపబడినవి. అందముగ ముద్రితములయిన రంగుల బొమ్మలు ఎనిమిది, సాదాబొమ్మలు ౧౬౫ ఉన్నవి.

డెమ్మీ నాలుగుపుటలసైజున ౬౦౦ పుటలు, మేలైనకాగితము. బంగారురేకు చెక్కడపు అచ్చుకట్టు, పేరు మొదలయినవి కల చక్కని స్వదేశపు తోలుబైండు. వెల పది రూపాయలు మాత్రము. తపాలు లేక, రైలు ర్చులు ప్రత్యేకము.

తపాలు వ్యయము ఒకటిన్నర రూపాయ. రైలుద్వారా అయిన, ఖర్చు దూరమునుబట్టి ఎచ్చును, తగ్గును వచ్చును. రు. ౧౧-౮-౦ మణిఆర్డరుద్వారా పంపినవారికి పుస్తకము రిజిస్టరు తపాలుద్వారా పంపబడును. వి. పి. గా పంపగోరువారు అయిదు రూపాయిలు అడ్వాన్సు పంపవలెను. చిరునామా (అడ్రెసు) స్పష్టముగా వ్రాయవలెను. రైలుద్వారా పంపగోరువారు తమగ్రామమునకు దగ్గరనుండు స్టేషన్ పేరు తెలుపవలెను.

కొలదిప్రతులే నిలువయున్నవి. త్వరపడవలయును. రెండవసంపుటము త్వరలో వెలువడనున్నది.

మేనేజరు, ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,
నెంబరు ౭, తంబుశెట్టివీధి, మదరాసు.

మన వి మా ట లు

ఆంధ్రవిశ్వకళాపరిషత్తు
ప్రాచ్యవిద్యాపరీక్షలు

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రాచ్యవిద్యల యందు ఏటేట పరీక్షలను నెరపుచు, సంస్కృతమునవానికి 'విద్యాప్రవీణ' పట్టమును, దేశభాషలవానికి 'ఉభయభాషాప్రవీణ' పట్టమును ఒసగుచున్నది. ఈపరీక్షలు సంస్కృతమున నేడు* శాఖలుగను, దేశభాషల మూడు† శాఖలుగను విభజింపబడినవి. వానిలో నొకొక్కశాఖయు పూర్తియయి పట్టమును బడయుటకు రెండు‡ పరీక్షలు గలవు. ఈపరీక్షలకు జదువునర్హతను నిర్ణయించుట కింకొకపరీక్షయు॥ గలదు. 'విద్యాప్రవీణ' పట్టమునకు దేశభాషను చదువ బనిలేదు. ఇంగ్లీషు చదువువారు బి. ఏ. లో కూడ, ఏశాస్త్రమును జదివినను, ఇంగ్లీషు సాహిత్యమును, మాతృభాషాసాహిత్యమును చదువవలెనను నియమము గలదు. 'విద్యాప్రవీణ' పట్టమునకు జదువువారికి మాతృభాషను చదువునావశ్యకము లేకపోయినది. విశ్వకళాపరిషత్తు ఇంగ్లీషున కట్లు, సంస్కృతమున కిట్లు నియమమును విధించుటకు కారణము దురూహము. దీనివలన 'విద్యాప్రవీణ'లు 'సంస్కృతారణ్యసంచారి విద్వన్మత్తేభము' లగుచున్నారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఒసగు పట్టములకు కొన్నింటికి దేశభాషాపఠన మావశ్యకము కాకపోవుట వింతగా తోచుచున్నది. ఇది యొక పొరపాటు. విశ్వకళాపరిషత్తు శాస్త్రశాఖల 'విద్యాప్రవీణ'కు అథమము ప్రిలిమినరివరకును, సాహిత్యశాఖకు సంపూర్ణముగను మాతృభాషాసాహిత్యపఠనమును విధిగ నియమించి ఎట్లో పొసగిన పొరపాటును ఇకనయిన దిద్దుకొనుట ఉచితము. 'ఉభయభాషాప్రవీణ' యందు 'ఉభయభాషా' శబ్దమునకు నియతముగా సంస్కృత మొక్కభాషయు, రెండవది దేశభాషలలో నొక్కటియు నని సంప్రదాయసిద్ధమగు నర్థము. ఆపట్టమున కర్హుడయిన

---

* ౧. మీమాంస, ౨, ౩, ౪. అద్వైత, ద్వైత, విశిష్టాద్వైతశాఖల వేదాంతము. ౫. న్యాయశాస్త్రము, ౬. వ్యాకరణము, ౭. సాహిత్యము. ఈ యేడింట దేనినేని జదివి పరీక్షలయందు కృతార్థులగువారు తత్తచ్ఛాఖానామపూర్వక విద్యాప్రవీణపట్టముల కర్హులు.

† ౧. ఎ-సంస్కృతము, దేశభాష ఒకటి, సమానముగ జదువవలసినది. ౨. బి-సంస్కృతము చాల కొంచెము. దేశభాషవిరివిగ నుండును. ౩. సి. రెండు దేశభాషలు సమప్రధానములు. ఏ. బి. సి.లలో దేన కృతార్థుడయినను పట్టమున కర్హుడగుచున్నాడు.

‡ ౧. ప్రిలిమినరి, ౨. ఫైనలు. మొదటిదానియందు కృతార్థులయినవారు. రెండవదానిని చదువవలయును.

॥ ప్రవేశపరీక్ష (Entrance).

వాడు రెండుభాషలయందును ప్రావీణ్యము కలవాడని పట్టనామమువలన విస్పష్టమగును. దీనికి సరితాళునది 'ఏ' శాఖ యొక్కటియే. తక్కిన రెంటివలన పట్టమాత్రలాభమేకాని జ్ఞానలాభము మృగ్యము. 'ఏ' శాఖకు సంస్కృతమున సాహిత్యముతోకూడ ఛందోవ్యాకరణాలంకారాదిశాస్త్రపఠనము నావశ్యకమగుచున్నది. 'సి' శాఖకు మాతృభాషాన్యతరదేశభాషాపఠన మావశ్యకము. కావున నీరెండును కష్టసాధ్యములు. 'బి' అట్టిది కాదు. ఇందు పేరునకే అనవచ్చును సంస్కృతమును చదువుట—ఒకపద్యకావ్యమున కొన్ని సర్గలు, ఒక గద్యకావ్యమున కొన్నిపుటలు, ఒకానొకనాటకము (ప్రిలిమినరి, ఫైనలులకు కలిసి). అవియైన సవిమర్శముగ జదువబనిలేనివి. సులభమనుభావముతో పలువురు — ఇంచుమించుగ నందరు-ఈశాఖకే చదువుదురు. దేశభాషలు అనేకముగ సంస్కృతభాషాజన్యములు; తద్భాషాభూయిష్ఠములును. సంస్కృతభాషాజ్ఞానములేని దేశభాషాజ్ఞానము, పునాదిలేనియిల్లు. ఈవిధముగ 'బి' శాఖవలన ప్రయోజనముదూరమగుచున్నది. పరీక్షార్థము చదువవలసిన విషయములు, వానికి దగినగ్రంథములు, చదువవలసినకాలము, పరీక్షాపద్ధతి మొదలగునవానియందును లోపము లుండుటచేత తత్ప్రయోజనము మిక్కిలిదూర మయిపోవుచున్నది.

'ఉభయభాషాప్రవీణ'కు లీ దేశభాషాపాఠ్యగ్రంథము లిరువదిటికి పైబడియుండును. వానిలో పదునైదుదనుక సాహిత్యగ్రంథములు. కొన్నికొన్ని అనివార్యములగు కారణములవలన తప్పులతడుకలు (భాషలో, అచ్చులో), గ్రంథభాగములు లోపించినవి, కొరకరానికొయ్యలు, అసమర్థరచనములు, భావార్థశూన్యములు, ఎక్కడను దొరకనివికూడ కొన్ని యీ పాఠ్యగ్రంథములలో తరుచు చేరుచుండును. ఇట్లెల్ల నిర్ణీతములయిన పాఠ్యగ్రంథములలో పెక్కిట నేదోయొకమూలనొకయింతయె చదువవలసియుండును. గ్రంథైకదేశముల జదివినవారికి లభించు శబ్దార్థజ్ఞానపరిమితి యూహాతీతము కాదు. నిర్ణయించినది ఏకదేశమేయైనను ఒకొక్కగ్రంథమును సంపూర్ణముగ జదివియుండవలెనని తలచుట కేవలము పొరపాటు. నిర్ణీతభాగములనే సవిమర్శముగా జదువుటకు చాలదు కాలపరిమితి. ఇట్లు అర్థజ్ఞానమే చాలనపుడు భావవిశేషములు, తత్తత్కవి కవితాతత్త్వ చమత్కారాదులు నెట్లు గోచరము కాగలవు?

పరీక్షాపత్రములయందు సాహిత్య, శాస్త్రలక్షణాది జ్ఞాననిర్ణాయకములగు ప్రశ్నములు చాల తక్కువ. పాఠ్యగ్రంథములకు ఏదో బాదరాయణసంబంధమును గల్పించి ఎవరో, ఎన్నడో వ్రాసి యెందో ప్రకటించిన వివాదగ్రస్తములగు నేవో యనావశ్యకములగు చర్చలయొక్క గుణదోష విచారము చేయవలసిన ప్రశ్నము లధికముగ నుండును. ఆ ప్రశ్నములకయిన నన్నింటికి నందరు సమాధానము వ్రాయబనిలేదు. ఒకొ్కక

పత్రమునకు ప్రశ్నము లనేకము లుండును. వానిలో పరీక్ష్యుల యిచ్ఛకు వచ్చినవానికి ఏవో కొన్నిటికి మాత్రమే సమాధానము లీవలసియుండును. ఇది 'ఛాయిస్' (Choice) పద్ధతి. ఈపద్ధతి నేరికొనిన ప్రశ్నముల కొసగు సమాధానములవలననే జయాపజయ నిర్ణయము చేయవలసినది. జయముచేకూరినవా రెట్లును పట్టాంచితులే. ఈ 'ఛాయిస్' పద్ధతి ప్రతిభయందును, పాండిత్యమునందును పరీక్ష్యులలో నొండొరులకు గల తారతమ్యము నిశ్చయించుటకు బనికిరానిది. చదువవలసినగ్రంథము లందరకు నభిన్నములయియుండ వానిని బురస్కరించుకొని బయలుదేరినప్రశ్నలకు మాత్రము 'ఛాయిస్' పద్ధతి యేల? ఇట్లు పట్టములను గడించినవారి లేఖినినుండి విషయమునగాని, రచనమునగాని, భాషనుగాని లోపములులేక పట్టి పదిపంక్తులు వెలువడజాలకున్నవి. పట్టభద్రులలో ననేకులపట్ల నీమాట చెల్లును.

ఈపట్టములకు భాషాతత్త్వము, చరిత్ర, వాఙ్మయచరిత్రకూడ చదువవలెను. వానిని గూర్చినగ్రంథములు ఇంగ్లీషున నున్నవి కాని దేశభాషలయందు లేవు. పరీక్షార్థులు ఇంగ్లీషు చదువువారు కారుకాన స్వయముగ వానిని జదివి తెలిసికొనజాలరు. ప్రాచ్యభాషల తత్త్వమును చక్కగా దెలియని ఇంగ్లీషువిద్యాపట్టభద్రుల యనువాదవాక్యములే వారికి గతి యగుచున్నవి. శబ్దార్థజ్ఞానమే బాగుగ నమరనివీరికి భాషాతత్త్వజ్ఞాన మేపాటి కుదురగలదు?

ఏవంరూపపాండిత్యమండితు లగు పట్టభద్రులే పాఠశాలలయందు దేశభాషాపండితులుగ నియమింపబడవలెననునది శాసనమయినది. కావున నెన్నియేండ్లనుండియో పాఠశాలలయందున్న దేశభాషాబోధకులు గట్టి పండితులయిననుగూడ, వారిపై విద్యాశాఖాధికారులు దయయుంచి శాసననియమమును తొలగించినతప్ప, పట్టభద్రులు కాని కారణమున నూడబెరుకబడి వారి పదముల నేటేట నధికసంఖ్యాకులుగ తయారగుచున్న 'బి' పట్టమువారు నియమింపబడుచున్నారు. వారిబోధనమువలన బాలురకు గలుగు భాషాజ్ఞానము వారి పాండిత్యానుగుణముగ నుండుట నిశ్చయము. 'తా జెడ్డకోతి వనమెల్ల చెరపక' మానదు.

ఈ లోపమును బరికించియె కళాపరిషత్తు శాఖాత్రయాత్మకముగనున్న 'ఉభయభాషాప్రవీణ'ను ఏకమాత్రముగ నేర్పరుప నిశ్చయించెను. ఇది యిప్పటి 'ఏ' శాఖనుబోలినది.

ఇది మెరుగయినమార్పే.* కాని దానితోపాటు పాఠ్యవిషయ, గ్రంథాదినిర్ణయము

---

* ఈ మార్పును గొనితెచ్చిన శ్రీ జయంతి రామయ్యపంతులుగారి ప్రాచ్యభాషాభిమాన మభినందనార్హము.

నను, పఠనక్రమమునను, పరీక్షాపద్ధతియందు ను, పఠనకాలపరిమితియందును సముచితమగు మార్పు జరుగవలెను. లేకున్న నుద్దిష్టప్రయోజనము గలుగజాలదు. ఈ చెప్పినదంతయు పాఠశాలలయందు క్రమముగ చదివి పట్టములు పొందువారివిషయమున.

ఈ పట్టములను బడయుటకు ప్రైవేటుగ గూడ చదువుట కవకాశము గలదు. వారి విషయమున నెంతయేని చెప్పవలసియుండును. అట్టివారిలోనత్యధికసంఖ్యాకులపఠనక్రమము, వారి పాండిత్యము, వారు పరీక్షలయందు సులభముగ కృతార్థులయి పట్టములను బడయుటకు పన్ను నుపాయములు, పట్టభద్రులయి పండితంమన్యతచే, ఉపాధ్యాయులు, గ్రంథకర్తలు, వ్యాఖ్యాతలు నయి వాఙ్మయమునకు, తద్ద్వారమున దేశమునకు వారుచేయు నపకారము మొదలగువానిని విస్తరించి చెప్పుటకంటె ప్రైవేటుగా చదువు నవకాశమునే రద్దుచేయుట వివేకమన్న తీరిపోవును. అట్లు చేయుట సరికాదని తలపబడునేని, గట్టి కట్టుదిట్టములనయిన నేరుపరుపవలెను.

ఈ లోపమునకంతకును ముఖ్యకారణ మాంగ్లవిద్యాబోధనక్రమానుకరణము. అశ్రద్ధయు, నసమర్థతయు నానుషంగికములు. ఇంగ్లీషుభాష, దానితత్త్వము, దానిని చదువవలసినక్రమము నన్యము. ప్రాచ్యభాషలు, వానితత్త్వము, వానిని చదువవలసినక్రమము నన్యము. ఈ విభేదమునెరిగి శ్రద్ధతో, సమర్థులగువారి సాహాయ్యమున ప్రాచ్యవిద్యాభిధానము నామూలాగ్రము సంస్కరించు టవశ్యకర్తవ్యము. అట్లు చేయజాలనినాడు 'నాస్మాకే వాస్తే' ప్రాచ్యవిద్యాపరీక్షలకు స్వస్తిచెప్పుట సర్వోత్తమము. అందుచేత కళాపరిషత్తునకు వానికొరకగుచున్న వ్యర్థవ్యయము తప్పిపోవును. ప్రాచ్యవిద్యలును ప్రాచీనమార్గముల బడి తత్పఠనతత్పరులప్రాపున చిరంజీవములయి విలసిల్లగలవు. అప్పుడయిన నాంధ్రమునకభ్యున్నతిని గలిగించు మార్గముల నరయవలసినబాధ్యత కళాపరిషత్తునకు తప్పదు. లేనియెడ 'నాంధ్రవిశ్వకళాపరిషత్తు' అనునామము నిరర్థకమే యగును.

ఇదియంతయు పర్యాలోచించి విజ్ఞానసంపన్నులు, దేశహితైషులు, ప్రాచ్యవిద్యాభిమానులు నగు నాంధ్రు లీప్రాచ్యవిద్యా విషయమున విశ్వకళాపరిషత్తునకు సముచితములగు సలహాల నిచ్చి, ప్రాచ్యవిద్యలకును, కళాపరిషత్తునకును, ఆంధ్రదేశమునకును అభ్యున్నతిని సమకూర్తురుగాక!

ఆంధ్రనాటక కళాపరిషత్తు (౧౯౩౩)

ఈ పరిషత్తు ౧౯౨౯ లో తెనాలిలో జన్మించి ౩౧ లో గుంటూరులో రెండవ మారు సమావేశమయి స్థాయిత్వాన్ని గూర్చుకొన్నది. మరల రెండుసంవత్సరాల వ్యవధానముతో రాగల డిసెంబరులో చెన్నపురియాంధ్రుల నడుమ సమావేశముకానున్నది.

ఏలాగైతేనేమి, అపూర్వముగా బయలుదేరిన యీసంస్థ మూడవసమావేశానికి వచ్చినదంటే ఆంధ్రుడైనవానికి సంతోషము మితిమీరి పోకతప్పదు.

కాని నేటి కాలపు పరిషత్తుల సామాన్య లక్షణాల ఆవరణలోనుంచి యిదిగూడ తప్పకో లేకపోయినది. ఏదో ఒక నిర్ణీతసమయములో సమావేశముల నేర్పాటుచేయుట, పేరెన్నిక గన్న యేవ్యక్తినో అగ్రాసనమున నుంచి యుపన్యాసముల నిప్పించుట, అవీయివీ నాలుగు ప్రదర్శనాల వంటివి జరిపించుట, Vote of thanks తో అటుతరువాతి సమావేశము వరకు మాటుమణగియుండుట పరిషత్తులకు మామూలయినదంటే ఉలుకుపడితే లాభము!

ఏసంస్థఅయినా తన యుద్దేశ్యాలను నిండుమనసుతో నెరవేర్చుకోవలెనంటే, కొన్ని కట్టుబాట్లతో పనిచేయవలసియుండును. కేవలము పరిషత్తులను సమావేశపరచి, కొన్ని యుపన్యాసముల నిప్పించి, కొన్ని తీర్మానములను చేయించి, మరల సమావేశములో మామూలు తంతునే నడపుతూఉంటే ఎన్నటికైనా ఉద్దేశ్యాలు గట్టెక్కేమార్గమున్నదా? ఒకవేళ రెండుసమావేశములనడుమ కారణాంతరములవలన నిడుపాటి వ్యవధానము తప్పనిసరిఅయినా, అవాంతరసమావేశములను కూర్చి, పూనుకొన్న కార్య మెంతవరకు ముందుకు సాగుచున్నది గమనించుచు, చలనానికి కొంచె మడ్డుతగిలియుండినపట్ల చురుకుదనమును కల్పించుచు వచ్చినగాని మహాసమావేశము లెన్ని జరిగినను ఫలిత ముండదు. మాటవరుసకని అనుకొందము — ఇప్పటికి రెండుసమావేశములు కూడి చేసిన తీర్మానాలలో తుద కొక్కటైనా కార్యరూపమునకు వచ్చినదా? మరి ప్రయోజనము?

వైయక్తికముగా నెటు లున్నను, సాంఘికముగా మనదేశములో నాట్యకళ యింకా ప్రథమావస్థలోనే యున్నదంటే, తలవంచుకోక ఎత్తుకోవడానికి వీలేది? సర్వావయవముల నాట్యకళాకాంతులుగల సంఘము మన ఆంధ్రదేశమున మచ్చున కొకటి లేదు. పేరుకు కొన్నిసంఘము లున్నవేకాని వానిలో జీవము తక్కువ; కట్టుబాట్లు అసలే లేవు. సభ్యలలో ప్రతివాడును స్వయంరాజు, స్వయం మంత్రి. ఇక నిర్వాహకులా, వారికి కావలసినది డబ్బు. సమయముచూచి, ఏదో ఒక నాటకమును ఏరి, ఒకరిద్దరు విఖ్యాతనటులను రప్పించి ప్రదర్శనములను సాగించుట, నాలుగు డబ్బులను రాల్చుకొనుట. ఇంతే - చిల్లర నటులతోగాని, రంగస్థలసామగ్రి, తక్కుంగల విశేషములతోగాని వారికి పనియేలేదు. ఇలాటి పరిస్థితులలో మన రంగభూమి కళాకాంతులతో రాణించవలెనంటే సాధ్యమా? 'రంగస్థలముమీద కేవలము నటులే ప్రధానముగాదు. రంగంమీద కనుపించు ప్రతినీడ గమనింపవలసియుండును. ప్రతివెలుగు, ప్రతికాంతి, ప్రతికిరణము, ప్రతికుర్చీ, ప్రతివస్తువు

కూడ ముఖ్యమైన దే.' ఇన్ని కుదిరికలు నిర్వాహకుల కౌశలముపై నాధారపడియుండును. వారికిని నటులకును సామరస్యము, సౌహార్దము పెంపొందియుండవలెను. నటులును నిర్వాహకుః గిరిగీశలపై ఏమరక నడచుచు తమకు నిర్ణీతములయిన పాత్రములను విమర్శనదృష్టితో పరిశీలించి కార్యరంగమున కంజవేయవలెను. అందరికిని అన్నిపాత్రలు ఒప్పవు. నే నన్నిటికిని తగుదునను నుట అహంత. తరువాత – 'ఆడే నాటకము ఏ కాలముదో, ఆకాలపు ఆచార వ్యవహారములను బాగా అవగాహన చేసుకోవలెను. బహదూర్ వేషమున పంపుషూలు వేసుకొనివస్తే లాభము లేదు.' ఇక రంగులు వేసుకోవడము–'ప్రత్యేకముగా అభ్యసించవలసిన విద్య' అది. 'అది నేర్చుకొంటే ఒకగీటుతో ఏలాగు మార్చుకొనవలసిన ఆలాగు మార్చుకొనవచ్చు, వేషము.'

మనదేశములో చక్కని, ప్రేక్షకుల హృదయముల నావర్జించు నాటకములు లేనే లేవు. ఏమున్నా, అన్నీ ఒకసూత్రముపైననే, ఒకదృష్టితోనే కూర్చబడినవి. దేశకాల పరిస్థితులతో వీని కానుగుణ్యా ముండదు. 'మానవసమస్యలతో, మనుజమాత్రుల కష్టసుఖములతో సంబంధముగల నాటకములు' నేడు కావలసినవి. అవి ఎంత 'స్వల్పముగానున్నను అవే నిజముగా నాటకములు.' నవీనాభిరుచులకు సరిపోవు నాటకములు లేనప్పుడు రంగభూమిపై ఆదరము లేదంటే, లేక మరేమవును?

ఇంతకును—నాట్యకళాభివృద్ధియే నిజముగా ఈపరిషత్తుయొక్క ఉద్దేశ్యమయితే యిట్టి తాబేటినడకలతో లాభము లేదు. చేయవలసిన కార్య మపారము. పరిషత్తులలో చర్చించుకొన్న, తీర్మానించుకొన్న సంగతుల నెప్పటికప్పుడు కార్యరూపమునకు తేజాలిన చురుకుదన మవసరము.

ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము, చెన్నపురి.

(Oriental Research Institute)

సహాయాంధ్ర పరిశోధక నియామకము

చెన్నపురి విశ్వవిద్యాలయము నెలకొలపిన ప్రాచ్యవిద్యా పరిశోధనాలయమున నాంధ్రవాఙ్మయ పరిశోధనమునకయి, తొలుత, మూడేండ్లకాలము కాబోలు, ముగ్గురు పరిశోధకులు నియమింపబడిరి. వారిలో నొకరు (ప్రధానులు) ప్రాచ్యవిద్యా పాండిత్యముతోపాటు యం. ఏ. పట్టమును పొందినవారుగను, తక్కిన యిరువురు (సాహాయ్యకులు) కేవలము ప్రాచ్యవిద్యాపాండిత్యముగలవారుగను ఉండవలెనను నియమముండెను. అపుడు వారిని నియమించుట కేరుపడిన కమిటీయొక్క అసమీక్ష్యకారిత మొట్టమొదట నియమితులయిన సహాయపరిశోధకులకు ఆశాభంగము కలుగుటకు, తరువాతను ఇద్దరుపట్టభద్రులు నియమింపబడుటకు కారణమయినది. వారిలో నొకరొక సంవత్సరకాల ముండి మానుకొనిరి. తత్స్థానమున నింకొకరు నియమింపబడక పోయిరి. రెండవమారు మరల క్రొత్తగ నిరువురను మాత్రమే నియమింప విశ్వవిద్యాలయము నిశ్చయించినది. వారియందు సహాయ-పరిశోధకునకు ప్రాచ్యవిద్యాపాండిత్యాతిశయము గలిగియుండవలయు ననుట విధియయ్యెను. తదనుసారముగనే తన్నియామకము జరిగెను. ఈ కార్యాలయము ప్రారంభమయి అయిదారేడు లయినను ఆంధ్రేతర

భాషలయందు విశేషముగ పరిశోధనము జరిగి గ్రంథ ములు ప్రకటితములయియుండ, ఆంధ్రమున విష్ణు పురాణ మొకటిమాత్రము ప్రకటితమయినది. అనల్ప వ్యయమూలకమగు నీయల్పఫలమునకు కారణము దురూహముకాదు.

ఇపుడు సహాయపరిశోధకుని యుద్యోగము సృజ్జ గించుటవలన మరియొకరిని క్రొత్తగా నియమించవల సిన ఆవశ్యకత కలిగినది. ప్రకృతము తత్స్థానమునకు సర్వథా తగినవా రాంధ్రులలో శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగా రొక్కరుమాత్రము కాన్పించుచున్నారు. వా రించుమిం చిరువదియైదేండ్లకాలమునుండి ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తకభాండా గారమున నాంధ్రపండిత పదము నధిష్ఠించి బహుగ్రంథపరిశోధనమును గావిం చుచు వాఙ్మయ, వాఙ్మయచరిత్రాదుల పరిశోధన కార్యములయందు ముక్కాకలుదీరియున్నారు. శ్రీ శాస్త్రిగారు స్వతంత్రముగ రచించిన శృంగార శ్రీనాథము, సంస్కరించి పరిష్కరించిన బసవ పురాణము, తంజావూరు ఆంధ్రరాజులచరిత్ర, క్రీడాభి రామము, ప్రబంధరత్నావళి, చాటుపద్యమణిమంజరి (భాగద్వయాత్మకము) మొదలగు గ్రంథములు - తెన్ను పులసవిమర్శకీతికలు, నీతివిధి, ప్రతిమ, మధ్యమవ్యా యోగము, కర్ణభారము మున్నగు అనువాదగ్రంథములు, అనేకపత్రికలయందు ప్రకటితములయిన ప్రాచీనాధునా తన సారస్వతచారిత్రికాది పరిశోధనవ్యాసములు - రస వత్పద్యఖండ రచనములు వారి పాండిత్యగౌరవమును, చారిత్రకజ్ఞానమును, విమర్శనశక్తిని, ప్రతిభాకౌశల మును అనంతముఖముల చాటిచెప్పుచున్నవి. ప్రాచీన భాషాశబ్దస్వరూప, తత్త్వనిర్ణయమునకు ముఖ్యసాధన ములయిన ప్రాచీనశిలాతామ్ర శాసనములయు, ప్రాచీన తాళపత్రసంపుటములయు పరిశోధనమును పెక్కు డులనుండి చేయుచుండుట శాస్త్రిగారి సహజసామర్థ్య మునకు మెరుగగుచున్నది. ఇట్లు సకలవిధముల శ్రీశాస్త్రి గారు ఆసహాయపరిశోధకపదవి నలంకరింప జాలిన వారు. వారినియామకమువలన నాంధ్రవాఙ్మయము నకు వికాస మపరిమితముగ గలుగ గలదు. సర్వథా తన్నియామక మవశ్యకర్తవ్యము. విశ్వవిద్యాలయము పరిశోధనకార్యారంభముననే శాస్త్రిగారిని నియ మింపవలసి యుండెను. ఇపుడయిన వారిని నియమిం చుట వివేకము. ఇప్పటి కీకార్యాలయమున నాంధ్ర శాఖయం దయిన పరిశోధనాదికార్యముల ఫలము ఆశావిషయమున విశ్వవిద్యాలయమున శ్రద్ధను, కర్త వ్యపరాఙ్ముఖతను వెల్లడిచేయుచున్నది. విశ్వవిద్యా లయ మెల్లభాషలయెడను సమానాదరమును చూపుచు అన్నిటను కార్యములు సరిగా కొనసాగునట్లు చూచుట న్యాయ్యము.

వివిధవాఙ్మయవిజ్ఞానసంపదలను నిరంతరము పెంపును సంపాదించుకొనుచుండుట విశ్వవిద్యాలయ ముల కార్యము. తదర్థము పక్షపాతరహితదృష్టితో నాయావిషయముల సిద్ధహస్తులగువారి నేరితెచ్చుకొని వారిప్రాపున తత్తత్సంపద నెల్లపుడు వృద్ధిచేసికొను చుండుట విశ్వవిద్యాలయముల కావశ్యకము.

వెనుకనొకరు నిలిచిపోగా వారిస్థానమున నెవ రిని నియమింపకుండినట్లు ఇపుడును ఈ సహాయపరి శోధక స్థానమున నెవ్వరిని నియమింప నుపేక్షను చూపునేని ఆంధ్రభాషయెడ చెన్నపురి విశ్వవిద్యాలయ ము చూపు ననాదరమున కది గొప్పనిదర్శనము కాగలదు. అట్టియనాదరము నాంధ్రలోకము సహింపజాలదు.

స్వర్గీయ జతీంద్రమోహనుడు

పండితపుత్రుడంటే శుంఠడనియర్థము. తండ్రి గుణాలు ఏవీ అంటవు. అందుకని పండితుల పుత్రు లందరు అట్లాంటివారని అంటానికి వీల్లేదు. కాని అను భవము అట్టిది. ఇట్లాగే భాగ్యవంతుల పుత్రుల విష యంలోకూడాను.

జతీంద్రమోహనసేనుగుప్త ౧౮౮౫లో పుట్టాడు. ఇతడు ఆగర్భశ్రీమంతుడు. ఇతనితండ్రి ఒకజమీందారు. అయినా జతీంద్రుడు సర్వసాధారణముగా భాగ్య వంతుల పిల్లలుమాదిరిగా తయారవలేదు.

ంబ్రిడ్జిలో బ్యారిష్టరయి వచ్చాడు. జతీంద్రుడు పూర్తిగా స్వయంకృషిమీదనే పైకొచ్చినాడని అన టానికి వీల్లేదు. జన్మకూడా ఇతనికి తోడ్పడింది. అసలు

సేనుగుప్త దంపతులు

(మొన్న కరాచీ కాంగ్రెసుసమయమున వీరిబసవద్ద తీసిన ఛాయాచిత్రము. తరువాత గుప్తగారు జైలులోనుండుటకారణమున మరిఫోటోతీసినట్లు కానరాదు.)

—I. P. P. A.

వస్తువు మంచిదికావడంచేత ఇవి మెరుగుపెట్టినాయి. జతీంద్రునికి మొదటినుంచి ప్రజాసేవ చేయడంలో ఉత్సాహం మెండు. ఇతనితండ్రికూడా ఇట్టి విషయాలలో పేరు వడసినాడు.

క్రమంగా చుట్టుప్రక్కల ఇతని ప్రఖ్యాతి ప్రసరించింది. కాని అప్పుడు వంగరాష్ట్రీయ నాయకులలో ఒకడవలేదు.

సమయమనేది ప్రతివ్యక్తికి, ప్రతికార్యానికి ఉంది. కాని అది గ్రహించుకోక మనం తొందరపడతాము, ఒకసారి ఊరుకుదామని. ఇది మానవ స్వభావం. అది అనుభవంమీద రావలసిందేగాని ఒకళ్లుచెపితే వచ్చేదికాదు.

సేనుగుప్తకికూడా ప్రఖ్యాతపురుషు డవటానికి ఒకసమయముంది. అది అస్సాము-బెంగాలు రైల్వేపనివాండ్ర సమ్మె సమయము. అప్పుడు ఆయన పనివాండ్రకు చేసిన సహాయ మపారము. వాళ్లకి భోజనం పెట్టడానికి అపరిమితంగా డబ్బు వెచ్చించాడు. ఆయన ధనంలో చాలాభాగం దీనిక్రిందే వ్యయమయిందని వాడుక.

సమ్మెలో పనివాండ్రు జయ మందారు. జతీంద్రుని ప్రఖ్యాతి దిగంతములకు వ్యాపించింది.

జతీంద్రుడు కలకత్తాకు వచ్చాడు. వన్నెకెక్కిన న్యాయవాదులలో ఒక డయినాడు. కొద్దికాలంలోనే నాగపూరు కాంగ్రెసులో సహాయనిరాకరణమే కావాలని అన్నారు. నాయకులు తమ వృత్తులను మానేసినారు. జతీంద్రుడుకూడాను.

బెంగాలులో చిత్తరంజనుని ప్రతిభ ధూమ్యా కాశాలు నిండింది. ఆతని ధాటికి అందరు తొలిగారు. జతీంద్రుడు అతని ముఖ్యసేనాని.

దాసు చనిపోయినాడు. అతనితరువాత కిరీట ధారణకి ఎవరు తగుదు రనే సమస్య వచ్చింది. ఆలో చించారు. చివరకి జతీంద్రుడే తగుపురుషుడని అతనికే పట్టం కట్టారు.

జతీంద్రుడు కిరీటత్రయాన్ని ధరించాడు. అంటే కలకత్తా మేయరుపదవి, బెంగాలు రాష్ట్రీయ కాంగ్రెసు సంఘాధ్యక్షత, బెంగాలు స్వరాజ్యపార్టీనాయకత్వము. ఈపదవులు పొందటానికి ఇంకా అనేకమంది తంటాలు పడ్డారు. ఆసందర్భములో కొందరు కొన్ని అసభ్య మైన పనులనుకూడ చేశారు. వాటిని ఇక్కడ పేర్కొ నడం అనవసరం.

నేనుగుప్త మంచి టెన్నిసు, క్రికెటు ఆటగాడు. సౌత్ క్లబ్బునకు అనేకపర్యాయాలు ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోబడినాడు. పందెములలో చివరదాకా వచ్చే వాడు. కాయం స్థూలంఅవడంచేత ఈమధ్య ఆటలు మానేసినాడు.

నేనుగుప్త ధైర్యవంతుడు, ఉల్లాసవంతుడు. ప్రతిపక్షి విమర్శ చేస్తున్నా మందహాసంతో వింటూ ఉంటాడు. ఆటల్లో తగిలిన దెబ్బ అరటిపండుఅనే తత్త్వము మనిషిది. ఆగుణమే అతన్ని పైకి తీసుకొని వచ్చింది.

అదిగాకుండా నిష్పక్షపాతి. తాను కార్పొ రేషను మేయరుగా ఉన్నన్నాళ్లు సమానబుద్ధితో వ్యవహరించేవాడు. తనపక్షమువారితోను, ఇతరపక్ష ములవారితోను ఒకేవిధంగా ఉండేవాడు. అందుకనే అయిదుసారులు వరుసగా ఎన్నుకొనబడినాడు.

ప్రతివ్యక్తికి ఏదో ఒక శక్తి, సామర్థ్యము ఉంటుంది. ఇవి కొందరిలో ఎక్కువగా ఉంటాయి, కొందరిలో తక్కువగా ఉంటాయి. దానికి తగినట్లుగా వ్యక్తులు ప్రకాశిస్తూ ఉంటారు.

అట్టిదే జతీంద్రునియందుకూడా ఒకశక్తి ఉంది. శక్తిఅంటే, సాధారణంగా మనమనుకునే వాక్పటిమ, ధైర్యము, నాయకత్వం వహించడం, సంగీతం పాడడం ఇట్లాంటిదే ఇంకొకటి. కాని జతీంద్రుని శక్తి త్యాగము; తనకున్నదంతా దేశానికి అర్పించడము. అదికూడా ఒకశక్తే. అది కొద్దిమందికే ఉంటుంది.

జతీంద్రుడు మధ్యవయస్కుడుగానే చనిపోయి నాడు. అయినా అతను పెద్దవాడే. ఏండ్లు జరిగి పోతుంటాయి. కాని అతను మనహృదయాలలో ఉంటూనే ఉంటాడు.

జతీంద్రుడు చావలేదు; జతీంద్రుడు కీర్తి మూర్తి.

అశ్రుతర్పణము:

కీ. శే. ఆ. వేం. సాంఖ్యాయనశర్మగారు.*

ఆంధ్రాకాశమునుండి యొక విజ్ఞానతారక యూడిపడిపోయినది. దానితో కొంత వికాసమును, ఉత్తేజనమును పొందుచుండిన యాంధ్రులను వెరగు క్రమ్ముకొన్నది.

మహోపాధ్యాయులు 'శర్మగారొక సంస్థ; అపురూపవ్యక్తి'; 'విజ్ఞానసర్వస్వము'. కాదామరి? అతడేమికాడు? కవి, పండితుడు, విజ్ఞాత, విమర్శ కుడు, న్యాయవాది, పత్రికాసంపాదకుడు. సంస్కృ తాంధ్రాంగ్లములయందు సిద్ధహస్తుడు. తెలుగునాట నీ 'యాంధ్రషేక్స్పియ'ని ప్రతిభ వెల్లివెరిసినది. ఇట్టి యీయనతీరనియెడబాటు ఆంధ్రలోకమునకు సహింప రానిదనుట చెప్పనేల?

---

* వీరి పాండిత్యాదివిశేషాదికముల వివరించు లేఖన మొకటి వెనుకటి వైశాఖమాసపు భారతియందు కలదు.

కీ. శే. ఆ. వేం. సాంఖ్యాయనశర్మగారు.

శర్మగారి పాండితి, కవనము, విమర్శకత, భావుకత వారి రచనముల ప్రతిఫలించినవి. దైవగతిని వారి సాక్షాద్రూపము నేడు మననుండి మరుగుపడినను ఛాయారూపము వారి రచనలరూపమున మనకు చిరము గోచరించుచునే యుండును.

ఇదియొక ఊరటమాత్రమే. చేపడిన వగపు ఎల్ల రీతుల తుడువరానిది. ఏమిచేయగలము? అనుభవించి తీరవలయును.

అరవమునకు ప్రోత్సాహము

'ఆంధ్రా' పత్రికయం దీక్రింది విషయముకలదు:

“అణ్ణామలై విశ్వవిద్యాలయమున అరవమున ఆనర్సుపరీక్షకు చదువుట కవకాశము గలదు. ఇటీవలనే అరవమున తర్కశాస్త్ర (Logic) పాఠ్యగ్రంథము నొకదానిని రచియించుటకు వేయిరూపాయలు పారితోషిక మివ్వబడెను. పట్టపరీక్షోపతనక్రమమున రెండవ భాగమున కరవము నేర్పబడుచున్నది. విద్వాన్ పరీక్షకును, ప్రెయిలింగుపరీక్షకును అరవమున నొకశాఖ కలదు. మదరాసు విశ్వవిద్యాలయమువారును అరవము పెంపొందుటకయి చాల తోడుపడుచున్నారు; పరిశోధనశాఖ నొకదానిని నెలకొలిపినారు; రమారమి ఆరు లక్షలరూపాయలు వెచ్చించి నిఘంటువును ప్రకటింపజేయుచున్నారు; విద్యాధ్యయనక్రమమున అరవమునకు మంచి గౌరవమును సమకూర్చినారు.”

ఆంధ్రులకొరకే ప్రత్యేకముగ పుట్టువుగన్న ఆంధ్రవిశ్వవిద్యాలయమును, అంతకంటె వయోవృద్ధయి దేశభాషల నన్నింటిని సమానముగ నాదరింపవలసిన మదరాసు విశ్వవిద్యాలయమును తెలుగునకిచ్చిన ప్రోత్సాహము చెప్పుకొనదగినంత లేకున్నది. మరియు శాస్త్రములు (Sciences), చరిత్ర మొదలగువానిని సయితము తెలుగుననే నేర్పవలయునని చిరకాలముక్రిందటనే ఆంధ్రవిశ్వకళాపరిషత్తు నిశ్చయించినది. ఆయావిషయములనుగూర్చిన గ్రంథములు లేక అట్లు చేయుట సాధ్యము కాజాలదని చెప్ప బనిలేదు. కాని ఇప్పటికిని విశ్వకళాపరిషత్తు తద్దృష్టితో రచియింపించిన గ్రంథములు, తుదకు తత్ప్రయత్నమేని యున్నట్లు కానరాదు. వయసున చిన్నదయ్యును గుణమున పెద్దగా పేరునకెక్కిన అణ్ణామలై విశ్వవిద్యాలయము నికనయిన ననుసరించి తెలుగునకు చక్కని ప్రోత్సాహ మిచ్చుట దీనికి ధర్మము. ఆంధ్రులు నీ విషయమున మిక్కిలి శ్రద్ధను వహింపవలెను. 'అడుగక అమ్మయయిన పెట్టదు'

దాంపత్యసౌఖ్యము

"హంగెరీలో నే డొక క్రొత్తసమస్య బయలు దేరినది. అది దేశీయబుణమునకుగాని, ఆయుధములకు గాని, ఇన్ఫ్లుయంజారోగమునకుగాని, నిరుద్యోగము నకుగాని సంబంధించినది కాదు. వానికంటె చాల గహనమయినది.

ప్రధానామాత్యుడు గోంబోసుగారికి ఒకమహా జరునామా అందినది. దానిని నూటయేబదిమంది పార్లమెంటుప్రతినిధులభార్యలు వ్రాసి సంతకముచేసి పంపిరి.

రాత్రులయందు పార్లమెంటుసమావేశములు జరుపరాదనియు, రాత్రివేళయంతయు తమపతులను తమకు దూరముచేయు రాజ్యాంగవ్యవహారములు దాంపత్యసౌఖ్యమున కపాయకరములనియు, తమ దాంపత్య జీవితము విధ్వస్తమగుచుండ తా మూరక చూచుచు నూరుచుండుట అసాధ్యమనియు, తమభర్తలు రాత్రి వేళలందు ఇంటిపట్టున నుండకపోవుటకు నిర్బంధముగ నలవాటుపడుదురుకాన, వారు ప్రొద్దుట నింటికి వచ్చినపుడు, వారు రాత్రియంతయు కేవలము దేశవ్యవహారములయందే నిమగ్నులయియుండి రనుకొనుటకెంతమాత్రమును వీలుపడదనియు నందు వ్రాసిరి."

పయిన పేర్కొనిన విషయము ౧౬-౭-౧౯33 నాటి 'హిందూ'సచిత్రవారపత్రికలో వినోదవిషయములయందు ప్రకటితమయినది. ఇది కేవలము వినోదవిషయముగ భావింపదగినది కాదు. మన దేశమునను వివాహితులగు మగవారు చాలరాత్రి-పది, పండ్రెండుగంటలవరకు- ఒకొకప్పుడు రాత్రియెల్లను పనిచేయవలసిన నిర్బంధము సంప్రాప్తమగుచున్నది. తాలూకాకచేరీల గుమాస్తాలు, జమీందారుల నౌకరులు, షాహుకారుల నౌకరులు ముఖ్యముగ నిట్టినిర్బంధమునకు పాలగుచున్నారు.

హంగెరీలో పార్లమెంటుసభ్యులు రాత్రులయందు పనిచేయుట దేశహితకార్యనిర్వహణముకొరకు; ఇచ్చటివారెల్లరు దాంపత్యానురాగశూన్యులు, అరసికులు, ధనాశాపీడితులు, అధికారదుర్విదగ్ధులు నగు మనుష్యపశువుల స్వార్థసంపాదనముకొరకు. రాత్రులయం దిట్లు చాలప్రొద్దువరకు మగవారలిండ్లను వదలియుండవలసినవా రగుటచే వారి దాంపత్యసౌఖ్యమున కంతరాయము కలుగుచుండుటయేకాక, వారి సతులకు వారి ప్రవర్తనమునెడ సంశయము గలుగుటయు, తద్ద్వారమున వారి దాంపత్య మంతరించుటయు సంభావ్యము. దాంపత్యసౌఖ్యము మాటయటుండుగాక!

పార్లమెంటుసభ్యులకు కొంతకుకొంత స్వాతంత్ర్యము గలదు. వారి పలుకుబడి బహుసంఖ్యాకులగు ప్రజలయొక్క ఇచ్ఛననుసరించియుండును. ఈనౌకరులకన్ననో స్వాతంత్ర్యము పూర్ణానుస్వారము. పొట్టకొరకు నౌకరిలో నున్నంతకాలము ఓర్మాత్రము వారికి చీవాటులు. నిగ్రహానుగ్రహములరెంటను జీవితము దుర్భరమగుచుండును. నిగ్రహ మించుక మించిన తరచు వారి జీవనమునకు, కొండొకతరి జీవితమునకును స్వస్తి చెప్పబడుచుండును. సంఘమున కొందరికి సంప్రాప్తమగు నిట్టి యమానుషప్రవర్తనము కడుంగడు హేయము.

నేషనల్ ఇన్స్యూరన్సు కంపెనీ లిమిటెడ్

హెడ్ ఆఫీసు, 7, కౌన్సిల్ హౌస్ వీధి, కలకత్తా. (స్థాపితము: 1906)

ఆస్తి మొత్తం రు. 1,65,00,000 లకు పైన
సాంవత్సరిక ప్రీమియముల రాబడి రు. 30,00,000 లు
చెల్లింపబడిన క్లెయిముల మొత్తం రు. 78,00,000 లు

డబ్లియు. ఆర్. రే యస్క్వైయిర్	డైరెక్టర్లు	జి. పి. దుతియా యస్క్వైయిర్	
పి. సి. కార్ ,,		యస్. సి. లా	,,
రాయ్‌బహాదూర్ తారకనాద్ సాదు	మేనేజర్లు	రంజిత్ సింగ్	,,

ఆర్. జి. దాస్ & కో.

జీవితముల భీమాచేయు ఈ కంపెనీలో, ప్రీమియములు చాలతక్కువ నూతనపద్ధతులు, నూతనలాభములు. ఆకర్షణీయమైన బోనసులు. ధారాళమైన సరండర్ విలువ. పాలసి హోల్డర్లకు చూపబడు దయ గలిగినట్టియు, సమానమైన ఆదరణ సమాన గౌరవము. లాభమును దెచ్చు సుఖకరమైన పెట్టుబడులు అందువల్ల ధారాళమైన బోనసులు. భారతదేశపు మూలధనము—భారతదేశీయుల పాలనము—భారతీయోత్సాహము. ఏజన్సీ; ఇన్స్యూరన్సు; వివరములకు వ్రాయుడు:—

మద్రాసు బ్రాంచి,
113, ఆర్మీనియన్ వీధి,
మద్రాసు

టి. అనంతాచార్లు, బి. ఏ.
కార్యదర్శి.

ఆత్మకథ

(గాంధిమహాత్ముని స్వీయచరిత్రము)

కొంచది ప్రతులుమాత్రమే మిగిలియున్నవి

(మొదటి సంపుటము) (వెల రూ. ౦-౧౨-౧
(రెండవ సంపుటము) రూ. ౧-౦-౦

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల, నెం. 7, తంబుశెట్టివీధి, మద్రాసు.



అమృతాంజనము
డిపో.,

బొంబాయి. కలకత్తా.

మద్రాసు, రంగూను.

ఆంధ్రపత్రిక

2,22,00,000 ఆంధ్ర మహాజనులకు

ఇది యొక్కటే దైనిక పత్రిక

ఆంధ్రదేశవార్తలను, భారతదేశవార్తలను, ప్రపంచవార్తలను ఏరోజున కారోజున ప్రకటించుచుండును. వార్తలకు సంబంధించిన పటములు ప్రచురింపంబడును. ప్రజలస్వాతంత్ర్యమును కాపాడుటకును స్వరాజ్యము నతిశీఘ్రకాలములో సంపాదించుటకును, ఆంధ్రపత్రిక తోడ్పడినరీతిని మఱి యేపత్రికయు తోడ్పడనేరదు. కాంగ్రెసు నాదేశమును, ఆంధ్రదేశమునం దన్నిమూలలను వ్యాపింపజేయుటలో ఆంధ్రపత్రికను మించిన పత్రికయే లేదు. ఆంధ్రులక్షేమమును పెంపుజేసి ఆంధ్రత్వసిద్ధికై పాటుపడుపత్రిక ఆంధ్రపత్రికయే. ఆంధ్రపత్రికను పోషించుట ఆంధ్రమహాజనుల ప్రధానవిధి యగుచున్నది. శైలి సులభమై ఎల్లరకును గ్రాహ్య మగురీతిని పత్రికావ్యాసము లలరారుచుండును.

చందా యేర్పాటులు

(పొరుగూరువారికి)

దినపత్రిక సంవత్సర చందా	రు. 24	0	0	వారపత్రిక సంవత్సరం 1 కి,
,, అర్ధ సంవత్సర ,,	,, 12	0	0	చందా రూ. 4 0 0
,, మూడుమాసములు,,	,, 6	4	0	వారపత్రిక సంవత్సరమునకు తక్కువ
,, మాసమునకు ,,	,, 2	2	0	చందాకు పంపబడదు.

నూతన సంవత్సరాదిసంచిక వెలలు

దినపత్రిక సంవత్సరచందాదారులకు	...	...	1	0	0
దినపత్రిక సంవత్సరపు తక్కువ చందాదారులకు	...	...	1	4	0
వారపత్రిక చందాదారులకు	...	...	1	4	0
ఇతరులకు	...	...	2	0	0

(వి. పి. ఖర్చులు ప్రత్యేకము.)

మేనేజరు,

ఆంధ్రపత్రికాకార్యాలయము,

7, తంబుశెట్టి వీధి, మద్రాసు.

మన దేశమున స్త్రీలును విద్యా విజ్ఞానముల నార్జించుచున్నారు; దేశహితైకజీవనలగుచున్నారు; ఆత్మహితకార్యములయందును అభినివేశము గలిగియున్నారు. కావున, తమ దాంపత్యసౌఖ్యమునకు కలుగుచున్న యీ యాటంకమునుగూడ హంగేరీస్త్రీలవలె సముచితప్రయత్నముమూలమున నివారించుకొను టావశ్యకము.

అశ్లీల ప్రకటనములు

"గతసంవత్సరపు 'విశాలభారత్' సంచికలలో నొకసారి 'అశ్లీల ప్రకటనముల' ను గురించి ఒక సంపాదకీయవ్యాఖ్య వెలువడియుండెను. అన్నిభాషలలోను వార్తాపత్రికలయందు అశ్లీలప్రకటనములకు కొదవ లేదు. ఈవిషయమై కలకత్తాలోని భారతీయ పత్రికాకార సమితివారు ఒక ప్రత్యేక-ఉపసంఘమును నియమించిరి. ఈసంఘమువారు మంచిచెడ్డలను చర్చించుకొని యీ క్రిందివిధముగా పత్రికాసంచాలకుల కొక విన్నపము నంపుకొనిరి:—

(అ) పాఠకుల మనస్సులందు అశ్లీల భావములు ఉత్పన్నములగుటకు కారణమగు నెట్టిశబ్దముగాని, వాక్యముగాని, ప్రకటనలలో నుండరాదు.

(ఆ) కాముకతకు ఉత్తేజనము నిచ్చు ఔషధముల ప్రకటనములు అచ్చువేయరాదు.

(ఇ) జననేంద్రియసంబంధమగు రోగములకు కుదుర్చు మందుల ప్రకటనము అచ్చువేయవలసివచ్చినపుడు, ఆరోగముల పేరులు శీర్షికలలో నుండరాదు. మరియు ఆప్రకటనలలో అశ్లీలమగుతలంపులను పురిగొల్పునట్టి ఏవాక్యమును ఉండరాదు.

(ఈ) ఇట్టిరోగముల వైద్యముపేరు లిచ్చుట అనివార్యమేయగునెడల వానిని మామూలు అక్షరములతోనే ముద్రింపవలయును.

మన హిందీపత్రికలయందును యిట్టి ప్రకటనలు చాల బయలుదేరుచున్నవి. హిందీపత్రికా సంచాలకులును ఈసంఘమువారి పై సిఫారసులను అమలుజరుపుదురని మేము ఆశింపవచ్చునా?"

(విశాలభారత్ - సంపాదకీయవిచారః)

ఈవిన్నపము విశాలభారత (జూలయి సంచిక) యందు కలదు. తెలుగు దేశమున గల పత్రికలయందును ఇట్టి అశ్లీలప్రకటనలు చాల తరుచుగ కాన్పించుచుండును. వానివలన పత్రికలకు ధనలాభ మధికమయ్యును సంఘము నైతికప్రవృత్తి కవి న్యూనతను గల్పించుచున్నవి. పత్రికలు నానావిధముల సంఘాభివృద్ధిని కావింపవలసినవి. కావున తెలుగు పత్రికల అధిపతులును ఉపర్యుక్తములగు సుపదేశవాక్యములకు సాఫల్యమును సమకూర్చుటావశ్యకము.



సాభిప్రాయ విశేషములు

ఓ ధర్మమా! నీ మహిమ విచిత్రము. నీ సందర్శనమునకు సబర్మతి సత్యాగ్రహాశ్రమనివాసము సాధనమొ, సబర్మతి జెయిలునివాసము సాధనమొ సామాన్యులకు తెలియకున్నది. ప్రవృత్తియందు భోగత్యాగములకు గల సంరంభము ధర్మసంస్థాపనము వినియోగపడుటయును, విచిత్రముగ నున్నది. సుఖప్రాప్తియును, దుఃఖనివృత్తియును జీవయాత్రకు సహజములైనను పరమార్థములు గావు. ధర్మనిర్వహణమునందు దుఃఖానుభవమును సుఖనివృత్తియును పరమార్థములుగ గనుపడుచున్నవి. సుఖదుఃఖములు జీవయాత్రయందు ధర్మనిర్వహణమునకు సమానార్థకములు. గాంధిమహాత్ముడు ధర్మనిర్వహణమునకై సబర్మతీ సత్యాగ్రహాశ్రమమును పరిత్యాగము చేసిన మహాత్యాగోదంతము ప్రపంచేతిహాసములం దపూర్వముగ నున్నది. సత్యాగ్రహ పరిత్యాగము గాంధిమహాత్మునకు గలుగజేసిన హృదయసంతాపమును గాంధిమహాత్ముని దివ్యవాక్యములు వ్యక్తము చేయుచున్నవి.

“౧౯౧౫ సం, హిందూ దేశమునకు వచ్చిన క్రొత్తలో సత్యాగ్రహ ఆశ్రమమును నిర్మించితిని. సత్యాన్వేషణమే ఆశ్రమ-ఆదర్శము. ఆశ్రమవాసులందరు సత్యము, అహింస, బ్రహ్మచర్యము, జిహ్వాచాపల్యమును స్వాధీనపఱచుకొనుట, దరిద్రనారాయణసేవ, ధైర్యసాహసములు, అస్పృశ్యతానిర్మూలన ప్రచారము, స్వదేశీ (ముఖ్యముగా ఖద్దరు) మున్నగు ఆదర్శముల నన్నింటిని మతాచారముగా పాటించి, ఉదరపోషణము చేసుకొందురు. ఆశ్రమస్థలమును ౧౯౧౬. సం. లో కొంటిని. పనులనన్నిటిని ఆశ్రమవాసులే చేసుకొనుచున్నారు. ఖద్దరు, పశుపోషణపరిజ్ఞానము, శాస్త్రరీత్యా పారిశుధ్యము చేయుట, విద్యాభ్యాసము మున్నగునవి ఆశ్రమవాసులు నేర్చుకొనవని. ఆశ్రమములో ౧౦౭ మంది ప్రస్తుతము గలరు. (పురుషులు ౪౨, స్త్రీలు ౩౧, బాలురు ౧౨, బాలికలు ౨౨) ప్రస్తుతము చెరసాలలోనున్న వారిసంఖ్య యిందుచేర్చ లేదు. ఆశ్రమము వెలుపల పనిచేయుచున్న వారిసంఖ్యకూడ యిందుచేర్చలేదు. ఇప్పటివరకు ఖద్దరు పరిశ్రమలో ౧౦౦౦ మంది తయారైరి. వీరందరు నాకు తెలిసినంతవరకు ప్రజానిర్మాణకార్యక్రమ నిమగ్నులైయుండిరి. ఆశ్రమము రిజిస్టరైనది. ట్రస్టుఫండు సక్రమముగానే యున్నది. మిత్రులనుండి విరాళములను స్వీకరించుచున్నాము. ఇది కేవలము విద్యావ్యాపకమునకే వినియోగపడుచున్నది. జీతములు లేకపోవుటయే గాక, విద్యార్థులకు భోజనము పెట్టి, కట్టుబట్టలనుగూడ యిచ్చుచున్నారు. ఆశ్రమస్థిరాస్తి రు ౩,౫౦,౦౦౦. చరాస్తి రు ౩,౦౦,౦౦౦ ఆశ్రమము రాజకీయములందు పాల్గొనుట లేదు.”

సత్యాగ్రహోద్యమమునకు జనకుడ నగు నేను అత్యధిక త్యాగము చేయవలసిన ఆవశ్యకత యిపుడు

కల్గినది. ఏది నాకు ప్రియతమమో, ప్రాణసమమో, దేని నేర్పఱచుటకు ౧౫ సం. నుండి నేనును, ఆశ్రమవాసులను, నిరుపమానశక్తుల వినియోగించి పనిచేసితిమో అట్టి ఆశ్రమమునే నే నిపుడు త్యాగము చేయుచున్నాను. ఈ ఆశ్రమమునకు సంబంధించిన ప్రతిపక్షి, పసువులకు ప్రత్యేకపవిత్రచరిత్ర గలదు. ఈ ఆశ్రమమునకు సంబంధించిన చరస్థిరము లన్నియు ఒకగొప్ప కుటుంబమునకు చెందినవే. వెనుక పనికిమాలిన బీడుగానున్న ప్రదేశము, మనుష్యులకృషివలన ఒకపెద్ద ఆరామక్షేత్రమైనది. ఇట్టి ఆశ్రమమును చీల్చివేసి యిచట జరుగుచున్న పలువిధములగు కార్యములను విరమింపవలసి వచ్చినప్పుడు మేము అశ్రుజలపూరితనేత్రులముకాకుండ నుండజాలము. దీనిని గూర్చి ఆశ్రమవాసులను స్త్రీపురుషులతో చాలసార్లు సంభాషించితిని. ప్రస్తుతము దీనిని విరమించుటకు వారందరు సమ్మతించిరి.

సత్యాగ్రహ మింతలో ముగియునటుల లేదు. అందువలన దాని ఫలితముల నన్నింటిని అనుభవింపవలసి యుండునని ఊహింపక తప్పదు. ఆకారణమున ఆశ్రమము విరమింప నిశ్చయించితిమి కాని ఆశ్రమముసొత్తు వంతయు ప్రజాహితమునకే వినియోగింపవలెనని మాకోరిక, నగదును. చరాస్తుల నన్నిటినిగాని కొన్నిటినిగాని వశపఱచుకొనగోరినయెడల వాటిని నేను ప్రజలలాభమునకు నా సూచనలప్రకారము వినియోగింపబూనిన మిత్రులకు వశపఱుపగోరెదను.

సత్యాగ్రహాశ్రమమును విచ్ఛేదము చేయుటయందు మహాత్మునకు గలిగిన హృదయసంతాపమును, పూర్వోదాహృతములైన సత్యవాక్యములు సకలజనులకును పరమవిచారమును గలుగజేయుచున్నవి. పదునెనిమిదేండ్లు శ్రమపడి పోషించి పెంచిన యాశ్రమమును నిర్మూలముచేయుట సామాన్యులకు సాధ్యముగాని విషయము. ప్రాణావసానసమయమునందైనను నిస్సంగత్వమును, నిస్పృహయును దేహధారులకు దుర్లభము. సన్న్యాసాశ్రమమును స్వీకరించియును మహాశ్రమములను నిర్మించి మమకారము బూనుట ప్రపంచమునందు పరిపాటియైనవిషయము. సత్యాగ్రహమునకై వినియోగపడని సత్యాగ్రహాశ్రమనిర్వహణము సత్యాగ్రహనాయకుడైన గాంధిమహాత్మునకు నిరర్థకమేకాకను దురారాధ్యమును.

సత్యవ్రతపరాయణుడైన మహాత్మునకు సత్యధర్మనిర్వహణమునకు సంసారము, విద్యలు, ఆశ్రమములు సాధనములు కాని పరమార్థములుగావు. సామాన్యులకు సాధనముకాని గ్రాహ్యమైనటులు సాధ్యములు గ్రాహ్యములు గావు. సాధ్యములకు నిరర్థకములైన సాధనములను విసర్జించుట మహాత్ములకు సులభము. మనోవాక్కాయములను సత్యము నారాధించుటకు ప్రతిబంధకములను నిగ్రహించుట మహాత్ములకు పరమార్థము. సత్యాగ్రహనిర్వహణమునకు ప్రతిబంధకమైన సత్యాగ్రహాశ్రమమును విచ్ఛేదము చేయుటయందు గాంధిమహాత్ము డవలంబించినత్యాగ వ్రతానుష్ఠానము ప్రపంచము నందంతటను భయసంభ్రమములను గలుగజేసినది.

* * * *

గాంధి-మహాత్ముని సత్యాగ్రహాశ్రమత్యాగము బుద్ధదేవునిరాజ్య సంసారత్యాగ

మును విస్మరింప జేయుచున్నది. గౌతమ బుద్ధుడు దుఃఖనివృత్తికిని, ఆత్మోపలబ్ధికిని సంసారమును, రాజ్యమును విసర్జించెను. గాంధి మహాత్ముడు సత్యవ్రతపరాయణమైన ధర్మనిర్వాహణార్థము శ్రమపడి పోషించి పెంచిన సత్యాగ్రహాశ్రమమును తృణప్రాయముగను విధ్వంసము చేయుట త్యాగోదంతములందు దివ్యోదంతము. వర్తమానసమయమునందు సత్యాగ్రహోద్యమమునందు సత్యాగ్రహాశ్రమ పరిత్యాగము విషాదాధ్యాయముగను గోచరం బగుచున్నను కాలాంతరమునను దివ్యాధ్యాయముగను వెలయగలదు. సత్యనిర్వహణమునకై సోక్రెటిసు విషపానముచేసిన ఇతిహాసమువలెను, మానవ మోక్షమునకై ఏసుక్రీస్తు శిలువను ధరించిన యితిహాసము రీతిని గాంధిమహాత్ముని త్యాగమును కాలాంతరమునందు ధర్మేతిహాసమునందు పరంజ్యోతి వలెను ప్రకాశింపగలదు.

* * * *

ఏసుక్రీస్తు అశ్వశాలయందు పుట్టినరీతిని ధర్మము నిర్బంధాశ్రమములందు, బీభత్సపరిస్థితులందు తేజోవంత మగుచున్నది. పంచ మహాపాతకులకును వాసస్థలములైన చెరసాలలు మహాత్ములకు నిర్బంధవాసస్థలము లగుట ప్రపంచావృతమైన దురదృష్టము. అనిత్యమైన బాహుబలమునకు గల ప్రతిష్ఠ రాజ్యాంగములం దాదికాలమునుండియును నిత్యమైన ధర్మబలమునకు గలుగకున్నది. రోమక సామ్రాజ్యము క్రీస్తుమత విధ్వంసనమున కుపయోగించిన పశుబలప్రయోగమునే వర్తమానకాలమునందు ౧౯౩౩ సంవత్సరముల యనంతరము రాజ్యాంగములు వినియోగించుచున్నవి. శిక్షాస్మృతియందు సత్యసంకల్పములును, ధర్మనిర్ణయములును దండనార్హము లగుచున్నవి. సత్యసంహారమునకును, ధర్మనిరాదరణమునకును సహకారము చేసెడిప్రయత్నము లసహ్యములైనను సదుపయోగము లగుచున్నవి. అనికారభయావృతమైన ప్రపంచపరిస్థితులందు ధర్మాభయములను స్థాపించుటకు ప్రపంచ మనుభవించిన దుఃఖవేదనను ఘోరసంగ్రామములు, మతకలహములు, సాంఘికసంరంభములు, వ్యాపారార్థికసమరములు వేనోళ్లను బోధించుచున్నను జ్ఞానోదయము దుస్తరముగనున్నది. సంరంభమయమైన ప్రపంచోదంతములందు గాంధిమహాత్ము డుపక్రమించిన మహాత్యాగోదంతము ఆసురబలనిరసనమునకును, దైవబలసంవర్ధనమునకును, ధర్మాకరమైన శాంతిస్థాపనమునకును పరంజ్యోతివలె వినియోగపడుటకు భగవదనుగ్రహము గలుగుగాక!

Printed and Published by C. Seshagiri Rao, B. A., at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras
Editor: G. Subbaramayya.

దానిని మీకొరకే వినియోగింపుడు

ఉదారమైన అభిమానులకు

మీరు నిలువచేయగలిగిన స్త్రీధనము—
మీ తండ్రి—సోదరుడు—భర్త—పుత్రుడు—
వీరిలో నెవరివద్ద మీ రుంచినను సరే, దానిని
మీకొరకే వినియోగింపుడు.



ఆధనముతో నగలుకొని వానిని మీరు ధరింపుడు.

పురుషు లెల్లపుడును......... ఈసంగతి మీకు బాగుగా తెలిసియే యున్నది. కావున మీకు హక్కుగల స్త్రీధనము బాంకిలోను నమ్మకములేని వాటాలక్రిందను నిలువబడి యుండకూడదు.

ఆధనము యెల్లపుడును మీకంటి యెదుటనే మీ వంటిమీదనే యుండి వెలుగునట్లు దానితో మీ కొరకు సొగసైన నగలను కొనుడు.

మేము తయారుచేయించిన నగల విలువ యెన్నటికిని తగ్గిపోదు. నగలను అందముగా చేయించుటయే ప్రత్యేకాభిమతము. ఈవిషయమున మేమే అగ్రగణ్యుల మనికూడ సవినయముగ తెలుపుచున్నాము.

మీరు మొదట మావద్ద కొనునట్టి అలంకారము మీకు మిక్కిలి సంతృప్తికరముగా నుండుటకే మేము ప్రయత్నించెదము అటు పిమ్మట మీ రెల్లప్పుడును మావద్దనే కొనుచుందురు. మీ మిత్రులకు కూడ సిఫార్సు చేయుచుందురు.

ఉమ్మిడి రామయ్యశెట్టి గురుస్వామిశెట్టి కంపెని,

బంగారు వెండి నగలను తయారుచేయువారు,

25, చైనాబజారు రోడ్డు   చెన్నపురి.   62, గోవిందప్పనాయక వీధి

జెనిత్ ద్రాక్షాసవ

ఆయుర్వేద శాస్త్రీయ పద్ధతులమీద తయారు కాబడినది

ఆరంభిదశలో నున్న క్షయరోగము, ఉబ్బసము, శ్వాసనాళీద్రాహము, ఊపిరితిత్తులకు సంబంధించిన యితర వ్యాధులు, శీతలము, పడిసెము, మందాగ్ని, అజీర్తి, మలబద్ధకము, కడుపుపులియుట, వాంతులు వచ్చునట్లుండుట, అన్నివిధములగు గొంతువ్యాధులు మున్నగు జాడ్యములను ఇది పూర్తిగా కుదుర్చును. పిల్లలదగ్గులను పోగొట్టుటలో అద్వితీయమైనది. త్రాగుటకు మధురముగా నుండును. క్రమముగా సేవించినచో, ప్రేగులను శుభ్రముగా నుంచి, ఆకలిని వృద్ధిజేయును. జెనిత్. ద్రాక్షాసవమును రాత్రివేళ పరుండకమునుపు పుచ్చుకొనిన సుఖనిద్ర నిచ్చును. ఉదయమున మేల్కాంచినంతనే తమపనులయం దాసక్తులై చురుకుగా నుందురు.

“జెనిత్ ద్రాక్షాసవము” ఇప్పుడు ప్రతినగరములోను పల్లెలందును గల దుకాణములలో దొరకును. తపాల ద్వారా సీసాల నంపుటచే మిగుల వ్యయ మగును గాన మా ఖాతాదార్లు వారిగ్రామములో గల దుకాణములందే “జెనిత్” ద్రాక్షాసవమును కొనినచో వీలుగా నుండుటేకాక లాభకరముగాగూడ నుండును.

వెల 1½ పౌను రు. 1-12-0. 1 పౌను రు. 1-4-0. ½ పౌను రు. 0-12-0. ప్యాకింగ్ వి. పి. ఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రజిల్లాల రేజెంట్లు:—
ఉపేంద్ర అండు కో., గుంటూరు

Zenith Chemical Works,
Dekaran mansions, Princess St., Bombay No. 2.

స్వల్పధర! ఫల మధికము!! పూర్తి తృప్తి!!!

100 కి 100 గురు సంతృప్తిచెందియున్నారు

లోకామయహర కస్తూరి మాత్రలు

పిల్లలుమొదలు ముసలివారివరకు అందరి మందము, మలబద్ధము, పడిసెము, దగ్గు, గూరలు, శీతలముచే కాళ్లులాగుట, కడుపుబ్బరము, కడుపునొప్పి, పక్కలయందునొప్పి, ఆహారజీర్ణకాలమందు తలనొప్పి, చలిజ్వరము, జ్వరము, ప్లేగు, ఇన్‌ఫ్లూయంజా ఇంకను అనేకవ్యాధులను గుణపరచును. స్త్రీలు ప్రసవించిననాడు, స్నానమునాడు (కస్తూరికి బదులుగా) ఈ మాత్రలు 4-5 ను, 2-3 తమలపాకులలో నమలి మ్రింగవలెను. సాంక్రామికరోగులతో నుండవలసినవారు, దినము 1-2 మాత్రలను సేవించిన ఆరోగ్యదృఢాంగు లగుదురు. ఈమాత్రలసీసాతోగల అనుపానపత్రమును చూడుడు. 300 మాత్రలు గల సీసా 1 కి 4 అణాలవంతున ప్రతిషాపులోపలను దొరకును. పోస్టుమూలకముగా 6 సీసాలు రు. 1-8-0, 12 సీసాలు రు. 2-12-0, 25 సీసాలు రు. 5-3 0.

సారస్వతాసవం:—మెదడుకు బలమును కలిగించి, జ్ఞాపకశక్తిని వృద్ధిచేయును గావున, మెదడు దుర్బలమువలన గలిగియుండు సమస్తవ్యాధులను పరిహరించి నరములకు మంచిత్రాణను, రక్తవృద్ధిని కలుగజేయును. సంగీతపాఠకుల కంఠస్వరమునకు మృదుమధురత్వము నిచ్చును. పాడను పాడను ఉత్సాహము నింపును. బలహీనులైన స్త్రీలకు నెత్తినడుము (నెత్తినోరు చాల మెత్తగా వుండుటవలన) మాట్లాడను నడువనుకాని పిల్లలకు సంజీవివంటిది.

6 ఔన్సుల సీసా 1-కి రు. 1-0-0. పోస్టుఖర్చులు ప్రత్యేకము.

శ్రీ సీతారాఘవ వైద్యశాల, మైసూరు.

చికాకునకు హేతువు

బలహీనము

నీవు బలహీనుడవుగ నున్నచో యేపని చేయుట యందును తోచక, బహు చికాకు నొందుదువు. ఈ-చికాకువల్ల మెదడు చెడును. తలనొప్పి యేర్పడును. నరములయందు శక్తి తప్పిపోవును.

బలహీనుడ వయినట్లు నీకు తోచిన వెంటనే జీవామృతమును సేవింప ప్రారంభింపుడు. ఇయ్యది మానవులకు ప్రాణప్రదాయినివంటిదని ప్రసిద్ధి గాంచినది. బలహీనతవల్లను యేర్పడే సమస్తవిధ రుగ్మతలను పారద్రోలి దేహమునకు ఆరోగ్యమును, పుష్టిని, తేజస్సును, పటుత్వము నొసంగును. సేవింప ప్రారంభించిన మొదటి మోతాదు నుండియే గుణ మగుపడి తీరును. వయోభేదము లేక ఎల్లరు సేవింపవచ్చును.

వైద్యరత్న, పండిత డి. గోపాలాచార్లువారి

జీవామృతము

పూర్ణారోగ్యప్రదాయిని

వెల పెద్దసీసా రు. 3-4-0

చిన్నసీసా రు. 1-12-0

ఆయుర్వేదాశ్రమము,

151, గోవిందప్పనాయక వీధి,

తపాలుపెట్టె 287, మదరాసు.

లోధ్ర

గర్భాశయరోగ నివారిణి

ఋతుశూల, కుసుమవ్యాధి, మూర్ఛ, తెలుపుపోవుట, గర్భస్రావము, సోమరోగము, సంతానహీనత, పిమవ్రణములు, ఋతురక్తము పలురంగులుగ వెడలుట, నడుమునొప్పి, నాతికగడ్డ, బహిష్టి నిలిచిపోవుట, ఋతురక్తము చక్కగ వెడలకుండుట, రంగుమారుట, మేహజ్వరము, దగ్గు, రక్తహీనత, మేహవాతము మొదలగువ్యాధులను లోధ్ర తుదముట్టించును.

లోధ్ర అన్నిషాపులలో దొరకును.

కేసరి కుటీరం,

ఆయుర్వేద ఔషధశాల,

ఎగ్మూరు, మదరాసు.

ఆరోగ్యసాధనము

గాంధిమహాత్మునిచే వ్రాయబడినది

వెల 8 అణాలు

మహాభాషిత రత్నాకరము

గాంధిమహాత్ముని ఉపదేశములు

వెల 4 అణాలు

5 ప్రతులు రూ. 1-0-0

(వి. పి. ఖర్చులు ప్రత్యేకము)

ఒకప్రతి కావలసినచో అయిదు అణాలు

పోస్టుబిళ్లలు పంపిన వి. పి. ఖర్చులు తగలవు

ఆంధ్రపత్రిక ఆఫీసు,

7, తంబుశెట్టివీధి, మద్రాసు.

IPL0134M132

ఇదిగో మీకు నూతన శక్తి గూర్చుచున్నది

మీకు దుర్బలత గలుగుటకు యేకారణమైన గానిండు—రోగముచేగాని—బలము గల నెత్తురు లేకపోవుటచేగాని—తాపత్రయములచేగాని—లేక—పురుషులైనచో—మితిమీరిన స్త్రీలోలత్వముచేగాని,—ఇటులే—దేనివలననైననుసరే—సనటోజన్ మీ దుర్బలతపోగొట్టి వెంటనే మామూలు ఆరోగ్యకర మగు స్థితి చేకూర్చును.

సనటోజన్‌లో ఇంద్రజాల మేదియు లేదు. అది శరీరమును నరములను బలపరచుట కేవలము యదార్థము మీదనే ఆధారపడియున్నది. సనటోజన్ బలహీనతను జయించి, కండరములు, నరములు, రక్తము, మాంసము, మున్నగునవి బలయుతములై యుండుటకు ఏపదార్థము లవసరమో ఆపదార్థముల నొసంగుశక్తి గలిగియున్నది.

సుప్రసిద్ధుడైన యొక వైద్యశిఖామణి డాక్టర్ డబ్లు యం. యర్. గారు పూనా సిటీనుండి యిట్లు వ్రాయుచున్నారు: "నరముల పోషించి దేహమునకు బలముగూర్చుటకు సనటోజన్ మిగులయుపయుక్తమైనది."

సనటోజన్ మిమ్ము ఎక్కువ బలవంతులుగాచేసి ఎక్కువ ఆరోగ్యమును కలిగించును. అది దుర్బలతను జయించును. నిజమునకు, కొలదికాలములో మిమ్ము క్రొత్త మానవులుగా చేయును. నేడే దీనినిసేవింప మొదలిడుడు.

సనటోజన్

నిజమైన బలవర్ధకాహారము.
ఔషధవిక్రేత లందరివద్దను, బజారులోను దొరకును.
చేతులతో స్పృశింపబడినది.

రాజమోహన హేరాయలు

శ్రేష్ఠమయిన సువాసనగల తల నూనె. మెదడుకు చల్లదనమును గలిగించి వెంట్రుకలను అభివృద్ధి చేయుటలో అత్యుత్తమ మయినది.

తలపోటు, మాడుపోటు, శిరోవేడిమి, చుండు మొదలగువాటిని పోగొట్టి కన్నులకు చలవ నొసంగి వెంట్రుకలను మృదువుపరచి, నల్లగా పెంచుటలో అత్యుత్తమ మయినది.

స్త్రీలకు ఆనందమును కలుగజేయును.

సీసా 1-కి రు. 1-0-0 3 సీసాలు రు. 2-10-0

పోస్టేజి ప్రత్యేకము.

పి. శి. ఏ. అండు కంపెని,
ఆయుర్వేదసమాజం,
పెరిదేపి, నెల్లూరుజిల్లా.

कामामृतम्

ఆయుర్వేదశాస్త్రి, అష్టావధాని,
కందుకూరి వేంకటసుబ్బారావు,
ఎం. డి. ఎ. గారి

స్వదేశమునందు, అనేకవిదేశములయందుఁ బ్రఖ్యాతిఁబొందిన యౌషధము. రాత్రిపూట యొకమాత్రపుచ్చుకొనిన ఎంతనిస్సారమైన శుక్రమైనను వెంటనే సంసార సౌఖ్యము నీయఁగలదు. 5 దినములలో మూత్రములోఁ గలిసిగాని ముందువెనుకలఁగాని నిద్రలోఁగాని పోయెడి వీర్యమును దృఢముగా నిలిపివేయును. మధ్యనపుంసకులు, నరముల బలహీనముగలవారు ఈ మందునే పైకి పూతగాఁగూడ నుపయోగించిన మిక్కిలి శక్తివంతులు కాఁగలరు. వెంటనే పరీక్షింపుఁడు. ఉత్తరములు రహస్యముగా నుంపఁబడును. మావద్ద మదరాసు గవర్నమెంటువారిచే నిర్ణీతమైన ఆయుర్వేదౌషధములు గూడ పెక్కులు గలవు. యోగ్యతాపత్రములు అనేకములు కావలసినవారు వ్రాయుఁడు.

20 మాత్రల కామామృతము సీసా 1-కి రూ. 2-0-0.

అమృతాశ్రమము, నెం. 2, ఏలూరు, పశ్చిమ గోదావరి.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక	
పుస్తకం సంఖ్య	TPLA134M132
పుస్తకం పేరు	భారతి
తారీఖు	31/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	187
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	I,198B,222B,
లేని పేజీలు	1-050
తయారు చేసినది	munishaa
పేజీలు విడదీసినది	munisha
స్కాన్ చేసినది	Y.V.Bhanusree
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	GOOD